జాన్ పెర్కిన్స్

కన్ఫెషన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్‌మాన్

ఒక దళారీ పశ్చాత్తాపం

తెలుగు : కొణతం దిలీప్



OKA DALAARI PASCHATHAPAM

TRANSLATION OF 'CONFESSIONS OF AN ECONOMIC HITMAN'

BY

JOHNPERKINS

ప్రథమ ముద్రణ : జనవరి 2006

ఎనిమిదవ ముద్రణ : జూన్ 2009

డిటిపి : ఎస్. కిషోర్ కుమార్

లే ఔట్ : అనల

లోగో : ఆర్టిస్ట్ మోహన్

వెల : 50 రూపాయలు

ప్రచురణ :

వీక్షణం పబ్లికేషన్స్
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్‌నెం.3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029
ఫోన్- 040-66843495
సర్క్యులేషన్ మేనేజర్ - 99493 91028

ప్రతులకు:

- వీక్షణం పబ్లికేషన్స్ ఆఫీస్
- అన్ని ప్రముఖ పుస్తకాల షాపులు

ముద్రణ : దక్కన్ ప్రెస్, అజమాబాద్, హైదరాబాద్

ఎనిమిదవ ముద్రణ !
ఇటీవలి పుస్తక ప్రచురణ చరిత్రలో అసాధారణం !
పాఠకుల ఆత్మీయ స్పందనకు హృదయపూర్వక కృతజ్ఞతలు...

– వీక్షణం పబ్లికేషన్స్

In the midst of Death, Life persists
In the midst of Untruth, Truth persists
In the midst of Darkness, Light persists

గాంధీజీ అన్న ఈ మాటలు – జాన్ పెర్కిన్స్ పుస్తకం చదవడం పూర్తి చేయగానే నా కన్నీటి తడిలో మెరిశాయి. వేదనా? విజయమా? విభ్రమమా? వైరాగ్యమా? – ఏదీకాదు.

ఇన్నాళ్ళూ, ఇన్ని దశాబ్దాలూ చదివిందీ, నమ్మిందీ, అనుమానించిందీ, కోపంతో రగిలిపోయిందీ అంతా నిజమేనని అమెరికా వాడే చెబుతున్నాడు. స్వార్థంతో కాదు. ఎత్తుగడా కాదు. పశ్చాత్తాపంతో.

పెర్కిన్స్ రాసిన పుస్తకం నన్నయితే కుదిపేసింది...

... ఈ పుస్తకాన్ని తెలుగులోకి కొణతం దిలీప్ అద్భుతంగా అనువదించారు.

– ప్రకాష్
ఆంధ్రజ్యోతి, ఆదివారం అనుబంధం,
2 ఏప్రిల్, 2006

❦ ❦ ❦

ఈ గాథ నేడు ప్రపంచ వ్యాప్తంగా సంచలనాలను సృష్టిస్తోంది. తెలుగు అనువాద ప్రతి ఇప్పటికే రెండవ ముద్రణకు దగ్గర అవుతోంది. అదీ సత్యంపట్ల ఆకలితో వున్న పాఠకుల ప్రతిస్పందన. మా వ్యథలకు పెర్కిన్స్ మాటల రూపాన్నిచ్చినవాడు అన్నది వేలాది మంది పాఠకుల తీర్పు. దీనికి పుస్తక అనువాదకుడు కొణతం దిలీప్ అద్భుత కృషి తోడయ్యింది. ఇంకేం, తెలుగులో – అచ్చ తెలుగులో వ్రాయబడ్డదా (అనువాదంలా కాక) అన్న విధంగా 'ఒక దళారీ పశ్చాత్తాపం' వెలువడింది.

– దేవభక్తుని పాపారావు
www.telugupeople.com

❦ ❦ ❦

పుస్తకం చదువుతున్నంత సేపూ జాన్ పెర్కిన్స్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచబ్యాంకు ప్రవేశం తర్వాత జరుగుతూ వచ్చిన పరిణామాలను చూసి ఈ పుస్తకం రాశాడా అనిపించింది.

– వి. హనుమంతరావు
ప్రజాశక్తి
3 మార్చి, 2006

❦ ❦ ❦

మన సానుభూతి ఉండవలసిన చోటే ఉన్నటది. చమురు ప్రవహించే చోట, చెమట ప్రవహించే చోట, నెత్తురు ప్రవహించే చోట, నదులు ప్రవహించే చోట, అత్యంత అనాది నాగరికతా సంస్కృతులు ప్రవహించే చోట, జీవితేచ్ఛ ప్రవహించే చోట. ఇది మనం విడమర్చి చెప్పుకోలేక పోవచ్చు. మనిషిని మనిషి స్పృశిస్తే కలిగే మానుష భావంలో ఆ జీవశక్తి మన అనుభవంలోకి రావలిసిందే. ఒక ఎకనమిక్ హిట్‌మాన్ జాన్ పెర్కిన్స్ - ఎంతో చదువుకున్నాడు. ఎన్నో పుస్తకాలు రాశాడు. ఎన్నో దేశాలు తిరిగాడు. ఎంతో పెద్ద పెద్ద కంపెనీల కోసం పనిచేశాడు. స్వయంగా పెద్ద కంపెనీలు పెట్టాడు. ఎందరో దేశాధిపతులతో స్నేహం చేశాడు. ఎంత ఆశ్చర్యంగా ఆయన చెప్తున్న కన్ఫెషన్‌లో అపరాధ భావంతో అని ప్రారంభించాడు. అటువంటి పరిచయమే చేశాడు. తనకు లోపలి నుంచి తెలిసిన, పైనుంచి తెలిసిన, ప్రామాణికంగా తెలిసిన, అనుభవపూర్వకంగా తెలిసిన సామ్రాజ్యవాదం గురించి చెప్పాడు. అదే 'ఒక దళారీ పశ్చాత్తాపం'.

కొందరి అనువాదాలు చదివితే ఎంత అద్భుతంగా చేశాడనిపిస్తుంది. ఈ అనిపించడంలో మూల రచయితకన్నా అనువాదకుడు కనిపిస్తాడు. శ్రీశ్రీ వలె వాళ్లు చాలా గొప్ప అనువాదకులు. ఇంకొన్ని అనువాదాలు చదివితే అవి అనువాదాలని తెలిసిపోతుంది. మూలానికి 'న్యాయం' చేసినవే కావచ్చు, కాని అనువాదానికి న్యాయం చేసినవి కావు. ఇటువంటి అనువాదాలు చేసి చేతులు కాల్చుకున్న అనుభవంతో చెబుతున్నాను.

ఈ అనువాదం చదివితే జాన్‌పెర్కిన్స్ కాదు, కొణతం దిలీప్ కాదు ఒక సామ్రాజ్యవాద విశ్వరూపం - దాని పనిముట్టు అయిన దళారి కళ్లకు కడతాడు. అంత సాఫీగా సాగినది ఈ అనువాదం.

- పి. మనవాళ్లయ్య

చర్చ

ఫిబ్రవరి-మార్చి, *2006*

✾ ✾ ✾

సాయం చేస్తున్నట్టు నమ్మిస్తూ అభివృద్ధి చెందని, చెందుతున్న దేశాలను అమెరికా ఎంతటి లోతైన ప్రణాళికలతో దోచుకుంటుందో బయటపెట్టే పుస్తకమిది. పేదలు పేదలుగా ఉంటూనే ఓ దేశ ఆర్థికాభివృద్ధి ఎలా జరుగుతుందో ఈ పుస్తకం చదివితే అర్థమవుతుంది.

- నీలిమ,

ఈనాడు ఆదివారం అనుబంధం,

28 మే, 2006

✾ ✾ ✾

ఒక అమెరికన్ పౌరుడు స్వయంగా ఎకానమిక్ హిట్‌మాన్‌గా పనిచేసి తమ పని ప్రపంచాన్ని దోచుకోవడానికి ఎలా తోడ్పడుతుందో, ప్రపంచంలో వర్ధమాన దేశాల వనరులు, ఆర్థిక, రాజకీయ, సామాజిక విలువల విధ్వంసం ఎలా జరుగుతుందో చూసి పశ్చాత్తాప

పడి వ్రాసిన ఈ రచన విలువైనది. విప్లవోద్యమంలో వున్నవారు, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు ఈ పుస్తకాన్ని తప్పక చదవాలి. చదివించాలి.

- పి. రంగారావు
ప్రజాపంథా,
సి.పి.ఐ. (ఎం.ఎల్-న్యూ డెమోక్రసీ) పక్షపత్రిక
15 మే, 2006

* * *

అమెరికా విసిరిన విషమంత్రాంగానికి ఎదురు నిల్చిన ఒమర్ టోరిజోస్ "అమెరికాను ఎదిరించి నిలవడం మా లక్ష్యం కాదు, పేదవాడి పక్షాన నిలబడడమే మాకు కావలసింది" అన్నప్పుడు మన రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ప్రపంచబ్యాంకు దగ్గర, ఆసియా అభివృద్ధి బ్యాంకు ముందు చేతులు దేబరించి నిల్చునే మన రాజకీయ నాయకులు గుర్తుకొచ్చి సిగ్గుతో చితికిపోతాము.

ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన పుస్తకమే కాదు, తమ స్నేహితులందరిచేతా చదివించాల్సింది కూడా.

- దుప్పల రవికుమార్
సత్యం సాయంకాల పత్రిక, శ్రీకాకుళం
21 మే, 2006

* * *

'అభివృద్ధి' పేరిట జరుగుతున్న కార్యక్రమాలు, ఈ అభివృద్ధి ఫలాలు ఎవరికి దక్కుతున్నాయి? ఫలితాలు దక్కకపోగా చితికిపోతున్న లక్షలాది పేద ప్రజానీకం అగచాట్లు, అసలు అభివృద్ధి అంటే ఏమిటి, ఎవరికోసం అభివృద్ధి లాంటి అంశాల మీద మనం చాలాకాలంగా మాట్లాడుతున్నాం. రాస్తున్నాం. కోపం తెచ్చుకుంటున్నాం. ఉద్యమాలు చేస్తున్నాం. సామ్రాజ్యవాద కుట్ర గురించి తెలుగు నేల మీద పెద్ద స్థాయిలోనే చర్చలు, ఉద్యమాలు జరిగాయి. ఇంతకాలం మనం మాట్లాడిందంతా నిజమని మనమే కరక్ట్ అని నొక్కి చెబుతోంది ఈ పుస్తకం.

- కొండవీటి సత్యవతి
స్త్రీ వాద పత్రిక **భూమిక**
ఏప్రిల్-మే 2006

* * *

వర్తమాన ప్రపంచంలో, దేశంలో, ఇంకా స్పష్టంగా మన తెలుగుగడ్డ మీద ఇపుడు ప్రజలపై జరుగుతున్న అమెరికా కుట్రల నేపథ్య స్వరూపాన్ని అర్థం చేసుకొని, వాటిని ధైర్యంగా ఎండగట్టి ఎదిరించి, అలుపెరుగని పోరాటంతో నిలువరించి, తరిమి కొట్టేందుకు ప్రజాస్వామ్య ప్రియులైన వారు ఈ పుస్తకం చదివి తీరాల్సిందే!

- అనిసెట్టి సాయికుమార్
ఉద్యోగక్రాంతి మాసపత్రిక
ఎ.పి. ఎంప్లాయీస్ కో-ఆర్డినేషన్ కమిటి
మే 2006

* * *

"ఒక దళారీ పశ్చాత్తాపం" అనే పేరుతో తెలుగులో వెలువడిన ఈ పుస్తకాన్ని వీలైనంత ఎక్కువ మందికి పరిచయం చేయటం అనేది నూతన యుగ నిర్మాణంలో మన వంతు కృషి అవుతుంది అనేదాంట్లో ఎటువంటి సందేహము లేదు.

- పి. సీతారాముడు
స్వర్ణయుగము, ఆధ్యాత్మిక సామాజిక మాసపత్రిక
ఏప్రిల్-మే 2006

❋ ❋ ❋

"అమెరికా రచిస్తున్న విధ్వంసంలోని ఆర్థిక గణాంకాలలోకి లోతుగా పోకుండా అందరూ చదవాలన్న సదాశయంతో పెర్కిన్స్ చిన్న చిన్న అధ్యాయాలతో ఒక నవల అనిపించేట్టు రాశాడు....

ఈ పుస్తకం చదువుతున్నంత సేపూ - ఇటీవల బుష్ గారికి మన దేశంలో ఎర్రతివాచీలు పరిచిన మన్మోహన్ సింగ్, అహ్లువాలియాలు, ఈ అప్పుల కోసం అర్రులు చాచిన, చాస్తున్న మన చంద్రబాబునాయుడు, రాజశేఖర రెడ్డి గార్లే గుర్తొస్తుంటారు. ఈ పుస్తకం వాళ్లతో చదివించి ఎవరైనా పుణ్యం కట్టుకుంటే ఎంత బాగుండును!"

- సి. ధర్మారావు
జూన్ 2006, నడుస్తున్న చరిత్ర

❋ ❋ ❋

"పరాయి దేశాల వనరులను దోపిడి చేయడం, ఆ దేశాలు అందుకు అంగీకరించనప్పుడు ఆయా దేశాల మీద అగ్రరాజ్య తోడేళ్ల దౌర్జన్యాన్ని పెర్కిన్స్ చూపించాడు. అదీ గాక మాట వినని దేశాల మీదికి .... అది అఫ్ఘనిస్తాన్ కావచ్చు లేకుంటే ఇరాక్ కావచ్చు వాటి మీద విచక్షణా రహితంగా బాంబు దాడులు జరిపించడం గురించి ఎంతో చక్కగా చిత్రించాడు. అగ్రరాజ్యాల అరాచక అకృత్యాన్ని దృశ్యమానం చేశాడు."

- డా. మంతెన సూర్యనారాయణరాజు
ఆంధ్రభూమి

❋ ❋ ❋

"తేట తెలుగులో, సూటిగా, స్పష్టంగా సాగిన ఈ అనువాదం పాఠకుల హృదయాలకు సూటిగా తగులుతుంది. 'ఒక దళారీ పశ్చాత్తాపం' ప్రతి ఒక్కరూ చదవ దగిన, చదవాల్సిన పుస్తకం. దీనిని చదువుతుంటే ఎన్నో వాస్తవాలు మన కళ్ల ముందుకొస్తుంటాయి. హృదయం రగిలి పోతుంటుంది. ఆవేదనతో కళ్లు చెమ్మగిల్లుతాయి. ఏమి చేయలేని నిస్సహాయతకు, చేష్టలుడిగి చూస్తూండిపోవడానికి

బాధ పడ్డాము. ఒక్క పుస్తకాన్ని చదవడంతోనే ఇన్ని రకాల అనుభూతులకు లోనవుతాం."

– సయ్యద్ ఖుర్షీద్
జూలై 2006, గీటురాయి.

❋ ❋ ❋

"... స్థానిక గిరిజనులు కార్పొరేట్‌స్వామ్యం అవలంబిస్తున్న దారుణ దోపిడీకి వ్యతిరేకంగా ఎంతటి దృఢచిత్తంతో వున్నారో రేఖామాత్రంగానైనా పెర్కిన్స్ తెలియచేశాడు. ఈ వివరాలు మన దేశంలోని ప్రజలు తమ జీవనోపాధినీ, తమ జీవన హక్కునూ, తమ సంస్కృతినీ పరిరక్షించుకొనేందుకు చేపట్టాల్సిన దృఢమైన పోరాట స్ఫూర్తినివ్వడానికి తోడ్పడతాయి.

ఈ పుస్తకాన్ని తెలుగు పాఠక లోకానికి అందుబాటులోకి తెచ్చిన వీక్షణం పబ్లికేషన్స్ మరిన్ని ఇటువంటి మంచి పుస్తకాలను తెలుగుపాఠకులకు అందుబాటులోకి తేవాలని కోరుకోవడం దురాశ అవదనుకొంటాను."

– జి.వి. భద్రం
జూన్ 2006, ప్రజాసాహితి

❋ ❋ ❋

"ప్రపంచబ్యాంకు ఎత్తుగడలను పటాపంచలు చేయడానికి, ప్రపంచీకరణమనే వలను తెంచడానికి, దాని ముసుగును తొలగించడానికి, దాని నిజస్వరూపం తెలుసుకోవడానికి, అమాయక ప్రజలను రక్షించడానికి ఈ దళారీ పశ్చాత్తాపం గాథ చదివి తెలుసుకోదగింది."

– నీరుకొండ హనుమంతరావు
జూలై 2006 – సామాజిక న్యాయం

❋ ❋ ❋

ప్రపంచీకరణ ముసుగులో దేశదేశాలనూ దోచుకోవడం కోసం, పావురాల రక్తంతో శాంతి సందేశాలు రచిస్తున్న అమెరికన్ గ్రద్ధ విశ్వరూపాన్ని "ఒక దళారీ పశ్చాత్తాపం" పుస్తకం నగ్నంగా మన ముందు నిలబెట్టింది. పడికట్టు పదాలతో నిండిన చిలక పలుకులు వల్లించే మేధావులు ఈ పుస్తకం చదివితీరాలి. ఇన్నాళ్లా మనం అనుమానిస్తున్న అమెరికా దుష్టపన్నాగాలను అనుభవపూర్వకంగానూ, ప్రామాణికం గానూ వివరించిన జాన్ పెర్కిన్స్‌కూ, సాధికారికంగా సాగిన ఈ కథనాన్ని "అనువాదం" అనే మాట గుర్తుకు రాకుండా, అద్భుతమైన శైలితో తెలుగువారికి అందించిన కొణతం దిలీప్‌కూ మనం ఎంతో ఋణపడి ఉంటాం!

– అదృష్టదీపక్
డిసెంబర్ 2006 – చినుకు సాహిత్య మాసపత్రిక

❋ ❋ ❋

విషయసూచిక

సామ్రాజ్యవాద కుట్ర గురించి సాధికారిక కథనం

•

ఈ పదిహేనేళ్లలో ప్రపంచీకరణ మీద తెలుగు సమాజ సాహిత్యాలు ఎక్కువగానే స్పందించాయి. బహుళజాతి సంస్థల వ్యూహాల వెనుక ఉన్న రాజకీయార్థిక ప్రయోజనాల గురించి, ఆ వ్యూహాల ఫలితంగా పేద దేశాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక జీవనంలో వచ్చిన, రానున్న ప్రభావాల గురించి తెలుగులో వందలాదిగా వ్యాసాలు వచ్చాయి. డజన్ల కొద్దీ పుస్తకాలు వచ్చాయి. కనీసం రెండు డజన్ల మంది రచయితలు విశ్లేషణలు వెలువరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రసంగించారు. కవులు, కథా రచయితలు, నవలా రచయితలు కూడ ఈ విశ్లేషణను అందుకుని కళారూపం ఇచ్చారు.

నా వరకు నేను ప్రపంచీకరణ మీద, నూతన ఆర్థిక విధానాల మీద నా మొదటి వ్యాసం 1991 జులై 12న రాశాను. ఈ పదిహేను సంవత్సరాలలో ఈ అంశాల మీదనే రెండు మూడు పుస్తకాలు, కనీసం మూడు వందల వ్యాసాలు రాసి ఉంటాను. కనీసం ఐదారు వందల చోట్ల ఉపన్యసించి ఉంటాను.

అయినా ఇప్పటికీ ప్రపంచీకరణ మీద చెప్పవలసిన విషయాలు మిగిలే ఉన్నాయనిపిస్తుంది. ఎన్నో ముఖ్యమైన ఖాళీలున్నాయనిపిస్తుంది. ఆ ఖాళీలలో ప్రధానమైనది ప్రపంచీకరణ వెనుక ఉన్న కుట్రను విశ్వసనీయంగా, సోదాహరణంగా వివరించలేకపోవడం. "మూడు శతాబ్దాల వలసవాద కుట్రను, ఐదు దశాబ్దాల బహుళజాతి సంస్థల కుట్రను, దానికి సహకరించిన మన దళారీ పాలకుల భాగోతాన్ని ఇంకా విప్పి చెప్పవలసిందెంతో ఉంది" అని 1999లో 'అమ్మకానికి ఆంధ్రప్రదేశ్' ముందుమాటలో రాశాను. అంతకు ముందూ, ఆ తర్వాత కూడ నేనీ మాట అన్నప్పుడల్లా నేను గౌరవించే ఇద్దరు అర్థశాస్త్రవేత్తల వ్యాఖ్యలు నాకు గుర్తొస్తుంటాయి. వారిలో ఒకరు మాజీ మార్క్సిస్టు, ప్రస్తుతం ఉదారవాది. 'మీరు వివరించలేని దానికల్లా ఒక కుట్ర సిద్ధాంతం కనిపెడతారు' అని ఆయననేవారు. మరొకరు ఇప్పటికీ మార్క్సిస్టే. 'మీరు చెప్పేదంతా ఐడియలాజికల్ (భావజాలంతో ప్రేరేపితమైనది), వాస్తవం కాదు. గట్టి ఆధారాలతోనే అటువంటి విమర్శలు చేయాలి' అని ఆయనంటారు.

భారత దేశానికీ, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలలోని అనేక దేశాలకూ చెందిన రాజకీయార్థిక చరిత్రలలో సామ్రాజ్యవాద కుట్రల ఆధారాలు దొరుకుతున్నా,

ప్రపంచీకరణయుగంలో ఎన్నో పత్రికా వార్తలు, విశ్లేషణలు ఆ కుట్రలను బయట పెడుతున్నా, కుట్ర గురించి మాట్లాడడానికి కొంత సంకోచమే ఉండేది.

ఆ సంకోచం నుంచి కొంత ఉపశమనం ఇచ్చింది వాస్కోడగామా భారతదేశంలో ప్రవేశించిన చరిత్ర. అది ఒక స్పష్టమైన ప్రయోజనం కోసం, నిర్దిష్టమైన లక్ష్యంతో జరిగిన కుట్రపూరిత ప్రయాణం.

మూడు ఓడలతో, నూటయాభై మంది నావికులతో వాస్కోడగామా కేరళ తీరంలోని కోళిక్కోడు (యూరపియన్ స్వరంలో వాస్కోడగామా దాన్ని కాలికట్ అన్నాడు. ఇప్పటికీ దాన్నట్లాగే పిలవాలని మనం అనుకుంటాం!)కు ఎనిమిది మైళ్ల ఉత్తరాన భూమిని తాకాడు. అది 1498 మే 17. ఆ మలబార్ తీరంలో తనను కలిసిన మొట్టమొదటి మనుషులతో ఆయన తాను "క్రైస్తవులనూ, సుగంధ ద్రవ్యాలనూ వెతుకుతూ" వచ్చానన్నాడు.

ఈ రెండు లక్ష్యాలలోనూ అబద్ధం ఉంది, కుట్ర ఉంది, ద్వేషం ఉంది, స్వార్థ ప్రయోజనాలున్నాయి.

వాస్కోడగామా 'రక్షించదలచిన' క్రైస్తవులు ముస్లింల చక్రబంధంలో చిక్కుకు పోయారని, వాళ్లను కాపాడి, తన క్రూసేడ్లలో (క్రైస్తవేతరులను, ముఖ్యంగా ముస్లింలను ఊచకోత కోసిన మత యుద్ధాలు) భాగం చేసుకోవాలని అనుకున్నాడట. ఇంతకూ ఆ నాటి మలబార్ తీరంలో ఆయన ఊహించినట్టుగా "ముస్లింల చక్రబంధంలో చిక్కుకున్న క్రైస్తవులు" లేరు. అప్పటికి మలబార్ తీరంలో కొందరు క్రైస్తవులున్నారు గాని వాళ్లకూ ముస్లింలకూ ఘర్షణలేమీ లేవు.

అంటే వాస్కోడగామా మొట్టమొదటి లక్ష్యం అబద్ధం మీద, ముస్లింల పట్ల విద్వేషం మీద ఆధారపడింది. సరిగ్గా ఇవాళ ప్రపంచీకరణ సమర్థకులందరూ కూడ మళ్లీ ఒక అబద్ధం మీద, ఒక విద్వేషం మీద ఆధారపడి ప్రపంచం మీద ఉక్కుపాదం మోపుతున్నారు. మూడో ప్రపంచదేశాల ఆర్థికవ్యవస్థలు సంక్షోభంలో పడ్డాయని, తాము వాటిని రక్షించడానికే వస్తున్నామనేది ఆ అబద్ధం. మూడో ప్రపంచదేశాల ప్రజల అభివృద్ధికి కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరమయ్యే విమానాశ్రయాలు, ఓడరేవులు, ఆనకట్టలు, రహదారులు, బహుళ అంతస్తుల భవనాలు, గోల్ఫ్ కోర్సులు, వగైరా అవసరమని, ఆ పెట్టుబడులు తాము పెట్టడానికి మార్గం సుగమం చెయ్యాలనేది ఆ అబద్ధం.

ఇవాళ ప్రపంచాన్ని నడుపుతున్న చమురు నిల్వల మీద ఆవాసాలున్నందుకు అటు వెనిజులా మీద, ఇటు నైజీరియా మీద, వాటికన్న ఎక్కువగా పశ్చిమాసియా ముస్లింల మీద విద్వేషాన్ని రెచ్చగొట్టడం, ప్రపంచానికి మరొక ప్రత్యామ్నాయ, సమానత్వ మార్గాన్ని చూపిస్తున్నందుకు కమ్యూనిస్టుల మీద విద్వేషాన్ని రెచ్చగొట్టడం ప్రపంచీకరణ లక్ష్యం.

వాస్కోడగామాతో వచ్చిన పోర్చుగీసు వలసవాదం మలబార్ తీరం మీది హిందూ, ముస్లిం పాలకుల మధ్య చిచ్చుపెట్టి ఇరుపక్షాల్నీ ఓడించి లొంగదీసుకుంది. ఆ రాజ్యాల నౌకాశక్తిలోని బలహీనతల్ని గుర్తించి వినియోగించుకుంది. ఏడు సంవత్సరాలు తిరగకుండానే పోర్చుగీసు రాజు భారత భూభాగం మీదికి తన వైస్‌రాయ్‌ని పంపాడు. అప్పటి నుంచీ ఇవాళ్టి దాకా వలసవాద, సామ్రాజ్యవాద ప్రతినిధులే మన రాజకీయార్థిక విధానాలను నిర్ణయిస్తున్నారు. వాళ్ల పేర్లు వైస్‌రాయ్, గవర్నర్ జనరల్, ఏజెంట్, అంతర్జాతీయ ద్రవ్య సంస్థ, కన్సల్టెంట్, వగైరాగా మారి ఉండవచ్చు. వాళ్ల జెండాలు మారి ఉండవచ్చు. వాళ్ల కేంద్ర కార్యాలయాలు మారి ఉండవచ్చు. అది ఒకప్పుడు ప్రత్యక్షంగా, మరొకప్పుడు నల్లతోలే ఉన్న దళారీల ద్వారా జరిగి ఉండవచ్చు. అంతిమ సారాంశంలో ఈ ప్రజల మీద దోపిడీ పీడనలకు భూస్వాములకూ రాజులకూ తోడుగా సామ్రాజ్యవాదం తరలి వచ్చిందన్నది నిజం.

ఆ క్రమంలో వాస్కోడగామా రెండో లక్ష్యాన్నీ గమనంలో ఉంచుకోవాలి. ఆ నాటికి యూరప్‌తో పోలిస్తే ముడిసరుకులలో గాని, పరిశ్రమలలో గాని, వ్యవసాయోత్పత్తులలో - ముఖ్యంగా సుగంధ ద్రవ్యాలలో గాని అగ్రభాగాన ఉన్న దేశాలలో భారతదేశం ఒకటి. అప్పటికి సుగంధ ద్రవ్యాల వ్యాపారంలో పైచేయిగా ఉన్న అరేబియన్ వర్తకులను ఓడించి ఆ వ్యాపారాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలన్న యూరపియన్ ఆకాంక్షకు, పోర్చుగీసు ప్రయత్నానికి చిహ్నం వాస్కోడగామా యాత్ర.

ఇవాళ్టికీ మూడో ప్రపంచ దేశాలే వ్యవసాయోత్పత్తులకూ, ఖనిజ వనరులకూ, ముడిసరుకులకూ గొప్ప వనరు. అట్లాగే సామ్రాజ్యవాద పారిశ్రామిక, సేవా రంగాలకు అవసరమైన, వారి దగ్గర లేని గొప్ప మానవ వనరులు మూడో ప్రపంచ దేశాలలోనే ఉన్నాయి. అంతకన్న ముఖ్యంగా వ్యవసాయోత్పత్తులలో వారి మారు బేరానికి, పారిశ్రామిక, సేవా ఉత్పత్తులకు అసంఖ్యాక జన బాహుళ్య మార్కెట్ ఈ మూడో ప్రపంచ దేశాలలోనే ఉంది.

అంటే వాస్కోడగామా లక్ష్యం ఈ ఐదు వందల ఏళ్లలో పరిమాణాత్మకంగానూ, గుణాత్మకంగానూ విస్తరించిందన్నమాట. పైగా ఇప్పుడు ప్రపంచం ఒక కుగ్రామం అయిపోయిందనీ, మార్కెట్లు అనుసంధానించబడుతున్నాయనీ, సమాచార, సాంకేతిక విప్లవం మనుషులనూ, మార్కెట్లనూ ఏకం చేస్తున్నదనీ ఎన్ని కోతలయినా కోయగల హైటెక్ వాచాలత్వం సామ్రాజ్యవాదులకూ దాని దళారీలకూ అబ్బింది.

ఇవాళ దళారీలు వాస్కోడగామాల వంటి సముద్ర ప్రయాణ సాహసికులు మాత్రమే కాదు. జాన్ పెర్కిన్స్ వంటి అత్యాధునిక విజ్ఞాన, వాక్చాతుర్య నిధులు. పేద దేశాల నాయకులతో మంతనాలాడి, వారిని బురిడీ కొట్టించి, వారిని కొనివేసి, వారి దేశాలను ఆక్రమించగల అధర్మయుద్ధ వీరులు.

అటువంటి అధర్మ యుద్ధాల గురించి ఊహిస్తూ, ఆరోపిస్తూ, ఫలితాల ద్వారా పరిణామాల్ని విశ్లేషిస్తున్న మా లాంటి వారికి జాన్ పెర్కిన్స్ అటువైపు కథనాన్ని తన స్వానుభవం నుంచి వివరిస్తున్నాడు. ఇందులో పశ్చాత్తాపం ఉందా, ఇది కూడ ఒక ఎత్తుగడేనా, ఇన్నాళ్లూ ఎన్నో అక్రమాలు చేసి ఇప్పుడీ గంగలో మునిగితే సరిపోతుందా అని ఎన్నో ప్రశ్నలు వేయవచ్చును గాని ఇది సామ్రాజ్యవాద కుట్ర గురించి సాధికారిక కథనం.

అనేకానేక సామాజిక, రాజకీయ కారణాల వల్ల ఈ పుస్తకం తెలుగు అనువాదం అత్యంత అవశ్యకమైనదవుతోంది. సంపన్నమైన వనరులతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన 1956 నుంచో, మన అధికారులకు ప్రపంచబ్యాంకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించిన 1983 నుంచో, కనీసం పాలకులే స్వయంగా ప్రపంచబ్యాంకు ఆదేశాలను శిరసున పెట్టుకున్న 1995 నుంచో ఎందరెందరు జాన్ పెర్కిన్స్‌లు ప్రవేశించారో, మంతనాలు నడిపారో ఎప్పటికైనా బయట పడుతుందో లేదో తెలియదు. ఆ రహస్యాలు బయట పడేదాకా, ఏమి జరిగి ఉంటుందో ఊహించడానికి మనకు ఈ పుస్తకం అవసరమైన సూచిక.

దాదాపు ఏడాది కింద ఫ్రంట్‌లైన్‌లో ఈ పుస్తక సమీక్ష చదివినప్పటి నుంచీ, ఇంటర్‌నెట్ మీద పెర్కిన్స్ గురించీ, పుస్తకం గురించీ చదువుతున్నప్పటి నుంచీ దిలీప్‌తో ఈ విషయాలు పంచుకుంటున్నాను. దిలీప్ హఠాత్తుగా ఒక రోజు ఇంగ్లీషు పుస్తకం పట్టుకొచ్చాడు. గద్దె ఆనందస్వరూప్ గారు ఇది తెలుగులోకి వస్తే బాగుంటుందన్నారని అన్నాడు. చదువుతూ చదువుతూనే తానే తెలుగు చేస్తానన్నాడు. అనువాదంలో మొదటి ప్రయత్నమైనా చాల సరళంగా, భావ స్ఫోరకంగా, చెయ్యి తిరిగిన అనువాదకుడిలా తెలుగు చేశాడు. ఇప్పటికే ఈ పుస్తకం తెలుగులో వెలువడుతుందని తెలిసినప్పటి నుంచీ పాఠకుల నుంచి వస్తున్న ప్రతిస్పందన చూస్తే తెలుగు సమాజానికి ఈ పుస్తకం అవసరం ఎంత ఉందో అర్థమవుతోంది.

ఫ్రమ్ ది హార్సెస్ మౌత్ అని ఇంగ్లీషు నుడికారం చెప్పినట్టు ఇన్నాళ్లూ మనం ఏ సామ్రాజ్యవాద రథ చక్రాలకు కట్టివెయ్యబడ్డామని ఆరోపిస్తున్నామో, ఆ రథాన్ని లాగుతున్న అశ్వాలలో ఒకటి ఇక్కడ మాట్లాడుతోంది. వినండి. ఇది కుట్రేనో కాదో తేల్చుకోండి.

- ఎన్. వేణుగోపాల్

జనవరి 6, 2006

ముందుమాట

'ప్రపంచ దేశాలనుండి వేలకోట్ల డాలర్లను అక్రమంగా దారి మళ్లించేవారినే ఎకనామిక్ హిట్ మెన్ (ఇహెచ్ఎమ్) అంటారు. ప్రపంచ బ్యాంక్, అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సీ (యుఎస్ఎఐడి), ఇతర విదేశీ ఋణ సంస్థల నుండి డబ్బును కొన్ని బహుళజాతి కంపెనీలకు, కొద్దిమంది ధనవంతుల జేబుల్లోకి తరలించడమే ఈ ఎకనామిక్ హిట్‌మెన్ బాధ్యత. ఇలా చేయడానికి వీరికి సహకరించే ఉపకరణాలు -అబద్ధపు ఆర్థిక రిపోర్టులు, ఎన్నికలలో రిగ్గింగ్, లంచాలు, బలవంతపు వసూళ్లు, వ్యభిచారం, హత్యలు. వందల ఏళ్ల కింద మొదలుపెట్టబడిన సామ్రాజ్యవాదపు దుష్టక్రీడ ఈ కొత్త భయంకరమైన రూపంలో ఇప్పుడు ప్రదర్శితమవుతోంది.

నాకు తెలుసు నేనొక ఎకనామిక్ హిట్‌మాన్‌ను!'

1982లో నేను రాయతలపెట్టిన 'కాన్షియన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్‌మాన్' అనే పుస్తకం కోసం నేను రాసి పెట్టుకున్న తొలిమాటలు అవి. ఆ పుస్తకాన్ని ఇద్దరు దేశాధినేతలకు అంకితం ఇద్దామనుకున్నాను. నేను ఎంతో గౌరవించే ఆ ఇద్దరూ - ఈక్వెడార్ దేశాధ్యక్షుడు జైమెరోల్డోస్, పనామా దేశాధ్యక్షుడు ఒమర్ టోరిజోస్. ఆ ఇద్దరూ విమాన ప్రమాదాల్లో మరణించారు. వారి మరణాలు ప్రమాదవశాత్తూ జరిగినవి కావు. బహుళజాతి కంపెనీల, బ్యాంకుల అధిపతుల, అగ్రరాజ్యాల సామ్రాజ్యవాద కాంక్షలను వ్యతిరేకించినందుకు వాళ్లు దారుణంగా చంపబడ్డారు. మాబోటి ఆర్థిక ఏజెంట్లు వారిని మా వ్యూహాల్లో ఇరికించలేకపోవడంతో మా తరువాత రంగప్రవేశం చేసే సిఐఏ తోడేళ్ల చేతిలో వారిరువురూ హతమయ్యారు.

ఈ పుస్తకం రాయొద్దని నామీద చాలా ఒత్తిడి వచ్చింది. గత ఇరవై ఏళ్ల కాలంలో కనీసం నాలుగుసార్లయినా ఈ పుస్తకం రాయడం మొదలుపెట్టాను. ప్రతీసారీ ఏదో ఒక ప్రపంచ పరిణామం నన్ను రాయమని పురిగొల్పేది కానీ బెదిరింపులో, లంచాలో నన్ను కట్టిపడేసేవి.

2003లో ఒక అంతర్జాతీయ కార్పొరేషన్‌చే నడపబడుతున్న ఒక ప్రచురణకర్త ఈ పుస్తకం చిత్తు ప్రతిని చదివాడు.

'ఇది ప్రపంచానికి తప్పకుండా తెలియజెప్పాల్సిన కథ' అన్నాడు. కానీ వెంటనే కాస్త బాధగా 'మా బాస్‌లు దీనికి ఒప్పుకోరు. మీరు దీన్ని కల్పిత నవలగా రాయండి. అప్పుడు ఏ జాన్‌లీకారీ నవలలానో, గ్రాహమ్ గ్రీన్ నవలలానో దీన్ని మార్కెట్ చేయొచ్చు'.

కానీ ఇది కల్పిత కథ కాదు. ఇది నా జీవితపు యధార్థ గాథ. బహుళజాతి కార్పొరేషన్ చేతిలో లేని ఓ ధైర్యమున్న ప్రచురణకర్త పుణ్యమా అని నాకు దీన్ని మీతో పంచుకునే వీలు కలిగింది.

ఈ కథను తప్పకుండా చెప్పాలి. ఎందుకంటే మనమిప్పుడు ఎదుర్కొంటున్న సంక్షోభాలూ, అసలు పరిష్కారమే కానరాని సమస్యలెన్నిటికో కారణాలు ఈ కథలో వున్నాయి. మనం ఇన్నాళ్లూ చేసిన తప్పిదాలు ఏమిటో తెలుసుకుంటేనే కదా వాటిని సరిదిద్దుకునే వీలు కలిగేది! సెప్టెంబర్ 11 దాడి, ఇరాక్‌పై దాడి ఇవన్నీ ఎందుకు జరిగాయో తెలుసుకోవాలంటే మనమీ కథ చదవాలి. సెప్టెంబర్ 11 దాడిలో చనిపోయిన మూడు వేల మందితో పాటు సరైన పోషకాహారం లేక ప్రతిరోజూ చనిపోతున్న ఇరవైనాలుగు వేల మంది గురించి కూడా తెలుసుకోవాలి మనం.

మానవాళి ఎదుర్కొంటున్న అనేక సమస్యలు తీర్చగల వనరులు, అధికారం చరిత్రలోనే మొదటిసారిగా ఓ అగ్ర రాజ్యానికి సమకూరాయి. నేను ఎకనామిక్ హిట్‌మాన్‌గా పనిచేసింది కూడా ఆ దేశం తరపుననే.

ఆ దేశం పేరు అమెరికా.

ఇన్నాళ్లూ మౌనంగా వుండి ఇప్పుడే ఈ పుస్తకం రాయడానికి కారణం మాత్రం మా అమ్మాయి జెస్సికా. ఈ పుస్తకం గురించి నా భయాలను తనతో చెప్పినపుడు 'మన భావితరాలకోసమైనా ఈ పుస్తకం రాయాలి. ఒకవేళ నీకేమైనా హాని జరిగితే నేనా కార్యం పూర్తిచేస్తాను నాన్నా' అని భరోసా ఇచ్చింది తను.

ఈ పుస్తకం యధార్థ సంఘటనల సమాహారం. ఇందులో పాత్రలూ పాత్రధారులూ నిజమైనవారు. నేను నా ఉద్యోగంలో భాగంగా రాసుకున్న నోట్సు, రాసిన వ్యాసాలూ, ఇతరులు రాసిన వ్యాసాలూ, వేరే రచయితలు రాసిన పుస్తకాల్లోంచి కొంత సమాచారం, ఇలా రకరకాల పద్ధతులలో నేను సేకరించిన విషయాలన్నిటినీ గుదిగుచ్చితే ఈ పుస్తకం తయారైంది.

'మిమ్మల్ని నిజంగానే ఎకనామిక్ హిట్‌మాన్ అంటారా?' అని మా ప్రచురణకర్త అడిగాడోసారి. అది నూటికి నూరుపాళ్లు నిజమైన పదమే. 1971లో నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో నా గురువుగా ఉన్న క్లాడిన్ అనే మహిళ మొదటిసారిగా చెప్పింది నేను ఒక ఎకనామిక్ హిట్‌మాన్‌గా నియమించబడ్డానని.

'ఇది అత్యంత రహస్యమైన ఉద్యోగం. నీ భార్యకు కూడా నీ ఉద్యోగ స్వరూపం తెలియకూడదు' అని షరతు విధించింది తను.

తెలివి, అందం కలబోసినట్టుండే క్లాడిన్ నన్ను చాలా చక్కగా ఉపయోగించుకుంది. నా బలహీనతలను ఎలా సొమ్ము చేసుకోవాలో బాగా పసిగట్టింది తను. నన్ను నియమించిన వ్యవస్థ ఎంత సంక్లిష్టమైనదో తనను చూస్తే అర్థమయ్యేది.

తను ఏదీ దాచేది కాదు.

'అమెరికా ప్రయోజనాలు నెరవేర్చే ఒక వ్యవస్థలో ప్రపంచ దేశాధినేతలను భాగం చేయడమే నీ పని. కొన్నాళ్లకి ఆ దేశాలను అప్పుల వలయంలో చిక్కేటట్లు చేసి వారిని బానిసలుగా మార్చాలి. మన ఆర్థిక, రాజకీయ, సైనిక అవసరాలు తీర్చే బంట్లుగా వారిని మార్చేయాలి. ఈ సాయం చేసినందుకు, వారి వారి దేశాల్లో పదవులు నిలబెట్టుకునేందుకు, ప్రజలకు చూపించేందుకు పారిశ్రామిక పార్కులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలూ, విమానాశ్రయాలూ నిర్మించబడాలి. అమెరికన్ ఇంజనీరింగ్ నిర్మాణ రంగ సంస్థల ఖజానా కూడా నిండాలి' అని చెప్పేది తను.

ఆ దారితప్పిన విధానాల ఫలితాలే ఇవ్వాళ మన ముందున్నవి. ఆసియన్ దేశాల కార్ఖానాలలో బానిసల వేతనాలకు మనుషులతో పనిచేయించుకుంటున్నాయి మన గౌరవప్రదమైన కంపెనీలు.

ఇప్పుడు మానవాళి ఒక భారీ వినియోగయంత్రంగా రూపాంతరం చెందింది. దీన్ని నడపడానికి అవసరమయ్యే ఇంధన అవసరం నానాటికీ ఎక్కువై చివరకు అది తనను తానే తినేసే దశకు చేరుకుంది. ఇవ్వాళ్టి ప్రపంచంలో విజేతలు తమ బంగళాలు, పడవలు, జెట్ విమానాలతో మిగతా ప్రపంచానికి నమూనాలుగా నిలబెట్టబడ్డారు.

ప్రతిక్షణం వినియోగం, వినియోగం, వినియోగం!

భూమిపై వున్న వనరులను ఎంత కొల్లగొట్టి వినియోగిస్తే అంత ఆర్థిక ప్రగతి అనే ప్రచారం భారీయెత్తున సాగుతున్నది. అట్లాంటి ప్రగతిని ఈ వ్యవస్థ సాధించడానికి మాలాంటి ఎకనామిక్ హిట్‌మెన్లకు భారీ జీతాలు ఇవ్వబడుతున్నాయి.

ఒకప్పుడయితే మాలాంటివాళ్లు కొద్దిమందే వుండేవాళ్లు. కానీ ఇప్పుడో! బోలెడంతమంది వున్నారీ వృత్తిలో. కాకపోతే వారి పేర్లు కొంచెం మర్యాదకరంగా వుంటాయి. మోన్‌సాంటో, జనరల్ ఎలక్ట్రిక్, నైకి, జనరల్ మోటర్స్, వాల్‌మార్ట్ లాంటి బహుళజాతి కంపెనీల కారిడార్లలో వారు కనబడతారు.

ఇది మనందరి కథ. దీన్ని మనం మార్చలేకపోతే ఈ ప్రపంచం కథ ఎక్కడో ముగిసిపోతుంది. సామ్రాజ్యాలు ఎల్లకాలం కొనసాగవు. చరిత్ర గతిలో అవి కొంతకాలం తర్వాత పతనమే అయ్యాయి. మనలో మార్పు రావాలనే ఈ పుస్తకం రాయబడింది.

కొద్దిమంది ధనంలో ఓలలాడి, అత్యధికులు పేదరికంలో మగ్గిపోయే వ్యవస్థ మారాలంటే మనమేం చేయాలో ఆలోచించాలి.

సమానత్వం, ప్రజాస్వామిక దృక్పథం అనే పథంవైపు మనం నడవవలసిన అవసరం వుంది. చేసిన తప్పులు ఒప్పుకోవడం పరిష్కార మార్గంలో తొలి అడుగు. సమసమాజం దిశగా మానవాళి వేసే అడుగులకు ఈ పుస్తకం స్ఫూర్తి కావాలని ఆశిస్తున్నాను.

ఉపోద్ఘాతం

సముద్ర మట్టానికి తొమ్మిది వేల అడుగుల ఎత్తులో ఆండిస్ పర్వత సానువుల్లో ఉంటుంది ఈక్వెడార్ రాజధాని క్విటో. షెల్ ఆయిల్ కంపెనీ తన అవసరాల కోసం ఏర్పరచిన షెల్ నగరం, క్విటో కన్నా దాదాపు ఎనిమిదివేల అడుగుల దిగువన ఉంటుంది. పాగలు గక్కే ఆ నగరంలో ఎక్కువగా నివసించేది సైనికులు, చమురు కార్మికులు. వీరికి వేశ్యలుగా, పనివారుగా ఉపయోగపడే స్థానిక షూఆర్, కిచ్వా తెగల ప్రజలు.

క్విటో నుండి షెల్ నగరానికి వెళ్లే రోడ్‌పై నేను ఎన్నో సార్లు ప్రయాణించాను. కానీ చుట్టూ కనువిందు చేసే దృశ్యమాల నన్నిప్పటికీ అబ్బురపరుస్తూనే ఉంటుంది. ఎత్తైన మొనదేలిన కొండలూ, మధ్య మధ్యలో హోరుమనే జలపాతాలూ, ఓ వంక పాతాళంలోతులో ప్రవహించే పాస్తాజా నది.

నేనిదివరకు ఎన్నడూ ఒప్పుకోని ఓ పని మీద షెల్ నగరానికి బయల్దేరాను. నా ప్రమేయంతో మొదలైన ఓ యుద్ధాన్ని ముగించడానికి ప్రయత్నిస్తున్నాను నేను. నా వంటి ఎకనామిక్ హిట్‌మెన్ మొదలుపెట్టిన అనేక సంఘర్షణల్లాగే ఇదీ బయటి ప్రపంచానికి తెలియకుండా జరుగుతున్న యుద్ధం. చమురు కంపెనీలతో తలపడుతున్న షూఆర్, కిచ్వా, అచ్వార్, జాప్రాస్, షివియార్స్ తెగల ప్రజలను కలవడానికి బయల్దేరాను నేను. తమ కుటుంబాలనీ, తమ ఇళ్లనీ, తమ భూములనీ చమురు కంపెనీల బారి నుండి కాపాడుకోవాలని ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు వారు. వారికి సంబంధించినంత వరకు ఇది తమ భావితరాల కొరకు, తమ సంస్కృతి కొరకు జరుపుతున్న చావు బతుకుల పోరాటం. మరి మనకో? ఇది అధికారం, డబ్బు, సహజ సంపదల కొరకు జరుగుతున్న యుద్ధం.

ప్రపంచాధిపత్యం కొరకు కొద్దిమంది దురాశాపరులు సల్పుతున్న పోరు ఇది.

వారి స్వప్నం - గ్లోబల్ సామ్రాజ్యం.

ఎకనామిక్ హిట్‌మాన్ చేసే పని అదే - గ్లోబల్ సామ్రాజ్యాన్ని నిర్మించడం. అంతర్జాతీయ ద్రవ్య సంస్థల తోడ్పాటుతో ప్రపంచదేశాలను మా బహుళజాతి కార్పొరేషన్లకు, మా ప్రభుత్వానికీ, మా బ్యాంకులకీ దాసోహమయ్యేలా చేసే ఉన్నతశ్రేణి యువతీయువకుల బృందం మాది. మాఫియాలో ఉండే మిత్రులలాగే హిట్‌మెన్ కూడా కొన్ని వరాలిస్తారు. ఈ వరాలే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, రహదారులు,

రేవులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక పార్కుల అభివృద్ధి కోసం ఇచ్చే అప్పులు. ఇలాంటి అప్పులకు మామూలుగా ఉండే షరతు - మా దేశానికి చెందిన ఇంజనీరింగ్, నిర్మాణ సంస్థలకే ఆ ప్రాజెక్టులు నిర్మించే కాంట్రాక్టులు ఇవ్వాలని. నిజానికిలా అప్పులా ఇచ్చిన డబ్బులో అధిక శాతం అమెరికాను వదిలి వెళ్లనే వెళ్లదు. ఆ డబ్బు కేవలం వాషింగ్టన్‌లోని బ్యాంకు ఆఫీసులనుండి న్యూయార్క్, హూస్టన్ లేదా సాన్‌ఫ్రాన్సిస్కో నగరాల్లోని ఇంజనీరింగ్ ఆఫీసులకు మారుతుంది.

అయితే అప్పులో సింహభాగం తిరిగి బహుళజాతి కార్పొరేషన్లకే చేరినా అప్పు తీసుకున్న దేశం మాత్రం వడ్డీతో సహా అప్పు తిరిగి చెల్లించాల్సిందే. ఎకనామిక్ హిట్‌మాన్ తన పనిలో సఫలీకృతమైతే ఈ అప్పులు తిరిగి చెల్లించలేనంత భారీ మొత్తాలలో ఉంటాయి. కొన్నేళ్లకే ఆ దేశం ఈ అప్పుల వాయిదాలు కట్టలేని దశకు చేరుకుంటుంది. మాఫియాలాగే అప్పుడు మేం మా వాటా కోరుతాం. మా కోరికల్లో ప్రధానమైనవి ఐక్యరాజ్యసమితిలో మా తీర్మానాలకు మద్దతుగా ఓట్లు, సైనిక స్థావరాలు నెలకొల్పడానికి అనుమతులు లేదా విలువైన సహజ సంపదలపై మా నియంత్రణ. మా కోరికలు తీర్చినా బాకీ పడ్డ సొమ్ము మాత్రం అలాగే ఉంటుంది సుమా. .

నా ఆలోచనలు ముప్పై అయిదేళ్ల క్రితం ఈక్వెడార్‌కు నా మొదటి ప్రయాణం వేపు మళ్లాయి.

ఈ బుల్లి దేశంలో ముప్పై 'జీవ' అగ్నిపర్వతాలు ఉన్నాయి. ప్రపంచంలోని పక్షి జాతుల్లో 15 శాతం, వేల కొద్దీ వృక్ష జాతులు, అనేక భిన్న సంస్కృతులూ, అరుదైన పురాతన భాషలకు నిలయం ఈక్వెడార్.

స్వచ్ఛంగా, నిర్మలంగా, అమాయకంగా ఉండేదప్పుడు ఈ దేశం.

గడిచిన ముప్పై అయిదేళ్లలో పరిస్థితులు చాలా మారి పోయాయి. 1968లో నేను మొదటిసారి ఇక్కడికి రావడానికి కొద్దికాలం ముందే టెక్సాకో అనే బహుళజాతి కంపెనీ ఇక్కడ చమురు నిల్వలను కనుగొంది. ఇవ్వాళ ఈక్వెడార్ ఎగుమతుల్లో సగభాగం చమురుదే. నా మొదటి పర్యటన తరువాత నిర్మించబడ్డ ట్రాన్స్-ఆండియన్ పైప్‌లైన్ నుండి దాదాపు అయిదు లక్షల బారెళ్ల చమురు ఈక్వెడార్ సతతహరిత అడవుల్లోకి లీకైంది. ఇప్పుడు 130 కోట్ల డాలర్ల వ్యయంతో కొత్తగా ఇంకో ఎకనామిక్ హిట్‌మాన్ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న చమురు పైప్‌లైన్ ఈక్వెడార్‌ను అమెరికాకు చమురు సరఫరా చేసే పది పెద్ద దేశాల జాబితాలోకి చేరుస్తుంది.

అయితే దీనికి ఈ దేశం చెల్లించిన మూల్యం?

భారీ ఎత్తున అడవి నరకబడింది. మకావ్‌లు, జాగ్వార్ల వంటి అరుదైన జంతుజాలం నశించింది. మూడు ఈక్వెడార్ స్థానిక సంస్కృతులు నాశనం చేయబడ్డాయి. స్వచ్ఛమైన నదులు కాలుష్యంతో పనికిరాకుండా పోయాయి.

ఇదే సమయంలో స్థానిక తెగలు ఈ ధ్వంస రచనను అడ్డుకునేందుకు నడుం బిగించాయి. మే 7, 2003 న దాదాపు 30,000 మంది స్థానిక ఈక్వెడార్ తెగ ప్రజల పక్షాన ఒక అమెరికన్ లాయర్ల బృందం షెవ్‌రాన్ టెక్సాకోకార్ప్ చమురు కంపెనీపై 100 కోట్ల డాలర్ల దావా వేసింది. ఆ దావా ప్రకారం 1971 నుండి 1992 మధ్య ఈ చమురు కంపెనీ ఆ దేశపు భూమిపై నదుల్లో, రోజుకు దాదాపు నలభై లక్షల గ్యాలన్ల అత్యంత కలుషిత జలం వదిలింది. ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేని 350 వ్యర్థ పదార్థాల గుంటలను ఏర్పాటు చేసింది.

నా షర్టు చెమటతో తడిసిపోయింది. కడుపులో వికారం వంటి భావన. ఈ అందమైన చిన్ని దేశాన్ని ఇలా చిదిమేయడంలో నా పాత్ర ఎంతో ఉంది. నేను, నాతోటి హిట్‌మెన్ ఈక్వెడార్‌కు చూపించిన నూతన ఆర్థిక విధానాల అద్భుతాలకు భిన్నంగా ఆ దేశం ఇప్పుడు మునుపటి కంటే దయనీయమైన పరిస్థితికి దిగజారింది.

చమురు వెల్లువగా పేర్కొనబడే 1970ల అనంతర కాలంలో ఈక్వెడార్‌లో అధికారికంగా పేదరికం 50 నుండి 70 శాతానికి పెరిగింది, నిరుద్యోగం 15 నుండి 70 శాతానికి, విదేశీ రుణం 24 కోట్ల డాలర్ల నుండి 1600 కోట్ల డాలర్లకు పెరిగింది. దేశంలో సహజవనరుల నుండి పేద ప్రజల కోసం కేటాయించే సొమ్ము 20 శాతం నుండి 6 శాతానికి తగ్గింది.

దురదృష్టవశాత్తూ ఇది కేవలం ఈక్వెడార్‌లో మాత్రమే జరిగిన పరిణామం కాదు. ఎకనామిక్ హిట్‌మెన్ చేతిలో పడ్డ ప్రపంచదేశాలన్నీ ఇదే పరిస్థితిలో ఉన్నాయి. తృతీయ ప్రపంచ దేశాల మొత్తం అప్పు 2.5 లక్షల కోట్ల డాలర్లు దాటింది. దానిపై వడ్డీనే ఏడాదికి 37,500 కోట్ల డాలర్లు అవుతోంది - ఈ మొత్తం తృతీయ ప్రపంచ దేశాలు అన్నీ విద్యపై, ఆరోగ్యంపై పెట్టే ఖర్చు కన్నా ఎక్కువ. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏటా అందుతున్న విదేశీ సాయానికన్నా ఇది ఇరవై రెట్లు ఎక్కువ. ప్రపంచ జనాభాలో సగం మంది రోజుకు రెండు డాలర్ల కంటే తక్కువపై జీవిస్తున్నారు - వారు 1970లో కూడా ఇదే రెండు డాలర్లపై జీవించారు. మరో వైపు ఇదే తృతీయ ప్రపంచ దేశాల్లో ధనికులైన 1 శాతం అక్కడి ఆస్తిలో 70-90 శాతానికి హక్కుదారులు.

నా ఎదురుగా ఓ పెద్ద కాంక్రీట్ భూతం ప్రత్యక్షమైంది. బూడిదరంగులో ఉన్న ఆ మహా కట్టడం అక్కడి పరిసరాల మధ్య చాలా అసహజంగా కనపడింది నాకు. హిట్‌మెన్ తిరిగే దేశాలలో అలాంటి కట్టడాలు కన్పించడం పెద్ద ఆశ్చర్యమేమీ

కాదు. అయినప్పటికీ ఆ దృశ్యం నా రోమాలు నిక్కబొడుచుకునేట్టు చేసింది. పాస్తాజా నదిపై కట్టిన భారీ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం అది. 156 మెగావాట్ల అగోయాన్ జల విద్యుత్కేంద్రం - ఈక్వెడార్‌లో పరిశ్రమాధిపతులైన కొద్ది కుటుంబాలకు ధనాన్ని ప్రసాదించి, నదీ పరీవాహక ప్రాంతాలలో నివసించే అనేక మంది స్థానిక రైతులకు, గిరిజన తెగలకూ అంతులేని క్షోభను కలుగజేసిందది.

నేను, నావంటి ఎకనామిక్ హిట్‌మెన్ కృషి ఫలితమే ఈ భారీ జలవిద్యుత్కేంద్రం. ఇప్పుడు స్థానిక షూఆర్, కీచ్వా తెగలు మా చమురు కంపెనీలపై యుద్ధం ప్రకటించడానికి కారణం కూడా ఇలాంటి ప్రాజెక్టులే.

ఈ ప్రాజెక్టుల వల్లనే ఈక్వెడార్ విదేశీ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. పేదరికంలో మగ్గుతున్న లక్షలాది పౌరులను ఒడ్డున పడేసేందుకు వినియోగించవలసిన మొత్తాలు అప్పులకు వడ్డీలు కట్టడానికి వినియోగిస్తోంది ఈ దేశ ప్రభుత్వం. ద్రవ్య సంస్థలను మెప్పించడానికి విలువైన అడవులను చమురు కంపెనీలకు ధారాదత్తం చేయడం మినహా ఇప్పుడు ఈక్వెడార్‌కు మరో దారిలేదు. అసలు మా వంటి ఎకనామిక్ హిట్‌మెన్‌ను ఇక్కడికి రప్పించింది ఈ దేశపు చమురు సంపదనే. గల్ఫ్ దేశాల్లోని చమురు నిల్వలకన్నా పెద్ద మొత్తంలో చమురు నిక్షేపాలు అమెజాన్ నదీలోయలో దాగి ఉన్నాయి.

సెప్టెంబర్ 11 దాడి అనంతరం అమెరికా గల్ఫ్ దేశాల నుండి చమురు ఎగుమతులు తగ్గిపోతాయని భీతిల్లింది. ఓ వైపు వెనిజులాలో హ్యూగో చావెజ్ అనే కొత్త ప్రజారంజక అధ్యక్షుడు ఎన్నికయ్యాడు. ఆయన విధానం సామ్రాజ్యవాదానికి చెంపపెట్టులా మారింది. ఇరాక్‌లో, వెనిజులాలో ఎకనామిక్ హిట్‌మెన్ విఫలం అయ్యారు కానీ ఈక్వెడార్‌లో మాత్రం హిట్‌మెన్ ఉపాయం ఫలించింది. ఇక పిండుకోవల్సినంత పిండుకోవచ్చు.

ఈక్వెడార్ అడవుల్లో ఉత్పత్తి చేయబడ్డ ప్రతి 100 డాలర్ల చమురులో 75 డాలర్లు చమురు కంపెనీకి చేరుతాయి. మిగిలిన 25 డాలర్లలో మూడోవంతు విదేశీ అప్పులు తిరిగి చెల్లించడానికి వినియోగిస్తారు. సైనిక, ప్రభుత్వ అవసరాలకు పోగా మిగిలేది 2.5 డాలర్లు. వైద్యం, విద్య, ప్రజాసంక్షేమం కొరకు చేసే ఖర్చులన్నీ ఈ మొత్తంలో సర్దుకోవాలి. 100 డాలర్ల చమురు దోచుకుని ప్రజలకిచ్చేది మాత్రం 3 డాలర్ల లోపు! ఈ ఆనకట్టల వల్ల, ఈ పైప్‌లైన్ల వల్ల, ఈ డ్రిల్లింగ్ వల్ల కష్టపడి, నష్టపడి, తినే ఆహారం లేక, తాగేనీరు లేక కాలుష్యానికి రోగాలు తెచ్చుకునే వారు ఆ ప్రజలే కావటం గమనార్హం.

వీళ్లంతా - ఈక్వెడార్‌లో లక్షల కొద్దీ ప్రజలు, ఇతర దేశాల్లో కోట్ల మంది -

కాబోయే టెర్రరిస్టులు. కారణం వాళ్లకేదో కమ్యూనిజం మీదో, అరాచకత్వం మీదో ఇష్టముండటం కాదు, వాళ్లు పుట్టుకతోనే అంత చెడ్డవాళ్లేమీ కాదు.

కారణం ఒక్కటే - వాళ్లకు ఇంకో దారి లేదు!

ఈ నూతన సామ్రాజ్యపు నిర్మాణ చాతుర్యం నిరుపమానం. అది 18వ, 19వ శతాబ్దాల స్పానిష్, యూరోపియన్ ఆక్రమణదారులను చిన్నబోయేటట్టు జేస్తుంది.

మా ఎకనామిక్ హిట్‌మెన్ వ్యవస్థ చాలా కళాత్మకం. మేం చరిత్ర నుండి పాఠాలు నేర్చుకున్నాం. మేం కత్తులూ, కటార్లూ వాడం. మాకు యూనిఫారం లేదు, ఈక్వెడార్, నైజీరియా, ఇండోనేషియా వంటి దేశాల్లో మేం స్థానిక బడిపంతుళ్ల, దుకాణదారుల వేషధారణలో ఉంటాం. వాషింగ్టన్‌లో, పారిస్‌లో మేం ప్రభుత్వ అధికారుల్లా, బ్యాంకు అధికారుల్లా కనపడతాం. మేం ప్రాజెక్టు నిర్మించే ప్రదేశాలను, దాని చుట్టుముట్టూ ఉండే పేద గ్రామాలను పర్యటిస్తాం. మేం చేపడుతున్న మహోన్నత కార్యం గురించి స్థానిక దినపత్రికల వారితో గంభీరమైన మాటలు మాట్లాడుతాం. సమావేశాలలో, ప్రభుత్వ కమిటీల ముందు భారీ ప్రజెంటేషన్లు, ఆర్థిక నివేదికలూ ప్రదర్శిస్తాం. హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో నూతన ఆర్థిక విధానాల గూర్చి ఉపన్యాసాలు ఇస్తాం. మేం అన్నీ బహిరంగంగానే, చట్టపరంగానే చేస్తాం.

అయితే ఈ వ్యవస్థనే ఒక మోసపు పునాదిపై నిర్మించబడ్డది. ఒక వేళ మేం మా పనిలో విఫలమైతే మా బాధ్యతను 'తోడేళ్లు' అని పిలువబడే మరొక రకం ఏజెంట్లు తీసుకుంటారు. ఈ తోడేళ్లు కనుక బాధ్యత తీసుకున్నారంటే దేశాధ్యక్షులు మారిపోతారు లేదా 'ప్రమాదవశాత్తు' మరణిస్తారు. ఒక వేళ ఇరాక్, అఫ్ఘనిస్తాన్‌లోలా ఈ 'తోడేళ్లు' కూడా తమ పనిలో విఫలమైతే అప్పుడు పురాతన పద్ధతులే మళ్లీ ఉపయోగిస్తారు - అప్పుడు యువ అమెరికన్ సైనికులు చంపడానికి, చావడానికి పంపించబడతారు.

మొదటి భాగం 1963 - 1971

అధ్యాయం 1

ఎకనామిక్ హిట్‌మాన్ పుట్టుక

అమెరికాలోని న్యూ ఇంగ్లాండ్‌కి చెందిన ఒక మధ్య తరగతి కుటుంబంలో 1945వ సంవత్సరంలో జన్మించాను నేను.

వెర్మాంట్‌లోని మిడిల్ బరీ కాలేజిలో చేరాక జరిగిన రెండు సంఘటనలు నా జీవితాన్ని మలుపు తిప్పాయి.

మొదటిది ఒక ఇరానీ జనరల్ కొడుకైన ఫర్హాద్ రూపంలో, రెండోది ఆన్ అనే అందమైన అమ్మాయి రూపంలో.

మొదలు ఫర్హాద్ గురించి చెప్తాను. దృఢమైన శరీరం, నల్లని రింగురింగుల జుత్తు, జేగురు రంగు కళ్లు, వీటన్నిటినీ మించి కుటుంబపు నేపథ్యం ఫర్హాద్ అంటే అమ్మాయిలు పడిచచ్చేలా చేసేవి. అతని స్నేహం పొందడానికి నేను ఎంతో కష్టపడాల్సివచ్చింది. నా భవిష్యత్ జీవితానికి ఉపయుక్తమైన ఎన్నో విషయాలు ఫర్హాద్ నుండి నేర్చుకున్నాను నేను.

అయితే ఫర్హాద్‌తో స్నేహం నా చదువును దెబ్బతీసింది. అతనితో కలిసి విందులకు వెళ్లడం, తాగడం వంటి దుర్వ్యసనాలు నేర్చుకున్నాను. తత్ఫలితంగా నేను కాలేజి స్కాలర్‌షిప్ కోల్పోయాను. చదువును ఆపేయాల్సి వచ్చింది. తల్లిదండ్రుల ఆగ్రహాన్ని కూడ చవిచూడాల్సి వచ్చింది.

కాలేజి చివరి రోజు నేను, ఫర్హాద్ ఒక బార్‌లో పీకలదాకా తాగాం. ఒక రైతుతో బాగా గొడవపడ్డాం. ఫర్హాద్ అయితే ఒక కత్తి తీసుకుని అతన్ని తీవ్రంగా గాయపరిచాడు. మరునాడు క్యాంపస్ పోలీసులు ఈ సంఘటన గురించి నన్ను

ప్రశ్నిస్తే 'నాకేం తెలియదు' అని బుకాయించాను. ఫర్హాద్‌ను ఇదే కారణం మీద కాలేజి నుండి తొలగించారు.

ఇక ఆన్ గురించి, మా ఇద్దరి అమలిన ప్రేమ గురించి చెప్పాలి మీకు. మిడిల్‌బరీ కాలేజిలో తను పరిచయమైంది. నేనా కాలేజి వదిలి బోస్టన్ యూనివర్సిటీ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కాలేజిలో చేరినప్పటికీ ఆన్‌తో నా స్నేహం కొనసాగింది. తను తరచూ నా కాలేజికి వచ్చి కలిసేది. తను నా కంటే ఓ ఏడాది ముందుగానే - 1967లో తన డిగ్రీ పూర్తి చేసుకుంది.

పెళ్లి విషయంలో ఆన్ చాలా నిక్కచ్చిగా ఉండేది. పెళ్లయితే కానీ నాతో కలిసి ఉండనని కరాఖండిగా చెప్పేసింది తను.

ఆన్‌తో గడిపే సమయాలు ఎంతో బావుండేవి. ఆ ఆనందం శాశ్వతం కావాలనుకుని తననే పెళ్లి చేసుకున్నాను.

ఆన్ వాళ్ల నాన్న ఒక అద్భుతమైన ఇంజనీరు. అతను ఒక నూతన శ్రేణి క్షిపణి రూపకల్పనలో చాలా కీలక పాత్ర పోషించాడు. అతని శ్రమకు గుర్తింపుగా నావికాదళంలో చాలా పెద్ద పదవినిచ్చారు.

ఆన్ వాళ్ల నాన్నగారికి అంకుల్ ఫ్రాంక్ (నిజం పేరు కాదు) అనే స్నేహితుడుండేవాడు. నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ (ఎన్ఎస్ఏ)లో ముఖ్య పదవిలో ఉండేవాడు ఫ్రాంక్. దేశంలోపల, బయట పెద్దగా ఎవరికీ తెలియని ఎన్ఎస్ఏ - అమెరికాలో అతి పెద్ద గూఢచారి సంస్థ.

పెళ్లయ్యాక కొన్నాళ్లకే సైన్యం నుండి పిలుపొచ్చింది నాకు. వియత్నాం యుద్ధం జోరుగా సాగుతున్న రోజులవి. అయితే వియత్నాంలో అమెరికన్ సేనల దుర్మార్గాల కథనాలు వినపడుతున్న ఆ రోజుల్లో సైన్యంలో చేరడానికి చాలా తటపటాయించాను నేను.

ఆ సందిగ్ధావస్థ నుండి నన్ను అంకుల్ ఫ్రాంక్ రక్షించాడు. నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ (ఎన్ఎస్ఏ) లో ఒక ఉద్యోగానికి నన్ను రిఫర్ చేశాడు. ఏజెన్సీలో రోజుల తరబడి నన్ను రకరకాల పరీక్షలకు గురిచేసారు. ఓ రోజంతా పాలీగ్రాఫ్ (లై డిటెక్టర్) పరీక్షలు కూడా పెట్టారు. నేను ఏజెన్సీలో పనిచేసేందుకు ఉపయోగపడతానా లేదా అనేది కనుక్కునేందుకే ఈ పరీక్షలు పెడుతున్నామని నాకు చెప్పారు. వియత్నాం యుద్ధం పట్ల నాకున్న భావాల దృష్ట్యా నేనీ ఏజెన్సీ ఉద్యోగానికి అర్హుడిని కానని నాకు బలంగా అనిపించేది.

ఇంటర్వ్యూలలో ఇదే విషయం చెప్పినా ఏజెన్సీ అధికారులు పెద్దగా పట్టించుకున్నట్టు కనిపించలేదు. వాళ్లు నా పెంపకం గురించి, తల్లితండ్రుల పట్ల

నాకున్న ద్వేషం, నా జీవితంలో డబ్బు, అమ్మాయిలు, సెక్స్ లేకపోవడం గురించీ, తదనుగుణంగా రూపుదిద్దుకున్న నా స్వప్నలోకం గురించి ఇంటర్వ్యూలలో తెలుసుకున్నారు. ఫర్హాద్‌తో నాకున్న అనుబంధం గురించీ, క్యాంపస్ పోలీసులతో నేనాడిన అబద్ధాల గురించీ ఏజెన్సీ అధికారులు అమిత ఆసక్తిని ప్రదర్శించారు.

ఇవన్నీ నా ఉద్యోగానికి నన్ను అనర్హుడిని చేస్తాయేమోనని భయపడ్డాను. కానీ చాలా ఏళ్ల తర్వాత వెనుదిరిగి చూసుకుంటే ఈ అవలక్షణాలే నన్ను ఏజెన్సీలో ఉద్యోగానికి అర్హుడిని చేశాయని అర్థమైంది. దేశానికి నేను ఎంత విధేయుడిని అన్న దాని కన్నా నా జీవితం ఎంత అసంతృప్తిగా ఉన్నదన్నదే వారికి అవసరం. తల్లిదండ్రులపై ద్వేషం, అమ్మాయిల పిచ్చి, విలాసవంతమైన జీవితం గడపాలనే కోరిక, విదేశీయులతో స్నేహంగా ఉండగలగటం, అవసరమైతే పోలీసులతో కూడా అబద్ధం ఆడగలగటం - ఇవన్నీ ఎన్ఎస్ఏ వారికి నాలో నచ్చిన అంశాలు!

కొద్ది రోజుల తర్వాత ఏజెన్సీలో గూఢచారిగా శిక్షణకు పిలుపొచ్చింది నాకు. అయితే శిక్షణలో చేరటం మాత్రం నా డిగ్రీ పూర్తయ్యాకే. ఇదే సమయంలో పీస్ కోర్ అనే స్వచ్ఛంద సంస్థ వాళ్లు నిర్వహించిన ఓ సదస్సుకు హాజరయ్యాను నేను. అనేక దేశాల్లోని గిరిజన ప్రాంతాల్లో పీస్ కోర్ తన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అంకుల్ ఫ్రాంక్ కూడా నన్ను పీస్ కోర్‌తో కొంత సమయం గడపమని ప్రోత్సహించాడు. నేను, ఆన్ కలిసి ఈక్వెడార్ దేశంలో పీస్ కోర్ కార్యక్రమాలలో పాల్గొన్నాం.

అక్కడే నన్ను ఐనార్ గ్రేవ్ అనే పెద్ద మనిషి కలుసుకున్నాడు. ఛాస్ టి మెయిన్ అనే కన్సల్టింగ్ కంపెనీకి అతను వైస్ ప్రెసిడెంట్. పెద్దగా ప్రచార పటాటోపం లేని ఈ బహుళజాతి సంస్థ, ప్రపంచబ్యాంక్ ఈక్వెడార్‌కు, దాని పొరుగు దేశాలకు విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కొరకు కోట్ల డాలర్ల రుణాలు ఇవ్వాలా వద్దా అనే విషయాలపై పరిశోధించి నివేదికలు ఇస్తుంది.

ఐనార్ నన్ను మెయిన్‌లో చేరమని ఆహ్వానించాడు.

నేను అప్పటికే ఎన్ఎస్ఏ నన్ను గూఢచారిగా ఎంపిక చేసుకుందని అతనికి చెప్పాను. అతను వెళ్తూవెళ్తూ ఈక్వెడార్ ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితి గురించి తనకు సమాచారం పంపించమని అభ్యర్థించాడు. నేను సరేనన్నాను.

అప్పట్లో నాకు ఓ చిన్న టైప్‌రైటర్ ఉండేది. రాయడమంటే కూడా బలే సరదా నాకు. అందుకే ఐనార్ కోరినట్టు ఈక్వెడార్ దేశం గురించి నాకు తెలిసిందంతా అతడికి రాశాను. ఇక్కడ స్థానిక తెగలలో చమురు కంపెనీలపై పెరుగుతున్న అసహనం, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు, ఇక్కడి పరిణామాలలో వాటి పాత్ర గురించి నా రిపోర్టులలో వివరించాను.

పీస్ కోర్ పని అయిపోగానే ఐనార్ నన్ను మెయిన్‌లో చేరమని మళ్లీ ఆహ్వానించాడు. వ్యక్తిగతంగా కలిసినప్పుడు మెయిన్ సంస్థ చేస్తున్న వ్యాపారం గురించి నాకు తెలియజేశాడు.

మెయిన్ ముఖ్య వ్యాపారం ఇంజనీరింగ్ అయినా అది ప్రపంచ బ్యాంక్ కొరకు ఎక్కువ పని చేస్తుందని అతను చెప్పాడు. ప్రపంచ బ్యాంక్ చేపట్టే ప్రాజెక్టుల ఇంజనీరింగ్ డిజైన్లు, వాటి ఆర్థిక అంచనాలు మెయిన్ రూపొందిస్తుంది. నా ఉద్యోగంలో భాగంగా నేను ఈక్వెడార్, ఇండోనేషియా, ఇరాన్, ఈజిప్ట్ వంటి మారుమూల దేశాలకు వెళ్లవలసి ఉంటుందని, అక్కడి స్థానిక నాయకులతో నిత్యం సంభాషించవలసి వస్తుందనీ ఐనార్ నాకు వివరించాడు. ఇదివరకు ఇదే పని మీద నియమితులైన వారు అందరూ ఇందులో విఫలం అయ్యారనీ అతను చెప్పాడు.

'నువ్వు ఈక్వెడార్‌లో పనిచేయటం చూశాను. నువ్వు ప్రపంచంలో ఎక్కడైనా పనిచేయగలవనిపించింది. అందుకే నువ్వు ఉద్యోగానికి సరిపోతావనిపిస్తోంది నాకు' అని నా భుజం తట్టాడు ఐనార్.

1971 జనవరిలో నేను మెయిన్‌లో ఆర్థిక నిపుణుడిగా చేరాను. అప్పుడు నా వయస్సు ఇరవై ఆరు. ఆన్ కుటుంబంతో కూడా ఈ ఉద్యోగం గురించి చర్చించాను. అంకుల్ ఫ్రాంక్ కూడా దీనికి సమ్మతించాడు. అసలు ఈ పరిణామాలు ఓసారి విశ్లేషిస్తే ఇదంతా ఓ పద్ధతి ప్రకారమే జరిగిందని నాకు అర్థమైంది.

మొదలు ఎన్ఎస్ఏ లో ఉద్యోగం - ఆ తర్వాత పీస్ కోర్ వారి ఈక్వెడార్ ప్రాజెక్టు, ఇప్పుడు మెయిన్‌లో ఓ ఆర్థిక నిపుణుడి ఉద్యోగం...

కొన్నాళ్లు నేను కాలరెగరేసుకు తిరిగాను. డిగ్రీ పూర్తవగానే ఇంత పెద్ద కంపెనీలో ఇంత మంచి ఉద్యోగం. గొప్ప సీక్రెట్ ఏజెంట్‌గా నన్ను నేను ఊహించుకునేవాణ్ణి.

ఎక్కడో దూరదేశాలకు వెళ్లినట్టు, స్విమ్మింగ్‌పూల్‌లో బికినీలు వేసుకున్న అమ్మాయిల మధ్యలో సేదదీరినట్టూ కలల్లో తేలిపోయేవాణ్ణి.

ఇదంతా కలనే అని తెలిసినా కొన్నాళ్లకి ఇందులో చాలా భాగం నిజమవుతాయనీ - ఆర్థిక నిపుణుడిగా నన్ను నియమించినా, నా ఉద్యోగం జేమ్స్ బాండ్ ఉద్యోగానికి చాలా దగ్గరిదని త్వరలోనే తెలుసుకున్నాను నేను.

అధ్యాయం 2

యావజ్జీవిత ఉద్యోగం

మెయిన్‌లో దాదాపు రెండువేల మంది పనిచేసేవాళ్లు. అందులో దాదాపు ఐదు శాతం ఉద్యోగులు ఆ కంపెనీకి యజమానులు. వీరిని పార్ట్‌నర్స్ అని అనేవారు. ఈ పార్ట్‌నర్స్ చాలా శక్తివంతమైనవారు. వాళ్లు దేశాధినేతలతో, అత్యున్నత స్థాయి అధికారులతో మాత్రమే వ్యవహారాలు నడిపేవారు. వీరి పని అంతా అత్యంత గోప్యంగా నిర్వహించబడేది. అసలు పత్రికల వాళ్లతో మాట్లాడటమే నిషిద్ధం. అందుకేనేమో మెయిన్ గురించి బయట ప్రపంచానికి పెద్దగా తెలిసేది కాదు. మా ప్రత్యర్థులైన ఆర్థర్-డి లిటిల్, స్టోన్ అండ్ వెబ్‌స్టర్, బ్రౌన్ అండ్ రూట్, హాలిబర్టన్, బెక్టెల్ గురించి కాస్తో కూస్తో సమాచారం ప్రపంచానికి తెలిసేది. అయినా 'ప్రత్యర్థులు' అన్న మాట కూడా ఇక్కడ సరికాదు ఎందుకంటే మెయిన్ చేసే పని చాలా ప్రత్యేక తరహాది.

మా ఉద్యోగుల్లో అధిక శాతం ఇంజనీర్లు. కానీ మాకు ఏ యంత్ర సామాగ్రి, నిర్మాణ సామాగ్రి ఉండేది కాదు. కనీసం ఓ షెడ్డు కూడా కట్టలేదు మా కంపెనీ. మా వద్ద పనిచేసే వారిలో చాలా మంది ఇదివరకు సైన్యంలో పనిచేసినవారు కానీ మా కంపెనీ రక్షణ శాఖ కొరకు ఏమీ కాంట్రాక్టులు చేయదు. అసలు మా కంపెనీ ఏం చేస్తుందో చేరిన కొన్ని నెలల దాకా నాకే అంతుబట్టలేదు. నా మొదటి పని ఇండోనేషియాలో అని మాత్రమే నేను తెలుసుకోగలిగాను.

నా ఉద్యోగం గురించి మాట్లాడినప్పుడల్లా ఐనార్, ఇతర సహోద్యోగులు ఇండోనేషియా ఆర్థికరంగం బాగా ఎదుగుతోందని నన్ను నమ్మించడానికి యత్నించేవారు. నేను మంచి ఆర్థిక జ్యోతిష్కుడిగా మారాలంటే నేనూ అలాంటి భావాలనే ప్రదర్శించాలని వారు నాకు సూచనలిచ్చేవారు.

నా బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిగ్రీ, నా ఆర్థిక నిపుణుడి ఉద్యోగానికి పెద్దగా ఉపయోగపడలేదు. అందుకే నేను చాలా కష్టపడవలసి వచ్చేది. ఆర్థిక అంశాలకు సంబంధించి అనేక శిక్షణా కార్యక్రమాలకు హాజరయ్యాను నేను. గణాంకాలు అనేవి ఎలా అంటే అలా వాడుకోవచ్చని నాకు ఆ సమయంలోనే అర్థం అయింది.

మెయిన్ ఓ పురుషాధిక్య కంపెనీ. 1971 నాటికి ఉన్నత పదవుల్లో కేవలం నలుగురే స్త్రీలు ఉండేవారు. పర్సనల్ సెక్రటరీలు, స్టెనోలుగా దాదాపు 200 మంది స్త్రీలు పనిచేసేవారు.

ఓ రోజు బోస్టన్ పబ్లిక్ లైబ్రరీలో కూర్చుని ఏదో పుస్తకం చదువుతుండగా ఓ ఆకర్షణీయమైన యువతి నా ఎదురుగా వచ్చి కూర్చుంది. తన ముదురాకుపచ్చ బిజినెస్ సూట్‌లో చాలా దర్పంగా ఉందావిడ. నాకంటే చాలా ఏళ్లు పెద్దదిలా ఉంది. నేను ఆమెను పట్టించుకోనట్టు నటించాను. కాసేపయ్యాక తనే ఓ పుస్తకం నా వేపు తోసింది. నేను చాలా సేపటినుంచి వెతుకుతున్న ఓ సమాచారం ఉందా పుస్తకంలో. దాంతోపాటే ఆ స్త్రీ విజిటింగ్ కార్డ్ - క్లాడిన్ మార్టిన్, స్పెషల్ కన్సల్టెంట్, ఛాస్. టి. మెయిన్ ఇన్‌కార్పొరేషన్.

నేను తలెత్తి తన నీలి కళ్లలోకి చూశాను. తను నావంక చేయిచాచింది.

'మీ శిక్షణలో సాయం చేయడానికి నన్ను నియమించారు' అంది తను.

ఆ మరునటి రోజు నుండి మేం బీకన్ రోడ్డులో ఉన్న క్లాడిన్ సొంత అపార్ట్‌మెంట్‌లో కలుసుకునే వాళ్లం. ఈ ఉద్యోగం వివరాలు చాలా గోప్యంగా ఉంచాలని తను నాకు మొదటి రోజే చెప్పింది.

'నిన్ను ఒక ఎకనామిక్ హిట్‌మాన్‌గా మార్చడమే నా పని' అని తను నాకు చెప్పింది.

ఆ మాట వినగానే వెన్నులో జలదరించింది నాకు. నా భావాలు గమనించి తను 'ఫర్వాలేదులే, ఈ విషయం తెలిసినా ఎవరూ నమ్మరు' అని నన్ను సమాధానపరిచింది.

ఈ ఎకనామిక్ హిట్‌మాన్ అంటే ఏమిటని అమాయకంగా ప్రశ్నించాను నేను.

'మనమో పాడు పనిలో ఉన్నాం. చాలా అరుదైన ఉద్యోగం ఇది. మనలాంటి వాళ్లు చాలా మందే ఉన్నారు' అని వివరించింది తను.

'నువ్వు చేసే పని గురించి నీ భార్యతో కూడా చెప్పొద్దు. నేను ఈ పనిలో మెళకువలు అన్నీ నేర్పుతాను నీకు కానీ, ఇప్పుడే ఆలోచించుకో ఒకసారి ఇందులోకి దిగావంటే జీవితాంతం ఇందులోనే ఉండాలి' అని చెప్పింది క్లాడిన్.

అప్పటి నుండీ మమ్మల్ని పూర్తి పేరుతో గాక ఇహెచ్‌ఎమ్ అని పిలిచేవారు.

తను తన అందాన్ని, మాటల చాతుర్యాన్ని కలబోసి వాడేది. పెద్ద వ్యవహారాలలో ఇలాంటివి మామూలే కదా!

క్లాడిన్ చాలా విషయాల్లో నిర్మొహమాటంగా వ్యవహరించేది. నేను మా మధ్య ఉన్న వ్యవహారాన్ని ఎప్పటికీ నా భార్యకి చెప్పనని, అలా చేస్తే నా పెళ్లి పెటాకులు అవుతుందనీ క్లాడిన్‌కు తెలుసు.

నేను రెండు పనులు చేయాల్సి ఉంటుందని క్లాడిన్ చెప్పింది. మొదటిది భారీ విదేశీ రుణాల గురించి దేశాధ్యక్షులను ఒప్పించడం. ఈ రుణాల్లో అధికభాగం పెద్దపెద్ద ఇంజనీరింగ్ నిర్మాణ కంపెనీలైన బెక్టెల్, హాలిబర్టన్, స్టోన్ అండ్ వెబ్‌స్టర్, బ్రౌన్ అండ్ రూట్‌లకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ప్రాజెక్టులకే వెచ్చింపబడతాయి.

ఇక నా పనుల్లో రెండోది ఈ అప్పులు తీసుకునే దేశాలని క్రమంగా అప్పుల ఊబిలో కూరుకుపోయేటట్టు చేసి వారిని అమెరికాకు, అప్పులిచ్చిన సంస్థలకు బానిసల్లాగా మార్చుకోవడం. ఒకసారి ఈ గుప్పెట్లో చిక్కిన దేశం అమెరికా ఆడమన్నట్టు ఆడాలి - సైనిక స్థావరాలు నెలకొల్పేందుకు అనుమతులు ఇవ్వాలి, ఐక్యరాజ్యసమితి తీర్మానాల్లో అవసరమయ్యే ఓట్లు వేయాలి. లేకపోతే చమురు లాంటి విలువైన సహజ వనరులని అప్పజెప్పాలి.

ఈ వేల కోట్ల డాలర్ల డబ్బును ఆయా దేశాల్లో పెట్టుబడిగా పెట్టడం ద్వారా చేకూరే లాభాలను ముందస్తుగా సూచించడమే నా పని. ఉదాహరణకు సోవియట్ యూనియన్‌తో దగ్గరవకుండా ఉండేందుకు ఫలానా దేశానికి ఒక కోటి డాలర్లను రుణంగా ఇవ్వాలని నిర్ణయం జరిగిందనుకోండి. నేనా డబ్బును కొత్త విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిర్మించడానికి వాడితే లాభదాయకమా లేక కొత్త రైల్వే లైన్లు లేదా టెలికమ్యూనికేషన్ వ్యవస్థను నెలకొల్పాలా అనే పరిశోధన చేసి నివేదికను ఇస్తానన్నమాట. ఏ ప్రాజెక్టు అయితే స్థూల జాతీయోత్పత్తిని ఎక్కువగా ప్రభావితం చేస్తుందో దానికి ఆమోదం లభించేది.

అయితే ఇందులో కనబడని అంశం ఒకటుండేది. ఈ ప్రాజెక్టులన్నీ మా దేశపు కాంట్రాక్టర్ల జేబులు నింపేవే. అంతే కాదు లబ్ధిపొందిన దేశంలో గుప్పెడు డబ్బున్న, అధికారమున్న వ్యక్తులకు ఈ డబ్బులో వాటా దక్కేది. రుణం పొందిన దేశాల ప్రభుత్వాలు మాపట్ల చాలా విధేయతతో మెలిగేందుకు ఇది ఉపయోగపడేది. ఈ దేశాలపై మోపబడిన రుణభారం వల్ల ఆయా దేశాల్లోని పేద ప్రజలకు ఆరోగ్యం, విద్య, ఇతర పౌరసేవలు అందని మావి పండ్లవుతాయనే విషయం అసలు పరిగణనలోకే తీసుకునేవారు కాదు.

స్థూల జాతీయోత్పత్తి అనేది ఎంత మోసపూరితమైన గణాంకమో నేనూ క్లాడిన్ అనేకసార్లు చర్చించుకున్నాం. ఉదాహరణకు దేశంలో కేవలం ఒక్క వ్యక్తి - ఓ పెద్ద కంపెనీ యజమాని - డబ్బులు సంపాదించి, మిగతా ప్రజానీకం అంతా పేదరికంలో మగ్గినా స్థూలజాతీయోత్పత్తి మెరుగుదలను నమోదు చేయవచ్చు

ధనికులు ఇంకా ధనికులు అవుతారు, పేదవారు ఇంకా పేదరికంలోకి నెట్టబడతారు అయినా గణాంకాలు మాత్రం ఆర్థికంగా ప్రగతి సాధించామని నమోదు చేసుకుంటూనే ఉంటాయి.

* * *

చాలా మంది అమెరికన్ల లాగే మా మెయిన్ ఉద్యోగులు కూడా ఈ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలూ, రహదారులూ, ఓడ రేవులూ నిర్మించి మేమేదో ప్రపంచదేశాలకు గొప్ప సాయం ఒరగబెడుతున్నామని నమ్మేవారు. ఎన్నో ఏళ్లుగా మా స్కూళ్లలో, మా పత్రికలలో మాకిదే రంగరించి బోధించారు కూడా.

నా మొదటి గమ్యస్థానం ఇండోనేషియా. ప్రపంచంలో అత్యంత జనసాంద్రత కలిగిన దేశమది. విలువైన చమురు నిల్వలు కలిగిన ముస్లిం దేశం. అంతేకాదు అప్పటికది కమ్యూనిస్టుల కార్యకలాపాలు ఉధృతంగా సాగుతున్న దేశం.

'మనం ఎలాగైనా ఆ దేశాన్ని మన దారికి తెచ్చుకోవాలి. అది కమ్యూనిస్టు కూటమిలో చేరిందంటే మన పనైపోయినట్టే' అంది క్లాడిన్ ఒక రోజు.

'నువ్వు ఆ దేశం కొరకు ఒక చక్కని ప్రణాళిక సిద్ధం చెయ్యాలి. కొత్తగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, పంపిణీ లైన్లు నిర్మిస్తే అక్కడి ఆర్థికరంగం దౌడు తీస్తుందని చెప్పాలి నీ నివేదికలు. అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు భారీ రుణాలివ్వడానికి ఇది ఉపకరిస్తుంది' అని వివరించింది క్లాడిన్.

'కానీ ఇదేమీ అంత తేలికైన పని కాదు. బ్యాంకుల నుండి వచ్చే నిపుణులు నీ నివేదికలను తూర్పారబడతారు. అయితే భయపడాల్సిందేమీలేదు ఇదంతా ఒక క్రమ పద్ధతిలో జరిగిపోతుంది' భరోసా ఇచ్చింది తను.

ఇండోనేషియాకు నాతోపాటు వస్తున్న పది మంది గురించి క్లాడిన్‌ను అడిగాను. వారికి కూడా నావంటి శిక్షణే లభిస్తున్నదా అని ప్రశ్నించాను. లేదు అని బదులిచ్చింది తను.

'వాళ్లంతా ఇంజనీర్లు. వాళ్లు విద్యుత్ ప్లాంట్లను, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ లైన్లను, ఓడరేవులను, రోడ్లను డిజైన్ చేస్తారు. నువ్వు భవిష్యత్తుని ఊహించే పనిని నిర్వర్తిస్తావు. నువ్వు ఎంత భారీ అంచనాలు రూపొందించావు అన్నదాన్ని బట్టి వారు అంతే భారీ ప్రాజెక్టును డిజైన్ చేస్తారు. బ్యాంకులు కూడా ఈ అంచనాలను బట్టే రుణాల మొత్తం నిర్ణయిస్తాయి. కాబట్టి ఈ మొత్తం కార్యక్రమంలో నీ పనే కీలకమైంది!'

క్లాడిన్ అపార్ట్‌మెంట్ నుండి బయల్దేరిన ప్రతీసారి నా అంతరాత్మ నన్ను వేధించేది. నేను చేస్తున్న పని సరైనదేనా కాదా అన్న మీమాంస నన్ను అనుక్షణం వెంటాడేది. నేను సరైన పని చేయడంలేదని నా హృదయం లోలోపల అనిపించేది.

కానీ నా గత జీవితపు నిరాశా నిస్పృహలు నన్ను ఈ ఉద్యోగం స్వీకరించేలా చేసేవి. నేను కోల్పోయినవన్నీ మెయిన్ సంస్థ నాకు సమకూరుస్తోంది. ఈ వ్యవస్థ లోపలి నుండి పనిచేసి తరువాత దాని గుట్టు బయటపెట్టవచ్చని నన్ను నేను సమాధానపర్చుకునేవాణ్ని. ఇదే సంగతి తనతో చెబితే,

'అట్లాంటి పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టు' అంది క్లాడిన్.

'ఏదైనా ఉంటే ఇప్పుడే ఆలోచించుకో. ఒకసారి ఇందులోకి దిగావంటే ఇక వెనక్కి రావడం కల్ల' అని హెచ్చరించింది.

కొన్ని నెలల తర్వాత ఓ రోజు మధ్యాహ్నం క్లాడిన్, నేను తన అపార్ట్‌మెంట్ కిటికీలో కూర్చుని బీకన్ రోడ్‌లో కురుస్తున్న మంచుని చూస్తున్నాం.

హఠాత్తుగా తను అంది 'మనమొక విలక్షణమైన తరగతికి చెందిన మనుషులం'. మళ్లీ తనే 'మనకు ఇంత పెద్ద మొత్తాలలో జీతాలు ఎందుకు ఇస్తారో తెలుసా? ప్రపంచ దేశాలనుండి వేలకోట్ల డాలర్లను మోసపూరితంగా కొట్టేయడానికి. అమెరికా ఆర్థిక ఆకాంక్షలు నెరవేర్చే ఒక నెట్‌వర్క్‌లో ప్రపంచదేశాలను భాగస్వాములను చేయటం నీపని. చివరికి ఆ దేశాలన్నీ ఒక అప్పుల ఊబిలో కూరుకుపోయి మనకు విశ్వాసపాత్రంగా మారిపోతాయి. మన ఆర్థిక, రాజకీయ, సైనిక అవసరాలకు తగినట్టుగా ఈ దేశాలను మనం వాడుకోవచ్చు. ఇందుకు ప్రతిఫలంగా ఆ దేశ నాయకులు తమ తమ దేశాలలో పారిశ్రామిక పార్కులు, విద్యుత్‌ప్లాంట్లు, విమానాశ్రయాలు నిర్మించి వారి ప్రజలకు చూపించవచ్చు. ఈ ప్రక్రియ ద్వారా మన ఇంజనీరింగ్, నిర్మాణ కంపెనీల బొక్కసాలు నిండుతాయి'.

ఆ శీతాకాలపు మధ్యాహ్నం క్లాడిన్ నాకు ప్రపంచ చరిత్రను కళ్లకు కట్టినట్టు చెప్పింది.

చరిత్రలో సామ్రాజ్యాల నిర్మాణం సైన్యం ప్రయోగించో లేదా సైన్యాన్ని బూచిగా చూపో జరిగింది. అయితే రెండో ప్రపంచ యుద్ధానంతరం, సోవియట్ యూనియన్ ఏర్పడ్డాక, అణుబాంబు తయారయ్యాక సైన్యంతో సామ్రాజ్య విస్తరణ చాలా ప్రమాదకరంగా తయారైంది. 1951లో తన సహజ వనరులని, తన ప్రజలనీ దోచుకుంటున్న బ్రిటిష్ చమురు కంపెనీతో ఇరాన్ తలపడ్డప్పుడు ఒక నిర్ణయాత్మక పరిణామం సంభవించింది.

ఆ చమురు కంపెనీ ఇప్పటి బ్రిటిష్ పెట్రోలియం మాతృసంస్థ. ఈ సంఘర్షణ పర్యవసానంగా అప్పటి ఇరాన్ ప్రధానమంత్రి మహమ్మద్ మొస్సాదెగ్ దేశంలోని చమురు వనరులన్నిటినీ జాతీయం చేసాడు. దీంతో చిర్రెత్తిన బ్రిటన్ తన

రెండో ప్రపంచయుద్ధ మిత్రదేశమైన అమెరికాను సాయమడిగింది. అయితే రెండు దేశాలూ ఇరాన్‌పై సైనిక చర్య తీసుకునే సాహసం చేయలేకపోయాయి. అలా చేస్తే ఇరాన్ తరపున సోవియట్ యూనియన్ రంగంలోకి దిగుతుందని భయపడ్డాయి.

ఇరాన్‌కు సేనల బదులు సిఐఎ ఏజెంట్ కెర్మిట్ రూజ్‌వెల్ట్‌ని (థియోడర్ రూజ్‌వెల్ట్ మనవడు) పంపించింది అమెరికా. కెర్మిట్ అక్కడ అద్భుతంగా పనిచేశాడు. కొందరిని డబ్బుతో కొన్నాడు, మరి కొందరిని బెదిరించి తన వైపు తిప్పుకున్నాడు. దేశమంతటా వీధి పోరాటాలు, హింసాత్మక ప్రదర్శనలు జరిపించాడు. మొస్సాదెగ్‌కు ప్రజల్లో పట్టులేదనే భ్రమను కలుగజేశాడు. ఫలితంగా మొస్సాదెగ్ పదవీచ్యుతుడయ్యాడు. అమెరికా మద్దతుతో మహమ్మద్ రెజా షా ఇరాన్ దేశాధ్యక్షుడయ్యాడు. ఎదురులేని నియంతలా మారి ఇరాన్‌ను పాలించాడు. కెర్మిట్ రూజ్‌వెల్ట్ ఓ కొత్త వృత్తికి ప్రాణం పోశాడు. ఇప్పుడు నేను చేయబోతున్న పని కూడా అలాంటిదే.

రూజ్‌వెల్ట్ పాచిక పశ్చిమ ఆసియా చరిత్రను తిరగరాసింది. అంతేకాదు సామ్రాజ్య నిర్మాణంలో పాత వ్యూహాలకు కాలం చెల్లిందని చాటింది. అదే సమయంలో అమెరికా చేసిన 'అణురహిత పరిమిత యుద్ధం' అనే కొత్త ప్రయోగం వియత్నాంలో, కొరియాలో ఘోరంగా విఫలమైంది. అణుయుద్ధం భయం లేకుండా సోవియట్లను ఎదుర్కోవడానికి అమెరికాకి ఇక రూజ్‌వెల్ట్ ప్రయోగం మాత్రమే ఏకైక దారిగా మిగిలింది.

అయితే ఈ వ్యూహంలో ఒక చిన్న సమస్య ఉంది. కెర్మిట్ రూజ్‌వెల్ట్ సిఐఎ ఉద్యోగి. ఒకవేళ పరిస్థితులు అనుకూలించక అతను పట్టుబడితే పర్యవసనాలు చాలా దారుణంగా ఉండేవి. ఒక విదేశీ ప్రభుత్వాన్ని కూలదోయటానికి అమెరికా పన్నిన మొదటి కుట్రను అతను అమలు చేసాడు. అయితే ఇలాంటి కుట్రలు చాలా చేయవలసి వస్తే మాత్రం అమెరికా పేరు బయటకు రాని మార్గం ఏదైనా కనుగొనాలి.

అమెరికన్ వ్యూహకర్తల అదృష్టం బాగుండి అదే సమయంలో (1960లలో) ఓ కొత్త పరిణామం సంభవించింది అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు (ప్రపంచబ్యాంక్, ఐ.ఎం.ఎఫ్) అప్పుడప్పుడే వేళ్లూనుకున్నాయి. అమెరికా, దాని యూరపియన్ సామ్రాజ్యవాద మిత్ర దేశాల పెట్టుబడితో నడిచే ఈ ద్రవ్యసంస్థలు, బహుళజాతి కార్పొరేషన్ల మధ్య ఓ పరస్పర లాభదాయకమైన బంధం ఏర్పడింది.

ఇక రూజ్‌వెల్ట్ లాంటి సిఐఎ అధికారులకు ప్రత్యామ్నాయం కనుగొనబడింది. నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ వంటి గూఢచారి సంస్థలు ఎకనామిక్ హిట్‌మెన్‌గా నియమించదగిన వారిని గుర్తిస్తాయి. ఆ తరువాత ఆ హిట్‌మాన్‌ను ఏ ప్రైవేటు అంతర్జాతీయ బహుళజాతి కార్పొరేషనో ఉద్యోగంలోకి తీసుకుంటుంది. వీళ్ల జీతాలు

ప్రైవేటు కంపెనీల నుండి తీసుకుంటారు. పనులు మాత్రం అమెరికన్ సామ్రాజ్యవాదులకు పనికి వచ్చేవే చేస్తారు. ఒకవేళ ఎప్పుడైనా ఈ కుట్ర బైటపడినా ఇదేదో బహుళజాతి కంపెనీల దురాశకు సంబంధించిన వ్యవహారమని నలుగురినీ నమ్మించవచ్చు. తద్వారా న్యాయపరమైన చిక్కుల నుండి కూడా తప్పించుకోవచ్చు.

'అదీ సంగతి' అంటూ ముగించింది క్లాడిన్.

అధ్యాయం 3

ఇండోనేషియా : దళారీ పాఠాలు

'నువ్వు వెళ్లబోయే దేశం గురించి ఎంత ఎక్కువ తెలుసుకుంటే నీ పని అంత సులువవుతుంది' అని క్లాడిన్ చెప్పిన మాటలను నేను తు.చ. తప్పకుండా పాటించాను. గంటల తరబడి లైబ్రరీలో కూర్చుని ఇండోనేషియా గురించి పుస్తకాలు తిరగేసేవాడిని.

1492 లో కొలంబస్ ప్రయాణం మొదలుపెట్టినప్పుడు ఇండోనేషియాను స్పైస్ ఐలాండ్స్ అని పిలిచేవారు. వలస పాలన రోజుల్లో ఈ దేశాన్ని అమెరికా కన్నా విలువైనదిగా పరిగణించేవారు. ఖరీదైన వస్త్రాలూ, పేరెన్నికగన్న సుగంధ దినుసులూ, ఐశ్వర్యంతో తులతూగే రాజ్యాలూ - ఇవన్నీ కలిగిన జావా (ఇండోనేషియా) కొరకు అప్పటి స్పానిష్, డచ్, పోర్చుగీసు, బ్రిటిషు పాలకులు నిత్యం కొట్లాడుకునేవారు. 1750 నాటికి నెదర్లాండ్స్ జావానైతే గెలుచుకోగలిగింది కానీ చుట్టూ ఉన్న ద్వీపాలను ఆక్రమించుకోవడానికి మరో 150 ఏళ్లు పట్టింది.

రెండో ప్రపంచ యుద్ధకాలంలో జపనీయులు ఇండోనేషియాపై దాడి చేసినప్పుడు డచ్ బలగాలు పెద్దగా ప్రతిఘటించలేకపోయాయి. ఫలితంగా దేశ ప్రజలు అనేక కష్టనష్టాలనెదుర్కొన్నారు. యుద్ధానంతరం డచ్ వారికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య సమరాన్ని సుకర్ణో అనే ప్రజాదరణ కలిగిన నాయకుడు ముందుండి నడిపాడు. నాలుగేళ్లపాటు జరిగిన ఈ పోరాట ఫలితంగా డిసెంబర్ 27, 1949 నాడు ఇండోనేషియా స్వాతంత్ర్యం పొందింది. మూడు వందల ఏళ్లపాటు పోరాటం తప్ప మరొకటి తెలియని దేశ ప్రజలకు సార్వభౌమాధికారం లభించింది. దేశ ప్రథమ అధ్యక్షుడిగా సుకర్ణో ఎన్నుకోబడ్డాడు.

ఇండోనేషియాను పరిపాలించడం మాత్రం సుకర్ణోకు పెద్ద సవాల్‌గా మారింది. దాదాపు 17,500 ద్వీపాలు, అనేక గిరిజన తెగలు, భిన్నమైన సంస్కృతులు, డజన్ల కొద్దీ భాషలు, యాసలు, తెగల మధ్య వందల ఏళ్ల పగలు. ఇవన్నీ ఇండోనేషియాను నిత్య అగ్నిగుండంగా మార్చేవి. ఈ హింసపై సుకర్ణో ఉక్కుపాదం మోపాడు. 1960లో పార్లమెంట్‌ను రద్దు చేశాడు. 1963లో తనని జీవితకాలం

దేశాధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడు. ప్రపంచంలోని వివిధ కమ్యూనిస్టు దేశాలతో సాన్నిహిత్యం పెంచుకున్నాడు. ఈ మైత్రి ద్వారా సైనిక పరికరాలు, శిక్షణ సంపాదించాడు. కమ్యూనిజాన్ని ఆగ్నేయాసియా అంతటా వ్యాప్తి చేసి తద్వారా సోషలిస్టు నేతల మన్నన పొందాలన్న ఆలోచనతో ఇండోనేషియా సేనలను మలేషియా పైకి పంపాడు.

సుకర్నో విధానాలకు వ్యతిరేకంగా అతని వ్యతిరేకులు 1965లో తిరుగుబాటు లేవదీశారు. సుకర్నో ప్రాణాల్ని అతని ఉంపుడుగత్తె ఉపాయంతో కాపాడింది. కానీ అతని అంతరంగికులు, సైనిక అధికారులు మాత్రం మృత్యువు పాలయ్యారు. సుకర్నో పదవీచ్యుతుడైన తర్వాత సైన్యం జరిపిన మారణకాండలో మూడు నుండి ఐదు లక్షల మంది వధించబడ్డారు. మిలటరీ అధినేత జనరల్ సుహార్తో 1968లో ఇండోనేషియా అధ్యక్షపీఠం ఎక్కాడు.

1971 నాటికి ఇండోనేషియాను కమ్యూనిజం దారిన పోకుండా ఆపాలన్న అమెరికా తాపత్రయం ఇంకా ఎక్కువైంది. దానికి కారణం అప్పుడు వియత్నాంలో అగ్రరాజ్యానికి తగిలిన ఎదురుదెబ్బలు. అమెరికా వ్యూహాలు ప్రాపంచిక దృక్పథం సంతరించుకోవడం మొదలెట్టాయి. ఒక దాని తర్వాత మరొక దేశం కమ్యూనిజం గుప్పిట్లోకి పోకుండా నిరోధించాలన్న వ్యూహం రచించడం మొదలైంది.

ఇండోనేషియా ఈ వ్యూహంలో కీలక దేశం.

దక్షిణాసియాలో అమెరికా ఆధిపత్యాన్ని నిలబెట్టడానికే ఇప్పుడు మా కంపెనీ ఆధ్వర్యంలో ఇండోనేషియా విద్యుదీకరణ ప్రాజెక్ట్ చేపట్టాం. ఇరాన్‌లో షా ప్రభుత్వం లాగే సుహార్తోను మా దేశం చేతిలో కీలుబొమ్మగా మార్చడమే ఈ వ్యూహంలో ముఖ్య భాగం. అంతే కాదు ఇప్పుడిక్కడ ప్రయోగాత్మకంగా జరపబడుతున్న ఈ ప్రయత్నం సఫలమైతే ఈ ప్రాంతంలోని ఇతర దేశాల్లో కూడా ఇదే నమూనా చూపించవచ్చునని అమెరికా ఆలోచన. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఇస్లామిక్ ప్రపంచంపై ముస్లిం దేశమైన ఇండోనేషియా ప్రగతి చాలా సానుకూల ప్రభావాన్ని చూపుతుందని అమెరికా ప్రగాఢంగా విశ్వసిస్తుంది. వీటన్నిటినీ మించి ఇండోనేషియాలో విలువైన చమురు నిక్షేపాలు ఉన్నాయని మా దేశపు చమురు కంపెనీల నిపుణులు తేల్చారు.

త్వరలోనే నేనో అద్భుతమైన ఊహాలోకంలో విహరించనున్నాననే భావన నన్ను నిలువనీయటంలేదు.

ఇటీవల నా జీవితంలో ఇంకో మార్పు కూడా చోటుచేసుకుంది. ఆన్ కు నాకు మధ్య దూరం బాగా పెరిగిపోయింది. నేను రెండు వేర్వేరు జీవితాలు గడుపు తున్నానని తనకి తెలిసిపోయిందేమో. కొన్నాళ్లకి మేమిద్దరం వేర్వేరు అపార్ట్‌మెంట్లలోకి మారాల్సిన పరిస్థితి ఎదురైంది.

1971లో ఇండోనేషియాకు ప్రయాణానికి వారం రోజుల ముందు క్లాడిన్ నాకు చిన్న పార్టీ ఇచ్చింది.

'నువ్వు సాధించావ్' అని చిన్నగా నవ్వింది తను. 'నువ్విప్పుడు మాలో ఒకడివి' అని అంది.

ఓ అరగంటసేపు పిచ్చాపాటి మాట్లాడుకుంటూ వైన్ తాగాం.

కాసేపాగి తను 'మన మధ్య జరిగింది ఎట్టి పరిస్థితుల్లో, ఎవరికీ చెప్పొద్దు' అంది సీరియస్‌గా. 'ఒకవేళ నువ్వేమయినా చెప్పినా, నాకు నువ్వెవరో తెలియదని అంటాను నేను'

తన మాటలు నాలో చాలా కలవరాన్ని కలిగించాయి. క్లాడిన్ అంత తీవ్రంగా మాట్లాడటం నేను ఎన్నడూ చూడలేదు.

వెనక్కెళుతూ ఆలోచిస్తే - ఈ మొత్తం వ్యవహారం చాలా పకడ్బందీగా నడపబడిందని అర్థమైంది నాకు. నేను, క్లాడిన్ కలిసి ఉన్న సమయమంతా తన అపార్ట్‌మెంట్‌లోనే గడిపాం మేం. మా సంబంధం గురించి నావద్ద ఇసుమంత ఆధారం లేదు. అసలు మెయిన్ సంస్థలో ఎవరికీ ఈ వ్యవహారం తెలీనట్టే ఉంది.

ఇంత జరిగినా అన్నీ నిర్మొహమాటంగా చెప్పే క్లాడిన్ నిజాయితీని మాత్రం అభినందించకుండా ఉండలేకపోయాను.

అధ్యాయం 4

కమ్యూనిజం బారి నుంచి ఒక దేశాన్ని రక్షించడం

ఇండోనేషియాపై నాకు చాలా ఉద్వేగభరితమైన అభిప్రాయం ఉండేది. ఆ దేశం గురించి నేను చదివిన కొన్ని పుస్తకాలలో రంగురంగుల సారొంగ్‌లు ధరించిన అందమైన అమ్మాయిల చిత్రాలు, బాలి నృత్యకారుల చిత్రాలు, ఇంకా రకరకాల విన్యాసాలు చేసేవారి చిత్రాలూ ఉండేవి. ఇక్కడ ఉన్న చారిత్రక పుక్కిటి పురాణాల్లో ఉన్నవన్నీ ఆగ్రహించే దేవుళ్లు, డ్రాగన్లు, గిరిజన నాయకుల కథలే. ఏదో అర్థం కాని మార్మికత ఉంది మట్టిలో. ఎందరో చేజిక్కించుకోవాలని ఆరాటపడ్డా ఎవరికీ దక్కని ఓ అందమైన స్వప్నం ఈ దేశం.

నేను ఇండోనేషియా గురించి కొంచెం అతిగానే ఊహించుకున్నాని నేను అక్కడ అడుగుపెట్టిన తొలినాళ్లలోనే తెలుసుకున్నాను.

ఇక్కడ సౌందర్యం లేదని కాదు. పంచరంగుల సారొంగ్ అమ్మాయిలూ, విరిసిన పుష్పాలతో నిండిన ఉద్యానవనాలూ, బాలి నృత్యకారులూ, ఇంద్రధనస్సు రంగులలో అలంకరించబడ్డ రిక్షాలూ, ఠీవి ఒలకబోసే డచ్ రాజప్రాసాదాలు, ఎత్తైన మసీదులు అన్నీ ఉన్నాయి. కానీ నేనూహించని మరో వికృతమైన - విషాదకరమైన కోణం ఉంది దేశానికి. వేళ్ల చివరలు లేని మొండి చేతులతో అడుక్కునే కుష్ఠువ్యాధి పీడితులూ, చిల్లర డబ్బుల కోసం శరీరాలను అమ్ముకునే యుక్తవయస్సు అమ్మాయిలూ, మురికి కాల్వలుగా మారిపోయిన డచ్ పంటకాలువలూ, నల్లని నదీ తీరాలలో చెత్తకుండీల పక్కనే అట్టలతో చేసిన గూళ్లలో నివసించే కుటుంబాలూ, హారన్ల రణగొణ ధ్వనులూ, ఉక్కిరిబిక్కిరి చేసే పొగ - ప్రకృతి - వికృతిల మిశ్రమం ఇండోనేషియా. జకార్తాలో కమ్మని లవంగాల, ఆర్కిడ్ పువ్వుల పరిమళంతో కచ్చా మోరీల నుండి వచ్చే దుర్గంధం పోటీ పడేది.

మా టీమ్‌కి ఇండోనేషియాలో కెల్లా ఖరీదైన హోటల్ ఇంటర్‌కాంటినెంటల్‌లో బస ఏర్పాటు చేశారు. డబ్బున్న విదేశీయులు, ముఖ్యంగా చమురు కంపెనీల ఉన్నతోద్యోగులు ఈ హోటల్లో ఎక్కువగా దిగేవారు.

మేమక్కడ దిగిన మొదటి రోజే మా ప్రాజెక్ట్ మేనేజర్ చార్లీ ఇల్లింగ్‌వర్త్ మాకో విందు ఏర్పాటు చేశాడు. చార్లీకి యుద్ధమన్నా, సైన్యమన్నా ఎక్కడలేని అభిమానం. రోజులాగే ఆ రోజు కూడా మిలటరీ తరహా దుస్తులు ధరించి వచ్చాడు ఆ పార్టీకి.

షాంపేన్ పొంగించాక చార్లీ 'ఇండోనేషియా ప్రజలూ, ఇక్కడి అమెరికన్ ఎంబసీ వాళ్లు మనకు చక్కటి ఆతిథ్యం ఇస్తారు. అయితే మనం వచ్చిన పని ప్రాముఖ్యతను మాత్రం మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. మనం జావా ద్వీపం విద్యుదీకరించే మాస్టర్ ప్లాన్ తయారు చేయాలి. అయితే ఇది ఆరంభం మాత్రమే. మనం అసలైతే ఇండోనేషియాను కమ్యూనిజం బారి నుండి కాపాడడానికి వచ్చాం. పొరుగున ఉన్న వియత్నాం, కాంబోడియా, లావోస్‌ల దారిలో ఇండోనేషియా నడవకుండా చూడటం మన బాధ్యత. ఒక సంపూర్ణ విద్యుత్ వ్యవస్థ ఆ దిశలో కీలక అడుగు. అది ప్రజాస్వామ్యాన్ని, పెట్టుబడిదారీ వ్యవస్థను నిలబెడుతుంది'.

'ఇక చమురు విషయానికి వస్తే' సిగార్ దమ్ములాగి మళ్లీ మొదలుపెట్టాడు చార్లీ. 'మన దేశం చమురుపై ఎంతగా ఆధారపడిందో మనకు తెలుసు. ఈ విషయంలో ఇండోనేషియా మనకు మంచి మిత్రుడిగా ఉండగలదు. మీరు ఈ పాతికేళ్ల మాస్టర్ ప్లాన్ రూపొందించేటప్పుడు చమురు పరిశ్రమకు, దానికి ఉపయోగపడే రేవులు, పైపులైన్లు, నిర్మాణ కంపెనీలకు అవసరమైన విద్యుత్ అందేలా చూడండి'.

ఆ తర్వాత చార్లీ నేరుగా నా కళ్లలోకి చూస్తూ 'కొంచెం గురితప్పినా ఫర్వాలేదు కానీ అంచనాలు తక్కువ మాత్రం కానివ్వకు. అమాయకులైన ఇండోనేషియా పిల్లల రక్తం కానీ, ఆ మాటకొస్తే మన వాళ్ల రక్తం కానీ నీ చేతులకంటడం నీకు అంతగా నచ్చే పరిణామం కాదు కదా? ఈ దేశం సుత్తెకొడవలి నీడన గానీ, చైనా ఎర్రజెండా నీడన గానీ బతకడం నీకు నచ్చదు కదా?' అన్నాడు.

ఆ రాత్రి, నా లగ్జరీ ఫస్ట్‌క్లాస్ సూట్‌లో పడకపై పవళించి ఆలోచిస్తుంటే, నాకు క్లాడిన్ గుర్తొచ్చింది. విదేశీ రుణాలపై తను చెప్పిన ఉపదేశాలు గుర్తొచ్చాయి. నా బిజినెస్ స్కూల్ ఆర్థిక పాఠాలు గుర్తుచేసుకుని కాస్త స్థిమితపడ్డాను. అయినా నేను ఇక్కడికి ఎందుకొచ్చాను? 'ఒక మధ్యయుగాలనాటి ఇండోనేషియా ఆర్థిక వ్యవస్థ నేటి ఆధునిక పారిశ్రామిక ప్రపంచంలో తన స్థానం తాను పొందడానికి సాయం చేయడానికి' అని సమాధానపడ్డాను.

కానీ నాకు తెలుసు రేపు ఉదయం లేచి నా కిటికీలోంచి చూస్తే ఖరీదైన హోటల్ ఉద్యానవనం, స్విమ్మింగ్‌పూల్ దాటి నా చూపులు మైళ్ల కొద్దీ విస్తరించిన మురికివాడలపై ప్రసరిస్తాయి. సరైన పోషకాహారం, మంచినీళ్లు లేక అక్కడ

పసిపాపలెందరో మరణిస్తున్నారని, పిల్లలూ, పెద్దలూ భయంకరమైన వ్యాధుల బారినపడి బాధపడుతున్నారనీ, దుర్భరమైన పరిస్థితుల్లో నివసిస్తున్నారనీ నాకు అర్థమవుతుంది.

పక్కమీద అసహనంగా దొర్లాను. చార్లీతో పాటు మా టీమ్ అంతా ఇక్కడ వ్యక్తిగత స్వార్థం కొరకే వచ్చాం. అమెరికన్ విదేశీ విధానాన్ని, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలనీ మేం ఇక్కడ నెరవేరుస్తున్నాం. మా చేతలను నడిపిస్తున్నది దురాశ. అంతే గానీ ఇండోనేషియన్లకు మంచి జీవనాన్ని కలిపించాలనే ఆకాంక్ష కానేకాదు. నాకో పదం స్ఫురించింది. కార్పొరేట్‌స్వామ్యం. ఇదివరకు ఈ పదం నేను విన్నానో లేదో. అలాంటిది అసలు ఉందో లేదో. లేక నేనే కనిపెట్టానో. కానీ ఆ పదం సరిగ్గా ఇప్పుడు ఈ గ్రహాన్ని ఏలాలని నిర్ణయించుకున్న కొద్దిమంది ధనవంతుల సమూహాన్ని వర్ణించడానికి చక్కగా సరిపోతుంది.

చాలా దగ్గరి సంబంధాలు కల్గిన ఈ శక్తివంతుల సమూహానికి ఉమ్మడి లక్ష్యాలున్నాయి. ఈ సమూహంలోని వ్యక్తులు ఒక సంస్థ బోర్డునుండి ఒక ప్రభుత్వ పదవిలోనికి ... ఇలా అటునించి ఇటూ ఇటునించి అటూ అలవోకగా మారగలరు. నాకు అకస్మాత్తుగా గుర్తొచ్చింది. ఇప్పుడు ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు రాబర్ట్ మెక్‌నమారా దీనికి చక్కని ఉదాహరణ. అతను ఫోర్డ్ మోటార్ కంపెనీ అధ్యక్షుడి పదవిలో ఉండి, కెన్నెడీ, జాన్సన్‌లు అమెరికా అధ్యక్షులుగా ఉన్నపుడు రక్షణ సెక్రటరీగా - ఇప్పుడేమో ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన ఆర్థిక సంస్థకు అత్యున్నత పదవిలో...

నా కళాశాల ప్రొఫెసర్లు నమ్మల అర్థశాస్త్రం అసలు గుణాన్ని అర్థం చేసుకున్నట్టులేరు. చాలా సందర్భాలలో ఒక ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే ఆ వ్యవస్థలోని పైస్థాయి వ్యక్తులకే దాని ఫలాలు అందుతాయి, కింద ఉన్న వారికి ఒరిగేదేమీ ఉండదు - వారి బతుకులు ఇంకా దుర్భరమవడం తప్ప. పెట్టుబడిదారీ సమాజం చాలా విషయాల్లో మధ్యయుగాలనాటి ఫ్యూడల్ సమాజాలను పోలి ఉంటుంది. ఈ విషయాలేవైనా మా ప్రొఫెసర్లకు తెలిసి ఉంటే కూడా - వాళ్ళు మాకు చెప్పలేదు. ఎందుకంటే పెద్ద బహుళజాతి కార్పొరేషన్లు, వాటిని నడిపే వ్యక్తులే కదా చాలా కాలేజీలకు దాతలు. నిజాలు వెల్లడిస్తే ఆ ప్రొఫెసర్ల ఉద్యోగాలు ఊడతాయి. ఇప్పుడు ఇలాంటి నిజాలు మాట్లాడితే నా ఉద్యోగం మాత్రం ఊడదూ?

ఇండోనేషియాలోని హోటల్ ఇంటర్ కాంటినెంటల్‌లో నేను గడిపిన ఎన్నో నిద్రలేని రాత్రుల్లో ఇలాంటి ఆలోచనలే నా మదిలో అలుముకునేవి. చివరికి నాకు నేనుగా ఒక వ్యక్తిగత సమర్థన తయారు చేసుకున్నాను. ఒక చిన్న పట్టణం నుండి వచ్చిన నేను, కొంత కృషి, కొంత అదృష్టం కలగలసి ఇలాంటి స్థాయికి చేరుకున్నాను.

నా దేశ సంస్కృతి ప్రకారం నేను సరైన పనే చేస్తున్నాను. నేను ఒక ఆర్థికవేత్తగా నా రంగంలో రాణిస్తున్నాను. ప్రపంచంలోనే అత్యంత మేధావులుగా పరిగణింప బడినవారు తయారు చేసిన ఒక అభివృద్ధి నమూనాను అమలుచేయడంలో నేను సాయపడుతున్నాను.

ఎన్నోసార్లు ఆ అర్ధరాత్రుల్లో నన్ను నేను సమాధానపరుచుకునే వాణ్ణి - 'ఏదో ఒక రోజు ఈ రహస్యాన్ని నేను బద్దలు కొడతాను' అని.

అధ్యాయం 5

అమ్ముడుపోయిన నా ఆత్మ

పదకొండు మంది సభ్యులు గల మా బృందం జకార్తాలో ఆరు రోజులు గడిపింది. ఇంటర్‌కాంటినెంటల్ హోటల్‌లో బస చేసిన అమెరికన్ల సంఖ్య నన్ను ఆశ్చర్యపరచింది. అమెరికన్ చమురు, నిర్మాణరంగ కంపెనీల ఆఫీసర్ల అందమైన భార్యలను చూడడం గొప్ప సరదాగా ఉండేది. వాళ్లు తమ సాయం సమయాలను ఎక్కువగా స్విమ్మింగ్‌పూల్ దాపునో లేదా పట్టణంలోని అరడజను ఖరీదైన రెస్టారెంట్లలోనో గడిపేవారు.

ఆ తరువాత చార్లీ మా టీమ్‌ను బాండుంగ్ అనే పట్టణానికి తరలించాడు. అక్కడి వాతావరణం కొంచెం మధ్యస్థంగా ఉండేది. పేదరికం ఛాయలు కూడా కొంచెం తక్కువగా కనిపించేవి. మాకు విస్మా అని పిలవబడే ఒక ప్రభుత్వ అతిథి గృహంలో బస ఏర్పాటు చేశారు. ప్రతీ పనికి నౌకర్లను సమకూర్చారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వ అధీన విద్యుత్ కంపెనీ పెరుసహాన్ ఉమమ్ *లిస్ట్రిక్ నెగార (పిఎల్ఎన్)* కేంద్ర కార్యాలయంలో మాకు ఆఫీసు వసతి సమకూర్చబడింది.

బాండుంగ్‌లో ఉన్న తొలినాళ్లలో నేను అనేక పర్యాయాలు చార్లీ, హోవార్డ్ పార్కర్‌లతో సమావేశమయ్యాను. పార్కర్‌కు దాదాపు డెబ్భై ఏళ్ల వయసుంటుందేమో. న్యూ ఇంగ్లాండ్ ఎలక్ట్రిక్ సిస్టమ్‌లో చీఫ్‌లోడ్ ఫోర్‌కాస్టర్‌గా పదవీ విరమణ చేశాడు. వచ్చే పాతికేళ్లలో జావా ద్వీపం ఎంత విద్యుత్‌ను వాడుకోబోతున్నదో అంచనాలు వేయడం అతని పని. ఆర్థిక ప్రగతికీ, విద్యుత్ వినియోగానికీ చాలా దగ్గరి సంబంధం ఉండటం వల్ల నేను తయారు చేసే ఆర్థిక ప్రగతి అంచనాలపై ఆధారపడి పార్కర్ తన అంచనాలు చేస్తాడన్నమాట. మా టీమ్‌లో మిగతావారు ఈ విద్యుత్ వ్యవస్థలో ఇతర విభాగాలైన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ లైన్లు, ఇంధన రవాణా వ్యవస్థలు డిజైన్ చేస్తారు.

ఓ రోజు చార్లీ ఆఫీసులో కూర్చుని మాట్లాడుకుంటున్నాం. అతని ఆఫీసు గోడలపై రామాయణంలోని దృశ్యాలు వేసిన బాతిక్ వర్ణచిత్రాలు అలంకరించబడి ఉన్నాయి.

'మొదట ప్రస్తుతం ఇక్కడ ఉన్న విద్యుత్ వ్యవస్థ, రేవులు, రోడ్లు, రైల్వేల వివరాలను మన ఇంజనీర్లు సేకరిస్తారు. నెలాఖరుకల్లా మనం ఏర్పాటు చేసే కొత్త విద్యుత్ వ్యవస్థ వల్ల ఎలాంటి ఆర్థిక అద్భుతాలు జరగబోతున్నాయో నువ్వు అంచనాలు కట్టాలి' అన్నాడు చార్లీ.

హోవార్డ్ పార్కర్ చాలా మొండివాడనీ, ఎవరి మాటా వినడనీ చార్లీ అండ్ కంపెనీ నాకు తరచూ చెప్పేవారు. మా రోజువారీ మీటింగ్ అనంతరం ఓ రోజు పార్కర్ నన్ను పక్కకి పిలిచాడు. తను ఎప్పుడు ఉపయోగించే చెవిటి మిషన్‌ను సరిచేసుకుంటూ 'ఇది మనిద్దరి మధ్యే ఉండాలి' అని గుసగుసలాడాడు. మేం మా ఆఫీసులోని ఓ కిటికీ పక్కన నుంచున్నాం. పక్కనే ప్రవహిస్తున్న ఓ మురికికాలువకేసి దృష్టి సారించాను. ఆ మురికి నీళ్లలో ఓ యువతి స్నానం చేస్తోంది. తన మర్యాద కాపాడుకోవడం కోసం ఒంటి చుట్టూ ఓ సారొంగ్ వస్త్రాన్ని చుట్టుకుంది తను.

'ఈ దేశపు ఆర్థిక వ్యవస్థ అనూహ్యంగా పెరుగుతుందని చార్లీ నమ్మిస్తాడు. అతని వలలో పడకు' అన్నాడు పార్కర్.

'నిజంగానే ఇక్కడి ఆర్థికరంగం అభివృద్ధి చెందుతుంది' అన్నాన్నేను ఆ కాలువలోని అమ్మాయికేసి చూస్తూ.

'ఓహో. నువ్వు అప్పుడే వాళ్ల కథల్ని నమ్మేస్తున్నావన్నమాట' అన్నాడు పార్కర్ వెటకారంగా.

అంతలోనే ఓ పెద్దమనిషి కాలువ దగ్గరికొచ్చాడు. తన ప్యాంటు విప్పి అక్కడే కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఉపక్రమించాడు. ఆ యువతి అతగాడిని చూసి కూడా పట్టించుకోనట్టుగా తన స్నానాన్ని కొనసాగిస్తోంది. నేను నా చూపులు హోవార్డ్ వైపు మరల్చి,

'చమురు కనుగొంటే పరిస్థితులు అనూహ్యంగానే మారిపోతాయి. నేను దక్షిణాఫ్రికాలో అలా జరగటం ప్రత్యక్షంగా చూశాను' అన్నాను స్థిరంగా.

'నా జీవితమంతా విద్యుత్ లోడ్ అంచనాలు వేశాను నేను. ప్రపంచంలో ఏ పరిణామమూ విద్యుత్‌లోడ్ పెరుగుదలను ఏటా 7 నుంచి 9 శాతం కంటే స్థిరంగా పెంచలేదు. 6 శాతం పెరుగుదలే న్యాయంగా జరిగేది' అని బదులిచ్చాడు.

అతను చెప్పేదాంట్లో నిజముందని నాకూ తెలుసు. కానీ దాన్ని ఒప్పుకోవడానికి నేను సిద్ధంగా లేను.

'హోవార్డ్, ఇది బోస్టన్ కాదు. ఇక్కడి ప్రజల్లో అత్యధికులకు ఇంకా విద్యుత్ అందని పండే. కనుక ఇక్కడి పరిస్థితులు వేరు' అన్నాను నేను.

హోవార్డ్ ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

'మీరంతా మీ అంతరాత్మలను ఆ దెయ్యానికి అమ్మేసుకున్నారు. డబ్బుల కోసమే ఇందులోకి దిగారు మీరంతా' అని గట్టిగా అరచి అక్కడ్నించి వెళ్లిపోయారు.

ఆ మాటలు నన్ను నిలువెల్లా కంపింపజేశాయి.

ఇది జరిగిన కొన్నాళ్లకే హోవార్డ్ పార్కర్ తీవ్రంగా జబ్బు పడ్డాడు. డాక్టర్లు అతన్ని అమెరికా తిరిగి వెళ్లిపొమ్మని సలహా ఇచ్చారు.

వెళుతూ అతనన్న మాటలు ఇవి.

'తప్పుడు అంచనాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఈ కుంభకోణంలో నేను భాగస్వామిని కాలేను. ఇక్కడి ఆర్థిక రంగం సాధించబోయే విజయాల గురించి నువ్వెన్ని కబుర్లు చెప్పినా సరే'!

రెండో భాగం 1963 - 1971

అధ్యాయం 6

అన్వేషకుడి పాత్ర

ఇండోనేషియా ప్రభుత్వంతో, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, యుఎస్ఏఐడి లతో మా కంపెనీకి ఉన్న కాంట్రాక్టు ప్రకారం మా బృందంలోని ఎవరైనా ఒకరు ఈ మాస్టర్ ప్లాన్‌లోని అన్ని ఊళ్లూ పర్యటించాలి.

'ఈ పనికి తగినవాడివి నువ్వే' నంటూ చార్లీ ఈ పనికి నన్నే పురమాయించాడు.

మేముంటున్న అతిథి గృహాన్ని నిర్వహించే పెద్దావిడకో కొడుకుండేవాడు. వాడి పేరు రాస్‌మొన్. అందరూ అతన్ని 'రాసి' అని పిలిచేవారు. స్థానిక యూనివర్సిటీలో ఎకనామిక్స్ డిగ్రీ చదువుతున్న అతనికి నేను చేసే పని పట్ల ఎక్కడలేని ఆసక్తి, తను నాకు ఇండోనేషియా భాష బహాసా నేర్పడానికి ఒప్పుకున్నాడు. దేశాధ్యక్షుడు సుకర్నో పదవి చేపట్టగానే చేసిన మొదటి పని - దేశ ప్రజలందరూ వాడదగిన ఓ భాషను తయారుచేయటం. ఈ ద్వీప దేశంలో అప్పటికి దాదాపు 350 భాషలు మాట్లాడేవారు. అంతర్జాతీయ నిపుణుల బృందం ఎంతో శ్రమించి బహాసా ఇండోనేషియా భాషను తయారుచేసింది.

రాసికొక స్కూటర్ ఉండేది. ఓ రోజు సాయంత్రం 'మీరు చూడని ఇండోనేషియా చూపిస్తాను రండి' అని ఆహ్వానించాడు.

మా దారిలో తోలు బొమ్మలాడేవాళ్లను, సాంప్రదాయకమైన వాద్యగాళ్లను, మంటలతో విన్యాసాలను చేసేవాళ్లను, స్మగుల్డ్ అమెరికన్ క్యాసెట్ల దగ్గర్నుండి

అరుదైన పురాతన వస్తువులను అమ్ముకునే వాళ్ల వరకూ అందర్నీ చూశాను నేను. చివరికి యువతీ యువకులతో నిండిన ఓ కాఫీ హోటల్ చేరాం. అక్కడున్న వాళ్లందరికీ నన్ను రాసి పరిచయం చేశాడు.

వాళ్లంతా ఇంగ్లీషులోనే మాట్లాడుతున్నారు. నేను వారి బహసా భాషలో మాట్లాడటం చూసి వాళ్లు సంతోషపడ్డారు. 'మీ అమెరికన్లు ఎందుకు మా భాషను నేర్చుకోరు' అని వాళ్లు నన్ను ప్రశ్నించారు. నేను జవాబివ్వలేకపోయాను. అంతేకాదు అసలు ఇలాంటి హోటళ్లకు, ఇలాంటి ప్రదేశాలకు ఏ అమెరికన్ లేదా యూరోపియన్ రారెందుకు అన్న ప్రశ్నకూ నేను బదులివ్వలేకపోయాను.

ఆ రాత్రిని నేను ఎప్పటికీ మరువలేను. రాసి, అతని స్నేహితులు వారిలో నన్నొకడిగా చూసుకున్నారు. వాళ్లు తినే ఆహారం, వారు వినే సంగీతం, లవంగాలతో తయారైన సిగరెట్లూ - ఇవన్నీ నాతో పంచుకున్నారు. ఫస్ట్‌క్లాస్ రైల్లో ప్రయాణిస్తూ ఇలాంటి జీవితాన్ని నేనెందుకు వదులుకున్నానా అని బాధపడ్డాను నేను. వియత్నాంపై మా దేశం చేస్తున్న అధర్మ యుద్ధాన్ని నేనూ నిరసించడం అక్కడి వాళ్లకు ఎంతగానో నచ్చింది.

* * *

సమాచార సేకరణ కోసం నేను ఎంతోమంది రాజకీయ నాయకులను, అధికార్లను కలవవలసివచ్చేది. అయితే వారిలో అధికులకు నా పొడగిట్టేది కాదు. వారు ఏదో బలవంతం మీద నాకు సాయపడుతున్నట్టు తోచేది. నాకు సాయపడాలని ఏ ప్రభుత్వ అధికారో, ఏ బ్యాంకరో, ఏ సైనిక జనరలో లేదా అమెరికా ఎంబసీనో వారిని ఆదేశించినట్టు ప్రవర్తించేవారు.

అందుకే వారు నాకిచ్చే సమాచారం విశ్వసనీయతపై కూడా చాలా అనుమానాలు ఉండేవి నాకు. నేను ఎక్కడికి వెళ్లినా చాలా మర్యాదగా పలకరించే వారు. సమాచారం అడగగానే సరేనని కొన్ని రోజుల తర్వాత కలవమనేవారు. ఓ పెద్ద కాగితాల కట్టను తయారుచేసి రెండోసారి వెళ్లినప్పుడు ఇచ్చేవారు. ప్రైవేటు కంపెనీల యజమానులూ, బ్యాంకర్లూ, ప్రభుత్వ అధికారులూ అందరూ ఇండోనేషియా ఆర్థికరంగం ఏదో అద్భుతమైన పురోగతిని సాధిస్తుందనిపించే నివేదికలు, అంకెలు, గ్రాఫ్‌లు నాకిచ్చేవారు. ఒక్కరంటే ఒక్కరు కూడ చిన్న ప్రతికూల సమాచారం ఇచ్చేవారు కాదు.

నాకు ఇదంతా ఒక పెద్ద ఆటలో భాగమని అనిపించేది.

అధ్యాయం 7

బోనెక్కిన నాగరికత

'ఇవ్వాళ దలాంగ్‌కు తీసుకెళ్తున్నా మిమ్మల్ని' అన్నాడు రాసి ఉత్సాహంగా. 'ఇండోనేషియాలో పేరొందిన తోలుబొమ్మలాట అది'.

తన స్కూటర్‌పై బయల్దేరాం.

ఇదివరకు ఎన్నడూ చూడని ప్రాంతాల గుండా ప్రయాణించాం. డచ్ రాజప్రాసాదాలూ, ఆఫీసు భవంతులూ కనుమరుగయ్యాయి. ఎక్కువగా పేదవారు నివసించే ప్రాంతాల గుండా వెళ్లాం. పలుచటి బాతిక్ సారొంగ్‌లు, రంగురంగుల జాకెట్లు, వెడల్పాటి టోపీలు ధరించిన యువతులు తారసిల్లారు మాకు. ఎక్కడికెళ్లినా నవ్వుతూ, తుళ్లుతూ, కేరింతలు కొడుతున్న జనం. మేం ఆగగానే నన్ను తాకేందుకు అక్కడి పిల్లలు ఉత్సాహపడ్డారు. నా తలలో ఒక ఫ్రాంగిపని పువ్వును తురిమిందో తుంటరి పిల్ల.

ఆట నడిచే హాలు పక్కన మా స్కూటర్ నిలిపాం. అప్పటికే కొన్ని వందల మంది గుమిగూడారక్కడ. ఆకాశం నిర్మలంగా, అందంగా ఉంది. బాండుంగ్ మధ్యలో ఉన్నా కూడా కనుచూపువేరలో వీధి దీపాలు లేవు. తారలు మినుకు మినుకుమంటున్నాయి. గాలిలో వ్యాపించిన లవంగాలు, పల్లీల వాసన.

కొన్నాళ్ల క్రితం కాఫీ హోటల్‌లో కలిసిన రాసి మిత్రబృందం మమ్మల్ని చేరుకుంది. వారు నాకు టీ, కేకులు, మాంసం వేపుడు ముక్కలు అందించారు.

కాసేపటికే దేవాలయ గంటల వంటి శబ్దం చేసే 'గమలంగ్' ధ్వని వినిపించింది.

'దలాంగ్ తోలుబొమ్మలాడేవాళ్లు అన్ని వాయిద్యాలు ఒక్కరే వాయిస్తారు. బొమ్మలన్నిటికీ ఒక్క గొంతే మార్చి వాడుతారు' రాసి వివరించాడు నాకు.

మొదటి ఆట రామాయణంలోని ఓ కథ.

ఇక రెండో ఆట మొదలవగానే ఆశ్చర్యపోవడం నా వంతయింది. రిచర్డ్ నిక్సన్ తోలు బొమ్మను బయటికి తీశాడు దలాంగ్. కోటు, పొడవు నక్షత్రాల టోపీతో

అంకుల్ సామ్ కు ప్రతిరూపంలా నిక్సన్ బొమ్మ దాని వెనకాలే త్రీపీస్ సూట్, చేతిలో డాలర్ గుర్తులున్న బకెట్‌తో మరో తోలు బొమ్మ. చేతిలో ఉన్న అమెరికన్ జెండాను నిక్సన్‌కు వింజామరలా ఊపుతున్న రెండో బొమ్మ. అది ప్రపంచ బ్యాంక్‌దని వేరే చెప్పాలా?

పశ్చిమాసియా, తూర్పు ఆసియా దేశాల పటాలు వెనక తెర మీద తగిలించివున్నాయి. ఆట మొదలవగానే నిక్సన్ బొమ్మ వెనక ఉన్న వియత్నాం పటాన్ని అమాంతంగా అందుకుని గుటుక్కున మింగేశాడు.

'ఛీ చేదుగా ఉంది. ఇక ఇలా చేయనక్కరలేదు' అంటూ ఆ పటాన్ని నోట్లోంచి తీసి డాలర్ గుర్తులు కల బకెట్‌లోకి విసిరేశాడు.

ఆ తరువాత నిక్సన్ దక్షిణాసియా దేశాలపై పడతాడనుకున్నా. కానీ నా ఊహలకు భిన్నంగా నిక్సన్ పశ్చిమాసియా దేశాలైన కువైట్, పాలస్తీనా, సౌదీ అరేబియా, ఇరాక్, సిరియా, ఇరాన్‌ల వేపు తిరిగాడు. ఒక్కో పటం వద్దకు వెళ్లి ఏదో తిట్టుకుంటూ ఒక్కో పటాన్నీ బకెట్‌లో వేసుకోసాగాడు నిక్సన్.

'ముస్లిం కుక్కలు'

'మహమ్మద్ మహమ్మారులు'

'ఇస్లామిక్ భూతాలు'

ఇదీ ఆ తిట్ల పురాణం.

అక్కడ ఉన్న ప్రేక్షకుల గుంపు చాలా ఉత్సాహంగా ఉంది. బకెట్‌లో ఒక్కో దేశం జమ అవుతున్న కొద్దీ వారి ఉత్సాహం రెట్టింపవుతోంది - ఓ వేపు నవ్వులూ, ఓ వేపు అపనమ్మకం, మరో వేపు ఆగ్రహం.

ఆ తోలు బొమ్మలాడే వాడి భాషకూడా కొందరికి నచ్చడం లేదు. నా మనస్సేదో కీడును శంకించింది. అసలే ఇక్కడ నేను చాలా భిన్నంగా, తేలికగా గుర్తుపట్టేలా కనపడుతున్నాను.

ఇంతలో నిక్సన్ ఏదో అన్నాడు.

రాసి దాన్ని తర్జుమా చేసి నాకు చెప్పాడు.

నా రోమాలు నిక్కబొడుచుకున్నాయ్.

'ఇప్పుడు ఇండోనేషియాను ప్రపంచబ్యాంక్‌కు ఇద్దాం. ఇక ఆ దేశం నుండి డబ్బులు పిండుకోవడానికి బ్యాంక్ ఏం చేస్తుందో చూద్దాం' అన్నాడు నిక్సన్.

ఇండోనేషియా పటం తీసి బకెట్‌లో వేయబోయాడు నిక్సన్...

అదే క్షణంలో పక్కన నీడలోంచి ముందుకు దూకిందో ఆకారం. బాటిక్ అంగీ, ఖాకీ లాగు వేసుకున్న ఇండోనేషియా వ్యక్తి తోలుబొమ్మ అది.

'అతనో ప్రముఖ బాండుంగ్ రాజకీయ నాయకుడు' వివరించాడు రాసి.

నిక్సన్ చేయి పట్టి ఆపాడు ఆ నాయకుడు. 'ఆగండి. ఇండోనేషియా సార్వభౌమదేశం' అని అరిచాడు. జనం చప్పట్లు చరిచారు.

ఇంతలో బకెట్ పట్టుకున్న బొమ్మ తన చేతిలోని జెండా కర్రను బల్లెంలా ఉపయోగించి ఆ ఇండోనేషియా నేత గుండెల్లో గుచ్చాడు.

ఆ నేత విలవిలలాడుతూ ప్రాణాలు విడిచాడు.

జనం హాహాకారాలు చేశారు. పిడికిళ్లు బిగించి ఉద్రేకంగా గాల్లోకి ఊపారు.

నిక్సన్, బకెట్ వ్యక్తి బొమ్మలు ప్రేక్షకులకు అభివాదం చేసి నిష్క్రమించాయి.

ఆట తర్వాత పక్కనున్న కాఫీ హోటల్లో రాసి బృందంతో కూర్చుని మాట్లాడుతూ ఉంటే,

'ఇవ్వాళ నిక్సన్ - ప్రపంచబ్యాంక్ ఆట ఉన్నట్లు మాకెవరికీ తెలియదు' చెప్పాడు రాసి.

'ఇది అంతా నేను వస్తున్నానని ఏర్పాటు చేయలేదు కదా' అని వాపోయాను నేను.

అందరూ బిగ్గరగా నవ్వేశారు.

యూనివర్సిటీ నుండి ఇంగ్లీషు పట్టభద్రురాలైన ఓ యువతి నా ఎదురుగా కూర్చుని ఉంది.

'మీరు ప్రపంచబ్యాంక్ తరఫునే పని చేస్తున్నారు కదూ' అని అడిగిందా యువతి.

నా ప్రస్తుత ప్రాజెక్ట్ ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సీ (యుఎస్ఏఐడి) లది అని వివరించాను నేను.

'అవన్నీ ఒక్కటే కదా' అంది తను.

వెంటనే 'ఇందాక ఆటలో చూపించింది నిజమే కదూ? మీ ప్రభుత్వం ప్రపంచ దేశాలను ఒక ద్రాక్ష పళ్ల గుత్తి అని అనుకుంటుంది. నచ్చినవి తినొచ్చు, నచ్చనివి ఏరి పారేయవచ్చు'.

'చమురు అంతా పిండుకున్నాక' అందించింది పక్కనున్న యువతి.

నేను వారితో వాదించాలనుకున్నాను. నా బృందంలో నేనొక్కణ్ణే ఈ రాత్రి ఒంటరిగా ఈ ఆటను చూడ్డానికి వచ్చాననీ, బహాసా భాషను నేర్చుకునేందుకు ప్రయత్నించిన అమెరికన్ను నేనొక్కణ్ణే అనీ, ఈ దేశం గురించి, ఇక్కడి సంస్కృతి గురించి నిజాయితీగా తెలుసుకోవటానికి ప్రయత్నిస్తున్నాననీ...

కానీ ఆ వాదనంతా ఇప్పుడు అనవసరమనిపించింది. ఆటలో వియత్నాం తప్ప మిగిలినవన్నీ ముస్లిం దేశాలే ఎందుకు ఎంచుకున్నారని అడిగాను.

ఆ అందమైన ఇంగ్లీషు గ్రాడ్యుయేట్ నవ్వింది నా ప్రశ్న విని. 'మరి అదే కదా మీ అసలు వ్యూహం' అంది.

'వియత్నాం కేవలం మొదటి మెట్టు. హాలండ్‌పై నాజీలు దాడి చేసినట్టు' అన్నాడు పక్కనున్న యువకుడు.

'ముస్లిం దేశాలే అమెరికా అసలు లక్ష్యం' అన్నదా యువతి.

'అమెరికా ఇస్లాం వ్యతిరేకి అని మీరు నమ్ముతున్నారా?' అడిగాను నేను.

'మీరు కొంచెం చరిత్ర చదవాలి. టాయ్‌న్‌బీ అనే బ్రిటిష్ రచయిత యాభై ఏళ్ళ కిందటే రాశాడు - వచ్చే శతాబ్దంలో జరగబోయే యుద్ధం కమ్యూనిస్టులు, పెట్టుబడిదారుల మధ్య కాదనీ, అది ముస్లింలు, క్రైస్తవుల మధ్య అనీ.'

'అర్నాల్డ్ టాయ్‌న్‌బీ అలా రాశాడా' నేను ఖిన్నుడనయ్యాను.

'ఊఁ. *సివిలైజేషన్ ఆన్ ట్రయల్, ది వరల్డ్ అండ్ ది వెస్ట్* చదవండి'.

'ముస్లింలు, క్రైస్తవుల మధ్య అంత బద్ధ శత్రుత్వం ఎందుకుంటుంది?' అక్కడున్న వాళ్లందరూ ఒకళ్ల మొహాలు ఒకరు చూసుకున్నారు. అడిగాక అర్థం అయ్యింది నేనెంత తెలివితక్కువ ప్రశ్న అడిగానో.

'ఎందుకంటే' క్షణకాలం ఆగి,

'పశ్చిమ దేశాలు - వాటి పెద్ద అయిన అమెరికా వల్ల' అంది ఒక్కో అక్షరం ఒత్తి పలుకుతూ ఆ అమ్మాయి.

'ప్రపంచాన్ని అంతా తన గుప్పిట్లోకి తెచ్చుకుని ఒక మహా సామ్రాజ్యం కావాలన్న అమెరికా దురాశ వల్ల. ఇప్పటికే ఆ ప్రయత్నంలో చాల సఫలం అయ్యింది. ఇక ఆ దారిలో ఉన్నది కేవలం సోవియెట్లు. కానీ వారెక్కువ కాలం నిలవరు. టాయ్‌న్‌బీ ప్రకారం సోవియెట్లకు ఒక మతం కానీ, ఒక నమ్మకం కానీ లేవు. చరిత్ర చెప్పిన సత్యం ఏమిటంటే మనకో నమ్మకం - మనల్ని నడిపించే ఆ అతీత శక్తిపై అచంచలమైన నమ్మకం ఉండాలి. అది మా ముస్లింలకు ఉంది. మీ క్రైస్తవుల కన్నా మాకు నమ్మకం ఎక్కువ. అందుకే ఏదో ఒకనాటికి మీ కన్నా మేమే బలవంతుల మవుతాం' స్థిరంగా అందా యువతి.

'మేం మా వంతు వచ్చే వరకూ వేచిచూస్తాం. ఆ తరువాత పాములా కాటేస్తాం' నిశ్చయంగా అన్నాడు పక్కనున్న యువకుడు.

'ఓహ్. ఎంత భయంకరమైన ఆలోచన. అలా జరక్కుండా ఉండాలంటే ఏం చేయాలి మనం?' మనస్సులోని ఆలోచన పదాల రూపంలో బయటికి వచ్చింది.

ఆ గ్రాడ్యుయేట్ యువతి సూటిగా నా కళ్లలోకి చూస్తూ 'మీ దురాశను తగ్గించుకోండి. పెద్ద బంగళాలు, పెద్ద దుకాణాలే కాదు ప్రపంచమంటే. ఓ వైపు ప్రజలు ఆకలితో అలమటిస్తుంటే మీరేమో మీ కార్లకు ఇంధనం కొరకు ఆలోచిస్తారు. దాహంతో చిన్నపిల్లలు మరణిస్తుంటే కొత్త ఫ్యాషన్లు ఏం వచ్చాయా అని పత్రికలు తిరగేస్తారు మీరు. మా వంటి దేశాలు పేదరికంలో మునిగి హాహాకారాలు చేస్తుంటే మీ చెవికి ఎక్కదు. ఈ విషయాలు చెప్తుంటే చెవులు మూసుకుంటారు. చెప్పేవాళ్లను రాడికల్స్ అనీ కమ్యూనిస్టులనీ ముద్ర వేస్తారు'.

'మీకు ఎక్కువ సమయం లేదు. మీరు మారాలి. లేకుంటే పతనం తప్పదు'.

ఇది జరిగిన కొన్నాళ్లకు తోలుబొమ్మలాటలో నిక్సన్‌ను ఎదిరించిన ఆ ఇండోనేషియా నేతను ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది.

అతను అక్కడికక్కడే మరణించాడు.

అధ్యాయం 8

కొత్త రూపంలో జీసస్

దలాంగ్ స్మృతులు నన్ను చాలా కాలం వెన్నాడాయి. ఆ అందమైన గ్రాడ్యుయేట్ అమ్మాయి మాటలు కూడా నన్ను వదిలి వెళ్లలేదు. బాండుంగ్‌లో గడిపిన ఆ రాత్రి, నా ఆలోచనల పరిధినీ, నా భావాల విస్తృతినీ ఓ కొత్త ఎత్తుక తీసుకు వెళ్లింది. నేను ఇక్కడ చేస్తున్న పనుల పర్యవసానం ఏమిటో నాకు తెలియద కాదు. అయితే నాలో వ్యతిరేక భావనలు తలెత్తినప్పుడల్లా నేను ఏదో విధం సమాధానపడేవాణ్ణి. నేనూ, ఐనార్, చార్లీ వంటివారం కేవలం మా కుటుంబాల ప మాకున్న బాధ్యతను నెరవేరుస్తున్నాం అనే భావన నన్ను తేలికపరిచేది.

అయితే సమస్యను మరో కోణం నుండి అర్థం చేసుకోవడానికి ఆ రా జరిగిన చర్చ ఉపయోగపడింది. స్వార్థంతో నిండిన విదేశీ విధానం మన భావితరాల క్షేమకరం కాదని నాకు వారి ద్వారా అవగతమైంది.

విదేశీ సాయం గురించి చాలా ఆలోచించాను నేను. అభివృద్ధి చెందుతు దేశాలకు ధనిక దేశాలు సాయపడవలసిన అవసరం ఎంతైనా ఉంది. అయితే అ ఇప్పుడున్న పద్ధతిలో అయితే కాదని నాకు అర్థం అయింది.

ఒక ప్రశ్న నన్ను తరచూ వేధించేది. విదేశీ సాయం యొక్క అంతిమ ఫలి సామ్రాజ్యవాదం. అయితే సామ్రాజ్యవాదం వల్ల నష్టాలేమిటి? ప్రపంచం అం అమెరికన్లలా విలాసవంతమైన జీవితం గడపగలదా? అయినా అమెరికాలోనే లక్ష మంది పేదలున్నారు గదా?

అయినా మిగతా ప్రపంచ ప్రజలు అమెరికన్ జీవన విధాన కోరుకుంటున్నారా? హింస, మానసిక ఆందోళన, మాదక ద్రవ్యాలు, వ్యసనా విడాకులు, నేరాల గణాంకాలు చూస్తే అమెరికన్ సమాజం చరిత్రలోకెల్లా సం సమాజం కావొచ్చునేమో కానీ, అది చరిత్రలోకెల్లా అత్యంత తక్కువ సంతోషం సమాజం కూడా. వాస్తవం ఇలా ఉంటే ఎవరైనా మమ్మల్ని ఎందుకు అనుకరిం నుకుంటారు?

ప్రపంచవ్యాప్తంగా జరిగే పవిత్రయుద్ధం అన్న ఊహ నన్ను కలవర పరుస్తోంది. అయితే అది ముస్లింలు, క్రైస్తవుల మధ్య జరిగేది మాత్రమే కాదు. అది అభివృద్ధి చెందుతున్న దేశాలకూ, ధనిక దేశాలకూ మధ్య జరిగేది. కాకపోతే ఆ యుద్ధం ముందు శ్రేణుల్లో ముస్లింలు ఉంటారు.

వియత్నాం వంటి దేశాలపై యుద్ధాలు చేసే బదులు అమెరికా అదే డబ్బుతో ప్రపంచ ప్రజల ఆకలి తీర్చవచ్చు, ఆపన్నులకు విద్య, వైద్యం వంటి ఎన్నో అవసరాలు తీర్చవచ్చు.

ఇండోనేషియాలో గడిపిన నా చివరి రాత్రి నాకో కల వచ్చింది. ఆ కలలో జీసస్ నా ఎదురుగా నిలబడ్డాడు. అయితే నా చిన్ననాటి కలల్లో కనబడిన జీసస్ లా కాకుండా ఇతను నల్లగా, రింగులు తిరిగిన జుత్తుతో ఉన్నాడు. అతని భుజాలపై శిలువ ఉండాల్సిన ప్రదేశంలో ఒక కారు ఆక్సిల్ - చక్రం ఉన్నాయి. అతని ఫాలభాగంపై రక్తం వలె కనబడుతున్న గ్రీజు. జీసస్ నాతో ఇలా అన్నాడు:

'ఇప్పుడు ప్రపంచం మారిపోయింది. అందుకే నేనీ కొత్త రూపంలో కనబడుతున్నాను'.

* * *

ఇండోనేషియా నుండి తిరుగు ప్రయాణంలో పారిస్‌లో ఆన్ ను కలిసాను. అయితే దురదృష్టవశాత్తూ మా ఆలోచనల్లో తేడాలు చాలా ప్రస్ఫుటంగా కనిపించాయి. బోస్టన్‌లో దిగి ఇద్దరం చెరో వేపు వెళ్లిపోయాం.

అధ్యాయం 9

అపూర్వ అవకాశం

మెయిన్ హెడ్ ఆఫీసుకు వెళ్లాక నాకు మా కొత్త బాస్ బ్రూనో జాంబొ్ల నుండి పిలుపొచ్చింది.

కాసేపు ఇండోనేషియా పర్యటన గురించి పిచ్చాపాటి మాట్లాడుకున్నా 'హోవార్డ్ పార్కర్‌ను ఉద్యోగంలోంచి తొలగించాను' అన్నాడు బ్రూనో.

'అతనికి వాస్తవ పరిస్థితులతో సోయి లేకుండా పోయింది. లేకుం ఇండోనేషియా వంటి దేశంలో విద్యుత్ డిమాండ్ ఎనిమిది శాతం మాత్రమే పెరుగుతుందని నివేదిక ఇస్తాడా' అన్నాడు కోపంగా.

'నీ ఆర్థిక నివేదిక చాలా చక్కగా ఉందని చార్లీ చెప్పాడు. 17 నుండి 20 శాతం పెరుగుదల ఉంటుందని రాశావటగదా. వెరీ గుడ్' అన్నాడు.

నేను తలాడించాను.

'నిన్ను ప్రమోట్ చేస్తున్నా' అని లేచి షేక్‌హాండిచ్చాడు.

ఇది మిత్రులతో విందు చేసుకోవలసిన సమయం. కానీ నా మనసం క్లాడిన్ పైనే ఉంది. నా ప్రమోషన్ గురించి, ఇండోనేషియా అనుభవాల గురిం తనతో చెప్పాలని నా మనస్సు ఉవ్విళ్లూరుతోంది. విదేశాల నుండి తనకు ఫో చేయొద్దని హెచ్చరించింది తను. అందుకే ఏనాడూ తనని కాంటాక్ట్ చేయలేదు ఇప్పుడేమో తన ఫోన్ పని చేయడంలేదు. ఇక లాభం లేదనుకుని తన అపార్ట్‌మెంట్ బయలుదేరాను.

నేను ఆ అపార్ట్‌మెంట్‌కు వెళ్లేసరికి మధ్యాహ్నమైంది. అయితే ఇప్పు అపార్ట్‌మెంట్‌లో ఒక యువజంట కాపురముంటోంది. వాళ్లకు క్లాడిన్ అంటే ఎవ తెలియదు. ఆ అపార్ట్‌మెంట్ అద్దెకిప్పించిన బ్రోకర్ వద్ద కూడా క్లాడిన్ గురిం ఎటువంటి సమాచారం లేదు. చివరికి మా మెయిన్ ఆఫీసులో కూడా తన గురిం ఎలాంటి సమాచారం దొరకలేదు నాకు.

మధ్యాహ్నం వరకూ వెతికి వెతికి అలసిపోయాను. నాకు చాలా అసహనంగా అనిపించింది. జెట్‌లాగ్ వల్ల తలనొప్పి కూడా మొదలయ్యింది. ఇంటికి వచ్చి బెడ్‌పై అలాగే వాలిపోయాను. నాకు ఈ ప్రమోషన్ వృథా అనిపించసాగింది. నన్ను క్లాడిన్ చాలా తెలివిగా వాడుకుని వదిలేసింది అన్న భావన నన్ను నిలవనీయటంలేదు. ఒక బీర్ తాగి ఆ సీసాను టేబుల్ కేసి బాదాను.

కాసేపటికి ఓ పిచ్చి ఊహ - క్లాడిన్ నేలకు వాలిపోతోంది. తన శరీరం బుల్లెట్లతో జల్లెడలా మారి ఉంది. ఆ ఊహే భరించలేకపోయాను. రెండు నిద్రమాత్రలు మింగి అలాగే నిద్రలోకి జారిపోయాను.

మరునాడే నన్ను చీఫ్ ఎకానమిస్ట్‌గా పదోన్నతి చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. క్లాడిన్ గురించి ఆలోచనలు కట్టిపెట్టి నా పనిపై దృష్టి కేంద్రీకరించాను. హోవార్డ్ పార్కర్ వెళ్లటంతో అసంపూర్తిగా మిగిలిన విద్యుత్ లోడ్ అంచనాలు నేను పూర్తి చేశాను. నా బాస్‌లు కోరుకున్నట్టే మొదటి పన్నెండేళ్లు 19 శాతం వృద్ధిరేటు, ఆ తరువాత ఎనిమిదేళ్లపాటు 17 శాతం, మిగిలిన అయిదేళ్లు 15 శాతం వృద్ధి రేటును సూచిస్తూ అంచనాలు తయారు చేశాను.

ఆ అంచనాలు అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ముందు నేను సమర్పించినప్పుడు వాళ్ల ప్రతినిధులు నన్ను చాలా ప్రశ్నలే అడిగారు. నేను క్లాడిన్ చెప్పిన మాటలు గుర్తు చేసుకున్నాను.

'పాతికేళ్ల తరువాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ధైర్యంగా ఊహించగలగాలి'

నేను ఏ మాత్రం తొణక్కుండా నా అంచనాలు నిజమవుతాయని వాదించాను. వాళ్లు ఈ అంచనాలు ఒప్పుకున్నారు. ఇక నా ఆత్మవిశ్వాసానికి అంతే లేకపోయింది.

అకస్మాత్తుగా నేనో ప్రముఖుణ్ని అయిపోయాను.

కొద్ది నెలల్లోనే నేను ప్రపంచాన్ని చుట్టివచ్చాను. టెహరాన్, కారకాస్, గ్వాటిమాల, లండన్, వియన్నా, వాషింగ్టన్... గొప్పవాళ్లనెందర్నో కలుసుకున్నాను. ఇరాన్ షా ను, ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు రాబర్ట్ మెక్ నమారా, మాజీ దేశాధ్యక్షులు, ఇలా ఎందరో. నా విజయాలు నా అహాన్ని పెంచాయి. నన్ను నేనో మాంత్రికుడిలా ఊహించుకోసాగాను. నేను మంత్రదండం ఊపితే దేశాల్లో కాంతిదీపాలు వెలిగినట్టూ, పరిశ్రమలు పువ్వుల్లా వికసించినట్టూ...

ఆలోచిస్తే అర్థమైంది నాకు. మా వంటి వ్యక్తులు ఎప్పటికీ తాము సరైన పనే చేస్తున్నాం అనుకుంటారు. కమ్యూనిజం, టెర్రరిజం చెడ్డవని మా అభిప్రాయం.

అంతేగానీ అవి మా విధానాల ఫలితాలు అని మేమెప్పటికీ ఒప్పుకోం. దుడ్డు ఉన్నవాడిదే బర్రె అనే సూత్రాన్నే నమ్ముతాం మేం.

నా బిజినెస్ స్కూల్ రోజుల్లో ఉత్తర భారతదేశం నుండి వచ్చిన ఒక ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు ఉండేవాడు మాకు. అతను మాకు పరిమిత వనరుల గురించీ, మనిషి ఎదగడం కోసం చేసే ప్రయత్నం గురించీ, బానిసల శ్రమ విలువ గురించీ చెప్పాడు. 'పెట్టుబడిదారీ వ్యవస్థల్లో పై స్థాయిలో గుప్పెడు మంది బలమైన వ్యక్తులు అసంఖ్యాక శ్రామికుల వర్గాన్ని నియంత్రిస్తూ ఉంటారు. ఈ శ్రామికులు ఒకప్పటి బానిసలతో సమానం' అని అనేవాడు అతను.

అయినా ఇప్పుడు నన్ను ఎకనామిక్ హిట్‌మాన్ అని ఎవరూ అనరు. చీఫ్ ఎకానమిస్ట్ అనేది చాలా గౌరవప్రదమైన పదం కదూ? అదీగాక నాకు జీతం ఇచ్చేది మెయిన్ అనే ప్రైవేటు కన్సల్టింగ్ కంపెనీ - ఏ ప్రభుత్వ సంస్థా కాదు.

ఒక రోజు మధ్యాహ్నం బ్రూనో తన ఆఫీసుకు పిలిచాడు నన్ను.

'నీకప్పగించిన పనిని చక్కగా నిర్వర్తించావు. అందుకే నీకో మంచి అవకాశం ఇస్తున్నాం. నీ కంటే రెండింతల వయస్సు ఉన్నవారికి కూడా ఇలాంటి అవకాశం రాలేదు' అన్నాడు.

అధ్యాయం 10

పనామా దేశాధ్యక్షుడు, వీరయోధుడు

ఏప్రిల్ 1972 లో ఓ వర్షాకాలపు రాత్రి నేను పనామాలోని టోకుమెన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాను. టాక్సీలో హోటల్‌కు వెళుతుంటే వర్షపు నీటితో మసకబారిన కారు అద్దాల్లోంచి కనబడిందా హోర్డింగ్ - చురుకైన కళ్లు, విశాలమైన ఫాలభాగం, వెడల్పాటి టోపీ ధరించిన ఆ ఆకారం మరెవరో కాదు. అతనే పనామా దేశ ప్రజల కొత్త ఆరాధ్య దైవం ఒమర్ టోరిజోస్.

ఇక్కడికి రావడానికి ముందే బోస్టన్ పబ్లిక్ లైబ్రరీకి వెళ్లి పనామా చరిత్రను అధ్యయనం చేశాను.

ఒమర్‌ను పనామా ప్రజలు అంతగా అభిమానించడానికి కారణం అతను పనామా ప్రజల స్వయంపాలన కొరకు, పనామా కాలువపై ఆ దేశపు హక్కు కొరకు పోరాడటమే.

అట్లాంటిక్-పసిఫిక్ సముద్రాలను కలుపుతూ పనామా కాలువను తవ్వాలని ఫ్రెంచి ఇంజనీర్ ఫెర్డినాండ్ డీ లెస్సెప్స్ నిర్ణయించేనాటికి పనామా కొలంబియా దేశంలో అంతర్భాగంగా ఉండేది. 1881 లో ఫ్రెంచి వారి నేతృత్వంలో మొదలైన కాలువ పనులకు అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యాయి. చివరికి 1889లో భారీ ఆర్థిక నష్టంతో కాలువ పనులు ఆగిపోయాయి. కానీ అప్పటి అమెరికన్ అధ్యక్షుడు థియొడర్ రూజ్‌వెల్ట్ మదిలో మాత్రం ఈ కాలువ కొత్త స్వప్నాలను ఆవిష్కరించింది. ఇరవయ్యో శతాబ్దపు తొలినాళ్లలో పనామా కాలువను ఒక అమెరికన్ కంపెనీకి అప్పగించమని కొలంబియాను కోరింది అమెరికన్ ప్రభుత్వం. కొలంబియా ఇందుకు నిరాకరించింది.

1903లో రూజ్‌వెల్ట్ కొలంబియాపై దాడికి ఆదేశించాడు. అమెరికన్ యుద్ధనౌక నాష్‌విల్లెలో కొలంబియా గడ్డపై దిగిన అమెరికన్ సైనికులు పనామాలో ఒక స్థానిక ప్రజాసైన్య నేతను మట్టుబెట్టి ఆ ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించారు. ఒక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించి మొదటి కాలువ ఒప్పందాన్ని అమల్లోకి

తెచ్చారు. దీని ప్రకారం పనామా కాలువ ఇరువేపులా అమెరికన్ అధీనంలో ఉంటుందన్నమాట.

అయితే ఈ ఒప్పందంలో వింత ఏమిటంటే దీనిపై సంతకం చేసిన వారు ఒక వేపు అమెరికన్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ హే అయితే మరోవేపు ఫ్రెంచి ఇంజనీర్ ఫిలిప్ బునావ్ వరిల్లా. దీనిపై పనామా దేశస్తులెవరూ సంతకం చేయకపోవడం గమనార్హం. అలా కొలంబియా నుండి విడిపోయిన పనామా - ఒక అమెరికన్ దేశస్తుడు, ఒక ఫ్రెంచి దేశస్తుడు చేసుకున్న ఒప్పందం ఫలితంగా అమెరికాకు బంటుగా మారిపోయిందన్నమాట.

ఇది జరిగాక ఒక అరశతాబ్దం పాటు పనామా, వాషింగ్టన్‌తో దగ్గరి సంబంధాలు కల కొన్ని ధనిక కుటుంబాల పాలనలో ఉంది. వీరంతా అమెరికన్ ఆకాంక్షలను నెరవేర్చేందుకు అన్ని చర్యలూ తీసుకునేవారు. ఎలాంటి సోషలిస్టు ఆలోచనలు మొగ్గతొడగకుండా లాటిన్ అమెరికన్ నియంతల వలె కఠిన పాలన కొనసాగించేవారు. అమెరికన్ బహుళ జాతి కంపెనీలైన స్టాండర్డ్ ఆయిల్, యునైటెడ్ ఫ్రూట్ కంపెనీ (దీన్ని జార్జి బుష్ కొనుక్కున్నాడు) వంటి వాటికి పనామా ప్రభుత్వం కొమ్ముకాసేది.

1968లో స్వాతంత్ర్యం ప్రకటించుకునేదాకా అమెరికన్ సేనలు పనామాను కంటికి రెప్పలా కాపలాకాసేవి. అర్నుఫో అరేయాస్ ను కూలదోసి ఒమర్ టోరిజోస్ పనామా దేశాధ్యక్షుడయ్యాక పరిస్థితిలో గుణాత్మకమైన మార్పు వచ్చింది.

పనామాలోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఒమర్ ప్రీతిపాత్రుడయ్యాడు. దేశంలో అత్యంత పేద ప్రజలు నివసించే వాడల్లో అతను పర్యటించేవాడు. ఇదివరకు ఏ నాయకుడూ సాహసించని మురికివాడల్లో సభలు పెట్టేవాడు. నిరుద్యోగులకు ఉపాధి చూపించేవాడు. ఏదైనా వివాదంలో కానీ, అనారోగ్యంతో కానీ ఉన్న దేశ ప్రజలకు ఆర్థిక సాయం కూడా చేసేవాడు.

జీవితం పట్ల అతనికున్న ప్రేమ, పౌరుల పట్ల దయాగుణం, ఒమర్ కీర్తిని పనామా సరిహద్దు దాటించాయి. శరణార్థుల పట్ల ఒమర్ చాలా మర్యాదగా ప్రవర్తించేవాడు. వారు పినోషె వ్యతిరేకులైన లెఫ్టిస్టులైనా, కాస్ట్రో వ్యతిరేకులైన రైటిస్టులైనా సమానంగా వ్యవహరించేవాడు. చాలా మంది అతన్ని శాంతిదూతగా పరిగణించేవారు. ఈ లక్షణం వల్ల అతని పేరు ఆ ఖండం మొత్తం మారుమోగింది.

ఆ కాలంలో లాటిన్ అమెరికాలో అనేక దేశాలు తీవ్ర అంతర్యుద్ధంలో మునిగి ఉండేవి. హోండురాస్, గ్వాటెమాల, ఎల్‌సాల్వడార్, నికరాగువా, క్యూబా, కొలంబియా, పెరూ, అర్జెంటినా, చిలీ, పరాగ్వే వంటి దేశాలలో నిత్యం పోరాడుతున్న వేర్వేరు వర్గాల మధ్య సయోధ్య నెరపడానికి ఒమర్ టోరిజోస్ ఎంతో కృషి సల్పాడు. కేవలం

ఇరవై లక్షల జనాభా కలిగిన పనామా, సంఘ సంస్కరణలో ప్రపంచానికంతా ఆదర్శంగా నిలబడింది.

పనామాలో దిగిన ఆ మొదటి రాత్రి భోరున కురుస్తున్న వర్షంలో కారు అద్దాల్లోంచి నాకేసి చూస్తూ చిరునవ్వు చిందిస్తోన్న ఒమర్ - తన నమ్మకాల వెనుక ధైర్యంగా నిలబడ్డ యోధుడు. పనామా ఇప్పుడు వాషింగ్టన్ చేతిలోనో మరొకరి చేతిలోనో కీలుబొమ్మకాదు. మాస్కో, బీజింగ్‌ల ప్రలోభాలకు ఒమర్ ఎన్నడూ లొంగలేదు. సంఘ సంస్కరణే అతని ఏకైక లక్ష్యంగా ఉండేది. అన్నార్తులకు సాయపడటమే కర్తవ్యంగా భావించేవాడు. అదే సమయంలో అతను కమ్యూనిస్టు కాడు. అమెరికా నుండి స్వతంత్రం పొందాలంటే కాస్ట్రోలా అమెరికా శత్రువులతో చేతులు కలపాల్సిన అవసరం లేదని నమ్మేవాడు.

1840లలో అనేక మంది అమెరికన్లు నమ్మే మానిఫెస్ట్ డెస్టినీ అనే సిద్ధాంత పత్రం ఉండేది. ఉత్తర అమెరికా ఖండంపై అమెరికాకు దేవుడు సర్వహక్కులూ ఇచ్చాడనీ - స్థానిక రెడ్ ఇండియన్లనీ, అడవులనీ, స్థానిక బర్రెలనీ నాశనం చేసి, నదులకు ఆనకట్టలు కట్టి, సహజవనరులనీ, శ్రామికులనీ దోపిడీ చేసుకోవచ్చుననీ ఆ పత్రం చెప్పింది.

1823లో జేమ్స్ మన్రో అనే అమెరికన్ అధ్యక్షుడు రచించిన మన్రో పత్రం ఈ భావనలను ఇంకా ముందుకు తీసుకెళ్లి 1850, 60లలో ప్రాచుర్యంలోకి వచ్చింది. మధ్య అమెరికా, దక్షిణ అమెరికా ప్రాంతాల్లో అమెరికా విధానాలు ఒప్పుకోని ఏ దేశంపైన అయినా దాడీ చేయడానికి ఈ పత్రం సాధికారతను ఇచ్చింది. డొమినికన్ రిపబ్లిక్ పై దాడి చేయడానికి, వెనిజులా, పనామా దేశాల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి అప్పటి అమెరికన్ అధ్యక్షుడు టెడ్డీ రూజ్‌వెల్ట్ ఈ మన్రో పత్రాన్నే ఆధారం చేసుకున్నాడు. తరువాత వచ్చిన టాఫ్ట్, విల్సన్, ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్‌లు కూడా ఇదే విధానాన్ని కొనసాగించారు. ఇరవయ్యో శతాబ్దపు మలి భాగంలో వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాల్లో జోక్యం చేసుకున్నప్పుడు మాత్రం కమ్యూనిస్ట్ బూచిని చూపింది అమెరికా.

ఇప్పుడు వాషింగ్టన్ మార్గంలో ఒకే ఒక్క వ్యక్తి అడ్డంకిగా నిలబడ్డాడు. అలా నిలబడ్డవాళ్లలో అతనేమీ మొదటి వాడు కాదు. కాస్ట్రో, అలెండీ వంటి వారు ఆ పని ఇదివరకే చేసినా వారు కమ్యూనిజాన్ని నమ్మినవారు. పనామాకు తన గడ్డపై, తన ప్రజలపై, తన కాలువపై సర్వహక్కులూ ఉన్నాయని, అవి అమెరికాకు ఇచ్చినట్టే తమకూ దేవుడే ఇచ్చాడనీ ఒమర్ వాదన.

పనామా కాలువ ప్రాంతంలో అమెరికాకు చెందిన స్కూల్ ఆఫ్ అమెరికాస్, దక్షిణ కమాండ్‌కి చెందిన యుద్ధ శిక్షణ క్షేత్రం ఉండేవి. అనేక ఏళ్లుగా లాటిన్

అమెరికన్ దేశాధ్యక్షులు, నియంతలు తమ పిల్లలను, సైనిక అధికారులను ఈ శిక్షణా కేంద్రాలకు పంపిస్తుండేవారు. ఇక్కడే వారు అత్యాధునిక ఇంటరాగేషన్, కోవర్ట్ పద్ధతులు నేర్చుకునేవారు. స్వదేశంలో కమ్యూనిస్టుల నుండి రక్షణకు, తమ ఆస్తులూ, చమురు కంపెనీల, బహుళజాతి కంపెనీల ఆస్తులూ రక్షించుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడేది. ఇదే సమయంలో అమెరికన్ పెద్దలతో పరిచయాలు పెంచుకునేందుకు కూడా ఈ శిక్షణ పనికొచ్చేది. లాటిన్ అమెరికన్లలో అత్యధికులు ఈ శిక్షణా సదుపాయాలను ఏవగించుకునేవారు. నియంతలకు ఉపయోగపడేందుకు డెత్‌స్క్వాడ్‌లను, చిత్రహింసలు పెట్టేవాళ్లను తయారుచేస్తున్న ఈ శిక్షణ సంస్థల్ని వెంటనే తన దేశం పొలిమేరల నుండి తొలగించాలని ఒమర్ డిమాండ్ చేశాడు.

ఆ నాయకుని హోర్డింగ్ కేసి చూస్తుంటే కింద కనపడ్డాయా అక్షరాలు...

'స్వేచ్ఛ ఒమర్ ఆశయం. ఆశయాన్ని చంపే క్షిపణి ఇంకా కనిపెట్టబడలేదు.'

అధ్యాయం 11

కాలువలో దొంగలు పడ్డారు

ట్రాఫిక్ లైటు ఆకుపచ్చకు మారగానే డ్రైవర్ కారును ముందుకు దూకించాడు.

నా ఆలోచనలు నేను వచ్చిన పని వైపు తిరిగాయి. మెయిన్ ఆధ్వర్యంలో పనామాకు ఒక భారీ అభివృద్ధి పథకం తయారు చేయడానికి వచ్చాను నేను. ఈ పథకం వల్ల ప్రపంచబ్యాంక్, ఇంటర్-అమెరికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, యుఎస్ఏఐడి కలిసి పనామాకు కోట్ల కొద్దీ డాలర్లు అప్పుగా ఇవ్వడానికి వీలవుతుంది. విద్యుత్, రవాణా, వ్యవసాయ రంగాలకు ఉద్దేశించిన ఈ అప్పు కేవలం ఒక మోసపూరిత ఎత్తుగడ. పనామాను ఎప్పటికీ తమ పాదదాసిగా చేసుకునేందుకు అమెరికా వేసిన పాచిక.

* * *

మరునాడు పనామా ప్రభుత్వం నా కొరకు ఒక గైడ్‌ను పంపించింది. సన్నగా ఎత్తుగా రివటలా ఉన్న ఫిడెల్ అనే ఆ యువకున్ని చూడగానే ముచ్చటేసింది నాకు. తన దేశం పట్ల ఎనలేని అభిమానం ఉంది అతగాడికి. అతని ముత్తాత స్పెయిన్‌తో జరిగిన స్వాతంత్ర్య సంగ్రామంలో సైమన్ బొలివార్‌తో పాటు పాల్గొన్నాడట. నాకు స్పానిష్ వచ్చు అని తెలుసుకుని అతను చాలా ఉద్విగ్నంగా ఫీలయ్యాడు.

'మీ దేశం వాళ్లు ఎన్నేళ్లు ఇక్కడున్నా మా భాష నేర్చుకోవాలనుకోరు' అన్నాడు. మొదట అతను నన్ను కొంచెం ఖరీదైన న్యూ పనామా ప్రాంతానికి తీసుకువెళ్లాడు. పనామాలో చాలా అంతర్జాతీయ బ్యాంకులున్నాయని అవి కూడా స్విస్ బ్యాంకుల్లాగే ఖాతాదారుల గురించి ఎక్కువ ప్రశ్నలడగకుండానే డబ్బు నిల్వ చేస్తాయని చెప్పాడు.

దూరంగా కనపడుతున్న పనామా కాలువ ముందు బారులు తీరిన ఓడలు కనబడుతున్నాయి.

తరువాత పట్టణంలోని ఓ మురికివాడ వేపు తీసుకువెళ్లాడు ఫిడెల్.

చెక్కతో నిర్మించిన గుడిసెలు, మురుగు నీటితో నిండిన వీధులు, గాలిలో వ్యాపించిన కుళ్లు, మురుగు వాసన, బాన పొట్టలతో పరిగెత్తుతున్న చిన్న పిల్లలు. మా కారును చూడగానే చుట్టుముట్టి 'అంకుల్ డబ్బులివ్వండి' అంటూ చాచిన ఆ చిన్నారుల చేతులు. నాకు జకార్తా గుర్తొచ్చింది. గోడలపై ఏవో పిచ్చిరాతలు. కొన్ని హృదయాలూ, బాణాలూ ... ఎక్కువ శాతం అమెరికాపై ద్వేషం వెలిగక్కేవే.

'మా కాలువను మురుగుదొడ్డిగా వాడకండి'.

'పనామా వియత్నాం కాదు, నిక్సన్'

అక్కడక్కడా అంటించబడ్డ ఒమర్ టోరిజోస్ పోస్టర్లు.

'ఇప్పుడు నాణేనికి మరో వేపు చూద్దాం' అన్నాడు ఫిడెల్.

కాస్త ముందుకు వెళ్లాక, 'ఇదే కెనాల్ జోన్ - ఇది అమెరికా నియంత్రిత ప్రదేశం'.

నా కళ్లను నేను నమ్మలేకపోయాను. ఎక్కడ చూసినా సంపద కనబడుతోంది. భారీ తెల్ల భవంతులు, చక్కగా ఉన్న పచ్చిక మైదానాలు, ఖరీదైన ఇళ్లూ, గోల్ఫ్ కోర్సులూ, షాపులూ, థియేటర్లూ...

'ఇదంతా అమెరికాకు చెందిందే. ఇక్కడ పనామా చట్టాలు, పన్నులు నడవవ్' వివరించాడు ఫిడెల్.

ఇది దేశంలో దేశం!

'మా దేశంలో తలసరి ఆదాయం బొటాబొటిగా వెయ్యి డాలర్లుంటుంది. 30 శాతం నిరుద్యోగులున్నారు'.

'మరి మీరేం చేస్తున్నారు' ప్రశ్నించాను ఫిడెల్‌ను.

'మేం దీన్ని మార్చడానికి ప్రయత్నిస్తున్నాం. ఒమర్ మా కొరకు పాటుపడుతున్నాడు. కానీ అతన్ని బతకనిస్తారో లేదో. తన ప్రజల కోసం ప్రాణాలొడ్డి పోరాడగల యోధుడతను' గర్వంగా అన్నాడు.

'చలో ఇప్పుడు పనామా ఇంకో పార్శ్వం చూద్దాం'

అధ్యాయం 12

సైనికులూ, వేశ్యలూ

పందిమాంసంతో చేసిన రుచికరమైన స్టీక్, చల్లని బీరు తాగి రెస్టారెంట్ నుండి బయటపడ్డాం.

'ఇక్కడ ఎప్పుడూ రోడ్డుపై నడవొద్దు. సరిగ్గా గుమ్మం దగ్గరే టాక్సీ ఎక్కాలి' హెచ్చరించాడు ఫిడెల్.

కొద్ది దూరం వెళ్లాక ఒక పార్కింగ్ స్థలంలో కారును నిలిపాడు. ఒక ముసలివాడు మా కారు వద్దకు వచ్చాడు. అతగాడికో నోటు అందిస్తూ 'బాగా చూసుకో. ఇది నా డార్లింగ్' అంటూ కారుని ఆప్యాయంగా తడిమాడు.

నాలుగు అడుగులు వేసి మలుపు తిరగ్గానే నియాన్ లైట్ల వెలుతురులో మిరుమిట్లు గొలిపే ఒక వీధిలోకి ప్రవేశించాం. ఇంతలో ఇద్దరు కుర్రాళ్లు పరిగెత్తుకుంటూ మాకేసి వచ్చారు. వాళ్లిద్దరి చేతుల్లోనూ కర్రలున్నాయి. వాటిని తుపాకుల్లా ఎక్కుపెడుతూ డిషుం డిషుం అని ఒకరినొకరు కాల్చుకునే ఆట ఆడుతున్నారు.

ముందున్న కుర్రాడు చూసుకోకుండా ఫిడెల్‌ను ఢీ కొట్టాడు. ఒకడుగు వెనక్కి వేసి 'క్షమించండి' అన్నాడు స్పానిష్‌లో

ఫిడెల్ ఆ కుర్రాడి భుజాలపై ఆప్యాయంగా చెయ్యివేసి 'ఫరవాలేదోయ్. ఇంతకూ నువ్వూ, నీ స్నేహితుడు అంతగా కాల్చుకుంటున్నారేమి?' అని అడిగాడు. ఇంతలో రెండో కుర్రాడు దగ్గరికి వచ్చాడు. మొదటివాడి కన్నా కాస్త పెద్దగా కనపడుతున్నాడు.

మొదటి వాడి చుట్టూ తన చెయ్యి వేసి 'వీడు నా తమ్ముడు. మమ్మల్ని క్షమించండి' అన్నాడు వేడుకోలుగా.

'ఫర్వాలేదు లే' అన్నాడు ఫిడెల్ తేలిగ్గా నవ్వేస్తూ.

'మీరు అలా దేన్ని కాలుస్తున్నారని అడిగానంతే'.

కుర్రాళ్లిద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకుంటున్నారు.

'అతను కెనాల్ జోన్‌లో పనిచేసే ఒక జనరల్ అన్నమాట. మా అమ్మను రే చేయడానికి ప్రయత్నించాడన్నమాట. అందుకే నేను అతన్ని తరిమేస్తున్నానన్నమాట. అదీ మా ఆట' వివరించాడా కుర్రాడు.

ఫిడెల్ ఓరగా నన్ను చూస్తూ,

'ఆ జనరల్ ఎక్కడి వాడు' అని ప్రశ్నించాడు.

'అమెరికా'

'మీ అమ్మ ఏం చేస్తుంది'?

'అదో ఆ బార్‌లో వెయిటర్‌గా పని చేస్తుంది' బదులిచ్చాడా పెద్ద కుర్రాడు.

ఫిడెల్ చెరో నాణెం ఇచ్చి 'జాగ్రత్త. వెలుతురు ఉన్నచోటే ఆడుకోండి' అన్నాడు.

'సరే సర్. థాంక్యూ' అంటూ తుర్రుమన్నారా పిల్లలు.

మేం మళ్లీ నడుస్తుంటే నాకు చెప్పాడు ఫిడెల్. 'పనామా దేశ స్త్రీలను వ్యభిచారం చేయనివ్వరు. వాళ్లు బార్లలో వెయిటర్లుగా, డాన్సర్లుగా పనిచేయవచ్చు. కానీ శరీరాలను అమ్ముకోగూడదు. ఆ పని విదేశీయులకు వదిలివేయబడింది'

మేము బార్‌లోకి అడుగుపెట్టగానే చెవులు చిల్లులుపడే అమెరికన్ పా గీతం మమ్మల్ని ఆహ్వానించింది. ఆ శబ్దానికి, వెలుతురుకి అలవాటు పడటాని నాకు కొన్ని క్షణాలు పట్టింది. ద్వారపాలకుల్లాగా ఇద్దరు భారీకాయులైన అమెరికా సైనికులు నిలబడి ఉన్నారు.

బార్‌లో ఉన్న స్టేజిపై ముగ్గురు అమ్మాయిలు నృత్యం చేస్తున్నారు. వా తలలపై టోపీలు తప్ప శరీరాలపై మరే అచ్ఛాదనా లేదు. ఆ దృశ్యం బోస్టన్ నగరం ఉన్నట్టే ఉంది. ఒకటే తేడా ఏంటంటే ఇక్కడ అమ్మాయిలు పూర్తి నగ్నంగా ఉన్నారు.

మేం అక్కడ కూర్చున్న ఇంగ్లీషు మాట్లాడే యువకుల మధ్య నుండి దా చేసుకుంటూ ముందుకు వెళ్లాం. వాళ్లంతా టీషర్టులూ, జీన్స్ ప్యాంట్లు ధరిం ఉన్నా వారి క్రాపును చూస్తే అర్థమవుతోంది - వాళ్లంతా అమెరికన్ సైనికులు కెనాల్ జోన్‌లో ఉన్న అమెరికా సైనిక స్థావరానికి చెందిన వారు.

ఫిడెల్ అక్కడ వడ్డిస్తున్న ఒక అమ్మాయి భుజంపై తట్టాడు. ఆ అమ్మాయి వెనక్కి తిరిగి ఫిడెల్‌ను చూసి గట్టిగా అరిచి బిగ్గరగా వాటేసుకుంది. అక్కడ కూర్చు యువకులకు ఈ సన్నివేశం నచ్చలేదని వాళ్ల హావభావాలను బట్టి మాకర్థమైంది.

ఆ అమ్మాయి మమ్మల్ని ఒక మూలకు తీసుకువెళ్లి టేబుల్, కుర్చీ ఏర్పా చేసింది. కాసేపటిలోనే ఆ అమ్మాయి రెండు బీర్లు తీసుకుని వచ్చింది. తి వెనుదిరగగానే ఫిడెల్ చిలిపిగా ఆ అమ్మాయి పిరుదులపై తట్టాడు. బదులుగా అమ్మాయి ఇతగాడికేసి ఓ ముద్దు విసిరింది.

ఆ యువతుల బృందం ఇప్పుడు మమ్మల్ని పట్టించుకోవటంలేదు. వాళ్లు స్టేజిపై నర్తిస్తున్న డ్యాన్సర్ల పైనే దృష్టి సారించారు. ఈ బార్‌లో అత్యధికులు ఇంగ్లీషు మాట్లాడే సైనికులే. ఒకరిద్దరు మినహా పనామీయులు ఎక్కువ లేరు.

చాలా మంది యువతులున్నారా బార్‌లో. వాళ్లు ఒక టేబిల్ నుండి మరో టేబిల్‌కు మారుతూ - డ్యాన్స్ చేస్తూ, కస్టమర్ల ఒళ్లో వాలిపోతూ, పాడుతూ, స్టేజీ పైకి వంతులవారీగా వస్తున్నారు. బిగుతు, కురచ దుస్తుల్లో ఉన్నారు వాళ్లంతా. ఎంతో అందం ఉంటేగానీ ఇక్కడ నెగ్గుకురావడం కష్టం అని వారిని చూస్తే అర్థం అయ్యింది నాకు. అసలు ఇంతమంది పనామాకు ఎక్కడి నుండి వస్తున్నారో గదా?

అదే ప్రశ్న అడిగాను ఫిడెల్‌ను.

'అవును. ఇందులో ఒక్కరు గూడా పనామాకు చెందిన వారు కాదు.'

'మరి ఏ దేశాల నుండి వచ్చారు వీళ్లంతా?'

'హోండురాస్, ఎల్ సాల్వడార్, నికరాగువా, గ్వాటెమాల'.

మాకు వడ్డిస్తున్న అమ్మాయి వచ్చి ఫిడెల్ ఒళ్లో కూర్చుంది. అతను ఆమె వీపును మెల్లిగా రుద్దుతూ 'క్లారిస్సా. ఈ అమ్మాయిలంతా తమ దేశాలెందుకు వదిలేశారో నా అమెరికన్ మిత్రునికి చెప్పు' అన్నాడు.

క్లారిస్సా నాకేసి చెయ్యిచాచింది.

'మిమ్మల్ని కలిసినందుకు ఆనందంగా ఉంది' అంది షేక్ హాండిస్తూ. ఖాళీ సీసాలు అందుకుంటూ ఫిడెల్ ప్రశ్నకు జవాబుగా 'వీళ్లు తమ దేశాల్లో క్రూరత్వాన్ని తప్పించుకోవడానికి ఇక్కడికి వస్తారు' అంది.

'నేను ఇంకో రెండు బీర్లు తెస్తాను' అంటూ అక్కడ్నించి వెళ్లిపోయింది. తనటు వెళ్లగానే నేను ఫిడెల్‌తో

'వీళ్లు ఇక్కడ అమెరికన్ డాలర్లు సంపాదించుకోవడానికి వచ్చారనుకుంటా' అన్నాను వ్యంగ్యంగా.

'నిజమే. కానీ ఫాసిస్టు నియంతలు పాలించే దేశాల నుండే అమ్మాయిలు ఎందుకొస్తున్నారు?'

నేనోసారి స్టేజి మీద ఉన్న ముగ్గురు అమ్మాయిలకేసి చూసాను.

'నువ్వు జోక్ చెయ్యడం లేదు కదా'? అన్నాను.

'ఉహూ. ఇది అబద్ధమైతే బాగుండును. ఇక్కడ ఉన్న అమ్మాయిలందరూ కుటుంబ సభ్యులను పోగొట్టుకున్నవారే - తండ్రులు, అన్నలు, భర్తలు, ప్రియులు. వాళ్ల చిత్రహింసలను, మృత్యువును చూస్తూ పెరిగారు. డ్యాన్స్ చేయడం, వ్యభిచారం

చేయడం వాళ్లకంత చెడ్డపనుల్లాగా ఏమీ కనిపించవిప్పుడు. ఇక్కడ నాలుగు రాళ్ల వెనకేసుకుని కొత్త జీవితం మొదలుపెడతారు వాళ్లు. ఓ చిన్న బడ్డీ కొట్టో, హోటలో

ఇంతలో బార్‌లో ఓ మూల కలకలం రేగింది.

ఒక అమ్మాయి చెయ్యిపట్టుకు లాగుతున్నాడో సైనికుడు. అతడి పట్టునుండి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోందా అమ్మాయి. ఆ అమ్మాయి ఎంత అరచి వదలట్లేదా సైనికుడు. పైగా గర్వంగా నవ్వుతూ తోటి సైనికులకు సైగ చేస్తున్నాడు. ఆ అమ్మాయి మోకాళ్లపై కూలబడింది. చేయితో అతడిని కొట్టాలని ప్రయత్నిస్తోంది. వాడు ఆమె చెయ్యిని ఇంకా మెలిపెట్టాడు. పక్కనున్న సైనికుల మూక ఈ దృశ్యాన్ని వినోదంలా చూస్తోంది. ఆ అమ్మాయి మొహం నొప్పితో ఎర్రబారింది.

ఫిడెల్ చెంగున లేచాడు. ఆ గొడవ జరుగుతున్న కేసి నడవబోయాడు. పక్క టేబుల్‌పై ఉన్న పనామా దేశస్థుడు ఫిడెల్ చెయ్యిపట్టి ఆపి,

'ఆవేశపడొద్దు తమ్ముడూ. ఎన్‌రిక్ చూసుకుంటాడు' అన్నాడు.

ఇంతలో నీడల్లోంచి ఒక పొడవైన, సన్నని పనామీయుడు బైటికి వచ్చాడు. అతడే ఎన్‌రిక్ అనుకుంటాను. ఆ అమ్మాయిని హింసిస్తున్న సైనికుడి పైకి దూకాడు. ఒక చెయ్యి అతని మెడచుట్టూ వేసి, మరో చేతిలో టేబిల్‌పై గ్లాసు ఎత్తి వా మొహాన కుమ్మరించాడు. ఆ అమ్మాయి వీడి పట్టు విడిపించుకుని పక్కకు తప్పుకుంది.

నీడల్లో ఉన్న ఇంకొంత మంది పనామీయులు ఎన్‌రిక్‌కు రక్షణగా అతని చుట్టూ నిలబడ్డారు. ఆ సైనికుడిని గోడకేసి అదిమిపట్టి బార్‌లో అందరూ వినే అన్నాడు ఎన్‌రిక్. 'పనామా యువతులపై చెయ్యివేయొద్దు. వేరే దేశాల అమ్మాయిల ను కూడా డబ్బివ్వందే ముట్టుకోవద్దు'.

గేటు దగ్గర ఉండి ఇదంతా చూస్తున్న ద్వారపాలకులు వచ్చి ఆ సైనికుడి బైటికి తోడ్కొని వెళ్లారు.

అధ్యాయం 13

జనరల్‌తో సంభాషణలు

ఆ ఆహ్వానం నేనూహించనిది.

1972లో ఓ ఉదయం నేను పనామా ప్రభుత్వ విద్యుత్ కంపెనీ - *ఇన్‌స్టిటూట్ డి రెకర్సొస హిడ్రాలికోస ఎలక్ట్రిఫికెసియోన్* లోని నా ఆఫీసులో కూర్చుని పని చేసుకుంటుండగా వచ్చాడా వ్యక్తి.

తనను ఒమర్ టోరిజోస్ డ్రైవర్‌గా పరిచయం చేసుకున్నాడు.

'జనరల్ మిమ్మల్ని కలవాలనుకుంటున్నారు'.

జనరల్ ఒమర్ టోరిజోస్ ఖాకీ ప్యాంటు, నీలిరంగు పొట్టి చేతుల చొక్కా వేసుకుని ఉన్నాడు. ఎత్తుగా, బలిష్ఠంగా ఉన్న ఆయన చాలా కులాసాగా కనిపించాడు. మదిలోని ఆందోళనలేవీ బయటికి కనపడటంలేదు.

నేను ఇటీవల జరిపిన ఇండోనేషియా, గ్వాటెమాల, ఇరాన్ యాత్రల గురించి అడిగాడు ఒమర్.

ప్రపంచ రాజకీయాల గురించి, ముఖ్యంగా ఇరాన్‌లో తండ్రిపైనే తిరుగుబాటు చేసిన షా గురించి పిచ్చాపాటి మాట్లాడుకున్నాం మేం.

'షా కు శత్రువులెక్కువగా ఉన్నారు అతను ఎక్కువ కాలం బతకడం కష్టం'.

'కానీ అతనికి సుశిక్షితులైన అంగరక్షకులున్నారు' అన్నాన్నేను.

'అంగరక్షకులా? నాకూ ఉన్నారు మెరికల్లాంటి వారు. కానీ మీ దేశం నన్ను చంపాలని నిశ్చయించుకుంటే వారు ఆపగలరా?'

'అయినా మా దేశం మిమ్మల్నెందుకు చంపుతుంది? ఈ అమాయక అజ్ఞాన ప్రశ్నకు ఒమర్ జవాబిది: 'మాకు పనామా కాలువ ఉంది. యునైటెడ్ ఫ్రూట్‌కు - అర్బెంజ్‌కు జరిగిన వివాదం ఏంటో తెలుసుగా?'.

నాకు గ్వాటెమాల చరిత్ర గురించి బాగానే అవగాహన ఉంది. 1800లో గ్వాటెమాల దేశంలో నెలకొల్పబడ్డ యునైటెడ్ ఫ్రూట్ అనతికాలంలోనే మధ్య అమెరికాలో అత్యంత శక్తివంతమైన కంపెనీగా మారింది.

1950లలో జాకోబో అర్బెంజ్ అనే సంస్కరణవేత్త గ్వాటెమాల అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ప్రజాస్వామ్యానికి ఊపిరులూదిన ఈ ఎన్నిక అమెరికన్ ఖండమంతా శ్లాఘించబడింది. ఆ కాలంలో గ్వాటెమాలలోని మూడు శాతం పౌరుల చేతిలో 70 శాతం భూమి కేంద్రీకృతమై ఉండేది. ఎన్నికలకు ముందే అన్నార్తులకు ఆకలి నుంచి విముక్తి కలిగిస్తానని అర్బెంజ్ వాగ్దానం చేశాడు. గెలవగానే ఒక మౌలిక భూసంస్కరణల కార్యక్రమం చేపట్టాడు.

లాటిన్ అమెరికాలోని పేద, మధ్య తరగతి ప్రజలంతా అర్బెంజ్ సంస్కరణలను మెచ్చుకున్నారు. కానీ యునైటెడ్ ఫ్రూట్ సహజంగానే ఆ సంస్కరణలను వ్యతిరేకించింది, ఎందుకంటే గ్వాటెమాలలో అతిపెద్ద నిరంకుశ భూస్వాములు దాని యజమానులు. అంతేకాదు ఈ కంపెనీకి కొలంబియా, కోస్టారికా, క్యూబా, జమైకా, నికరాగువా, సాంటా డొమింగ్, పనామాలలో భారీ తోటలు ఉన్నాయి. అర్బెంజ్ ఆలోచనలు ఇతర దేశాల అధ్యక్షులకు కూడా వస్తే ఆ కంపెనీ పనైపోతుంది.

వెంటనే యునైటెడ్ ఫ్రూట్ అమెరికాలో భారీ ప్రచారం మొదలుపెట్టింది. అర్బెంజ్ రష్యన్ కుట్రలో భాగమనీ, గ్వాటెమాల సోవియట్లకు ఉపగ్రహ దేశమని సాగింది విషప్రచారం. 1954లో సిఐఏ గ్వాటెమాలలో సైనిక కుట్రను జరిపించింది. అమెరికన్ యుద్ధ విమానాలు గ్వాటెమాల సిటీపై బాంబులు కురిపించాయి. అర్బెంజ్‌ను తొలగించి కల్నల్ కార్లోస్ కాస్టిల్లో అర్మాస్ అనే నియంత అందలమెక్కాడు.

'అర్బెంజ్‌నైతే రాజకీయంగా హత్య చేయగలిగారు కానీ, నన్ను మాత్రం భౌతికంగా నిర్మూలించాల్సిందే' అన్నాడు ఒమర్

'ఇప్పుడు యునైటెడ్ ఫ్రూట్ యజమానులెవరో తెలుసా' అడిగాడు తనే.

'జపాట ఆయిల్ అని జార్జి బుష్ కంపెనీ. ఆయన మా దేశ ఐక్యరాజ్యసమితి రాయబారి' బదులిచ్చాను నేను.

'మేం ఇంకో కొత్త సముద్ర మట్టపు కాలువ నిర్మించాలని అనుకుంటున్నాం. దీనికి ఇప్పుడున్నట్టు లాకులు అవసరంలేదు. దీంట్లో ఇంకా భారీ నౌకలు కూడా ప్రయాణించవచ్చు. దీన్ని జపనీయుల సహాయంతో నిర్మించాలని అనుకుంటున్నాం'

ఒమర్ చెబుతున్న మాటలు విని హతాశుడిని అయ్యాను నేను. నా ప్లాన్‌కి సరిగ్గా వ్యతిరేకంగా ఆలోచిస్తున్నాడతను.

'జనరల్. మీరు నన్ను ఇక్కడికి ఎందుకు పిలిపించారు?' ధైర్యం చేసి అడిగాను.

'పనామాకు మీ సాయం కావాలి' అడిగాడు ఒమర్.

'నా సాయమా? నేనేం చేయగలను మీ కోసం?' ఆశ్చర్యపోవడం నా వంతయింది.

'కాలువను మేం వెనక్కి తీసేసుకుంటాం, కానీ అదొక్కటే చాలదు. మేం వేరే దేశాలకు ఒక నమూనాగా ఉపయోగపడాలి. మా విధానాలు పేదవాడి బాగు కోరేనని వాటిని ఏ రష్యానో, చైనానో లేక క్యూబానో ప్రభావితం చేయటం లేదని మేం ప్రపంచానికి చాటాలి. అమెరికాను ఎదిరించి నిలవడం మా లక్ష్యం కాదు, పేదవాడి పక్షాన నిలబడటమే మాకు కావలసింది'.

'అదంతా సాధ్యం కావాలంటే మాకు మౌలిక వసతులు కావాలి. విద్యుత్ కావాలి - పేదవాడిని చేరుకునే చౌక, సబ్సిడీ విద్యుత్ కావాలి. మెరుగైన రవాణా, కమ్యూనికేషన్ సౌకర్యాలు కావాలి. ఇవన్నీ చేయడానికి మీ ప్రపంచబ్యాంక్, ఇంటర్-అమెరికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ డబ్బు కావాలి'.

నా కళ్లలోకి సూటిగా చూస్తూ 'నాకు తెలుసు మీ కంపెనీ సామాన్యంగా ఎలా పనిచేస్తుందో. ప్రాజెక్టుల అంచనాలు పెంచి అవసరమైనదానికంటే వెడల్పాటి రహదారులూ, పెద్ద విద్యుత్ కేంద్రాలూ, లోతైన రేవులూ నిర్మించి... కానీ ఈసారి కొంచెం భిన్నంగా పనిచేయాలి మీరు. నా ప్రజలకు ఉపయోగపడేది మీరివ్వండి. మీకు కావలసిన పని నేనిస్తాను'.

నేను నిర్ఘాంతపోయాను. అతనలాంటి ప్రతిపాదనతో వస్తాడని నేను ఊహించలేదు. నేను మెయిన్‌లో పొందిన శిక్షణ సరిగ్గా దీనికి వ్యతిరేకమైనది. విదేశీ రుణాల మర్మం పూర్తిగా తెలిసినట్టు అతని మాటలు చెబుతున్నాయి.

పనామా కాలువకున్న ప్రాధాన్యత రీత్యా ఇవ్వాళ ఒమర్ టోరిజోస్‌ను అందరూ గుర్తించక తప్పదు. కానీ ఇతను జాగ్రత్తగా ఉండాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇప్పటికే మంచి పేరు సంపాదించుకున్నాడు ఒమర్ - కానీ తన హీరో అర్బెంజ్‌లా ఏదైనా చేయాలనుకుంటే ఈ వ్యవస్థ ఊరుకుంటుందా? ముఖ్యంగా అమెరికా ఊరుకుంటుందా?

అసలే లాటిన్ అమెరికా చరిత్ర నిండా ఒరిగిపోయిన సాహసవీరులే. నాకు పనామాలో దిగగానే కనపడిన హోర్డింగ్‌పై అక్షరాలు గుర్తొచ్చాయి. 'స్వేచ్ఛ ఒమర్ ఆశయం. ఆశయాన్ని చంపే క్షిపణి ఇంకా కనిపెట్టబడలేదు'.

ఆలోచనలు మరణించవు సరే - వాటి వెనుక నిలబడ్డ మనుషుల మాటేమిటి? చేగువేరా, అర్బెంజ్, అలెండీ - ఏమైంది వీళ్లందరికీ?

అధ్యాయం 14

ఆర్థిక చరిత్రలో దారుణ ఘట్టం

మెయిన్ సంస్థలో చీఫ్ ఎకానమిస్టుగా పనిచేస్తున్న నేను మా కంపెనీ తరఫున నడుస్తున్న ప్రాజెక్టులపైనే గాక అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు, సిద్ధాంతాలపై కూడా కొంచెం అవగాహన కల్పించుకోవలసి వచ్చేది.

1960లలో కొన్ని చమురు ఉత్పత్తి చేసే దేశాలు కలిసి ఒపెక్‌ను ఏర్పాటు చేశాయి. ఈ రంగంలో వేళ్లూనుకొని వటవృక్షాల్లా తయారైన బహుళజాతి చమురు కంపెనీలను నిలవరించడానికే ఒపెక్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. సెవెన్ సిస్టర్స్‌గా పేరుగాంచిన ఏడు ప్రముఖ చమురు కంపెనీలు చమురు రేట్లను తగ్గించాలన్న వ్యూహం పన్నాయని తెలుసుకున్న కొన్ని దేశాలు కలిసి హుటాహుటిన ఒపెక్‌ను ఏర్పాటు చేశాయి. 1970లలో ఒపెక్ - బహుళజాతి కంపెనీల మధ్య పోరు తీవ్రమై అది 1973లో చమురు అమ్మకాలు నిలిచిపొయ్యే దాకా పోయింది. పెట్రోల్ కొరకు అమెరికన్లు పొడవాటి క్యూలలో నిల్చోవడం అప్పట్లో మామూలు దృశ్యం. అమెరికన్ ప్రభుత్వానికయితే మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లయింది. వియత్నాం యుద్ధంలో పరాభవంతో ఉన్న అమెరికాకు ఇది మరో దెబ్బ.

అయితే ఇలాంటి పిల్ల కాకులను అమెరికా ఎక్కువ కాలం ఉపేక్షించదు అని చరిత్ర చెప్పిన పాఠం. నావంటి ఎకనామిక్ హిట్‌మెన్లు, సిఐఏ తోడేళ్లు ఎక్కడో కాచుకుని అవకాశం కోసం చూస్తూనే ఉంటారు. అర్బెంజ్, మొసాడెగ్ నుండి ఇటీవలే సిఐఏ ద్వారా పదవీచ్యుతుడైన చిలీ అధ్యక్షుడు సాల్వడార్ అలెండీ దాకా జరుగుతున్నది అదే కదా.

ఇటువంటి ఎన్నో పరిణామాలపై నేను, నా సహోద్యోగులు, బోస్టన్‌లో ప్రముఖ కాలేజీల లెక్చరర్లు తరచూ చర్చించుకునేవారం.

మా చర్చలో తరచూ రాబర్ట్ మెక్‌నమారా ప్రస్తావన వచ్చేది. 1960లో ఫోర్డ్ సంస్థ అధ్యక్షుడిగా ఉన్న మెక్‌నమారా, కెన్నెడీ అమెరికా అధ్యక్షుడు కాగానే రక్షణశాఖ కార్యదర్శి అయ్యాడు. ఆ తరువాత ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడయ్యాడు. సైనిక పారిశ్రామిక సముదాయానికి మెక్‌నమారా చక్కని ఉదాహరణ అని నా స్నేహితుల

అనేవారు. ఒక బహుళజాతి కంపెనీలో అత్యున్నత స్థానం నుండి ప్రభుత్వంలో ఉన్నత కాబినెట్ పదవికి, అక్కడి నుండి ప్రపంచంలోనే శక్తివంతమైన బ్యాంకుకి అధిపతి. వివిధ శక్తుల మధ్య ఉండే విభజన రేఖ ఇలా చెరిగిపోవడం పట్ల నా మిత్రులు ఆందోళన పడేవారు. నాకు మాత్రం ఇదేమీ పెద్దగా ఆశ్చర్యపడే విషయంలా తోచేది కాదు.

ఒకసారి మెక్‌నమారా ఎటువంటి వారసత్వాన్ని తయారుచేశాడో చూడండి.

1. జార్జ్‌షుల్ట్జ్ ట్రెజరీ సెక్రటరీగా పనిచేసి అనంతరం కౌన్సిల్ ఆఫ్ ఎకనామిక్ పాలసీకి ఛైర్మన్ పదవిలోకి మారాడు, ఆ తరువాత బహుళజాతి కంపెనీ బెక్టెల్‌కి అధిపతి అయ్యాడు, ఆ తరువాత రీగన్ హయాంలో సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా నియమింపబడ్డాడు.

2. కాస్పర్ వెయిన్‌బర్గర్ బెక్టెల్ ఉపాధ్యక్షుడిగా పనిచేసి, ఆ తరువాత రీగన్ హయాంలో రక్షణ సెక్రటరీ అయ్యాడు.

3. రిచర్డ్ హెల్మ్స్ సిఐఏ డైరెక్టర్‌గా ఉండి తరువాత ఇరాన్‌లో అమెరికా రాయబారి అయ్యాడు.

4. రిచర్డ్ చెనీ - జార్జిబుష్ సీనియర్ వద్ద రక్షణ సెక్రటరీగా పనిచేసి అనంతరం హాలిబర్టన్ బహుళజాతి కంపెనీ అధ్యక్షుడయ్యాడు. అనంతరం జార్జిబుష్ జూనియర్ కింద అమెరికా ఉపాధ్యక్షుడు అయ్యాడు.

5. జార్జిబుష్ కథ చూడండి: జపాటా పెట్రోలియం కంపెనీ స్థాపకుడు. ఆ తరువాత ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి, సిఐఏ డైరెక్టరు నుండి ఇప్పుడు దేశ అధ్యక్షుడు.

మావంటి ఎకనామిక్ హిట్‌మెన్లు ఇండోనేషియా, ఈక్వెడార్‌లలో లక్ష్యాన్ని ఛేదించి ఉండవచ్చు కానీ, మా దేశం ఎంత త్వరగా పాత పద్ధతులకు మరలుతుందో వియత్నాం చక్కని ఉదాహరణ.

అధ్యాయం 15

సౌదీ అరేబియా డబ్బుల మారుబేరాలు

1974లో సౌదీ అరేబియా దౌత్యవేత్త ఒకరు తన దేశ రాజధాని అయిన రియాద్ నగరం ఫొటోలు చూపించాడు. వాటిలో ఒక ఫొటో నా దృష్టి నాకర్షించింది. ఒక ప్రభుత్వ భవనం బయట ఉన్న చెత్తకుప్పను ఒక గొర్రెల గుంపు తింటోన్న ఆ ఫొటోను చూపించి ఏమిటిదని ఆ దౌత్యవేత్తను అడిగాను.

అతని జవాబు నన్ను ఆశ్చర్యపరిచింది.

'అది మా నగరపు పారిశుధ్య పథకం' అన్నాడతను

'ఆత్మగౌరవం గల ఏ సౌదీ దేశస్థుడూ చెత్తను ఏరే పనిచేయడు. అందుకే ఆ పని గొర్రెలకు వదిలేస్తాం మేం'

ప్రపంచంలోనే గొప్ప చమురు సామ్రాజ్యపు రాజధానిలో గొర్రెలు! ఆ ఊహే నమ్మశక్యంగానిది.

చమురు సంక్షోభానికి పరిష్కారం కనుగొనే పనిలో నిమగ్నమైన కన్సల్టెంట్ల బృందంలో పనిచేస్తున్న నాకు ఈ గొర్రెలు సమస్యకు పరిష్కారం చూపుతున్నట్లు తోచింది. గత మూడు దశాబ్దాల సౌదీ అరేబియా అభివృద్ధి చరిత్రను పరిశీలిస్తే ఆ పరిష్కారం కనపడుతుందేమో?

సౌదీ అరేబియా చరిత్ర సమస్తం హింస, మతోన్మాదంతో నిండి ఉంది. పద్దెనిమిదో శతాబ్దంలో మహమ్మద్ ఇబ్న్ సౌద్ అనే స్థానిక ముఠా నాయకుడు ఛాందసవాద వహాబీ తెగ ముస్లింలతో చేతులు కలిపాడు. ఈ శక్తివంతమైన కూటమి అరేబియా ద్వీపకల్పం లోని అత్యధిక భూభాగం - పవిత్రమైన మక్కా, మదీనాలతో సహా - జయించింది. సౌదీ సమాజం తమ పూర్వీకులు నమ్మిన పవిత్ర ఆదర్శవాదంపై ఆధారపడ్డది. ఖురాన్ బోధనలు తు.చ. తప్పకుండా పాటించేవారు సౌదీలు. రోజుకి

అయిదుసార్లు నమాజ్ చేయడం, స్త్రీలు బురఖా ధరించడంతో పాటు నేరాలకు కఠిన శిక్షలుండేవి. బహిరంగ శిరచ్ఛేదాలు, రాళ్లతో కొట్టడం చాలా తరచుగా జరిగేవి.

మతం అనేది రాజకీయ, ఆర్థిక వ్యవహారాలతో విడదీయరాని అంతర్భాగ మని సౌదీల అభిప్రాయం.

అక్టోబర్ 6, 1973న ఈజిప్ట్, సిరియాలు కలసికట్టుగా ఇజ్రాయెల్‌పై దాడి చేశాయి. ఆరోజు యోమ్ కిప్పుర్ అనే యూదుల పండుగ రోజు. అరబ్‌లు - ఇజ్రాయెలీల మధ్య అది నాలుగో యుద్ధం - ఇదివరకు జరిగిన వాటికన్నా విధ్వంసకర ఫలితాలను ఇచ్చిన యుద్ధం. ఇజ్రాయెల్‌తో అమెరికా కుమ్మక్కయిందనీ కనుక దాన్ని 'చమురు ఆయుధం'తో శిక్షించాలని సౌదీ రాజు ఫైసల్‌ను ఈజిప్ట్ అధ్యక్షుడు సాదత్ కోరాడు. అక్టోబర్ 16న ఇరాన్, మరో అయిదు గల్ఫ్ దేశాలతో పాటు సౌదీ అరేబియా కూడా చమురు ధరలను 70 శాతం పెంచాయి.

పరిస్థితిని సమీక్షించడానికి కువైట్ సిటీలో సమావేశమైన అరబ్ చమురు మంత్రులు ఇంకా ఏం చర్యలు తీసుకోవచ్చు అని ఆలోచించారు. అమెరికాను లక్ష్యంగా చేసుకోవలసిందిగా ఇరాక్ ప్రతినిధి ఇతర ప్రతినిధులను కోరాడు. అరబ్ దేశాల్లోని అమెరికన్ వ్యాపారాలను జాతీయం చేయాలనీ, అమెరికా, ఇజ్రాయెల్ వాటి మిత్రదేశాలకు చమురు ఎగుమతులు ఆపివేయాలనీ, అమెరికన్ బ్యాంకుల నుండి అరబ్ నిధులను వెనక్కి తీసుకోవాలనీ సూచించాడు.

అయితే ఇతర అరబ్ ప్రతినిధులు ఇంతటి తీవ్రచర్యలకు సాహసించలేదు. కానీ అక్టోబర్ 17న చమురు ఉత్పత్తులలో ఐదు శాతం కోత విధించారు. అమెరికా ఇజ్రాయెల్‌కు మద్దతు ఉపసంహరించుకోకపోతే ప్రతీ నెలా ఐదు శాతం కోత విధిస్తామని హెచ్చరించారు.

అక్టోబర్ 19న అమెరికా అధ్యక్షుడు నిక్సన్ ఇజ్రాయెల్‌కు 220 కోట్ల డాలర్ల సాయం చేయాలని కాంగ్రెస్ (పార్లమెంట్) ను కోరాడు. ఆ మరునాడే అరబ్ దేశాలు అమెరికాకు చమురు ఎగుమతులు నిలిపివేశాయి.

ఈ నిలిపివేత మార్చి 18, 1974న ముగిసింది. దీని వ్యవధి స్వల్పకాలమైనా ప్రభావం మాత్రం అపారం. చమురు ధరలు బ్యారెల్‌కు 1.39 డాలర్ల నుండి (1970) 8.32 డాలర్ల (1974) కు లంఘించాయి. రాజకీయ నాయకులు, భవిష్యత్ పాలనా యంత్రాంగాలు నడిపేవారు ఈ చమురు సంక్షోభం నుండి ఎన్నో పాఠాలు నేర్చుకున్నారు. అయితే గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే కార్పొరేట్‌స్వామ్యపు మూడు స్తంభాలైన బహుళజాతి సంస్థలు, అంతర్జాతీయ బ్యాంకులు, ప్రభుత్వం మధ్య అనుబంధం ఈ సంక్షోభ సమయంలో మరింత దృఢమైంది.

మరోసారి చమురు సంక్షోభం వంటిది పునరావృతం కాకుండా అమెరికన్ ప్రభుత్వం పావులు కదపడం ప్రారంభించింది. సౌదీలతో మంతనాలు ప్రారంభించింది. సాంకేతిక, సైనిక సహాయం, దేశాన్ని ఇరవయ్యొకటవ శతాబ్దంలోకి తీసుకువచ్చే వాగ్దానాలతో అమెరికా సౌదీ నేతలతో చర్చలు మొదలుపెట్టింది. దాని పర్యవసానమే యునైటెడ్ స్టేట్స్ - సౌదీ అరేబియన్ జాయింట్ ఎకనామిక్ కమిషన్. జెకార్ అని పిలవబడే ఈ సంస్థ సరిగ్గా సాంప్రదాయ రుణ పథకాలకు విరుద్ధంగా ఉంటుంది. ఇక్కడ సౌదీల డబ్బుతో అమెరికన్ కంపెనీల సేవలు వినియోగించుకుని ఒక కొత్త సౌదీ అరేబియా నిర్మించబడుతుంది.

సౌదీ అరేబియా తన పెట్రోడాలర్లతో అమెరికన్ ప్రభుత్వపు సెక్యూరిటీ బాండ్లను కొనుగోలు చేస్తుంది. ఇలా వసూలైన కోట్ల కొద్దీ డాలర్లపై పొగుపడిన వడ్డీతో అమెరికన్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ సౌదీ అరేబియాను అభివృద్ధి పరచే ప్రణాళికలు అమలు చేస్తుంది. ఈ ఒప్పందానికి బదులుగా అమెరికా సౌదీ అరేబియాకు అవసరమైన రాజకీయ, సైనిక మద్దతు ఇస్తుంది. ఇప్పటి పాలకులే ఎల్లకాలం సౌదీని ఏలేటట్టు అమెరికా చూసుకుంటుంది.

ఈ ఒప్పందానికి సౌదీ రాజకుటుంబీకులలో ప్రముఖుడైన ఒక యువరాజును ఒప్పించాల్సిన బాధ్యత నాపై పెట్టారు. ఎంతో నిష్ఠ గలిగిన వహాబీ తెగకు చెందిన ఈ యువరాజుకి తన దేశం పాశ్చాత్య దేశాల వ్యాపారీకరణ పథం పట్టడం సుతరామూ ఇష్టం లేదు.

కానీ అతడికి అందమైన తెల్లతోలు అమ్మాయిల బలహీనత ఉందని కనిపెట్టాను నేను. నా కార్యం నెరవేర్చుకోవడానికి నేను ఎంతకయినా తెగించాలి మరి!

అధ్యాయం 16

తీర్చుడు పనులు, ఒసామాకు డబ్బుల సరఫరా

యువరాజు ఎప్పుడు బోస్టన్ వచ్చినా అతనికి నచ్చిన అమ్మాయితో 'మర్యాదలు' జరగాలని కోరుకునేవాడు. అయితే అతనికి వేశ్యలు అక్కరలేదనేవాడు. అతనికో, అతని తరఫు వాళ్లకో బయట మార్కెట్‌లోనో, ఏ పార్టీలోనో తారసపడే వేశ్యలు వద్దు అనేవాడు.

యువరాజు కోర్కె తీర్చడానికి వెతికి వెతికి సాల్లీ అనే యువతిని పట్టుకున్నాను. సాల్లీకి భర్త తెచ్చే జీతం, అతని విలాసవంతమైన అపార్ట్‌మెంట్ నచ్చాయి గానీ వారిద్దరికీ అంతగా సఖ్యత లేదు. ఇలాంటి బయటి వ్యవహారాలకి ఆమె ఎప్పుడూ సిద్ధంగానే ఉండేది. డబ్బు సంపాదించేందుకు ఇదో చక్కని మార్గమని సాల్లీ అభిప్రాయం.

సాల్లీ - యువరాజు ఒకరికొకరు బాగా నచ్చారు. కొన్నాళ్ల తరువాత యువరాజు సాల్లీని ఏకంగా సౌదీ అరేబియాలోని తన విశ్రాంతి గృహానికే పంపమని అడిగాడు.

అప్పట్లో ఇట్లాంటి వ్యవహారాలు మామూలే. డబ్బులో మునిగి తేలుతున్న పశ్చిమాసియా దేశాలకు యూరోపియన్ దేశాల నుండి అమ్మాయిలను ఎగుమతి చేయడం ఆ రోజుల్లో బాగా జరిగేది. రాబర్ట్ బేయర్ అనే సిఐఏ అధికారి ఓ చోట ఇలా రాశాడు: '1970ల తొలి నాళ్లలో పెట్రో డాలర్ల వరద మొదలైంది. ఔత్సాహికులైన కొద్దిమంది లెబనాన్ వాసులు సౌదీ యువరాజుల కొరకు వేశ్యలను సరఫరా చేయడం మొదలుపెట్టారు. అయితే సౌదీ యువరాజులలో ఎవరికీ చెక్‌బుక్‌పై రాయడం రాకపోవడంతో ఈ లెబనాన్ వాసులు అనతికాలంలోనే ధనవంతులయ్యారు.'

నాకో చిక్కొచ్చిపడింది. సాల్లీ తన భర్తను వదిలి రాలేదు. ఈ సమస్యను యువరాజే పరిష్కరించాడు. ఈ సాల్లీ కాకపోయినా ఫరవాలేదు అని అతను చెప్పడంతో ఊపిరిపీల్చుకున్నాన్నేను. వెంటనే నాకు తెలిసిన మిత్రుల ద్వారా ఒక నకిలీ సాల్లీని యువరాజుకు ఎగుమతి చేశాం.

ఎలాగైతేనేం ఎంతో కష్టపడ్డ పిమ్మట మా ప్రణాళికలకు సౌదీ అరేబియా ప్రభుత్వం ఓకే చెప్పింది. మా కంపెనీకి సౌదీలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వ్యవస్థను నవీకరించే కాంట్రాక్టు ఇచ్చారు. ఎప్పటిలాగానే ముందు ఒక టీమ్‌ను సౌదీ పంపి అక్కడ ప్రాంతాల వారీగా విద్యుత్ డిమాండ్ ఎలా ఉండబోతుందో వివరమైన ప్రణాళికలు తయారు చేయాలి మేము.

జెకార్ ఆధ్వర్యంలో సౌదీ అరేబియా రూపురేఖలు అనతికాలంలోనే మారిపోయాయి. గొర్రెల స్థానంలో తళతళలాడే రెండొందల చెత్త ఎత్తే ఆటోమేటిక్ వాహనాలు వచ్చాయి. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, కంప్యూటర్లు, ఎయిర్ కండిషనింగ్, కేబుల్ టీవీ, అత్యాధునిక ఆస్పత్రులూ, అమ్యూజ్‌మెంట్ పార్కులూ - ఇలా సౌదీ స్వరూపమే మారిపోయింది.

ఈ ప్రయోగం అనేక దుష్ఫలితాలను కూడా ఇచ్చింది. 1979లో అత్యంత క్రూరుడిగా పేరొందిన ఉగాండా నియంత ఈదీ అమీన్‌కు సౌదీలు ఆశ్రయమిచ్చినప్పుడు అమెరికా పెద్దగా అభ్యంతర పెట్టలేదు. జెకార్ పేరిట తమ మధ్య ఉన్న ఒప్పందం దృష్టిలో పెట్టుకునే అమెరికా ఊరుకుందని అంటారు పరిశీలకులు.

అయితే ఇంతకన్నా ప్రమాదకర దుష్ఫలితం అంతర్జాతీయ టెర్రరిస్టులకు సౌదీ అరేబియా నిధులను సమకూరుస్తున్నా అమెరికా చూసీ చూడనట్టు ఉండటం. 1980లలో సోవియెట్లకు వ్యతిరేకంగా ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికా-సౌదీలు జంటగా రంగంలోకి దించారు. ఇందు నిమిత్తం ఆ ముజాహిదీ నాయకునికి 350 కోట్ల డాలర్లు ఇచ్చారని అంచనా.

2003లో అమెరికాకు చెందిన 'న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్టు' అనే పత్రిక సౌదీలకు-అమెరికన్లకు గల సంబంధాలు, అంతర్జాతీయ టెర్రరిజానికి సౌదీల ప్రోత్సాహం గురించి 'ది సౌదీ కనెక్షన్' అనే సవివరమైన నివేదిక వెల్లడించింది:

'దాదాపు 20 దేశాల్లోని జిహాదీ టెర్రరిస్టు గ్రూపులకు సౌదీ అరేబియా ఆర్థిక సాయం చేసింది. వీటితో ఆ గ్రూపులు సైనిక శిక్షణ, ఆయుధాల కొనుగోలు, కొత్త సభ్యుల నియామకం జరిపాయి. ఇదంతా చూసీ చూడనట్టు ఉండేందుకు అమెరికన్ అధికారులకు, సిఐఏ ఉద్యోగులకూ కాంట్రాక్టులు, గ్రాంట్లు, లంచాలు మేపారు. ఇలా లబ్ధి పొందిన టెర్రరిస్టు గ్రూపుల్లో అల్ ఖయిదా కూడా ఉంది.'

2001లో వరల్డ్ ట్రేడ్ సెంటర్, పెంటగాన్‌లపై దాడి జరిగాక ఈ కోవర్ట్ సంబంధాలపై మరిన్ని వివరాలు లభ్యమయ్యాయి. అక్టోబర్ 2003లో వానిటీ ఫెయిర్ అనే పత్రిక 'సేవింగ్ ది సౌదీస్' అనే సంచలనాత్మకమైన రిపోర్టు ప్రచురించింది.

బుష్ కుటుంబానికీ, సౌదీ రాజకుటుంబానికీ, బిన్ లాడెన్ కుటుంబానికీ గల సంబంధాలను ఆ పత్రిక బయటపెట్టింది. సౌదీలో జెకార్ కార్యకలాపాలు ఉధృతంగా జరుగుతున్నప్పుడు బుష్ ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా, తదనంతరం సిఐఏ డైరెక్టరుగా పనిచేశాడు. వానిటీ ఫెయిర్ పత్రిక రాసిన ఈ వివరాలు చూడండి.

ప్రపంచంలో రెండు ప్రముఖ వంశాలైన బుష్ కుటుంబానికీ, సౌదీ రాజ కుటుంబానికీ గత 20 ఏళ్లుగా సన్నిహిత వ్యాపార, రాజకీయ సంబంధాలు ఉన్నాయి.

హార్కెన్ ఎనర్జీ అనే చమురు కంపెనీలో జార్జి బుష్ పెట్టుబడి పెట్టాడు. అది ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సౌదీలే దాన్ని గట్టెక్కించారు. కార్లైల్ గ్రూప్ అనే బహుళజాతి కంపెనీకి సౌదీల నుండి మద్దతు అవసరమైనప్పుడు జార్జ్ బుష్, మాజీ సెక్రటరీ ఆఫ్ స్టేట్ జేమ్స్ బేకర్-III కలిసి సాయం చేశారు. టెర్రరిస్టు గ్రూపులతో సంబంధాలున్న ఓ సౌదీ ఆ సంస్థకి పెట్టుబడిదారుడిగా ఉన్నా జార్జి బుష్ ఇప్పటికీ ఆ సంస్థకు సీనియర్ అడ్వైజర్‌గా ఉన్నారు.

సెప్టెంబర్ 11 దాడి తరువాత బిన్ లాడెన్ కుటుంబీకులతో పాటు, సౌదీ దేశస్థులను కొందరిని ప్రైవేట్ జెట్ విమానాలలో అమెరికా నుండి హుటాహుటిన తప్పించారు.

బుష్‌కు సౌదీలకు గల సంబంధాలే దీనికి కారణమా?

మూడో భాగం 1975 - 1981

అధ్యాయం 17

పనామా కాలువ చర్చలు - గ్రాహం గ్రీన్

సౌదీ అరేబియాలో నేను సాధించిన విజయాలు నా ఉద్యోగాన్ని కొత్త ఎత్తులకు తీసుకువెళ్లాయి. 1972 నాటికే నేను ఇరవై మందితో కూడిన చిన్న సామ్రాజ్యం నిర్మించుకున్నాను. మెయిన్ సంస్థ వందేళ్ల చరిత్రలో లేని విధంగా అతి పిన్న వయస్సులో భాగస్వామినయ్యాను. చీఫ్ ఎకానమిస్టు పదవితో బాటు కొత్తగా మేనేజర్ ఎకనామిక్స్ అండ్ రీజనల్ ప్లానింగ్ అనే పోస్టు కూడా ఇచ్చారు నాకు. హార్వర్డ్‌లో ఉపన్యాసాలు ఇవ్వడం, పత్రికల్లో వ్యాసాలు రాయడం మామూలైంది. జీతం కూడా ఎన్నో రెట్లు పెరిగింది. నా భార్యతో విడాకులు తీసుకున్నాను గానీ దేశ విదేశాల్లో అనేక మంది సౌందర్యరాశులతో గడిపే అవకాశం దొరికేది.

ఒక రోజు మా బాస్ బ్రూనో జాంబొట్టి ఒక రష్యన్ గణిత శాస్త్రవేత్త కనుగొన్న సిద్ధాంతం పరిచయం చేశాడు నాకు. దీని ప్రకారం భవిష్యత్ అంచనాలకు సంభావ్యతా సూత్రం అన్వయించి కొన్ని రంగాలు ఎలా అభివృద్ధి చెందుతాయో తెలుసుకోవచ్చు. మేం సామాన్యంగా పెరుగుదలను ఎక్కువ చేసి చూపే పద్ధతిని అవలంబిస్తాం కాబట్టి ఈ కొత్త సిద్ధాంతం మాకు ఉపయోగపడేటట్టే తోచింది. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి డా॥నడిపురం ప్రసాద్ అనే యువ గణిత శాస్త్రవేత్తను ఈ పనికి పురమాయించాను. ఆరు నెలల్లో అతను 'మార్కోవ్ మెథడ్ ఆఫ్ ఎకనోమెట్రిక్ మోడలింగ్' ను తయారుచేశాడు

భారీ రుణాల ద్వారా దేశాలను 'అభివృద్ధి' చేస్తామనే మోసపూరిత మాటలకు సాంకేతిక రూపం ఇవ్వడానికి మాకో సరికొత్త ఆయుధం దొరికింది.

★★★

టోరిజోస్‌కు నాకు మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం నేను పనామా ప్రజలకు ఉపయోగపడే విధంగానే ప్రాజెక్టుల ప్రణాళికలు తయారు చేయాలి.

నేను ఆ మాట నిలబెట్టుకున్నాను.

మా కంపెనీ పెద్దలు కొంచెం నసుగుతూనే - పనామాతో వ్యాపారం చేయాలి కాబట్టి అయిష్టంగానే ఒప్పుకున్నారు.

* * *

జిమ్మీకార్టర్‌కు, ఒమర్ టోరిజోస్‌కు పనామా కాలువ హక్కులపై జరుగుతున్న చర్చలపై నేను అమితాసక్తి ప్రదర్శించేవాడిని.

బోస్టన్ గ్లోబ్ అనే పత్రికలో 1975 సెప్టెంబర్ 19న రాసిన వ్యాసంలో పనామా కాలువను పనామా ప్రజలకే అప్పజెప్పాల్సిన సమయం వచ్చిందని నేను రాశాను.

మెయిన్ వంటి సంస్థలో పనిచేస్తూ అటువంటి వ్యాసం రాయడం ఒక విధంగా దుస్సాహసమే.

అలా రాసినందుకు పర్యవసానం నాకు వెంటనే అర్థమైంది. నన్ను నానా రకాల మాటలు అంటూ అనేక మంది లేఖలు రాశారు.

అయితే విచిత్రంగా నా బాస్ బ్రూనో ఈ సంఘటనను వేరే కోణంలోంచి చూశాడు. 'నువ్వు చాలా చక్కని పని చేశావు. వెంటనే ఈ పత్రిక ప్రతినొకదాన్ని ఒమర్ టోరిజోస్‌కు పంపు. ఇక మనకు పనామాలో తిరుగే ఉండదు' అన్నాడు.

ఒక విధంగా బ్రూనో చెప్పింది నిజమే. పనామాలో మా ప్రత్యర్థి కంపెనీలన్నీ గెంటివేయబడుతున్న సమయంలో మెయిన్‌కు మాత్రం ఎటువంటి ఢోకా లేకుండా పోయింది.

* * *

ఓ రోజు పనామాలోని కాఫీషాప్‌లో ప్రఖ్యాత నవలాకారుడు, ఒమర్ స్నేహితుడైన గ్రాహంగ్రీన్ కలిశాడు. అతడి టేబిల్ వద్దకు వెళ్లి నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

'మీరు బోస్టన్ గ్లోబ్‌లో పనామా కాలువ గురించి రాసిన వ్యాసం చదివాను. చాలా బాగుంది' అని మెచ్చుకున్నాడు గ్రీన్. నేను చాలా ఆనందించాను.

ఆ తరువాత మా చర్చ ఒమర్ పైకి మళ్లింది. తన కొడుకు గురించి చెప్పినంత ఆప్యాయంగా జనరల్ ఒమర్ గురించి నాకు చెప్పాడు గ్రీన్.

'తన దేశం గురించి ఒక పుస్తకం రాయమని కోరాడు ఒమర్! ఇప్పుడు అదే పనిలో ఉన్నాను' వివరించాడు.

'మీరు ఎక్కువగా నవలలు ఎందుకు రాస్తారు? నిజజీవిత రచనలు చేయొచ్చు కదా? ప్రశ్నించాను నేను.

'కల్పిత కథలే క్షేమం. నేను రాసే విషయాలు సాధారణంగా కొంచెం వివాదాస్పదమైనవి. వియత్నాం, హైతీ, మెక్సికన్ విప్లవం... వీటిని యథాతథంగా రాస్తే ప్రచురించడానికి ప్రచురణకర్తలు భయపడతారు. అంతేకాక నాకు కల్పిత నవలలు రాయడంలో ఎక్కువ స్వేచ్ఛ ఉంటుంది. అందుకే అవే నాకు ఇష్టం'.

గ్రీన్‌కు ఒమర్ అంటే వల్లమాలిన అభిమానం. తన స్నేహితుని ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని ఈ నవలాకారునికి తెలుసు.

'ఆ ఉత్తర ధృవం భారీకాయాన్ని ఎదుర్కోవడం చాలా కష్టం!' అని వ్యాఖ్యానించాడు.

'సరే ఇక నేను వెళ్లాలి!' అంటూ లేచాడు.

'నువ్వు చక్కగా రాస్తావు. ఒక పుస్తకం రాయగూడదూ' అన్నాడు నిలబడ్డాక.

నేనేమీ మాట్లాడలేదు. వెళ్లబోతూ ఆగి,

'మరేం ఫరవాలేదు. ఒమర్ కాలువను తిరిగి గెలుచుకుంటాడు' అన్నాడు.

నిజంగానే ఒమర్ కాలువను తిరిగి పొందాడు. 1977లో జిమ్మీ కార్టర్‌తో జరిగిన చర్చలు ఫలవంతమై పనామా కాలువపై హక్కుని తిరిగి పనామా పొందింది. చివరకు అమెరికా పార్లమెంట్‌లో సుదీర్ఘ చర్చ తరువాత ఒక్క ఓటుతో పనామా కాలువ మార్పిడి ఒప్పందం నెగ్గింది.

గ్రాహంగ్రీన్ తదనంతరం రాసిన 'గెట్టింగ్ టు నో ది జనరల్' అనే పుస్తకం తొలి పేజీలో 'నికరాగువా, ఎల్‌సాల్వడార్, పనామా దేశాల్లో నా స్నేహితుడు ఒమర్ టొరిజోస్ స్నేహితులకు అంకితం' అని రాశాడు.

* * *

గ్రాహంగ్రీన్, ఒమర్ టొరిజోస్ ఇద్దరూ మంచి స్నేహితులు.

న్యూయార్క్ రివ్యూ ఆఫ్ బుక్స్ అనే పత్రికలో పనామా అధికార యంత్రాంగం అవినీతి గురించి విపులంగా రాశాడు గ్రాహంగ్రీన్.

ఈ అవినీతిని ఒప్పుకున్న ఒమర్ 'అవును. నాకింకో దారిలేదు. నేను అడ్డుకుంటే వాళ్లు సిఐఏ ఇచ్చే లంచాలకు అలవాటుపడతారు' అని బదులిచ్చాడు

అధ్యక్షుడు కార్టర్, ఒమర్‌ల మధ్య జరుగుతున్న చర్చలు ఫలవంతం కావడం సిఐఏకు ఇష్టం లేదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. మా కంపెనీ పనామాలో చేస్తున్న పనులు అంత లాభదాయకమైనవి కావు. ఎకనామిక్ హిట్‌మెన్ ఎక్కడ విఫలమైతే అక్కడ సిఐఏ తోడేళ్లు రంగప్రవేశం చేస్తాయి. ఇప్పుడు వాటి కళ్లు ఒమర్‌పై పడలేదు కదా!

అధ్యాయం 18

ఇరాన్ రారాజు

1975 నుండి 1978 మధ్య కాలంలో నేను చాలా సార్లు ఇరాన్‌ను దర్శించాను. కొన్నిసార్లు లాటిన్ అమెరికా నుండో లేదా ఇండోనేషియా నుండో ఇరాన్‌కు నేరుగా వెళ్లేవాణ్ణి. రాజులకు రాజు అని తనని తాను ప్రకటించుకున్న ఇరాన్ చక్రవర్తి షా మేం పనిచేసే ఇతర ప్రదేశాలతో పోలిస్తే మాకో విభిన్నమైన పరిస్థితిని సృష్టించాడు.

సౌదీ అరేబియా వలె ఇరాన్ కూడా చమురు సంపద సమృద్ధిగా గల దేశం. ఈ దేశం కూడా 'అభివృద్ధి ప్రాజెక్టులు' చేపట్టడానికి అప్పు చేయవలసిన అవసరం లేదు. సౌదీ అరేబియా జనాభా లాగానే ఇక్కడ కూడా ముస్లిం జనాభానే అధికం. కానీ వీరు సౌదీ వారిలా అరబ్బులు కాదు.

ఇరాన్ చరిత్ర మొత్తం రాజకీయ సంక్షోభాల మయం. ఇటు ఇంటా అటు బయటా ఎప్పుడూ ఏదో సంఘర్షణే. అందుకే మేం ఇక్కడో కొత్త పంథా చేపట్టాం. వాషింగ్టన్, బహుళజాతి కంపెనీలు కలిసి ఇరాన్ షా ను అభివృద్ధికి సూచికగా మార్చేందుకు నడుం బిగించాయి.

అమెరికాకు మిత్రుడిగా ఉన్న 'ప్రజాస్వామ్య దేశం' ఎంతగా రాజకీయ, ఆర్థిక 'విజయాలు' సాధించగలదో చూపించే ఒక బృహత్ కార్యక్రమం చేపట్టాం. అతనికి రాచరికపు బిరుదు ఉన్నదనీ, తనకంటే ముందున్న ప్రజాస్వామ్య పాలకుణ్ణి సిఐఏ మద్దతిచ్చిన సైనిక కుట్ర ద్వారా కూలదోశాడనీ మేం కాసేపు మర్చిపోయాం.

ఇరాక్, లిబియా, చైనా, కొరియా, ఇంకా అనేక ఇతర దేశాలలో ఉన్న అమెరికా వ్యతిరేక ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయంగా ఇరాన్‌ను నిలబెట్టాలని అమెరికా, దాని యూరోపియన్ నేస్తాలు కలిసికట్టుగా నిర్ణయించాయి.

కొన్ని విషయాల్లో షా పేదవారి బాగు గురించి ఆలోచించే వాడిగానే తోచేవాడు. 1962లో దేశంలోని పెద్ద భూకమతాలు విభజించి భూమిలేని పేదలకు పంచాలని ఆదేశించాడు. మరుసటి సంవత్సరం సామాజిక - ఆర్థిక సంస్కరణల కార్యక్రమం - శ్వేత విప్లవం అనే పేరుతో ప్రారంభించాడు. 1970లలో ఒపెక్ బలోపేతం

అవడంతో షా ప్రపంచ శ్రేణి పరపతిగల నాయకుడిగా ఎదిగాడు. అదే సమయంలో మధ్య ఆసియా ముస్లిం దేశాల్లోకెల్లా బలమైన సైనిక శక్తిగా కూడా ఇరాన్ అవతరించింది.

ఇరాన్‌లో మా మెయిన్ సంస్థకు అనేక ప్రాజెక్టులు దక్కాయి. వీటిలో ఉత్తరాన కాస్పియన్ సముద్రం ఒడ్డున టూరిజం క్షేత్రాల నుండి దక్షిణాన హార్ముజ్ సంధి వద్ద నిర్మాణమవుతున్న రహస్య సైనిక స్థావరాల వరకూ ఉన్నాయి. అన్ని చోట్ల చేసినట్టే ఇక్కడ కూడా మా బృందం విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా వ్యవస్థలు డిజైన్ చేయడం, ఆర్థిక అభివృద్ధి సూచికలు తయారు చేయడం చేసేది.

ఈ పనుల్లో భాగంగా నేను ఇరాన్‌లోని అన్ని ప్రాంతాలూ పర్యటించాను. పాతకాలపు ఎడారి వర్తక మార్గమైన కిర్మాన్ నుండి బందర్ అబ్బాస్ వరకూ పర్వత శ్రేణుల గుండా ప్రయాణించాను. పురాతన ప్రపంచపు వింతల్లో ఒకటైన పెర్సెపొలిస్ రాజ ప్రాసాదం శిథిలాలను దర్శించాను. దాని సమీపంలో ఇరాన్ షా కు పట్టాభిషేకం జరిగిన గుడారాల పట్టణం చూశాను. ప్రముఖ పర్యాటక స్థలాలైన షిరాజ్, ఇస్ఫహాన్ పట్టణాలకు కూడా నేను వెళ్లాను. నా పర్యటనల పర్యవసానంగా ఈ గడ్డపై, ఇక్కడి ప్రజలపై అవ్యాజమైన అనురాగం పెంపొందించుకున్నాను.

పైకి చూస్తే క్రైస్తవ, ముస్లిం ప్రజల పరస్పర సహకారానికి ఇరాన్ ఒక చక్కని ఉదాహరణ వలె కనపడేది. కానీ దూరపు కొండలు నునుపు అని నాకు త్వరలోనే తెలిసింది.

1977లో ఓ సాయంత్రం నేను నా హోటల్ గదికి తిరిగి వచ్చేసరికి నా గది తలుపు కింద ఒక చిన్న చిట్టీ లభించింది. ఆ ఉత్తరం చివర ఉన్న సంతకం చూసి నేను ఆశ్చర్యపోయాను. అది యామిన్ అనే తీవ్రవాదిది. నేనిక్కడికి వచ్చిన తొలినాళ్లలోనే ప్రభుత్వ అధికారులు అతడో కరడుగట్టిన తీవ్రవాది అని నాకు చెప్పారు.

గబగబా ఉత్తరం చదివాను.

ముత్యాల వంటి ఇంగ్లీషు అక్షరాలు. ఒక రెస్టారెంట్‌లో తనను కలవడానికి రమ్మని ఆహ్వానం. నా వంటి 'ఉన్నత స్థాయి' వ్యక్తులు ఎన్నడూ చూడని ఇరాన్ దేశపు పార్శ్వం చూడాలని ఉంటే తనని కలవడానికి రమ్మని పిలుపు.

అసలు నా 'స్థాయి' ఏమిటో ఇతగాడికి నిజంగా తెలుసా? వెళ్లడం చాలా ప్రమాదకరం అని అర్థం అవుతూనే వుంది. కానీ ఈ నిగూఢ తీవ్రవాద నాయకుడిని కలవకుండా కూడా ఉండలేను.

ఓ ఎత్తైన ప్రహరీ గోడకు ఉన్న చిన్ని గేటు ముందు దింపాడు టాక్సీవాలా. ఆ ఎత్తైన గోడ వెనక ఏముందో కనపడటం లేదు. నల్లటి పొడవాటి బురఖా ధరించిన

ఓ ఇరానీ యువతి నాకు స్వాగతం పలికింది. లోపల భవంతి కారిడార్ ఇరువైపులా నూనె దీపాలతో అలంకరించబడింది. లోపల రూమ్‌లోకి అడుగుపెట్టగానే చమక్కు మనే వెలుతురు. ఆ మెరుపుకు నా కళ్లు అలవాటు పడడానికి కొన్ని క్షణాలు పట్టింది. గోడలకు ఖరీదైన రాళ్లు, ముత్యాలతో తాపడం చేశారు. ఇత్తడి షాండిలియర్లలో అమర్చిన తెల్ల కొవ్వొత్తులు ఆ గదిలో వెలుగులు విరజిమ్ముతున్నాయి.

పొడవైన నల్లటి కురులతో, నీలం రంగు సూట్ ధరించిన ఓ ఆజానుబాహుడు వచ్చి షేక్‌హాండ్ ఇచ్చాడు. తనని తాను యామిన్‌గా పరిచయం చేసుకున్నాడు. అతని యాసను బట్టి అతనో బ్రిటిష్ స్కూల్‌లో విద్యనభ్యసించిన ఇరానియన్ అని నాకు అనిపించింది. అతన్ని చూస్తే ఏ కోశాన కూడా తీవ్రవాదిలా లేడు.

ఆ రెస్టారెంట్ నిండా జంటలే కనపడ్డాయి నాకు. ఇదేదో ప్రేమికుల రహస్య కార్యకలాపాలకు వేదికలాగుంది. అక్కడ ప్రేమికులం కానివారం మేమిద్దరమే!

యామిన్ నన్ను ఓ మూలన ఉన్న చిన్న గది వంటి దానిలోకి తీసుకెళ్లాడు. ఇక్కడైతే రహస్యంగా మాట్లాడుకోవచ్చని చెప్పాడతను.

యామిన్ నాకు చాలా మర్యాద ఇచ్చాడు. అతను నన్నో ఆర్థిక సలహాదారు అని మాత్రమే అనుకుంటున్నాడు. కానీ నా మొత్తం కార్యకలాపాలు అతనికి తెలియనట్టే అనిపించింది. నేనిదివరకు పీస్ కోర్ స్వచ్ఛంద సంస్థలో పనిచేసిన విషయం అతనికి తెలిసిందట. స్థానిక సంస్కృతుల గురించీ, అక్కడి ప్రజల గురించీ తెలుసుకోవడం నా అభిలాష అని అతను గమనించాడట.

'మీ వృత్తిలో ఉన్న అనేక మందితో పోలిస్తే మీరు చాలా చిన్న వయస్సు వారు' అన్నాడతను.

'మా దేశ చరిత్ర పట్ల, ఇక్కడి సంస్కృతి పట్ల, మా సమస్యల పట్ల మీకు చాలా శ్రద్ధ ఉంది. మీపై మాకు ఎన్నో ఆశలు ఉన్నాయి'.

అతని మాటలు, అతని ఆహార్యం, పక్కన రెస్టారెంట్లో ఉన్న మామూలు ప్రజలు నాకు కొంచెం ధైర్యాన్నిచ్చారు. స్థానికులతో కలిసిపోవడం నాకు అలవాటైన విద్యే. ఇండోనేషియాలో రాసి, పనామాలో ఫిడెల్...

చాలా మంది అమెరికన్లు నాలా ఉండరు. దర్శించిన చాలా ప్రదేశాలతో ప్రేమలో పడిపోయాను నేను. వారి సంస్కృతికి మన కళ్లు, చెవులు, హృదయం తెరచి ఉంచితే స్థానికులు త్వరగా మనకు మంచి నేస్తాలవుతారని నా అనుభవం నాకు నేర్పింది.

'మీకు పుష్పించే ఎడారి ప్రాజెక్ట్ గురించి తెలుసా? మా ఎడారులు ఒకప్పుడు మంచి మైదానాలనీ, పచ్చని అడవులనీ మా షా చక్రవర్తి నమ్ముతాడు. అలెగ్జాండ

దండయాత్ర జరిపినప్పుడు అతని భారీ సైన్యంతో పాటే లక్షల కొద్దీ గొర్రెలు, మేకలు కూడా వెంట వచ్చాయట. అలా వచ్చిన ఆ జీవాలు ఇక్కడ ఆకు మిగల్చకుండా తినేశాయట. పచ్చదనం కనుమరుగవటంతో ఈ ప్రాంతాన్ని కరువు చుట్టుముట్టిందట. అలా అలా ఈ ప్రాంతం అంతా ఎడారిలా మారిందట. ఇప్పుడు షా చెప్పే ఉపాయం ఏమిటో తెలుసా? ఈ ఎడారి అంతా లక్షల కొద్దీ మొక్కలు నాటాలట. అంతే, వర్షాలు కురిసి ఎడారి మళ్లీ పచ్చబడుతుందట'. ఒక క్షణం ఆగి,

'అలా జరగాలంటే మేం మిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టాలనుకోండి'. తరువాత నావేపు ఓరగా చూస్తూ,

'మీ వంటి కంపెనీలకు కాసుల వర్షం కురుస్తుంది' అన్నాడు యామిన్.

'మీరు ఈ సిద్ధాంతాన్ని నమ్ముతున్నట్టు లేరు' అడిగాను నేను.

'ఈ ఎడారి ఒక ప్రతీక. దీన్ని పచ్చగా మార్చడమంటే కేవలం వ్యవసాయం చేసినట్టు కాదు'.

మా టేబిల్ వద్దకు అనేక మంది వెయిటర్లు రకరకాల ఆహారపదార్థాల ట్రేలతో వచ్చారు. మొదలు నా అనుమతి అడిగి వచ్చిన ఆహార పదార్థాల నుండి తనకు నచ్చినవి ఎంచుకున్నాడు యామిన్.

తరువాత నా వేపు తిరిగి,

'ఒక ప్రశ్న అడగడానికి సాహసిస్తున్నా పెర్కిన్స్ గారూ. అమెరికాలో స్థానిక రెడ్ ఇండియన్లను, వారి సంస్కృతిని ఎవరు ధ్వంసం చేశారు?'

దానికి చాలా కారణాలున్నాయని - తరువాత వలస వచ్చిన వారి దురాశ, వారి చేతిలో ఆధునిక ఆయుధాలుండటం అని బదులిచ్చాను నేను.

'అవన్నీ నిజమే. కానీ వాటన్నిటి కన్నా ఎక్కువగా అక్కడి పర్యావరణ విధ్వంసమే దానికి ప్రధాన కారణం'.

అక్కడి అడవులు, స్థానిక బర్రెల వంటి జంతువుల నిర్మూలన, ప్రజలను వారి నివాస స్థలాల నుండి శరణాలయాలకు తరలించడం వల్ల వారి సంస్కృతి సమూలంగా నాశనమవడం గురించి వివరించాడు యామిన్.

'ఇక్కడ కూడా అదే జరుగుతుంది. 'పుష్పించే ఎడారి ప్రాజెక్ట్' మా ఎడారి పర్యావరణాన్ని దెబ్బతీస్తుంది. దాన్ని మేమెలా అనుమతిస్తాం?' ప్రశ్నించాడు అతడు.

'ఇదంతా మీ ప్రజల నుండి వచ్చిన ఆలోచనే అని విన్నానే' అన్నాను నేను.

అతను వ్యంగ్యంగా నవ్వి 'మీ అమెరికన్ ప్రభుత్వమే ఈ ఆలోచనను షా బుర్రలో నాటింది. మా చక్రవర్తి - మీ దేశం చేతిలో కీలుబొమ్మ' అన్నాడు.

'ఒక నిజమైన పర్షియన్ ఇలా ఎన్నటికీ జరగనివ్వడు' హుంకరించాడు చివరికి.

తన జాతి అయిన బెదోయిన్లకూ, ఎడారికీ గల అనుబంధాన్ని గురించి అతడు నాకో సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చాడు. నగరవాసులైన అనేక మంది ఇరానియన్లు ప్రతి ఏటా తమ సెలవు రోజుల్లో కనీసం వారం పాటైనా కుటుంబ సమేతంగా ఎడారిలో పెద్ద గుడారాల్లో ఆనందంగా గడుపుతారనీ అతడు నాకు వివరించాడు.

'మేం ఎడారిలో భాగం అయి జీవిస్తున్నాం. ఆ షా తొత్తులు అలా కాదు'.

ఆ తరువాత అతను నాకు చాలా ఎడారి కథలు చెప్పాడు.

మా భోజనం ముగిశాక గేటు దాకా నన్ను సాగనంపాడు యామిన్.

టాక్సీ ఎక్కేముందు నాకు షేక్‌హేండిస్తూ నన్ను కలిసినందుకు చాలా ఆనందంగా ఉందనీ, నేను చాలా చిన్న వయస్సులోనే ఈ స్థాయికి చేరుకున్న విషయం గుర్తు చేసి నాపై చాలా ఆశలు ఉన్నాయని చెప్పాడు యామిన్.

'మీతో ఇంత సమయం గడిపాక నాకు మిమ్మల్నో చిన్న సాయం అడగాలని ఉంది' అన్నాడు అభ్యర్థనగా.

'ఏం చేయగలను మీ కోసం' అన్నాను టాక్సీలో కూర్చుంటూ.

'నా ప్రియ స్నేహితుడిని ఒకణ్ణి మీకు పరిచయం చేద్దామనుకుంటున్నాను. మా చక్రవర్తి గురించి అతను చాలా విషయాలు చెబుతాడు మీకు. అతన్ని కలిసి మీరు దిగ్భ్రాంతి చెందుతుండొచ్చు కానీ అతనితో గడిపిన సమయం మాత్రం వృథా కాదు'.

అధ్యాయం 19

చిత్రహింసల బాధితుడి కథనం

ఆ అవకాశం చాలా రోజుల తరువాత వచ్చింది. ఒక రోజు యామిన్ నన్ను ఎడారి లోపలికి తీసుకుపోయాడు. టెహరాన్ నుండి బయల్దేరిన మేం దారిలో ఒక పేద పట్టణం దాటాక ఒంటెల బాటలో చాలా సేపు ప్రయాణించాం. సూర్యాస్తమయం అవుతుండగా ఖర్జూర చెట్ల గుంపు మధ్యలో ఉన్న చిన్న మట్టి గుడిసెల వద్ద ఆపాడు కారును.

'ఇదో పాత ఒయాసిస్సు' వివరించాడతను. 'మార్కోపోలో కన్నా కొన్ని శతాబ్దాల కిందటిది' అంటూ ఒక గుడిసెలోకి దారితీశాడు.

'లోపలున్న వ్యక్తి మీ దేశంలోని అత్యున్నత శ్రేణి విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పుచ్చుకున్నాడు. ఆయన వివరాలు గోప్యంగా ఉంచాలి. ప్రస్తుతానికి అతణ్ణి మనం డాక్టర్ అని సంబోధించవచ్చు'.

ఆ చిన్న గదికి కిటికీలే లేవు. ఒక మూలకు చిన్న పీటపై వెలిగించిన బుడ్డీలాంతరు వెలుతురుతో మసకగా ఉందా గది. కొద్ది క్షణాలకు దుమ్ము నేలపై పరచిన పర్షియన్ తివాచీలు నా కంటబడ్డాయి. లీలా మాత్రంగా నా ముందు చక్రాల కుర్చీలో కూర్చున్న ఓ వ్యక్తి ఆకారం. అతను వంటి చుట్టూ శాలువా కప్పుకున్నాడు. తలపాగా వంటిదేదో తలకు చుట్టుకున్నాడు.

యామిన్ నన్ను కింద కూర్చోమని సైగ చేశాడు. తను ఆ ఆకారం వద్దకు వెళ్లి చెవిలో ఏదో గుసగుసలాడి వెనక్కి వచ్చి నా పక్కన కూర్చున్నాడు.

'పెర్కిన్స్ గారికి స్వాగతం'

చాలా నెమ్మదిగా, కరకుగా ఉంది అతని స్వరం.

'నీ ముందు ఉన్నది ఒక చితికిపోయిన మనిషి. కానీ పూర్వం నేను చాలా శక్తివంతుడిగా ఉండేవాడిని. ఇరాన్ చక్రవర్తి - షా కు అత్యంత విశ్వసనీయమైన సలహాదారుడిగా పనిచేసేవాడిని'.

అతని గొంతులో బాధ, లీలా మాత్రంగా...

'ఎంతో మంది ప్రపంచ నాయకులు నాకు వ్యక్తిగతంగా తెలుసు. నిక్సన్, ఐసెన్‌హోవర్, డీగాల్ వంటివారు. ఈ దేశాన్ని పెట్టుబడిదారీ దేశాల సమూహంలో చేర్చే బృహత్ కార్యాన్ని నా భుజాలపైనే మోపారు వారు. షా నన్ను నమ్మాడు...' అతను దగ్గాడు.

నాకేమో అదో నవ్వులా వినపడింది.

'నేను షా ను నమ్మాను. అతని వాగాడంబరం చూసి నేను కూడా ఇరాన్ ముస్లిం ప్రపంచాన్ని ఒక కొత్త శకంలోకి నడిపిస్తుందని నమ్మాను'.

అతని చక్రాల కుర్చీ కిరకిరలాడుతూ ముందుకు కదిలింది. పక్కనుంచి అతని మొహం రేఖామాత్రంగా కనపడుతోంది.

అతని గుబురు గడ్డం...

ఆ పైన... ఏదో వెలితి!

ఆ వెలితి ఏమిటో అర్థం అవగానే వళ్లు జలదరించింది నాకు.

అతనికి ముక్కు లేదు!

అప్రయత్నంగానే నా నోటి నుండి ఓ నిట్టూర్పు.

'చూడడానికి బాగోలేదు కదూ మిస్టర్ పెర్కిన్స్? వెలుతురులో చూస్తే ఇంకా భయానకంగా ఉంటుంది. మీరు నన్నిక్కడ కలిసిన విషయం రహస్యంగా ఉంచాలి. మీరు అర్థం చేసుకోగలరనుకుంటాను. ప్రయత్నిస్తే మీరు నా గురించి తెలుసుకో గలరు. కానీ ఒక వేళ తెలుసుకున్నా నేను అధికారికంగా చనిపోయినట్లు ఉంటుంది రికార్డుల్లో'.

చక్రాల కుర్చీ మళ్లీ యథాస్థానానికి చేరుకుంది కిరకిర శబ్దం చేసుకుంటూ. కళ్ల ముందు నుండి ఆ భయానక రూపం పక్కకు తొలగిపోవడంతో నా మనస్సు కొంచెం తేలికపడింది.

నాకు తరువాత తెలిసింది కొన్ని ఇస్లాం సంస్కృతులలో తమ నాయకులకు కానీ, తమ సంఘానికి కానీ కళంకం తెచ్చిన వ్యక్తులకు విధించే శిక్ష ముక్కు కత్తిరించడం. ఆ విధంగా వాళ్లు జీవితాంతం ముద్రవేయబడతారు.

'మిమ్మల్ని ఇక్కడికి ఎందుకు పిలిచామని మీరు ఆలోచిస్తూ ఉండవచ్చు మిస్టర్ పెర్కిన్స్' చక్రాల కుర్చీలోంచి మళ్లీ మాటలు.

'తనని తాను చక్రవర్తిగా పిలుచుకునే మా షా చాలా దుర్మార్గుడు. అతని తండ్రిని నాజీలతో కుమ్మక్కయ్యాడన్న నెపంతో సిఐఏ సాయంతో మేమే కూలదోశాం. ఇప్పుడు షా, హిట్లర్‌ను తలదన్నేలా తయారయ్యాడు. విచారకరమైన నిజం ఏమిటంటే అతనిదంతా మీ ప్రభుత్వ మద్దతుతోనే చేస్తున్నాడు'.

'అలా ఎందుకు జరుగుతుందంటారు?' ప్రశ్నించాను నేను.

'పశ్చిమాసియాలో అతను మీకున్న ఏకైక నిజమైన స్నేహితుడు. పారిశ్రామిక ప్రపంచాన్ని నడిపే ఇరుసు ఈ ప్రాంతపు చమురే కదా. ఇక్కడే ఇజ్రాయెల్ ఉందనుకోండి కానీ ఆ దేశంలో చమురు లేదాయె. మీ ఎన్నికలకు ఆర్థికసాయం చేసే యూదులను సంతృప్తి పరచడానికి మీరు ఇజ్రాయెల్‌తో మంచి సంబంధాలు కొనసాగిస్తారు. కానీ మీ చమురు కంపెనీలు యూదులకన్నా శక్తివంతమైనవి. వాటికి మేం కావాలి. అందుకే మీరు మా షా అంటే అంత ఇష్టపడతారు'.

'ముస్లిం ప్రపంచం అంతా షా ను ద్వేషిస్తుంది. అరబ్బులే కాదు, ప్రపంచం అంతటా ఉన్న ముస్లింలు - అటు ఇండోనేషియా నుండి ఇటు అమెరికా వరకూ. అంతెందుకు, మా పర్షియన్ ప్రజలెవరూ షా ను మెచ్చరు. అతను ఎక్కువ కాలం కొనసాగుతాడని అనుకోను నేను'.

ఆ తరువాత కుర్చీపై గట్టిగా కొట్టిన శబ్దం.

'షా సైతానుతో సమానం. అతన్ని పర్షియన్లు అందరూ ద్వేషిస్తున్నారు' ఆవేశంగా అన్నాడు చక్రాల కుర్చీలోని వ్యక్తి.

'డాక్టర్ గారికి ఇక్కడి ముల్లాలతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఇక్కడి ముస్లిం మతస్థులలో షా పై తీవ్ర వ్యతిరేకత ఉంది. షా పెట్టుబడిదారీ విధానాల వల్ల లాభపడే గుప్పెడు మందిని వదిలేస్తే అతనికి ప్రజల్లో అసలు మద్దతే లేదు' అన్నాడు యామిన్.

'మీరు చెప్పేది నిజమే కావచ్చు. కానీ నేనిక్కడికి నాలుగు సార్లు వచ్చాను. ప్రజలంతా అతడి పాలనను మెచ్చుకుంటూనే మాట్లాడారు నాతో' అన్నాను నేను.

'మీకు ఫార్సీ భాష రాదు కదూ. ఒకవేళ వచ్చుంటే వీళ్లు మీ వెనకాల మాట్లాడే మాటలకర్థం తెలిసేది. ఇక్కడి మీడియా కూడా చమురు కంపెనీల అధీనంలోనే ఉంది. కాబట్టి వాటి ద్వారా కూడా మీకు నిజమేమిటో తెలియదు' బదులిచ్చాడు యామిన్.

'మా ఉద్దేశ్యం ఏమిటంటే - మీరు ఏదో ఒకటి చేసి మీ కంపెనీని ఒప్పించండి. ఇక్కడేదో చాలా డబ్బులు వెనకేసుకోవచ్చు అని మీ వాళ్లు అనుకుంటున్నారు కానీ ఇదో ఎండమావి. షా ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుంది' అన్నాడు డాక్టర్ కోపంగా.

తెరలు తెరలుగా దగ్గు రావడంతో అతను మాటలు ఆపేశాడు.

'ఇక మనం వెళ్లాలి' అని లేచాడు యామిన్.

వెనక్కి కారులో వస్తుంటే అడిగాను అతణ్ణి ఉండబట్టలేక,

'మీకు మా కంపెనీ అంటే అంత ప్రత్యేక అభిమానం ఎందుకు?'

అతను నవ్వాడు.

'మీలాంటి బహుళజాతి కంపెనీ ఇక్కడ భారీగా నష్టపోతే మాకు చాలా ఆనందం కలుగుతుంది. కానీ మాకిప్పుడు కావలసిందేమిటంటే మీ వంటి పెద్ద కంపెనీ ఇక్కడి నుండి నిష్క్రమించడం. అలాంటి సంఘటన ఒక్కటి జరిగితే షా పతనం ప్రారంభం అవుతుంది. మాకు ఇక్కడ రక్తపాతం జరగడం ఇష్టం లేదు. అందుకే మీ బ్రూనో జాంబొట్టితో మాట్లాడండి. ఇక్కడి నుండి బిచాణా ఎత్తేయండి'.

'కానీ మీరు ఈ విషయం చెప్పడానికి నన్నే ఎందుకు ఎంచుకున్నారు?'

'నిన్న రాత్రి రెస్టారెంట్‌లో కలిసినప్పుడు గమనించాను. మీరు సత్యాన్ని స్వీకరించడానికి సిద్ధంగా కనిపించారు. మీ గురించి మాకు తెలిసిన సమాచారం - మీరు రెండు ప్రపంచాల మధ్య నలిగిపోతున్న వ్యక్తి అని. అది నిజమేనని నాకు అనిపించింది'.

అధ్యాయం 20

ఒక రాజు పతనం

1978లో ఓ సాయంకాలం నేను టెహరాన్‌లోని ఇంటర్ కాంటినెంటల్ హోటల్ లాబీలోని బార్‌లో కూర్చుని ఉన్నాను.

నా భుజంపై ఎవరో తట్టినట్టనిపించింది. వెనక్కి తిరిగి చూద్దును కదా బిజినెస్ సూట్‌లో ఉన్న ఓ భారీ ఇరానీయుడు.

'జాన్ పెర్కిన్స్! గుర్తు పట్టావా నన్ను?'

ఈ పూర్వ ఫుట్‌బాల్ ప్లేయర్ చాలా లావెక్కాడు. కానీ ఆ గొంతు మాత్రం మారలేదు. మిడిల్‌బరీలో నా పాత నేస్తం ఫర్హాద్! పదేళ్లయింది అతణ్ణి చూసి.

వెంటనే లేచి గట్టిగా కౌగిలించుకున్నాను.

కాసేపటిలోనే నాకు అర్థం అయిన విషయమేమిటంటే ఫర్హాద్‌కు నా వృత్తి గురించి మొత్తం తెలుసు. నాకే అతని గురించి ఏమీ చెప్పకుండా తెలివిగా మాట్లాడుతున్నాడు.

'సరే సూటిగా విషయానికి వస్తాను' అన్నాడు రెండో బీర్ తాగుతూ.

రేపు రోమ్ వెళుతున్నాను. మా అమ్మా నాన్నా అక్కడే ఉన్నారు. నీకు కూడా ఒక టిక్కెట్ కొన్నాను. ఇక్కడ పరిస్థితులు బాగోలేవు. ఏ క్షణంలోనైనా ఏదైనా జరగొచ్చు. నువ్వూ వచ్చెయ్' అన్నాడు నాకో విమానం టికెట్ ఇస్తూ.

నాకు అతని మాటలపై వెంటనే నమ్మకం కలిగింది.

* * *

రోమ్ చేరాక ఫర్హాద్ తండ్రి కూడా షా గురించి అదే అభిప్రాయం వెలిబుచ్చాడు. పశ్చిమ ఆసియా అంతటా విస్తరిస్తున్న అమెరికన్ వ్యతిరేకతకు మా ప్రభుత్వ విధానాలే కారణమని అతనన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను.

సరిగ్గా ఇలాంటి విషయాలే ఇరాన్‌లో యామిన్, డాక్టర్ కూడా నాకు చెప్పారు. కానీ ఇప్పుడు షా వద్ద పని చేసిన ఈ మాజీ జనరల్ మాటలు విన్నాక ఇక నాకు ఏ అనుమానమూ లేదు.

ఫర్హాద్ తండ్రి నాకు అప్పుడప్పుడే పైకి వస్తున్న ఇరాన్ అసమ్మతి నేత అయతుల్లా రుహొల్లా ఖొమేనీ గురించి చెప్పాడు.

ఖొమేనీ టెహరాన్ సమీపంలోని ఒక షియా విద్యావంతుల కుటుంబంలో పుట్టాడు. అతని పేరుకు అర్థం 'భగవంతునిచే ప్రేరణ పొందినవాడు' అట.

అతని ఛాందస షియా వాదంతో ఇరాన్ ప్రజల్లో షా కు వ్యతిరేకంగా బాగానే మద్దతు సంపాదించగలిగాడు. 1950లలో అప్పటి ఇరాన్ అధ్యక్షుడు మొస్సాదెగ్‌తో షా తలపడినప్పుడు ఖొమేనీ ఆ సంఘర్షణకు దూరంగా ఉన్నాడు. 1960లకొచ్చేసరికి షా ను ఖొమేనీ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఫలితంగా షా అతణ్ణి టర్కీకి బహిష్కరించాడు. అక్కడి నుండి ఇరాక్‌లోని అల్-నజాఫ్ అనే పట్టణానికి చేరుకున్నాడు ఖొమేనీ. అక్కడే అతను పూర్తిస్థాయి ప్రతిపక్షనేతగా ఎదిగాడు. ప్రవాసంలో ఉంటూనే తన మద్దతుదారులకు ఉత్తరాలు, వ్యాసాలు, టేప్ రికార్డు చేయబడ్డ ఉపన్యాసాల ద్వారా తిరుగుబాటు చేయమని ఉద్బోధించేవాడు.

నేను ఫర్హాద్ తండ్రిని కలిసిన రెండు రోజుల తరువాత ఇరాన్‌లో అల్లర్లు, బాంబు దాడులు మొదలయ్యాయని తెలిసింది నాకు. ఖొమేనీ, ఇంకొందరు ముల్లాలు ఎదురుదాడి ప్రారంభించారు. ఫర్హాద్ తండ్రి వర్ణించినట్టే ఇరాన్‌లో హింసాత్మక ఇస్లాం తిరుగుబాటు జరిగింది. 1979 జనవరిలో పదవీచ్యుతుడైన షా ఈజిప్టుకు పారిపోయాడు. అక్కడే అతనికి క్యాన్సర్ వ్యాధి ఉందని వెల్లడైంది. వైద్యం కొరకు న్యూయార్క్‌లోని ఆసుపత్రిలో చేరాడు.

ఖొమేనీ మద్దతుదారులు షా ను అప్పగించాలని అమెరికాను డిమాండ్ చేశారు. 1979 నవంబర్‌లో టెహరాన్‌లోని అమెరికన్ రాయబార కార్యాలయంపై ఒక మిలిటెంట్ ముస్లిం గుంపు దాడి చేసి యాభై రెండు మంది అమెరికన్ దేశస్థులను బందీలుగా పట్టుకున్నారు. ఈ బందీల ఉదంతం 444 రోజులపాటు కొనసాగింది. అప్పటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీకార్టర్ బందీలను సంప్రదింపుల ద్వారా విడుదల చేయించడానికి ప్రయత్నించాడు. ఆ మార్గం విఫలమవడంతో 1980 ఏప్రిల్‌లో సైనిక దాడికి ఆదేశించాడు. రక్తసిక్తమైన ఆ దాడి కార్టర్ పదవి కోల్పోవడానికి ఒక ముఖ్య కారణమైంది.

అన్ని వర్గాల నుండి తీవ్ర వత్తిడి రావటంతో అమెరికా షా ను దేశం విడిచి వెళ్లవలసిందిగా ఆజ్ఞాపించింది. ఎక్కడికీ వెళ్లే దిక్కులేక అగమ్యగోచరంగా ఉన్న

షా ను ఆపద్బాంధవుడిలా ఆదుకున్నాడు పనామా అధ్యక్షుడు ఒమర్ టోరిజోస్. షా బతికి ఉన్నంతకాలం తన దేశంలో తలదాచుకోవచ్చని ఆహ్వానించాడు.

అమెరికన్ రాయబార కార్యాలయంలో బందీలుగా ఉన్న వారిని విడుదల చేయాలంటే షా ఇరాన్‌కు తిరిగి రావాల్సిందేనని ముల్లాలు డిమాండ్ చేశారు. అప్పటికే ఒమర్ టోరిజోస్‌పై తీవ్ర కోపంతో ఉన్న వాషింగ్టన్ పెద్దలు అతనిపై ఒంటికాలి మీద లేచారు. షా తో కుమ్మక్కై బందీలుగా ఉన్న అమెరికన్ల జీవితాలతో ఒమర్ ఆడుకుంటున్నాడని ఆరోపించింది అమెరికా ప్రభుత్వం. షా ను ఖొమేనీ ప్రభుత్వానికి అప్పగించాలని పనామా అధ్యక్షుడిని కోరింది. గమ్మత్తేమిటంటే కొన్ని నెలల ముందు ఇదే షా ను నిస్సిగ్గుగా సమర్థించింది అమెరికాయే.

చివరికి షా ఈజిప్టుకు తిరిగి వెళ్లాడు. అక్కడే క్యాన్సర్‌తో మరణించాడు.

డాక్టర్ చెప్పినట్టే మా కంపెనీ ఇరాన్‌లో లక్షల కొద్దీ డాలర్లు నష్టపోయింది.

కార్టర్ స్థానంలో రీగన్ - బుష్‌ల ప్రభుత్వం ఏర్పడింది.

ఇరాన్ నాకు ఎన్నో పాఠాలు నేర్పింది.

ప్రపంచ పరిణామాలలో తన నిజరూపాన్ని అమెరికా ఎప్పటికీ దాచాలనే చూస్తుంది. మా నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీకి, సెంట్రల్ ఇంటలిజెన్స్ ఏజెన్సీకి ఇరాన్‌లో ఏం జరుగుతుందో నిజంగా తెలియదనుకోవాలా? తెలిసీ అవి మా అందరి కళ్లు కప్పాయనుకోవాలా?

అధ్యాయం 21

కొలంబియా - లాటిన్ అమెరికాకు గీటురాయి

కొలంబియాలో ఒక భారీ జల విద్యుత్ ప్రాజెక్టుకు రూపకల్పన చేసే బాధ్యత మెయిన్ కంపెనీకి ఇచ్చారు.

దక్షిణ అమెరికా శిరస్సుపై గర్వంగా నిలబడే కొలంబియా భౌగోళికంగా చాలా కీలకమైన ప్రాంతం. ఉత్తర అమెరికా నుండి దక్షిణ అమెరికాను చేరుకోవడానికి మొదటి మెట్టులా ఉన్న కొలంబియా అంటే అమెరికాకు ప్రత్యేక 'అభిమానం'.

కొలంబియా సహజ అందాలతో అలరారే దేశం. ఈత చెట్ల వరుసలతో అటు అట్లాంటిక్, ఇటు పసిఫిక్‌లను ముద్దాడే శోభాయమానమైన బీచ్‌లతో, సమున్నతమైన పర్వత శ్రేణులతో, విశాలమైన పంపా లోయలతో, జీవ వైవిధ్యంతో తులతూగే సతతహరిత అడవులతో కొలంబియా నిజంగా కనులకు విందు.

చారిత్రకంగా కూడా కొలంబియాకు పెద్ద పేరే ఉంది. వలస పాలనలో అనేక స్పానిష్ వలస కాలనీలకు ఇదే ముఖ్యకేంద్రం. అప్పట్లో బంగారంతో నిండిన ఓడలు కొలంబియా రేవు పట్టణమైన కార్తజినా నుండే స్పెయిన్‌కు బయలుదేరేవి. స్వాతంత్ర్య పోరాటకారుడు సైమన్ బొలీవార్ స్పెయిన్ రాజరికపు సైన్యాన్ని ఓడించిన యుద్ధం - బొయాక యుద్ధం - ఈ దేశంలోనే జరిగింది.

ఎంతో మంది ప్రతిభావంతులైన రచయితలను, కళాకారులను, తత్వవేత్తలను, లాటిన్ అమెరికాకు అందించింది కొలంబియా. అక్కడ ఉన్న మాదక ద్రవ్యాల మాఫియా ఒక్కటి వదిలేస్తే, చాలా ఏళ్లుగా కొలంబియా అమెరికాకు మంచి నేస్తం. ఈ దేశానికి అమెరికా చాలా ప్రాముఖ్యత ఇవ్వడానికి భౌగోళిక కారణాలే కాక వాణిజ్య కారణాలు కూడా ఉన్నాయి. అమెరికన్ ప్రజలు కొనే అనేక వస్తువులు - కాఫీ, అరటిపళ్లు, బట్టలు, పచ్చలు, పువ్వులు, నూనెలు, కొకెయిన్- ఇలాంటివన్నీ కొలంబియా నుండే వస్తాయి. అంతేకాదు అమెరికన్ కంపెనీల ఉత్పత్తులు, సేవలు అమ్ముకోవడానికి కొలంబియా ఆకర్షణీయమైన మార్కెట్ కూడా.

ఇరవయ్యో శతాబ్దంలో కొలంబియాకు మేం అమ్మిన అతి పెద్ద సేవలు ఇంజనీరింగ్, నిర్మాణ రంగంలో మాకున్న నైపుణ్యం. మేం ఇదివరకు పనిచేసిన అన్ని చోట్లలానే ఇక్కడ కూడా మా పాత ప్రణాళికలే ఉపయోగిస్తాం. విద్యుత్ గ్రిడ్‌లు, హైవేలు, టెలికమ్యూనికేషన్ల రంగాలలో భారీ పెట్టుబడులు పెట్టాలనీ, తద్వారా దేశంలో గల అపార చమురు, సహజవాయువు నిక్షేపాలు వెలికితీసి అభివృద్ధి పథంలో నడవవచ్చనీ, తద్వారా వచ్చిన ఆదాయంతో ఈ అప్పులు దానిమీద వడ్డీ తీర్చేయవచ్చనేది మేం చెప్పే మామూలు కథ.

కానీ వాస్తవం మరోలా ఉంటుంది. మా వంటి వారు అవసరానికన్నా అధికంగా అప్పు చేయిస్తారు. రెట్టింపు ఆర్థిక అంచనాలు, విద్యుత్ లోడ్ డిమాండ్ అంచనాలు రూపొందించి మా పని నెరవేర్చుకుంటాం.

1970లలో కొలంబియాలో మా కంపెనీకి అనేక మౌలిక వసతుల రూపకల్పన కాంట్రాక్టులు దక్కాయి.

ఒక భారీ జల విద్యుత్ వ్యవస్థ కూడా మాకు దక్కింది. ప్రాజెక్టు స్థాపించడం, ఎక్కడో కొండలు, అడవుల్లోని ప్రాజెక్టు స్థలం నుండి పట్టణాల వరకూ ఈ విద్యుత్‌ను చేరవేసే సరఫరా లైన్లు నిర్మించడం మా కాంట్రాక్టులో భాగం.

తీర పట్టణమైన బారన్ ఖిల్లాలో నాకు ఆఫీసు వసతి ఇవ్వబడింది. 1977లో ఈ నగరంలోనే నాకు ఒక అందమైన కొలంబియన్ యువతి పరిచయమైంది. ఆ పరిచయం నా జీవితాన్ని మలుపు తిప్పింది.

పౌలాకు పొడవైన కురులు, ఆకట్టుకునే ఆకుపచ్చని కళ్లూ ఉండేవి. తన తల్లిదండ్రులు ఉత్తర ఇటలీ నుండి వలసవచ్చారు. పూర్వీకుల సంప్రదాయాన్ని నిలబెడుతూ, తను కూడా ఒక ఫ్యాషన్ డిజైనర్ అయ్యింది. ఒకడుగు ముందుకు వేసి తను చేసిన డిజైన్లు దుస్తులుగా మార్చి అమ్మేందుకు ఒక చిన్న ఫ్యాక్టరీ కూడా మొదలుపెట్టింది. కొలంబియాలోనే కాక పొరుగున ఉన్న పనామా, వెనిజులా లోని పెద్ద పట్టణాలలోని బొటిక్‌లలో ఈ దుస్తులు అమ్మేది పౌలా.

జీవితం మన అధీనంలో లేని కొన్ని యాదృచ్ఛిక ఘటనల సమాహారం. న్యూ హాంప్‌షైర్ స్కూల్‌లో నా చదువు, ఆన్‌ను, అంకుల్ ఫ్రాంక్‌ను కలవడం, వియత్నాం యుద్ధం, ఐనార్ గ్రేవ్‌ను కలవడం - ఇవన్నీ నా జీవితంలోని యాదృచ్ఛిక ఘటనలు. అయితే ప్రతి యాదృచ్ఛిక ఘటనలోనూ మనకు నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఏర్పడుతుంది. మన భవిష్యత్ జీవితం అలా తీసుకున్న నిర్ణయాల ఫలితమే.

స్కూల్ చదువుల్లో బాగా రాణించడం, ఆన్‌ను పెళ్లి చేసుకోవడం, పీస్ కోర్‌లో చేరడం, ఎకనామిక్ హిట్‌మాన్‌గా మారడం - ఇవన్నీ నా నిర్ణయాల ఫలితమే. అవే నన్నిక్కడికి చేర్చాయి.

ఇప్పుడు పౌలాతో పరిచయం కూడా అటువంటి ఒక యాదృచ్ఛిక ఘటన. తన ప్రభావంతో నేను తీసుకోబోయే నిర్ణయాలు నా జీవిత గమనాన్ని మారుస్తాయి. తనని కలిసేంత వరకూ నేను ఇప్పుడున్న వ్యవస్థతో కలిసినడిచాను. చాలాసార్లు నన్ను నేను ప్రశ్నించుకునే వాడిని. చాలాసార్లు అపరాధ భావన నన్ను వెన్నాడేది. కానీ ఎప్పటికప్పుడు ఏదో హేతువు నన్ను ఈ వ్యవస్థతో కట్టిపడేసేది. పౌలా నాకు సరైన సమయంలోనే కలిసింది.

నన్ను ఎకనామిక్ హిట్‌మాన్‌గా మార్చిన క్లాడిన్, ఇప్పుడు నన్ను ఆత్మశోధన చేసుకొమ్మని పురికొల్పిన పౌలా - ఇద్దరూ స్త్రీలే!

అధ్యాయం 22

అమెరికన్ రిపబ్లిక్ - గ్లోబల్ సామ్రాజ్యం

'నేను నీతో నిర్మొహమాటంగా మాట్లాడదల్చుకున్నాను' అంది పౌలా ఒక రోజు మేం కాఫీషాప్‌లో కూర్చొనుండగా.

'మీరు ఆనకట్ట కడుతున్న నది ఒడ్డున నివసిస్తున్న రెడ్ ఇండియన్లూ, రైతులూ మిమ్మల్ని ద్వేషిస్తున్నారు. నగరాల్లో నివసిస్తున్న ప్రజలు కూడా మీ కంపెనీ క్యాంపులపై దాడిచేస్తున్న గెరిల్లాల పట్ల సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. మీ ప్రభుత్వం వీళ్లని కమ్యూనిస్టులనీ, టెర్రరిస్టులనీ, స్మగ్లర్లనీ అంటుంది. కానీ వాస్తవం ఏమిటంటే వాళ్లు మామూలు ప్రజానీకం. మీ కంపెనీ నాశనం చేస్తున్న భూములపై నివసిస్తున్నవారు'.

కొద్దిసేపటి క్రితమే నేనామెకు మాన్యుల్ టోరిస్ అనే మా కంపెనీ ఉద్యోగి గురించి చెప్పాను. అతను మెయిన్‌లో పనిచేస్తున్న ఒక ఇంజనీరు. మేం కడుతున్న జల విద్యుత్ ఆనకట్ట వద్ద విధి నిర్వహణలో ఉండగా అతనిపై కొద్దిమంది గెరిల్లాలు దాడి చేశారు. టోరిస్ కొలంబియా దేశస్థుడు. అమెరికా సాధారణంగా తన పౌరులను ఇటువంటి ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేయడానికి అనుమతినివ్వదు. అందుకే చాలా చోట్ల మేం స్థానికులను తీసుకుంటాం. వీరి ప్రాణాలు విలువలేనివని మా దేశం అభిప్రాయం.

'వచ్చినవాళ్లు ఎకె-47 తుపాకీతో గాల్లోకి, ఇతని కాళ్లకేసి గురి చూసి కాల్చారట. నాకు చెప్పేప్పుడు నిదానంగానే ఉన్నాడు కానీ, సంఘటన జరిగినప్పుడు బాగా భయపడ్డట్లున్నాడు. వచ్చినవాళ్లు ఎవర్నీ చంపలేదు. కేవలం ఒక ఉత్తరం అందించి, ఉద్యోగులందర్నీ ఒక పడవ ఎక్కించి వెనక్కి పంపారు'.

'పాపం. చాలా భయపడ్డట్టున్నాడు' అంది పౌలా.

'నేను మాన్యుల్ టోరిస్‌ను అడిగాను వచ్చినవాళ్లు ఎఫ్ఎఆర్‌సి కి చెందిన వాళ్లా, ఎం-19 చెందిన వాళ్లా అని. అవి రెండూ కొలంబియాకు చెందిన గెరిల్లా గ్రూపులు.'

అతను ఇవి రెండూ కావన్నాడు.

అతను తెచ్చిన ఉత్తరాన్ని పౌలా పైకి చదివి వినిపించింది.

'మా మనుగడ కోసం కష్టం చేసుకుని బతుకుతున్న మేం మా పూర్వీకుల రక్తంపై ఆన చేసి చెబుతున్నాం. మా నదులపై ఎన్నటికీ ఆనకట్టలు కట్టనివ్వం. మేం సాధారణ రెడ్ ఇండియన్, మెస్టిజో తెగలకు చెందినవారం. మా భూములు ముంపుకు గురికాకుండా మా ప్రాణాలయినా ఒడ్డి రక్షించుకుంటాం. మా కొలంబియన్ తమ్ముళ్లకు ఈ నిర్మాణ కంపెనీల్లో ఉద్యోగం చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం'.

'ఇది చదివి మీరేమన్నారు?' అడిగింది పౌలా.

'నాకింకో మార్గం లేకపోయింది. కంపెనీ విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత నాపైన ఉంది' అన్నాను నేను.

'ఊ.. తరవాత ఏం చేశారు?' మళ్లీ అడిగింది తను.

'నేను ఆగ్రహంగా టేబిల్‌పై చరిచి అతగాడిని బెదిరించాను. ఎకె-47లు పట్టుకునే రైతులు ఎక్కడయినా ఉంటారా? ఈ ఉత్తరం చూస్తే నీకు రైతులు రాసినట్టు అనిపిస్తుందా? అయినా నీకు ఎకె-47 తయారు చేసిందెవరో తెలుసా అని అడిగాను'.

'అతనేమన్నాడు?'.

'ఒక రష్యన్ జాతీయుడని బదులిచ్చాడు. అవున్నిజమే అదొక రష్యన్ కమ్యూనిస్టు తయారు చేసిన ఆయుధం. వచ్చినవాళ్లెవరూ రైతులు కారు. వాళ్లంతా కమ్యూనిస్టులు అని చెప్పాను అతగాడికి'. 'నువ్వు నమ్ముతున్నావా ఈ కథని' సూటిగా అడిగింది పౌలా.

ఏమని చెప్పను నేను? నా దగ్గర జవాబు ఉందా ఆ ప్రశ్నకి?

గెరిల్లాలు దాడి చేసినప్పుడు నేనక్కడే ఉండాల్సింది. కనీసం గెరిల్లాల్లో ఒకడిగానయినా నేను ఉండాల్సింది. నమ్మిన ఆశయాల కోసం నిలబడ్డారు వాళ్లు. నిజమైన ప్రపంచాలను ఎంచుకున్నారు వాళ్లు.

రెండు ప్రపంచాల మధ్య ఊగిసలాడుతున్నాను నేను!

'నా ఉద్యోగ ధర్మం నిర్వర్తించాలి కదా' సమర్థించుకున్నాను.

తను మంద్రంగా నవ్వింది.

నేను సిగ్గుపడ్డాను.

'రోజు రోజుకీ నాకీ ఉద్యోగం మీద విరక్తి కలుగుతోంది' అన్నాను మెల్లిగా.

'ఏం చేద్దామనుకుంటున్నావు ఇప్పుడు?' అడిగింది తను.

బదులివ్వలేకపోయాను. నన్ను నేను సమర్థించుకోవడానికి ఏవో కుంటిసాకులు చెప్పాను.

ఇందులో ఉంటూనే ప్రజలకు నాకు సాధ్యమైనంత మంచి చేద్దామని ప్రయత్నిస్తున్నాననీ, వ్యవస్థను లోపలి నుండి మార్చేందుకు ప్రయత్నిస్తున్నాననీ, ఈ పని నేను వదిలేస్తే నాకంటే క్రూరంగా చేసే వాళ్లెవరయినా దీన్ని చేపడతారనీ... కానీ పౌలా కళ్లలోకి చూస్తే ఇదేదీ తను నమ్ముతున్నట్టు లేదు. తన సంగతి వదిలెయ్యండి. నా అంతరాత్మ ఇదేదీ నమ్మడంలేదు.

తను నాకు కనువిప్పు కలిగించింది. తప్పు నా ఉద్యోగానిది కాదు. నాదే!

'నువ్వేమనుకుంటున్నావ్?' ఎదురు ప్రశ్నించాను.

టేబిల్‌పై స్పూన్ చేతిలోకి తీసుకుని దాన్ని పరిశీలిస్తూ 'నాకు తెలుసు ఈ గెరిల్లాలలో కొద్దిమంది రష్యా, చైనాల్లో శిక్షణ తీసుకుని ఉంటారు'.

ఆ స్పూన్‌తో తన కాఫీని కలుపుకుని మెల్లిగా ఆ స్పూన్‌ను నాలికతో నాకింది తను.

'వాళ్లకు గత్యంతరం ఏం ఉంది కనుక? మీ స్కూళ్లలో శిక్షణ పొందిన సైనికులను ఎదుర్కోవాలంటే ఆధునిక ఆయుధాలు ఉపయోగించడం నేర్చుకోవాలి కదా. కొన్నిసార్లు వాళ్ల తుపాకులు కొనుక్కోవడానికి కొకైన్ కూడా అమ్ముతారు. లేకుంటే ఆయుధాలు కొనుక్కోవడానికి డబ్బు ఎక్కడి నుండి తేగలరు ? శత్రువేమీ చిన్నవాడు కాదే. మీ ప్రపంచబ్యాంక్ వీళ్లకు ఏమన్నా రక్షణ కల్పిస్తుందా! అదే కదా వీళ్లకు ఆ గతి పట్టించింది'.

కాఫీ కొంచెం తాగి...

'వాళ్ల లక్ష్యం న్యాయమైనదే అని నేను నమ్ముతాను. విద్యుచ్ఛక్తి కొద్ది మంది ధనికులైన కొలంబియన్లకే ఉపయోగపడుతుంది. కానీ మీరా ఆనకట్ట కట్టాక జరిగే కాలుష్యం వల్ల వేలాది మంది మరణిస్తారు'.

మమ్మల్ని వ్యతిరేకిస్తున్న ఆ గెరిల్లాల పట్ల పౌలా చూపుతున్న సానుభూతి నాకు రోమాలు నిక్కబొడుచుకునేలా చేసింది.

'ఈ గెరిల్లాల గురించి నీకంత సమాచారమెక్కడిది?' అడగనైతే అడిగాను కానీ దీనికి జవాబు తెలుసుకోకూడదనే నా మనస్సు కోరుకుంటోంది.

'నేను వారిలో కొద్దిమందితో కలిసి చదువుకున్నాను' అంది. కాసేపాగి కప్పును పక్కకి జరుపుతూ - 'మా తమ్ముడు ఉద్యమంలో చేరాడు' అంది.

నా మనసు గాలి తీసేసిన బుడగలా అయిపోయింది.

'మరి నాకెప్పుడూ చెప్పలేదేమిటి?'

'అనవసరమనిపించింది. అయినా అదేమీ గొప్పలు చెప్పుకునే విషయం కాదు గదా'. క్షణమాగి, 'రెండేళ్లయింది అతన్ని చూసి. చాలా జాగ్రత్తగా ఉండాలి తను'

'అతను బతికే ఉన్నాడని నీకెలా తెలుసు?'

'తెలియదు. ప్రభుత్వం వారు కావాలని వెతుకుతున్న జాబితాలో వాడి పేరుంది. అదో శుభసూచకం.'

'అతను గెరిల్లాలలో ఎలా కలిశాడు?' అడిగాను కుతూహలంగా. కాఫీ కప్పుపై నుండి దృష్టి మరల్చకుండా.

'ఓక్సిడెంటల్ అని ఒక చమురు కంపెనీ ఎదురుగా ప్రదర్శనల్లో పాల్గొన్నాడు వాడు. అంతరించిపోతున్న అరుదైన తెగ నివసించే ప్రాంతాలలో చమురు కోసం కంపెనీ డ్రిల్లింగ్ జరుపుతున్నందుకు నిరసన ప్రకటించారు వాళ్లు. ఆ పని చేసినందుకు వీడితో కలిపి మరో పాతిక మందిని సైన్యం అరెస్ట్ చేసింది. చితగ్కొట్టి చీకటి కొట్లలో బంధించారు. వీళ్లు చేసిన నేరం - ఆ కంపెనీ గేటు బైట నిలబడి చేతిలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు ఇవ్వడమే'.

కిటికీలోంచి బైటికి చూస్తూ 'ఆర్నెళ్లు జైల్లోనే ఉన్నాడు వాడు. అక్కడ ఏం జరిగిందో మాకు ఏమీ చెప్పలేదు. కానీ మనిషిలో మాత్రం చాలా మార్పు వచ్చింది'.

* * *

నేను, పౌలా తరచూ ఇటువంటి విషయాలను చర్చించుకునేవాళ్లం. నా మదిలో రేగుతున్న కల్లోలం అంతకంతకూ పెరగసాగింది. పౌలా సాన్నిహిత్యం నాలో కొత్త ఆలోచనలకు బీజం వేసింది.

కొలంబియాలో ఉన్నప్పుడే నాకు పాత అమెరికన్ రిపబ్లిక్‌కు, కొత్త గ్లోబల్ సామ్రాజ్యవాద రాజ్యానికీ తేడా తెలిసింది. రిపబ్లిక్ ప్రపంచానికో కొత్త ఆశను కల్పించింది. దాని పునాదులు నైతికత, తాత్వికతపై ఆధారపడి ఉన్నవి - భౌతికవాదంపై కాదు. రిపబ్లిక్ సమానత్వం, సమన్యాయం అనే సిద్ధాంతాలపై నిలబడింది. పేదవారిని అక్కున జేర్చుకునే మానవ ముఖం ఉన్నది దానికి. అది ఎంతో మందికి ఉత్తేజాన్నిచ్చింది. అవసరమైతే రెండో ప్రపంచయుద్ధంలో చేసినట్టు నిర్ణాయకమైన పాత్రను పోషించేది పాత అమెరికన్ రిపబ్లిక్.

గ్లోబల్ సామ్రాజ్యవాద అమెరికా, రిపబ్లిక్ అమెరికా పతన ఫలితం. ఇది వ్యక్తిగత, స్వార్థ, దురాశాపర, భౌతికవాద వ్యవస్థ. ఇది వాణిజ్యంపై ఆధారపడ్డ వ్యవస్థ. పాతకాలపు సామ్రాజ్యాల వలె ఇది కంటికి కనపడ్డ వనరులను కడుపులో కుక్కుకోవడానికి ప్రయత్నిస్తుంది. డబ్బు, అధికారం కోసం ఏ గడ్డి కరవడానికయినా ఇది సిద్ధం.

* * *

నేను అమెరికన్ రిపబ్లిక్‌కు విశ్వాసపాత్రుడినే, కానీ ఇప్పుడు మేం చేస్తున్న పని సామ్రాజ్యవాదాన్ని విస్తరించడమే. ఇది ఒకరకంగా వియత్నాంలో సైన్యం ద్వారా మేం చేయాలనుకున్న పనే. ఆ ఉదంతం మాకు సైన్యానికున్న పరిమితులను తెలియజెప్పింది. అందుకే మా ఆర్థికవేత్తలు ఈ మెరుగైన ఉపాయాన్ని కనిపెట్టారు. విదేశీ ద్రవ్యసంస్థలు, బహుళజాతి కార్పొరేషన్లు ఈ ఉపాయంలో భాగస్వాములై చాలా చక్కగా దాన్ని అమలు జరుపుతున్నారు.

భూగోళంపై ప్రతి ఖండంలో అమెరికాకు చెందిన బహుళజాతి కార్పొరేషన్లకు పనిచేస్తున్న యువతీయువకులు తమకు తెలియకుండానే ఒక భారీ అంతర్జాతీయ కుట్రలో భాగస్వాములవుతున్నారు. మెయిన్‌లో పని చేసే ఇంజనీర్ల వలె వీళ్లకి కూడా తమ పనుల పర్యవసానం ఏమిటో తెలియదు. బూట్లు, వాహనాల విడిభాగాలు తయారుచేసే కార్ఖానాలు, ఫ్యాక్టరీలు ఆయా దేశాల్లో పేదరికాన్ని రూపుమాపుతున్నాయనుకుంటున్నారు వీళ్లు. కానీ అవి పాతకాలపు బానిస వ్యవస్థను తిరిగి సృష్టిస్తున్నాయని అర్థం చేసుకోవట్లేదు. ఇలాంటి కార్ఖానాల్లో పని చేస్తున్నవారు కూడా పాతకాలపు బానిసల్లాగే తమ వారికంటే తామే మెరుగైన జీవితాన్ని గడుపుతున్నామని అనుకుంటున్నారు.

మెయిన్‌లో నేను కొనసాగాలా వద్దా అనే ప్రశ్న రోజు రోజుకీ తీవ్రమవుతోంది. నా అంతరాత్మ నన్ను దీంట్లోంచి బయటపడమంటోంది కానీ నా బిజినెస్ స్కూల్ వ్యక్తిత్వం మాత్రం ఒప్పుకోవడం లేదు. నా సొంత సామ్రాజ్యం కూడా భారీగా విస్తరించింది ఇప్పుడు. ఎంతో మంది ఉద్యోగులు, ఎన్నో దేశాల్లో కాంట్రాక్టులు, షేర్లు, నా అహాన్ని బాగా పెంచాయి.

అప్పుడప్పుడు క్లాడిన్ చెప్పిన మాటలు గుర్తొచ్చి భయమేసేది.

పౌలా వెక్కిరించేది, 'తనేమయినా చూడొచ్చిందా' అని.

'నీకు అసంతృప్తిగా అనిపించి నువ్వు వదిలేస్తున్నావ్. క్లాడిన్ అంతకంటే ఎక్కువ హాని ఏం చేయగలదు?'

నేనూ, పౌలా ఒక రోజు బీచ్‌లో నడుస్తున్నాం. అది పురాతన కార్తజినా నగరం ఒడ్డున ఉన్న బీచ్. ఎందరో సముద్రపు దొంగల దాడులను చవిచూసిందా పురాతన నగరం.

అకస్మాత్తుగా పౌలాకు ఓ కొత్త ఆలోచన వచ్చింది.

'నువ్వు ఉద్యోగం మానేసి నోరు మెదపకుండా ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు కదా?' అంది.

'నిజమే' అన్నాను నేను.

'నిన్ను కదిలిస్తే వారికే ప్రమాదమనీ, చాలా రచ్చవుతుందనీ వాళ్లకు అర్థమయ్యేలా ప్రవర్తించు చాలు. వాళ్లు నీ మానాన నిన్ను వదిలేస్తారు'.

ఇదేదో మంచి ఆలోచన లాగే ఉంది. నేను ఉద్యోగం మానేస్తాను. ఇన్నాళ్లు నేను చేసిన చీకటి వ్యవహారాల గురించి ఎలాంటి సమాచారమూ బైటికి రానివ్వను, అంటే పుస్తకాలు రాయడం లాంటివి చేయను. మళ్లీ పెళ్లి చేసుకుంటాను. నా శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా, దేశాలు తిరుగుతూ గడుపుతాను...

ఏదో ఒకటి చేసి దీంట్లోంచి బైటపడాలి.

అధ్యాయం 23

నా మోసపూరిత బయోడేటా

నేను కొలంబియాలో ఉండగానే మెయిన్ అధ్యక్షుడు జేక్ డాబర్ పదవీ విరమణ చేశాడని తెలిసింది. అతని స్థానంలో బ్రూనో జాంబొట్టిని అధ్యక్షుడిగా నియమించాడు మా సీఈవో మెక్‌హాల్. మా బాస్‌కు పదోన్నతి లభించడంతో నాకు కూడా త్వరలోనే ఏదో మంచి పదవి లభించబోతున్నదని మా కంపెనీలో జోరుగా ప్రచారం జరిగింది.

జరుగుతున్న ఈ మార్పులు నా బయోడేటాను ఒకసారి చూసుకునేలా పురికొల్పాయి. పౌలా సలహా ప్రకారం స్పానిష్ భాషలో ఉన్న నా బయోడేటా చదివి హతాశుడనయ్యాను. బోస్టన్ తిరిగి రాగానే దాని ఇంగ్లీషు ప్రతిని కూడా చదివాను.

ఒకప్పుడయితే నా బయోడేటాను చూసుకుని చాలా గర్వపడేవాడిని. కానీ ఇప్పుడు మాత్రం అది నాలో తీవ్ర ఆగ్రహాన్ని, మానసిక ఆందోళనను కలగజేసింది. అందులోని వివరాలు అబద్ధాలు కావు. కానీ మోసపూరితమైన అర్థసత్యాలు. సమకాలీన వాస్తవాలను ప్రతిబింబిస్తూ, గ్లోబల్ సామ్రాజ్యవాద పురోగమన పథాన్ని ఆవిష్కరిస్తుంది ఈ బయోడేటా. సత్యాలు బహిర్గతం కాకుండా వాటికో అందమైన ముసుగు తొడిగే ఒక వ్యూహానికి నిదర్శనం ఇది.

పైకి చూస్తే చాలా అమాయకంగా కనబడుతోంది నా బయోడేటా. అమెరికా, ఆసియా, లాటిన్ అమెరికా, పశ్చిమాసియాలలో నేను పర్యవేక్షించిన వివిధ భారీ ప్రాజెక్టుల పూర్తి చిట్టా దానిలో ఇచ్చారు. అభివృద్ధి వ్యూహాలు, ఆర్థిక ప్రగతి నివేదికలు, విద్యుత్ డిమాండ్ అంచనాలు వంటివి తయారు చేయడం గురించి వివరించారు. ఈక్వెడార్‌లో పీస్ కోర్ కొరకు నేను చేసిన పనిని కూడా ప్రస్తావించారు. కానీ నేను ఇటుకలు తయారు చేసే నిరక్షరాస్యులైన ఆండియన్ తెగవాసుల సహకార సంఘానికి చేసిన పనిని కాస్తా ఏదో నిర్మాణ సామాగ్రి తయారీ సంస్థకు పనిచేసినట్లు తిరగ రాశారు.

దాని తర్వాత నేనిప్పటి వరకు పనిచేసిన నా క్లయింట్ల వివరాలు ఉన్నాయి. ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ (ప్రపంచబ్యాంక్),

ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, కువైట్ ప్రభుత్వం, ఇరాన్ ఇంధనశాఖ, సౌదీ అరేబియాకు చెందిన అరేబియన్ - అమెరికన్ ఆయిల్ కంపెనీ, ఇన్‌స్టిట్యూట్ డి రెకర్సోస్ హైడ్రాలికోస్ ఎలక్ట్రిఫికేసియోన్ - పనామా, పెరుసహాన్ ఉముమ్ లిస్ట్రిక్ నెగారా - ఇండొనేషియా వంటివి. అయితే ఈ చిట్టాలో నా దృష్టిని ఆకర్షించింది మాత్రం ఇది: యు.ఎస్. ట్రెజరీ డిపార్ట్‌మెంట్, కింగ్‌డమ్ ఆఫ్ సౌదీ అరేబియా. అసలిటువంటి వివరం నా బయోడేటాలోకి ఎక్కడం నన్ను ఆశ్చర్యపరచింది.

ఇందులో చెప్పినవేవీ పచ్చి అబద్ధాలు కావు. నేను నిజంగా చేసిన పనులే రాశారు కానీ, నిజాలను వక్రీకరించి - శుద్ధి చేసి రాశారు. అధికారిక పత్రాలను పూజ్యనీయంగా భావించే వ్యవస్థలలో ఇదో హానికరమైన ఎత్తుగడ. అబద్ధాలను ఖండించవచ్చు - కానీ పలుచటి వాస్తవాలపై అల్లిన ఈ అందమైన అబద్ధాలను ఏం చేయగలం? ఎంతో ప్రతిష్ఠ కలిగిన బహుళజాతి కార్పొరేషన్ ఇటువంటి పత్రం తయారు చేసింది.

ఈ బయోడేటా నన్నో సమర్థుడైన ఆర్థిక నిపుణునిగా, ఒక ప్రఖ్యాత కన్సల్టింగ్ సంస్థలో శాఖాధిపతిగా చూపెడుతోంది. ప్రపంచాన్ని మరింత నాగరికంగా, మరింత సమృద్ధిగా మార్చేందుకు రకరకాల పరిశోధనలు చేస్తూ భూ మండలాన్ని చుట్టేస్తున్న వ్యక్తిగా ఆ పత్రం నన్ను నిలబెడుతోంది. అయితే అందులో రాసిన దానితో నాకు పెద్దగా పేచీ లేదు. సమస్యల్లా అందులో రాయని దానితోనే. ఆ రాయని విషయాలే ఎన్నో ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. ఉదాహరణకు నన్ను అమెరికా నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ (ఎన్ఎస్ఏ) నియమించినట్టు ఎక్కడా లేదు, ఐనార్ గ్రేవ్ కు అమెరికా సైన్యంతోను, ఎన్ఎస్ఏ తో ఉన్న సంబంధాల గురించి ప్రస్తావన లేదు. నేను తయారు చేసిన ఆర్థిక ప్రగతి నివేదికలు చాలా హెచ్చు స్థాయిలో ఉన్నాయని, ఇండొనేషియా, పనామా వంటి దేశాలకు నేను ఇప్పిస్తున్న అప్పులు ఆ దేశాలు ఎన్నటికీ తీర్చలేవని మీకు నా బయోడేటా చెప్పదు. హోవార్డ్ పార్కర్ వంటి నిజాయితీ గల వ్యక్తులు చేయడానికి ఇష్టపడని పని - మోసపూరితమైన నివేదికలు తయారు చేయడం - నేను చేస్తున్న విషయం నా బయోడేటా చదివితే తెలియదు.

అన్నిటికన్నా ఆశ్చర్యకరమైన సంగతి నా క్లయింట్ల జాబితాలో ఉన్న అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ - సౌదీ అరేబియాల విషయం. అసలు అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌కు సౌదీ అరేబియాకు సంబంధం ఏమిటి? కొంత మంది ఇదేదో అచ్చు తప్పు అనుకుంటుండవచ్చు. రెండు లైన్లలో విడివిడిగా రాయాల్సిన దానిని ఒకే లైనులో రాశారని అనుకోవచ్చు. కానీ ఎవరూ దాని వెనకున్న నిజాన్ని తెలుసుకోలేరు. ప్రపంచ చరిత్రగతిని మార్చివేసిన ఆ ఒప్పందాన్ని కుదిర్చిన బృందంలో నేను సభ్యుడిగా ఉన్నానని 'లోపలి వాళ్లకు' తెలియజెప్పేందుకే ఆ వివరం అక్కడ ఇచ్చారు. అమెరికాకు

JOHN M. PERKINS



EXPERIENCE

John M. Perkins is Manager of the Economics Department of the Power and Environmental Systems Division.

Since joining MAIN, Mr. Perkins has been in charge of major projects in the United States, Asia, Latin America and the Middle East. This work has included development planning, economic forecasting, energy demand forecasting, marketing studies, plant siting, fuel allocation analysis, economic feasibility studies, environmental and economic impact studies, investment planning and management consulting. In addition, many projects have involved training clients in the use of techniques developed by Mr. Perkins and his staff.

Recently Mr. Perkins has been in charge of a project to design computer program packages for 1) projecting energy demand and quantifying the relationships between economic development and energy production, 2) evaluating environmental and socio-economic impacts of projects, and 3) applying Markov and econometric models to national and regional economic planning.

Prior to joining MAIN, Mr. Perkins spent three years in Ecuador conducting marketing studies and organizing and managing a construction materials company. He also conducted studies of the feasibility of organizing credit and savings cooperatives throughout Ecuador.

EDUCATION

Bachelor of Arts in Business Administration
Boston University
Post Graduate Studies:
Model Building, Engineering Economics,
Econometrics, Probability Methods

LANGUAGES

English, Spanish

PROFESSIONAL AFFILIATIONS

American Economic Association
Society for International Development

PUBLICATIONS

"A Markov Process Applied to Forecasting the Demand for Electricity"
"A Macro Approach to Energy Forecasting"
"A Model for Describing the Direct and Indirect Interrelationships between the Economy and the Environment"
"Electric Energy from Interconnected Systems"
"Markov Method Applied to Planning"

CREDENTIALS

Forecasting Studies
Marketing Studies
Feasibility Studies
Site Selection Studies
Economic Impact Studies
Investment Planning
Fuel Supply Studies
Economic Development Planning
Training Programs
Project Management
Allocation Planning
Management Consulting

Clients served:

- Arabian-American Oil Company, Saudi Arabia
- Asian Development Bank
- Boise Cascade Corporation
- City Service Corporation
- Dayton Power & Light Company
- General Electric Company
- Government of Kuwait
- Instituto de Recursos Hidraulicos y Electrificacion, Panama
- Inter-American Development Bank
- International Bank for Reconstruction and Development
- Ministry of Energy, Iran
- New York Times
- Power Authority of the State of New York
- Perusahaan Umum Listrik Negara, Indonesia
- South Carolina Electric and Gas Company
- Technical Association of the Pulp and Paper Industry
- Union Camp Corporation
- U.S. Treasury Dept., Kingdom of Saudi Arabia

కలకాలం చమురు లభించేటట్టూ, సౌదీ రాజ్యంలో అక్కడి రాజ కుటుంబీకుల పాలన ఎల్లకాలం కొనసాగేటట్టూ తద్వారా ఒసామా బిన్ లాడెన్‌కు ఆర్థిక సాయం అందేటట్టూ, ఈదీ అమీన్ వంటి నరరూప రాక్షసులకు రక్షణ కల్పించేటట్టూ ఏకకాలంలో చేయగలిగిన ఆ ఒప్పందాన్ని కుదర్చటంలో నేను సాయపడ్డాను. తెలిసిన వాళ్లకు ఆ ఒక్క వాక్యం చాలు - నా శక్తి సామర్థ్యాలేమిటో అర్థం చేసుకోవటానికి.

ఆఫీసులో తిరుగాడేటప్పుడు నా కింద పని చేసే ఉద్యోగులను చూస్తే నాకు అపరాధ భావం కలిగేది. వారి జీవితాలను నేను మార్చేసిన విధానం... మేమందరం కలిసి ప్రపంచంలో పేదలకు, ధనికులకు మధ్య అంతరాన్ని పెంచిన తీరు... ఓ వంక తినడానికి తిండి లేక మలమలమాడే అభాగ్యులు, మరోవైపు ఫైవ్‌స్టార్ హోటళ్లలో తిని తిరిగే మేము...

నేను శిక్షణ ఇచ్చి ఎకనామిక్ హిట్‌మెన్‌గా మార్చిన వారి గురించి ఆలోచిస్తే - అప్పటికీ ఇప్పటికీ పరిస్థితిలో ఎంత తేడా! ఇప్పుడు ప్రపంచం చాలా మారిపోయింది. కార్పొరేట్‌స్వామ్యం ఎంతో ముందడుగు వేసింది. నా కింద పని చేసేవారు నాకంటే ఎంతో భిన్నమైన వారు. నాలాగా వారిని నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ పరీక్షలు పెట్టి నియమించలేదు. వారి జీవితాల్లో క్లాడిన్ వంటి శిక్షకులు లేరు. వారికి ఉద్యోగ బాధ్యతలు ఎవరూ విడమర్చి చెప్పలేదు. నన్ను చూసి గుడ్డిగా అనుకరించేవారు. ఎలాంటి పనులకు ప్రతిఫలం ఉంటుందో వారికి ఇట్టే అర్థమైపోయేది.

వ్యాపారంలో నైతికత గురించీ, నిజానికీ భ్రమకూ మధ్య ఉండే తేడా గురించీ నేను చాలా ఆలోచించేవాణ్ని. చరిత్ర ప్రారంభం నుండీ మనుషులు ఒకరినొకరు మోసం చేసుకున్నారు. మన పురాణాల్లో, జానపద కథల్లో అబద్ధాల గురించీ, మోసపూరిత ఒప్పందాల గురించీ అనేక ప్రస్తావనలు ఉన్నాయి. మోసగించే దగ్గు వ్యాపారులూ, పీడించే వడ్డీ వ్యాపారులూ, తన దుస్తులు తనకు మాత్రమే కనపడవని చక్రవర్తిని నమ్మించే దర్జీలూ...

వ్యవస్థీకృత నేరం మేం చేస్తున్న పనికి చక్కని ఉపమానం. మాఫియా డాన్‌లు మొదట వీధి రౌడీల్లాగే మొదలౌతారు. కొన్నాళ్లు గడిచి కాస్త 'అభివృద్ధి' సాధించాక తమ రూపం మార్చుకుంటారు. చక్కగా కుట్టిన ఖరీదైన సూట్లు ధరిస్తారు. న్యాయమైన వ్యాపారాలు మొదలు పెడతారు, సమాజంలో గౌరవప్రదమైన స్థాయికి చేరుకుంటారు. దానధర్మాలు చేస్తారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి వెంటనే ప్రయత్నిస్తారు. బయోడేటాలో ఉన్న జాన్ పెర్కిన్స్ లాగే వీరు మంచి పౌరులకు నమూనా వలె కనపడతారు. కానీ ఈ మెరుపు వెనకాల ఒక రక్తసిక్త గతం ఉంది. అప్పు తీసుకున్నవాడు కట్టకపోతే మొదట కిరాయి గూండాలు వస్తారు, ఆ తర్వాత గుంటనక్కలు గురగురలాడతాయ్ అప్పటికీ పని కాకపోతే ఇక తుపాకులు గర్జిస్తాయ్

నా కింద పని చేసే ఉద్యోగులు వివిధ పేర్లతో పిలవబడతారు. ఫైనాన్షియల్ ఎనలిస్ట్, సోషియాలజిస్ట్, ఎకానమిస్ట్, లీడ్ ఎకానమిస్ట్, ఎకొనామెట్రీషియన్, షాడో ప్రైసింగ్ ఎక్స్‌పర్ట్ ఇలా - అయితే ఏదో విధంగా ప్రతీ ఒక్కరూ ఎకనామిక్ హిట్‌మాన్ పనులే చేస్తున్నారు. అందరూ గ్లోబల్ సామ్రాజ్య ఆకాంక్షలనే నెరవేరుస్తున్నారు.

ఇప్పుడు మాబోటి వారు చేసేది సముద్రంలో కాకి రెట్టంత. ఇవ్వాళ బూట్ల తయారీ కంపెనీల నుండి భారీ యంత్ర సామాగ్రి తయారు చేసే కంపెనీల వరకూ ప్రతీ కంపెనీలో ఎకనామిక్ హిట్‌మాన్ వంటి వారు ఉన్నారు. కిరాయి గుండాలు గళ్ల లుంగీలు, చారల బనీన్లు వదిలేసి చక్కని సూట్లను ధరించారిప్పుడు. న్యూయార్క్, చికాగో, సాన్‌ఫ్రాన్సిస్కో, లండన్, టోక్యోల్లోని తమ కేంద్ర కార్యాలయాల నుండి ఇప్పుడు యువతీ యువకులు బయలు దేరుతున్నారు. తమ దేశాన్ని కార్పొరేట్ సామ్రాజ్యానికి తాకట్టు పెట్టే, తమ ప్రజలను విదేశీ బానిస కార్ఖానాలకు అప్పజెప్పే అవినీతి నేతల కొరకు వారు వెతుకుతున్నారు.

అధ్యాయం 24

భారీ చమురు కంపెనీలతో ఈక్వెడార్ అధ్యక్షుడి పోరాటం

కొలంబియా, పనామా దేశాల్లో నడుస్తున్న మా కంపెనీ పనుల పుణ్యమా అని నాకు ఈక్వెడార్ - నేను కాలుమోపిన మొదటి విదేశీ గడ్డను- తరచుగా సందర్శించే అవకాశం కలిగింది. అమెరికా చెప్పుచేతలలో ఉండే నియంతలూ, కుటుంబపాలనా ఈక్వెడార్‌ను చాలా ఏళ్లు పీడించాయి.

ఈక్వెడార్‌లోని అమెజాన్ నదీలోయలో చమురు దోపిడీ 1960లోనే మొదలయింది. దేశాన్ని ఏలుతున్న కొన్ని కుటుంబాలు అంతర్జాతీయ బ్యాంకుల వ్యూహాల్లో చిక్కుకున్నాయి. ఇంకేముంది, భారీ అప్పులు చేసి రోడ్లు, పారిశ్రామిక పార్కులు, జలవిద్యుత్ కేంద్రాలు, ఇతర విద్యుత్ కేంద్రాలు, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు దేశమంతటా నిర్మించారు. అంతర్జాతీయ ఇంజనీరింగ్, నిర్మాణ కంపెనీల పంట మరోసారి పండింది.

అయితే కార్పొరేట్‌స్వామ్యంతో కుమ్మక్కయిన ఈక్వెడార్ రాజకీయ నేతలలో ఒక వ్యక్తి మాత్రం భిన్నంగా ఉండేవాడు. అతనే జైమె రోల్డోస్. ఈ ముప్పై ఏళ్ల పైచిలుకు వయస్సు గల లాయర్, యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసేవాడు. అతన్ని నేను చాలాసార్లు కలిశాను కూడా.

రోల్డోస్‌లో ఏదో తెలియని ఆకర్షణ ఉండేది.

'మీకెప్పుడయినా ఏదైనా పనిపడితే చెప్పండి. నేను ఈక్వెడార్ వచ్చి సాయం చేస్తాను' అన్నానోసారి అతన్ని కలిసినప్పుడు సరదాగా.

అతనేం తక్కువ తిన్నాడా? వెంటనే 'మీకెప్పుడయినా మీ చమురు బిల్లు తగ్గించుకోవలసివస్తే నన్ను కలవండి' అన్నాడు.

ప్రజాకర్షక నాయకుడిగా, జాతీయవాదిగా రోల్డోస్ చాలా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు. పేదల హక్కుల పట్ల, రాజకీయ నాయకులు దేశ సహజ వనరులను బాధ్యతగా ఉపయోగించుకోవడం పట్ల అతనికి చాలా నిబద్ధత ఉండేది.

అతను 1978లో అధ్యక్ష ఎన్నికలకు ప్రచారం మొదలు పెట్టినప్పుడు స్వదేశంలోనే కాక అనేక ఇతర దేశాల్లో కూడా ప్రజలు ఎంతో ఆసక్తిగా చూశారు. వారి ఆసక్తికి కారణం రోల్డోస్ దేశాన్ని కొల్లగొడుతున్న చమురు కంపెనీలకు ముకుతాడు వేస్తానని ప్రకటించడమే. తమ దేశపు వనరులపై పాశ్చాత్యుల ఆధిపత్యం సహించలేని ఎన్నో దేశాల ప్రజలకు రోల్డోస్ ఒక ఆశాకిరణం.

అప్పట్లో అమెరికాలో సమ్మర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లింగ్విస్టిక్స్ (ఎస్ఐఎల్) అని ఒక క్రైస్తవ మిషనరీ సంస్థ ఉండేది. స్థానిక భాషలను రికార్డు చేసి, వాటిపై పరిశోధన సాగించడానికనే నెపంతో ఆ సంస్థ ఈక్వెడార్‌తో పాటు ఎన్నో దేశాల్లోకి ప్రవేశించింది.

ఈ సంస్థ అమెరికన్ చమురు కంపెనీల ప్రాబల్యంతో, వాటి వ్యాపార ప్రయోజనాల కొరకు ఏర్పాటయిన ముసుగు సంస్థ అని జైమె రోల్డోస్ ఆరోపించాడు.

అతని ఆరోపణల వెనుక బలమైన కారణాలే ఉన్నాయి. ఈక్వెడార్‌లో చమురు అన్వేషణ మొదలైన తొలినాళ్లలో ఎస్ఐఎల్, హురాని అనే అమెజాన్ తెగ ప్రజలతో కలిసి పనిచేయనారంభించింది. ఫలానా ప్రాంతంలో చమురు నిల్వలు ఉండే అవకాశం ఉందని సెస్మాలజిస్టులు చమురు కంపెనీలో పై అధికారులకు తెలియజేయగానే ఆ ప్రాంతంలో ఎస్ఐఎల్ ప్రవేశించేది. స్థానిక తెగ ప్రజలను అక్కడి నుండి వేరే ప్రదేశంలో గల తమ మిషనరీకి రమ్మని, అక్కడ ఉచిత ఆహారం, నివాసం, బట్టలు, ఆరోగ్య సంరక్షణ, మిషనరీ విద్య లభిస్తాయని వారిని ఊరించేది. అయితే ఈ సౌకర్యాలు పొందినందుకు బదులుగా తామియుంటున్న భూములపై హక్కుని చమురు కంపెనీకి ధారాదత్తం చేయాలన్న నిబంధన పెట్టేది ఎస్ఐఎల్.

స్థానిక తెగలను తమ నివాస ప్రాంతాలు వదిలి మిషనరీలకు తరలించేందుకు ఎస్ఐఎల్ అనేక అక్రమ పద్ధతులు ఉపయోగించేదని పుకార్లు ఉన్నాయి. గిరిజనులకు విరోచనాలు కలిగించే పదార్థంతో కూడిన ఆహారం దానం చేయడం, అది తిన్న వారికి డయేరియా వచ్చిందని చెప్పి దాన్ని నయం చేసే మందులు ఇవ్వడం ద్వారా వారి విశ్వాసం చూరగొనడం. రేడియో ట్రాన్స్‌మిటర్లు గల ఆహారపు పొట్లాలు విమానాల్లోంచి ఈ తెగలు నివసించే ప్రాంతాలలో జారవిడవడం, వాటి సాయంతో ఎవరికైనా పాము కరిచినా, అనారోగ్యంతో ఉన్నా తెలుసుకుని హెలికాప్టర్లలో వెళ్లి వారికి వైద్యం చేయడం. ఇలాంటి పద్ధతులను ఎస్ఐఎల్ ఉపయోగించేదని అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి.

చమురు అన్వేషణ తొలినాళ్లలో అయిదుగురు ఎస్ఐఎల్ మత ప్రచారకులు హత్యకు గురయ్యారు. వారి శరీరాల్లో హురాని తెగ బల్లేలు దిగి ఉన్నాయి. ఇద్ది

స్ఐఎల్ వారికో హెచ్చరిక అని, వారు ఈ ప్రాంతాన్ని వదిలి వెళ్లాలనే ఈ పని శామని హురాని తెగ వారు చెప్పుకున్నారు.

అయితే ఈ ఎత్తు పని చేయలేదు. ఒక విధంగా అది వ్యతిరేక లితాన్నిచ్చింది. హురాని తెగ చేతిలో మరణించిన ఒక ఎస్ఐఎల్ ఉద్యోగి చెల్లెలు రాచెల్ సెయింట్ అనే మహిళ - అమెరికా మొత్తం పర్యటించి, టెలివిజన్ షోలలో కనపడి ఎస్ఐఎల్‌కు భారీగా విరాళాలు సేకరించింది. చమురు కంపెనీలు, ఎస్ఐఎల్ కలిసి 'అనాగరిక' తెగలను సంస్కరిస్తున్నాయనీ, నాగరికత నేర్పుతున్నాయనీ ఆమె ప్రచారం చేసింది.

షెవ్‌రాన్, ఎక్సన్, మోబిల్ అనే మూడు బహుళజాతి చమురు కంపెనీలకు పెట్టుబడి పెట్టిన స్టాండర్డ్ అయిల్, జాన్ డీ రాక్‌ఫెల్లర్ అనే వ్యాపారవేత్తకు చెందింది. ఇతను స్థాపించిన స్వచ్ఛంద సంస్థ రాక్‌ఫెల్లర్ ఛారిటీస్. ఎస్ఐఎల్ కు రాక్‌ఫెల్లర్ ఛారిటీస్ విరాళాలు ఇచ్చేది.

జైమె రోల్డోస్ సరిగ్గా ఇదే విషయాన్ని ఎత్తి చూపేవాడు. ఎస్ఐఎల్ చమురు కంపెనీలకు సాయపడేందుకు, స్థానిక తెగల నుండి భూమిని లాక్కొనేందుకు ఉద్దేశించిన ముసుగు సంస్థ అని రోల్డోస్ తరచు ఆరోపించేవాడు.

జైమె రోల్డోస్ కూడా ఒమర్ టోరిజోస్ చూపిన దారిలో నడుస్తున్నాడనిపించేది నాకు. ఇద్దరూ ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన దేశానికి ఎదురొడ్డి నిలిచారు. టోరిజోస్ పనామా కాలువను తిరిగి సాధించాలనుకుంటే, రోల్డోస్ చమురు కంపెనీలు జాతీయం చేయాలనుకున్నాడు. టోరిజోస్ లానే రోల్డోస్ కూడా కమ్యూనిస్టు కాదు. ఇద్దరూ తమ దేశాల భవిష్యత్ నిర్ణయించుకునే హక్కు తమ దేశ ప్రజలకే ఉండాలనుకునేవారు.

అంతర్జాతీయ విశ్లేషకులు టోరిజోస్ వలె రోల్డోస్‌ను కూడా వాషింగ్టన్ పెద్దలు, బహుళజాతి కంపెనీలు చూస్తూ ఊరుకోవని, ఒకవేళ జైమె రోల్డోస్ గెలిస్తే - గ్వాటెమాల అధ్యక్షుడు అర్బెంజ్‌ను, చిలీ అధ్యక్షుడు అలెండీని ఏం చేశారో అదే చేస్తారని ఊహాగానాలు చేసేవారు.

నాకైతే ఈ ఇద్దరు నేతలు కలిసి లాటిన్ అమెరికాలో ఒక కొత్త ఉద్యమం లేవదీస్తారేమో అనిపించేది. ఈ ఉద్యమం ప్రపంచదేశాల భవితవ్యాన్ని మార్చేసేందుకు పునాది అవుతుందనే భావన కలిగేది.

వీళ్లు కాస్ట్రో, గడాఫీ వంటి వారు కాదు. రష్యాతోనో, చైనాతోనో జతకట్టిన వారు కాదు. అలా అని అలెండీ వలె సోషలిస్టు ఉద్యమం తలకెత్తుకోవడం లేదు. వాస్తవిక దృష్టి కలిగిన, ప్రజాదరణ పొందిన తెలివైన నాయకులు వీరు. తీవ్ర జాతీయ భావాలు కలిగి ఉన్నా అమెరికా అంటే నిరాధార ఆగ్రహం కనబరచలేదు వీరిరువురూ

రోల్డోస్ తన ప్రధాన ఎన్నికల అంశంగా హైడ్రోకార్బన్స్ విధానాన్ని ప్రకటించాడు. ఈక్వెడార్ ప్రధాన వనరు అయిన ముడి పెట్రోలియం వెలికితీత ద్వారా వచ్చే ఆదాయంలో సింహభాగం స్థానికులకే చెందాలని ఈ విధానం చెబుతుంది. పేదల పట్ల, దిక్కూ మొక్కూ లేని వారి పట్ల ప్రభుత్వం దయతో వ్యవహరించాలని రోల్డోస్ అనేవాడు. ఈ హైడ్రోకార్బన్స్ విధానం ద్వారా సంఘ సంస్కరణ చేయవచ్చు అని అతని నమ్మకం.

ఈ సమయంలో అమెరికా అధ్యక్షుడిగా జిమ్మీ కార్టర్ ఉండటం గుడ్డిలో మెల్ల అని అనుకునేవాణ్ణి నేను. టెక్సాకో వంటి చమురు కంపెనీలనుంచి తీవ్రమైన ఒత్తిడి ఉన్నా కార్టర్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం ఈక్వెడార్ ఎన్నికలకు దూరంగా ఉంది.

ఆగస్ట్ 1979లో జరిగిన ఆ ఎన్నికల్లో జైమె రోల్డోస్ గెలిచాడు. అతని గెలుపుకు ప్రధాన కారణం హైడ్రోకార్బన్స్ విధానమేనని నా అభిప్రాయం.

ఎందరో సైనిక నియంతల పాలన చవిచూసిన ఈక్వెడార్ ప్రజలకు చివరికి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన అధ్యక్షుడు లభించాడు. ఎన్నిక కాగానే చేసిన అతని మొదటి ఉపన్యాసం చూడండి :

'మన దేశపు చమురు వనరులను పరిరక్షించుకునేందుకు సకల చర్యలు తీసుకోవాలి మనం. ప్రభుత్వం తన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కోల్పోకుండా వివిధ ఎగుమతులు జరిగేటట్టు చూసుకోవాలి... ఇకపై నిర్ణయాలు చేసేటప్పుడు మన జాతి ప్రయోజనాలు, సార్వభౌమత్వాన్ని దృష్టిలో ఉంచుకొని చేయడం జరుగుతుంది'.

పదవి చేపట్టగానే రోల్డోస్ మొదట టెక్సాకో పై దృష్టి పెట్టాడు. ఈక్వెడార్ చమురు రంగంలో టెక్సాకోదే ప్రధాన పాత్ర. అయితే ఈ కంపెనీ మొదటి నుంచీ రోల్డోస్‌ను అనుమానంగానే చూసింది. వారి మధ్య పెద్ద అగాథం ఏర్పడింది. చమురు రంగంలో ఎటువంటి మార్పులు జరిగినా అది ఇతర దేశాల్లో తన వ్యాపారంపై ప్రభావం చూపుతుందని టెక్సాకో భయం.

చమురు కంపెనీల పట్ల కఠిన వైఖరి కనబరచాలనీ, ఎటువంటి ఒత్తిళ్లకు, భయానికి లోను కావద్దని జైమె రోల్డోస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉండేది.

1980 నూతన సంవత్సరం దినం నాడు నేనో నిర్ణయం తీసుకున్నాను. ఒక కొత్త దశాబ్దం మొదలవబోతోంది. మరో ఇరవై ఎనిమిది రోజులు గడిస్తే నా వయస్సు ముప్పై అయిదుకు చేరుకుంటుంది. కొత్త సంవత్సరంలో నేను నా జీవిత గమనాన్ని మార్చాలని నిర్ణయం తీసుకున్నాను. జైమె రోల్డోస్, ఒమర్ టోరిజోస్ వంటి యోధుల నుండి స్ఫూర్తిని పొంది వారిలా ఏదైనా చేయాలని గట్టిగా అనుకున్నాను.

అధ్యాయం 25

నా రాజీనామా

నేనలా నిర్ణయం తీసుకున్న తరువాత మరో దిగ్భ్రాంతికర సంఘటన జరిగింది. మెయిన్ సంస్థను కనీవినీ ఎరుగని లాభాల బాటలో నడిపిస్తున్న ప్రెసిడెంట్ బ్రూనోను మా సిఈవో మెక్‌హాల్ తొలగించాడు.

బ్రూనో ఉద్వాసన మెయిన్‌ను భూకంపంలా కుదిపేసింది. కంపెనీలో ప్రతి ఒక్కరూ కలవరపాటుకు, అయోమయానికి లోనయ్యారు. బ్రూనో అంటే గిట్టని వాళ్లను కూడా కదిలించింది చర్య. ఆఫీసు క్యాంటీన్‌లో, బయట పిచ్చాపాటి మాట్లాడుకున్నప్పుడు ఇదే విషయం చర్చకు వచ్చేది. తనకన్నా పదిహేనేళ్లు జూనియర్ అయిన బ్రూనో, కంపెనీని దౌడు తీయిస్తున్న తీరు చూసి మెక్‌హాల్ ఓర్వలేకపోయాడని, ఏదో ఒకనాడు తన పదవికి కూడా ఎసరు తేగలడని భయపడే ఇలా చేశాడని ఆఫీసులో గుసగుసలు వినిపించాయి.

ఆ గుసగుసలు నిజమే అనిపించేలా బ్రూనో స్థానంలో పాల్‌ప్రీస్ట్ అనే వ్యక్తిని ప్రెసిడెంట్‌గా నియమించాడు మెక్‌హాల్. పాల్ ఒక ఇంజనీర్. మెక్‌హాల్ మాట జవదాటని వాడని పేరున్నవాడు. బాగా నెమ్మదస్తుడు.

బ్రూనోను తొలగించడం వ్యక్తిగతంగా నన్ను చాలా బాధించింది. తను నా గురువు లాంటివాడు. అంతర్జాతీయ వ్యవహారాల్లో మమ్మల్ని ముందుండి నడిపినవాడు. పాల్ అలా కాదు. ఇతగాడికి ఎక్కువగా దేశీయ అనుభవమే ఉంది. ఇతని సారథ్యంలో కంపెనీ భవిష్యత్తు అగమ్యగోచరమే అనిపిస్తుంది.

తరువాత కలిసినప్పుడు బ్రూనో 'ఏదేమైనా నువ్వు జాగ్రత్తగా ఉండు. మెక్‌హాల్‌కు వాస్తవ పరిస్థితులతో సంబంధం లేనట్టు కనపడుతున్నాడు' అన్నాడు.

ఇది జరిగిన కొన్నాళ్లకి, 1980 మార్చిలో నేను నా స్నేహితురాలు, సహోద్యోగి అయిన మేరీ అనే యువతి కలిసి వర్జిన్ ఐలాండ్స్ పర్యటనకు వెళ్లాం. అక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నప్పుడు నేననుకోలేదు కానీ ఇప్పుడు ఆలోచిస్తే అర్థం అవుతోంది, నేను ఇక్కడికి వచ్చాక తీసుకున్న నిర్ణయానికి ఈ ప్రాంతపు చరిత్ర కూడా ఒక కారణమే.

బంగారంతో నిండిన స్పానిష్ నౌకలను ఆంగ్లేయులు దోచుకున్నది ఇక్కడే. సర్ హెన్రీ మోర్గాన్, డ్రేక్ వంటి పెద్దమనుషులు, గౌరవ బిరుదులు పొందినవారు - ఎవరు వీళ్లంతా? ఒకప్పటి సముద్రపు దొంగలే కదా! ఇటువంటి వారికి గౌరవమిచ్చే సమాజం నుండి వచ్చిన నేను ఇండొనేషియా, పనామా, కొలంబియా, ఈక్వెడార్ వంటి దేశాలను దోచుకుంటున్నానని ఎందుకు విచారించాలి?

నా హీరోలు - ఈథాన్ ఎల్లెన్, థామస్ జెఫర్సన్, జార్జ్ వాషింగ్టన్, డానియెల్ బూన్, డేవీ క్రొకెట్, లెవిస్ అండ్ క్లార్క్ - వీళ్లంతా రెడ్ ఇండియన్లను, బానిసలను, తమవి కాని వాటి నెన్నిటినో దోపిడీ చేయలేదా? నేను చేస్తున్న తప్పును సమర్థించుకునేందుకు వీళ్లనే కదా నేను ఆదర్శంగా ఎంచుకుంది!

ఇప్పుడు ఆలోచిస్తే అర్థం అవుతోంది నేను అలా సమర్థించుకోవడంలో ఉన్న పొరపాటు.

ఇన్నేళ్లు నేను చాలా చక్కగా విస్మరించిన కొన్ని విషయాలు జ్ఞప్తికి వచ్చాయి నాకు. ఈథాన్ ఎల్లెన్ కొన్ని నెలల పాటు ఇరుకు బ్రిటిష్ జైలు నౌకలలో చేతులకు ముప్ఫై పౌండ్ల సంకెళ్లతో గడిపాడు. 1775లో మాంట్రియల్ యుద్ధంలో ఖైదీగా చిక్కాడతను. అతను కూడా జైమె రోల్డోస్, ఒమర్ టోరిజోస్ ల్లాగా తన దేశ ప్రజలకు స్వాతంత్ర్యం కోసమే పోరాడాడు. థామస్ జెఫర్సన్, జార్జ్ వాషింగ్టన్ వంటి మా జాతి నేతలంతా అటువంటి ఆదర్శాల కొరకే తమ ప్రాణాలొడ్డి పోరాడారు. డానియల్ బూన్, డేవీ క్రొకెట్, లెవిస్ అండ్ క్లార్క్ - వీళ్లంతా ఎన్నో కష్టనష్టాలకోర్చారు.

మేరీ నాకో బీర్ అందించింది. చుట్టూ ఉన్న అందమైన పరిసరాలు నాలో ఆవేదనను తగ్గించలేకపోయాయి.

కొంచెం దూరంగా ఒక చెక్క పడవ వెళుతోంది. దానిపైన ఇంద్రధనుస్సు వర్ణాలతో రెపరెపలాడుతున్న జెండా. ఒక అరడజను స్త్రీ, పురుషులున్నారు ఆ పడవపై. మాకేసి చేతులు ఊపారు వాళ్లు. వారు వేసుకున్న బట్టలు చూస్తే హిప్పీల్లాగా కనపడుతున్నారు. ఆ పడవ డెక్‌పై ఒక జంట అయితే నగ్నంగా ఉంది. ఏ బాధ్యత లేకుండా, రికామీగా తిరిగే హిప్పీ గుంపు ఉన్నట్టుంది.

నేనూ చేతులు ఊపుదామని ప్రయత్నించాను.

ఊహుఁ. నా చేతులు సహకరించలేదు. నా మనస్సులో ఏదో తెలీని ఈర్ష్య.

మేరీ వాళ్లు కనుమరుగయ్యేంత వరకూ వారినే చూస్తూ ఉంది.

'నీకు అలాంటి జీవితం అంటే ఇష్టమా?' అడిగింది తను.

అప్పుడర్థమైంది నాకు.

నా కోపం ఎవరిపైనో కాదు. నా జీవన విధానంపైనే నా కోపమంతా.

'ఈ రాత్రికి మనం లీన్‌స్టర్ బే లో లంగరు వేద్దాం' అంది మేరీ బిగ్గరగా.

బంగారంతో నిండిన స్పానిష్ నౌకలను దోచుకునేందుకు సముద్రపు దొంగల పడవలు ఇక్కడే వేచి ఉండేవి. కొంచెం దగ్గరికి వెళ్లాక స్టీరింగ్ మేరీకి ఇచ్చి నేను లంగరును తీసి మెల్లిగా నీటిలోకి జార విడిచాను.

పడవ ఆగాక కాసేపు మేరీ ఆ నీటిలో ఈదులాడింది. అలసిపోయాక డెక్పై చిన్న కునుకు తీసింది. మధ్యాహ్నామవుతుండగా నేను ఆ ద్వీపంపై ఉన్న చిన్న కొండపైకి నడిచాను. పూర్వం చెరకు తోటలు ఉండేవిక్కడ.

అక్కడ నిలబడి నీటి అంచున లంగరేసిన మా పడవ కేసి చూశాను. నేనిప్పుడు నిలబడ్డచోట ఒకప్పుడు ఏదో భవనం ఉండేదనుకుంటా, ఇప్పుడు దాని గోడల అవశేషాలు మాత్రం మిగిలాయి. నా ఆలోచనలు ఈ ద్వీపంపై పనిచేసిన ఆఫ్రికన్ బానిసలపైకి మళ్లాయి. ఇక్కడే కదా వారు ఒక వ్యథాభరిత జీవితాన్ని గడిపింది. తుపాకి గొట్టం నీడలో ఈ భవంతుల నిర్మాణం, చెరకు తోటల పెంపకం, చెరకు రసం నుండి చక్కెర, ఆపై దాన్నుండి రమ్ తయారు చేసేవారా బానిసలు.

ఇప్పటి నిర్మలత్వం అప్పటి క్రూరత్వాన్ని మసక బారుస్తోంది.

దూరంగా ఉన్న కరీబియన్ కొండల్లోకి సూర్యుడు మాయం అయ్యాడు.

ఆకాశమంతా పరచుకున్న ఎర్రటి కాంతిరేఖ.

సముద్రంపై మెల్లిగా అలుముకుంటున్న చీకటి.

నేను కూడా బానిసనే కదా!

నా మెయిన్ ఉద్యోగం కేవలం పేద దేశాలను అప్పుల ఊబిలో కూరుకుపోయేటట్టు చేయడం గురించి కాదు. అది మా కంపెనీ లాభనష్టాల గురించి కూడా కాదు. ఈ ద్వీపంపై పని చేస్తూ మరణించిన వ్యక్తులు, వారి కుటుంబాల గురించి కూడా. మరో విధంగా చూస్తే నేను బానిస వ్యాపారిని కూడా!

పదేళ్లు నేను కూడా ఆ బానిస యజమానుల వారసత్వాన్నే కొనసాగించాను. ఆఫ్రికన్ అడవుల్లోకి వెళ్లి అక్కడ దొరికిన ఆడ, మగ అందర్నీ కట్టగట్టి తోలుకు వచ్చారు మా పూర్వీకులు. నాది కొంచెం నవీనమైన, బైటికి కనపడని పద్ధతి. చనిపోయిన వారి శవాలు, కుళ్లిపోతున్న మాంసపు ముద్దలు, బాధతో వేసే కేకలు ఇవేవీ నాకు కనపడవు. కానీ నేను చేసింది కూడా మా పూర్వీకుల వలె ఘోరమైన పనే. నాకు ఇందులోంచి బైటపడే అవకాశం ఉండీ బయటకు రాలేదు కాబట్టీ నా పాపమే పెద్దది.

నా పడవకేసి దృష్టి సారించాను. మేరీ డెక్పై విశ్రమిస్తోంది. బహూశా చేతిలో కాక్‌టెయిల్ గ్లాసు ఉండీ ఉంటుంది. నా కోసం కూడా ఓ గ్లాసు సిద్ధం చేసి ఉంటుంది

తనను అంత కులాసాగా, అంత స్వేచ్ఛగా చూస్తే అర్థమైంది. నేను తనను, తనలాంటి మరెందరినో ఏం చేస్తున్నానో. వాళ్లను ఎకనామిక్ హిట్‌మెన్‌గా మారుస్తున్నాను. క్లాడిన్ నన్ను ఎలా తీర్చిదిద్దిందో అలా. కాకపోతే తనలా నిజాయితీగా లేను నేను. వాళ్లకు భారీ జీతాలిస్తూ పదోన్నతులు ఇస్తూ, బానిసల్లాగా మారుస్తున్నాను. వాళ్లు కూడా నాలాగే ఈ వ్యవస్థకు గొలుసులతో బంధింపబడుతున్నారు. వాళ్లూ బానిసలవుతున్నారు...

నేను ఆకాశం నుండీ, సముద్రం నుండీ నా చూపులు మరలించాను. బానిసలు నిర్మించిన ఆ గోడల అవశేషాలు కనపడకుండా కళ్లు మూసుకున్నాను.

నేను ఏదీ చూడాలనుకోవడం లేదిప్పుడు.

నేను కళ్లు తెరిచేసరికి ఎదురుగా నాకో దుడ్డు కర్ర కనపడింది. చెంగున దూకి దాన్ని చేతుల్లోకి తీసుకున్నాను. ఆ రాతి గోడలపై ఆవేశంగా బాదసాగాను. అలసిపోయి నేలపై జారిపోయే దాకా అలా కొడుతూనే ఉన్నాను. తరువాత ఆ గడ్డిలో పడుకుని ఆకాశం కేసి చూస్తే వడివడిగా కదులుతున్న మబ్బులు...

సముద్రపు అంచున నిలబడి ఉన్న నా పడవ కేసి చూస్తుంటే అర్థం అయ్యింది నేనిప్పుడు ఏం చేయాలో. నేను మళ్లీ మెయిన్ ఉద్యోగం చేయడం మొదలుపెడితే ఇక ఎప్పటికీ అందులోనే కొట్టుమిట్టాడాలి. ఆ జీతాలు, బోనస్, పెన్షన్, ఇన్సూరెన్స్, షేర్లు... ఎంత ఎక్కువకాలం ఉంటే బైటపడటం అంత కష్టం.

నేను బానిసనై పోయాను!

రెండు రోజుల తర్వాత బోస్టన్ తిరిగి వచ్చాను. ఏప్రిల్ 1, 1980 నాడు పాల్‌ప్రీడ్డీ ఆఫీసులోకి నా రాజీనామా లేఖతో నడిచాను.

నాలుగో భాగం 1981 నుంచి ఇప్పటిదాకా

అధ్యాయం 26

ఈక్వెడార్ అధ్యక్షుడి మృతి

మెయిన్‌ను వదిలేయడం అంత తేలికగా జరగలేదు. పాల్‌ప్రిడ్డీ అయితే అసలు నమ్మలేదు.

'ఏప్రిల్ ఫూల్ చేస్తున్నావ్ కదూ' అన్నాడు కన్నుగీటుతూ.

నేను నిజంగానే రాజీనామా చేస్తున్నానని చెప్పానతనికి. ఎవరికీ అనుమానం వచ్చేట్టుగానీ, ఆగ్రహం వచ్చేట్టుగానీ చేయగూడదన్న పౌలా సలహా ప్రకారం నడుచుకున్నాను నేను. మెయిన్ వల్ల నాకు ఎనలేని లాభం ఒనగూరిందనీ కేవలం జీవితంలో మార్పు కోసమే ఈ ఉద్యోగం వదిలేస్తున్నానని నమ్మబలికాను. మెయిన్‌లో పని చేస్తున్నప్పుడు నాకు పరిచయమైన గొప్ప వ్యక్తుల గురించి రాయాలనుకుంటున్నాననీ, నేషనల్ జాగ్రఫిక్ వంటి పత్రికలకు ఫ్రీలాన్స్ చేయాలనుకుంటున్నాననీ, ప్రపంచాన్ని చుట్టి రావాలనుకుంటున్నాననీ బొంకాను. మెయిన్ గురించి అవకాశం దొరికినప్పుడల్లా పొగుడుతాననీ మాట ఇచ్చాను.

ఇదంతా విన్న పాల్ చివరకు నా రాజీనామా ఒప్పుకున్నాడు. ఆ తరువాత మా కంపెనీలో చాలా మంది నన్ను నిర్ణయం మార్చుకొమ్మని ఒత్తిడి చేశారు. నేనిక్కడ ఎంత బాగా పని చేశానో వారు నాకు గుర్తు చేశారు. కొందరైతే నాకు పిచ్చెక్కిందన్నారు.

వారు అలా అనక తప్పలేదు మరి. నేను సరైన పని చేశానని ఒప్పుకుంటే వాళ్లు చేస్తున్నది పిచ్చి పని అవుతుందిగా మరి. అందుకే నేను చేస్తున్నదే పిచ్చిపని అని నిర్ధారించారు వాళ్లు.

నా టీమ్‌లోని ఉద్యోగులైతే మరీ బాధపడ్డారు. సరైన వారసుడు లేకుండా నడిసంద్రంలో వదిలేశానని వారి భావన. ఏదేమైనా నేను మాత్రం నా నిర్ణయం మార్చుకోదల్చుకోలేదు.

ఇంకొన్నేళ్లు మెయిన్‌లోనే ఉండి ఉంటే ఆ సంస్థలో నేను పూర్తి కాలం భాగస్వామిని అయి ఉండే వాడిని. నలభై ఏళ్లకల్లా కోటీశ్వరుణ్ని అయ్యి ఉండేవాడిని. ఇప్పుడీ ముప్పై అయిదేళ్ల వయస్సులో ఆ లక్ష్యానికి బహుదూరంగా ఉండిపోయాను.

ఇంతలో ఒకరోజు పాల్‌ప్రీడ్డి నన్ను వెంటనే రమ్మని ఫోన్ చేశాడు.

'మన క్లయింట్లలో ఒకరు నువ్వు లేకపోతే కాంట్రాక్టు రద్దు చేసుకుంటామని బెదిరిస్తున్నారు' అన్నాడు.

'నువ్వు వారి తరపున మాట్లాడతావనే నమ్మకంతో వాళ్లీ కాంట్రాక్టు మనకిచ్చారట'.

నేను చాలా ఆలోచించాను.

నా జీతానికి మూడు రెట్లు ఇస్తే ఆ కంపెనీ తరఫున పని చేస్తానన్నాను. ఆశ్చర్యంగా పాల్ ఒప్పుకున్నాడు.

అలా ఓ కొత్త అవతారం ఎత్తాను. అమెరికాలో నిర్మిస్తున్న విద్యుత్ ప్లాంట్లకు కన్సల్‌టెంట్‌గా కొన్నేళ్లు గడిపాను.

లాటిన్ అమెరికాతో ఇప్పుడు ఉద్యోగరీత్యా నాకేమీ సంబంధం లేదు. కానీ అక్కడ జరుగుతున్న వ్యవహారాలపై సమాచారం సేకరించేవాడిని. పౌలాతో సంబంధాలు కూడా కొనసాగించాను.

జైమె రోల్డోస్ గురించి వార్తా పత్రికల్లో చదివినప్పుడల్లా నాకు ముచ్చటేసేది. అతని నిబద్ధత, లోతైన సమస్యలను కూడా అర్థం చేసుకునే అవగాహన నా దృష్టిని ఆకర్షించేవి.

1980 నవంబర్‌లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కార్టర్ ఓడిపోయాడు. పనామా కాలువను పనామాకే తిరిగి అప్పగించే ఒప్పందం చేసుకోవడం, ఇరాన్‌లోని అమెరికన్ ఎంబసీలో బందీలను విడిపించే ప్రయత్నం బెడిసికొట్టడం వంటివన్నీ అతని ఓటమికి కారణాలయ్యాయి.

ప్రపంచశాంతి కొరకు ప్రయత్నించే వ్యక్తి, చమురుపై అమెరికా ఆధారపడడాన్ని తగ్గించడానికి ప్రయత్నం చేసిన వ్యక్తి ఓడిపోయి అమెరికా ప్రపంచాధిపతి అని నమ్మే వ్యక్తి, చమురు నిల్వలు ఎక్కడున్నా అవి అమెరికా అధీనంలోనే ఉండాలనే వ్యక్తి ఇప్పుడు దేశాధ్యక్షుడయ్యాడు. వైట్‌హౌస్ పై కప్పుపై సౌర విద్యుత్ పలకలు అమర్చిన వ్యక్తి పోయి పదవిలోకి రాగానే వాటిని తొలగింపజేసిన వ్యక్తి సింహాసనం అధిష్ఠించాడు.

కార్టర్ అసమర్థుడైన రాజకీయ నాయకుడు కావచ్చు కానీ అతను పాత తరానికి ప్రతినిధి. ఈ దేశాన్ని రూపుదిద్దిన మా ముత్తాతల విలువలకు కార్టర్ ఊపిరులూదే ప్రయత్నం చేశాడు.

ఇప్పుడొచ్చిన రీగన్, అమెరికా సామ్రాజ్యాన్ని విస్తరించడానికి కంకణబద్ధుడైనవాడు. కార్పొరేట్‌స్వామ్యపు నమ్మిన బంటు. అతను హాలీవుడ్ హీరో అవటం యాదృచ్ఛికమే కావచ్చు కానీ అతను తన డైరెక్టర్ల మాటలు తు చ తప్పకుండా పాటించే గుణం కలవాడు. బహుళజాతి కంపెనీలు, బ్యాంకుల బోర్డులు, ఆఫీసుల మధ్య నాలుగు స్తంభాలాట ఆడే కొంత మంది నాయకమ్మన్యుల ఆదేశాలకు అనుగుణంగా ఆడే అధ్యక్షుడు.

ఇప్పుడు ఎకనామిక్ హిట్‌మెన్‌కు మంచి రోజులు వచ్చాయని అనిపించింది నాకు. అయితే నేను ఇదే దశలో నా ఉద్యోగాన్ని వదిలేయడం విధి విచిత్రం. నాకు మాత్రం నేను సరైన సమయంలో సరైన పని చేశానని అనిపించేది.

★ ★ ★

1981 తొలినాళ్లలో రోల్డోస ప్రభుత్వం కొత్త హైడ్రోకార్బన్స్ చట్టాన్ని ఈక్వెడార్ కాంగ్రెస్ (పార్లమెంట్)లో ప్రవేశపెట్టింది. అది గనుక అమలైతే అది ఆ దేశంతో చమురు కంపెనీల సంబంధాలను సమూలంగా సంస్కరించేది. ఏ కొలబద్దతో చూసినా అది విప్లవాత్మకమైన చట్టం. దాని పర్యవసానాలు ఈక్వెడార్‌లోనే కాక లాటిన్ అమెరికా అంతటా, ఇంకా చెప్పాలంటే ప్రపంచం అంతటా కనపడేవి.

ఊహించినట్టుగానే చమురు కంపెనీలు ఈ చట్టంపై విరుచుకు పడ్డాయి. ఆ కంపెనీల పౌరసంబంధాల శాఖలు జైవెం రోల్డోస్‌పై దుష్ప్రచారం మొదలుపెట్టాయి. పైరవీకారులు అటు ఈక్వెడార్ రాజధాని క్విటోలోను, ఇటు అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోను డబ్బు మూటలతో, బెదిరింపులతో అన్ని ప్రయత్నాలూ ప్రారంభించారు.

ఈక్వెడార్ చరిత్రలో మొదటి ప్రజాస్వామ్య అధ్యక్షుడిని మరో కాస్ట్రోలా పోల్చడం మొదలెట్టారు. అయితే ఈ బ్లాక్‌మెయిల్‌కు రోల్డోస లొంగలేదు. చమురు - రాజకీయాలు - మతం నిస్సిగ్గుగా కుమ్మక్కయ్యాయని అతను ప్రకటించాడు. సమ్మర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లింగ్విస్టిక్స్ (ఎస్ఐఎల్), చమురు కంపెనీలతో కలిసి పనిచేస్తున్నదని ఆ సంస్థను దేశం నుండి బహిష్కరించాడు.

ఇది జరిగిన రెండు రోజులకు ఈక్వెడార్‌లో పనిచేస్తున్న అన్ని విదేశీ కంపెనీలకు రోల్డోస ఓ హెచ్చరిక చేశాడు. ఈ దేశ ప్రజలకు ఉపయోగపడే పనులు చేయని వారందరికీ ఎస్ఐఎల్‌కు పట్టిన గతే పడుతుందని ఆ హెచ్చరిక సారాంశం.

మే 24, 1981 నాడు అటాహుల్పా ఒలంపిక్ స్టేడియంలో ప్రజలనుద్దేశించి ఓ కీలకోపన్యాసం చేసిన రోల్డోస్ దక్షిణ ఈక్వెడార్‌కు బయలుదేరాడు.

కానీ మార్గమధ్యంలో అతని హెలికాప్టర్ కుప్పకూలింది. జైమె రోల్డోస్ అక్కడికక్కడే మరణించాడు.

ప్రపంచం మొత్తం దిగ్భ్రాంతి చెందింది. లాటిన్ అమెరికన్ల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆ ప్రాంతపు పత్రికల పతాక శీర్షికలు అన్నీ ఒక్కుమ్మడిగా

'ఇది సిఐఏ హత్య' అన్నాయి.

రోల్డోస్ హత్యకు పథకం పన్నుతున్నారని అతనికి ముందే తెలుసనీ, అందుకే ఎప్పుడూ రెండు హెలికాప్టర్లు వినియోగించేవాడనీ, హత్య జరిగిన రోజు అతని సెక్యూరిటీ అధికారుల్లో ఒకరు చివరి నిమిషంలో ఈ రెండో హెలికాప్టర్‌లోకి మారమని రోల్డోస్‌కు సూచించాడని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.

ఈ వార్తను అమెరికన్ మీడియా మాత్రం పట్టించుకోలేదు. ఓస్వాల్డో హుర్టాడో ఈక్వెడార్ కొత్త అధ్యక్షుడయ్యాడు. వచ్చీ రాగానే సమ్మర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లింగ్విస్టిక్స్ కార్యకలాపాలు సాగించుకునేందుకు అనుమతి ఇచ్చాడు. చమురు కంపెనీలు తమ ఉత్పత్తిని పెంచేందుకు 'తగిన' చర్యలు తీసుకున్నాడు హుర్టాడో.

ఒమర్ టోరిజోస్, చనిపోయిన రోల్డోస్ గురించి శ్లాఘిస్తూ, అతన్ని తన 'తమ్ముడు' అని అభివర్ణించాడు. తనను కూడా చంపేసినట్లు పీడకలలు వస్తున్నాయనీ - 'ఆకాశం నుండి ఒక అగ్నిగోళంలా రాలిపడిపోయినట్లనిపిస్తోంది' అనీ అన్నాడు.

అధ్యాయం 27

పనామా : మరొక అధ్యక్షుడి మృతి

రోల్డోస్ మరణం నన్ను నివ్వెర పరచింది. కానీ ఇది నిజంగా నేనూహించని పరిణామమా? నాకు అర్బెంజ్, మొస్సాదెగ్, అలెండీ - ఇంకా ఇటువంటి మరెందరి గురించో తెలుసును కదా. ఎవరి జీవితాలు ఎన్నడూ వార్తా పత్రికలకు ఎక్కలేదో, ఎవరి జీవితాలను చరిత్ర పుస్తకాలు విస్మరించాయో... కార్పొరేట్‌స్వామ్యాన్ని ఎదిరించి నిలబడ్డందుకు ఎవరి జీవితాలు నలిపివేయబడ్డాయో ...

కానీ ఇన్ని తెలిసినా నేను నివ్వెరపోయాను.

ఆ చర్యలోని నగ్నత్వం నన్ను కుదిపివేసింది.

సౌదీ అరేబియాలో మా అసామాన్య విజయం తరువాత ఇలాంటి బహిరంగ చర్యలు గత కాలపు వ్యవహారాలైపోయాయనుకున్నాను. గుంటనక్కలను జూకు పంపేశారని అనుకున్నాను. కానీ నేను తప్పుగా అర్థం చేసుకున్నానని ఇప్పుడు అర్థం అవుతోంది.

రోల్డోస్ మరణం ప్రమాదవశాత్తు జరిగింది కాదని అర్థమవుతోంది. దానిపై సిఐఏ ముద్ర స్పష్టంగా కనపడుతోంది. ఇది ఇలా బహిరంగంగా చేయడం ద్వారా వాళ్లో పాఠం చెప్పదలుచుకున్నారు. హాలీవుడ్ ఇమేజ్ గల రీగన్ ప్రభుత్వం అలాంటి పాఠం చెబితే బావుంటుందని అనుకున్నట్టున్నారు. గుంటనక్కలు మళ్లీ రంగంలోకి దిగాయి. వాటికి కార్పొరేటీకరణను వ్యతిరేకించే ఒమర్ టోరిజోస్ వంటి వారిని బతకనీయడం ఇష్టం లేదు.

అయితే టోరిజోస్ మాత్రం అదరలేదు, బెదరలేదు. రోల్డోస్ లాగానే అతను కూడా సమ్మర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లింగ్విస్టిక్స్‌ను దేశం నుండి బహిష్కరించాడు. పనామా కాలువ ఒప్పందం విషయమై మళ్లీ చర్చించాలన్న రీగన్ ప్రభుత్వం డిమాండ్‌ను తోసిపుచ్చాడు.

రోల్డోస్ మరణం తరువాత రెండు నెలలకు జులై 31, 1981 నాడు ఒమర్ టోరిజోస్ పీడకల నిజమైంది. అతను ప్రయాణిస్తున్న విమానం అకస్మాత్తుగా కూలిపోయింది. ఒమర్ ఈ దుర్ఘటనలో మరణించాడు.

ఈ సంఘటన లాటిన్ అమెరికా ప్రజానీకాన్నే కాక ప్రపంచ ప్రజలెందరినో కలచి వేసింది టోరిజోస్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది - పనామా కాలువపై పోరాడి హక్కును సాధించినందుకు, రీగన్ ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలిచినందుకు.

టోరిజోస్ మానవ హక్కుల కొరకు పాటుపడేవాడు. ఇరాన్ షా వంటి ఎందరికో రాజకీయ ఆశ్రయం ఇచ్చిన దొడ్డ మనస్సు, సామాజిక న్యాయం కొరకు ఎలుగెత్తిన గళం. చాలా మంది అతడిని నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేయొచ్చని అనుకునేవారు.

'ఇది సిఐఏ హత్య' అంటూ మరోసారి వార్తాపత్రికలు పతాకశీర్షికలు రాశాయి.

ప్రముఖ రచయిత గ్రాహంగ్రీన్ పుస్తకం 'గెట్టింగ్ టు నో ద జనరల్' ఇలా మొదలవుతుంది...

'ఆగస్ట్ 1981లో పనామాకు అయిదో సారి వెళ్ళేందుకు బ్యాగు సర్దుకుంటున్నాను. ఇంతలో నా ఆప్తమిత్రుడు జనరల్ ఒమర్ టోరిజోస్ హెర్రెరా మరణ వార్త నా చెవినపడింది. పనామాలోని కాక్లిసెటో పర్వతాలలో గల నివాసానికి, తన చిన్న విమానంలో బయల్దేరిన ఒమర్ అది కుప్ప కూలడంతో మరణించాడు. కొన్ని రోజుల తరువాత అతని భద్రతాధికారి సార్జెంట్ చుచు అలియాస్ జోస్ డి జెసస్ మార్టినెజ్ నాతో ఫోన్‌లో ఇలా అన్నాడు - 'ఆ విమానంలో బాంబు ఉంది. ఆ సంగతి నాకు కచ్చితంగా తెలుసు. కానీ అలా ఎందుకు జరిగిందో నేను నీకు ఫోన్‌లో వివరించలేను'.

పేదల, అసహాయుల బాగు కొరకు ఉద్యమించిన ఒమర్ మృతి పట్ల అందరూ దుఃఖించారు. సిఐఏ కార్యకలాపాలపై వాషింగ్టన్ పెద్దలు దర్యాప్తు జరిపించాలనే డిమాండ్ ఊపందుకుంది. అయితే అది అంత సులభంగా జరిగే పనికాదు. ఆ పెద్దలంతా టోరిజోస్‌ను ద్వేషించేవారే. అతని మరణానికంటే ముందు అతన్ని బహిరంగంగా విమర్శించిన వారి లిస్టు చూడండి: అమెరికా అధ్యక్షుడు రీగన్, ఉపాధ్యక్షుడు బుష్, రక్షణ శాఖ సెక్రటరీ వీన్‌బర్గర్, జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్, బహుళజాతి కంపెనీల సీఈఓలు...

పనామా కాలువ దాపునే గల అమెరికా ట్రాపికల్ కమాండ్ సెంటర్ ఎత్తేయాలని టోరిజోస్, మాజీ అమెరికా అధ్యక్షుడు జిమ్మీకార్టర్ ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఇప్పటి సైనిక ఉన్నతాధికారులకు అది కంటగింపయ్యింది. ఇప్పుడా సైనిక స్థావరాన్ని మరో దేశంలో స్థాపించాలంటే బోలెడంత శ్రమతో కూడుకున్న పని. దానికన్నా టోరిజోస్‌ను లేపేసి అతని వారసుడితో మళ్లీ బేరాలు కుదుర్చుకోవడం సులువు కదా!

టోరిజోన్ కున్న కార్పొరేట్ శత్రువుల్లో పెద్ద పెద్ద బహుళజాతి కంపెనీలున్నాయి. వీటన్నిటికీ అమెరికన్ రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలున్నాయి. అంతేకాదు ఇవన్నీ లాటిన్ అమెరికన్ శ్రమ శక్తినీ, చమురు, తగరం, రాగి, బాక్సైట్, కలప వంటి సహజ వనరులను దోచుకుంటున్న కంపెనీలే. ఉదాహరణకు జపాన్ వారితో కలిసి టోరిజోన్ కొత్త పనామా కాలువను నిర్మించాలనుకుంటున్నాడు. ఇది బహుళజాతి సంస్థ బెక్టెల్‌కు అసలు రుచించలేదు. ఆ సంస్థతో దగ్గరి సంబంధాలున్న జార్జ్ షుల్జ్, కాస్పర్ వీన్‌బర్గర్ వంటి వారు ఇప్పుడు అమెరికన్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు.

టోరిజోన్ ఇటువంటి వ్యక్తులను ఎదుర్కొన్నాడు. అతని వారసుడిగా వచ్చిన మాన్యుయెల్ నోరీగాకు ఈ రీగన్లు, బుష్లు, బెక్టెళ్లను ఎదుర్కొనే సత్తా లేదు.

ఒమర్ మరణం వ్యక్తిగతంగా నన్ను చాలా కుంగదీసింది. ఒక రోజు రాత్రి టోరిజోన్ ముఖచిత్రం గల పత్రిక నా కంటబడింది. నేను పనామాలో దిగిన వర్షపు రాత్రి మదిలోకి వచ్చింది. ఒమర్ హోర్డింగ్‌పై ఉన్న అక్షరాలు గుర్తొచ్చాయి.

'స్వేచ్ఛ ఒమర్ ఆశయం.

ఆశయాన్ని చంపే క్షిపణి ఇంకా కనిపెట్టబడలేదు'

ఒమర్, కార్టర్‌తో చర్చించి పనామా కాలువపై తిరిగి హక్కును పొందుతాడని అప్పుడు నేను అనుకోలేదు. లాటిన్ అమెరికాలోని వివిధ సోషలిస్టు అధ్యక్షులకూ, నియంతలకూ మధ్య విభేదాలు పరిష్కరించే ప్రయత్నం చేసి ఒమర్ వాషింగ్టన్ పెద్దల కన్నెర్రకు గురవుతాడనుకోలేదు. ఒక నిశీథి రాత్రి తన ఇంటికి బయల్దేరి విమానం కూలి మరణిస్తాడనీ, అమెరికా వెలుపలి ప్రపంచమంతా ముక్తకంఠంతో ఇది సిఐఏ హత్య అని అంటుందనీ నేనాడు ఊహించలేదు.

ఒకవేళ టోరిజోన్ బతికుంటే నిస్సందేహంగా అతను మధ్య, దక్షిణ అమెరికాలను దహిస్తున్న హింసాకాండను అదుపు చేయగలిగేవాడు. ఏదో ఒకనాడు అమెజాన్ ప్రాంతంలోని ఈక్వెడార్, కొలంబియా, పెరూలలో చమురు కంపెనీలు సాగిస్తున్న ధ్వంసరచనను అడ్డుకునేవాడు.

నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. ఒమర్ జీవించి ఉంటే అమెరికా, ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని ఒక కొత్త తరం నాయకులకు ఆదర్శమూర్తిగా నిలిచేవాడు - బహుశా అందుకే అతను సిఐఏ కు, ఎన్ఎస్ఏ కు, ఎకనామిక్ హిట్‌మెన్‌కు కంటగింపు అయ్యాడు.

అధ్యాయం 28

నా విద్యుత్ కంపెనీ, ఎన్రాన్, జార్జి బుష్

టోరిజోస్ మరణించే నాటికి నేను పౌలాను కలిసి నెలలు దాటింది. నేను ఇతర స్త్రీలతో స్నేహం చేయనారంభించాను. వారిలో విన్‌ఫ్రెడ్ గ్రాంట్ అనే స్త్రీ ఉండేది. తను మెయిన్‌లో పర్యావరణ ప్రణాళికలు తయారు చేసేది. వాళ్ల నాన్న బెక్టెల్‌లో చీఫ్ ఆర్కిటెక్ట్‌గా పనిచేసేవాడు.

సీబ్రూక్ అణువిద్యుత్ కేంద్రానికి నేను కన్సల్‌టెంట్‌గా పని చేసేవాడిని. అయితే నాకెందుకో డబ్బు కోసం అమ్ముడు పోయానని, నా పాత జీవన విధానంలోకి మళ్లీ జారిపోయానేమోనని అనిపించసాగింది.

విన్‌ఫ్రెడ్ నాకు చాలా తోడ్పడిందీ సమయంలో. మా అనుబంధం కూడా చాలా దృఢపడింది అదే సమయంలో. మేం కొన్నాళ్లు సెలవుపై ఫ్లోరిడా వెళ్లాం. అక్కడి వెస్ట్‌పామ్ బీచ్‌లో ఒక అపార్ట్‌మెంట్ కొనుక్కున్నాం. అక్కడే మా పెళ్లి జరిగింది. 1982 మే 17న మాకు జెస్సికా పుట్టింది. అప్పుడు నా వయస్సు 36.

నా కన్సల్‌టెంట్ ఉద్యోగంలో భాగంగా నేను న్యూ హాంప్‌షైర్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనే ప్రభుత్వ విభాగం ముందు అణువిద్యుత్ కేంద్రం స్థాపించడం లాభదాయకమే అని వాదించాల్సి వచ్చింది. అయితే అణువిద్యుత్ గురించి రోజురోజుకీ తెలుస్తున్న కొత్త విషయాలు - అదేమంత చౌకది, సురక్షితమైనదీ కాదని తెలుపుతున్నాయి. డబ్బు తీసుకుని అబద్ధాలు చెప్పడం నా వల్ల కాలేదు. అందుకే ఒక రోజు సీబ్రూక్ వారి వద్దకు వెళ్లి నేనిక అక్కడ పనిచేయలేనని చెప్పివచ్చేశాను.

జెస్సికా పుట్టిన కొన్ని నెలల తరువాత 1982లో నేను ఇండిపెండెంట్ పవర్ సిస్టమ్స్ (ఐపిఎస్) అనే కంపెనీ స్థాపించాను. పర్యావరణానికి మేలు చేకూర్చే విధంగా రూపకల్పన చేయబడ్డ కొత్త శ్రేణి విద్యుత్ కేంద్రాలు నిర్మించడం మా సంస్థ లక్ష్యం. అయితే ఈ రంగంలో స్థాపించిన కంపెనీలేవీ నిలదొక్కుకోలేక పోయాయి. కానీ నా కంపెనీ మాత్రం 'యాదృచ్ఛికంగా' లభించిన కొన్ని సహాయాల వల్ల నిలబడగలిగింది. నేనిదివరకు చేసిన పనులకు, ఇప్పుడు నా నోరు విప్పనందుకు, ప్రతిఫలంగానే ఈ సహాయాలు అందుతున్నాయని నాకు తెలుసు.

నా మాజీ బాస్ బ్రూనో జాంబొట్టి ఇప్పుడు ఇంటర్-అమెరికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లో ఉన్నత స్థాయి పదవిలో ఉన్నాడు. నేను అడగగానే నా ఐపిఎస్ కంపెనీ బోర్డులో చేరడానికి ఒప్పుకున్నాడు.

మా సంస్థకు అనేక సంస్థల నుండి ఆర్థిక సాయం లభించింది. అవి - బ్యాంకర్స్ ట్రస్ట్, ఉఎస్ఐ ఎనర్జీ, ప్రూడెన్షియల్ ఇన్సూరెన్స్ కంపెనీ, చాడ్‌బోర్న్ అండ్ పార్క్, రై స్టోకర్ కార్పొరేషన్.

అమెరికన్ కాంగ్రెస్ (పార్లమెంట్) కూడా ఒక ప్రభుత్వ పన్ను నుండి మా కంపెనీని మినహాయించి మాకెంతో తోడ్పడింది.

1986లో ఐపిఎస్, బెక్టెల్ ఒకేసారి - వేర్వేరుగా - అమ్ల వర్షం కురిపించకుండా వృథా బొగ్గును మండించే నవీన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ కేంద్రాలను నిర్మించడం మొదలుపెట్టాయి. ఎంతో కాలంగా విద్యుత్ కంపెనీలు సాధ్యం కాదంటూ వదిలేస్తున్న వ్యర్థాలను వినియోగించి చూపడం ద్వారా మేం అమెరికన్ ప్రభుత్వ పర్యావరణ చట్టాలను కూడా సవరింపజేయగలిగాం. విద్యుత్ ఉత్పత్తిలో వెలువడే వేడిమిని కూడా కూలింగ్ టవర్‌కు తరలించి వృథా పరచకుండా ఓ గ్రీన్‌హౌస్‌కు ఉపయోగించేవాళ్లం.

ఐపిఎస్ కంపెనీకి అధ్యక్షుడిగా నాకు ఇంధన పరిశ్రమ లోతుపాతులన్నీ తెలిసాయి. బెక్టెల్‌లో ముప్పై ఏళ్లు పనిచేసిన మా మామగారి తోడ్పాటు కూడా నాకు ఉపయోగపడింది.

ఆ కాలంలో ఇంధన రంగం పెనుమార్పులకు వేదిక అయింది. ప్రభుత్వాలు సరళీకరణ చర్యలు తీసుకుంటుండడంతో కొత్త ద్వారాలు తెరుచుకుంటున్నాయి.

అయితే మా పూర్వ కంపెనీ అయిన మెయిన్ శరవేగంగా వస్తున్న ఈ మార్పులకు అనుగుణంగా మార్పు చెందలేకపోయింది. అంతేకాక యాజమాన్యం చేసిన వరుస తప్పిదాలు మెయిన్ పుట్టిముంచాయి. నష్టాల ఊబిలో చిక్కుకున్న మెయిన్‌ను దాని భాగస్వాములు ఒక భారీ ఇంజనీరింగ్ నిర్మాణ కంపెనీకి తెగనమ్మారు. 1980లో నేను వదిలేసినప్పుడు నా వద్ద ఉన్న మెయిన్ షేరు ఒక్కంటికి ముప్పై డాలర్లు లభిస్తే, కంపెనీ అమ్మినప్పుడు మా పార్టనర్లకు అందులో సగం కూడా లభించలేదు.

కొన్నేళ్ల తర్వాత మెయిన్‌ను కొన్న కంపెనీ మెయిన్ ఉద్యోగులను తనలో కలిపేసుకోవడంతో వందేళ్ల పైచిలుకు ఒక వెలుగు వెలిగిన మెయిన్ కాలగర్భంలో కలిసిపోయింది.

ఇదే సమయంలో నింగికెగసిన మరో కంపెనీ గురించి చెప్పాలి. అదే ఎన్రాన్. ఎక్కడ్నించి వచ్చిందో కూడా తెలియని ఈ బుల్లి కంపెనీ అనతికాలంలోనే అందరి దృష్టినీ ఆకర్షించి తారాపథంలోకి దూసుకుపోయింది. పరిశ్రమలో ఉన్న మా బోటి వారం ఎక్కడ కలిసినా ఎన్రాన్ గురించే చర్చ. కంపెనీ వెలుపలి వారికి దాని అనూహ్య ఎదుగుదల ఎప్పటికీ అర్థం కాని మిస్టరీనే. ఇదే విషయం అడిగితే ఎన్రాన్‌కు చెందిన వారి నుండి చిరునవ్వే సమాధానమయ్యేది. మరీ ప్రశ్నలతో వేధిస్తే, తాము కంపెనీ నిర్వహణలో 'కొత్త పుంతలు' తొక్కుతున్నామనీ, తమ ఉద్యోగులకు అనేక దేశాల్లో అత్యున్నత స్థాయి 'సంబంధాలు' ఉన్నాయనీ వారు వెల్లడించేవారు.

నాకైతే ఇదేదో కొత్త తరహా ఎకనామిక్ హిట్‌మెన్ పద్ధతి అనిపించేది.

అంతర్జాతీయ చమురు పరిశ్రమపై దృష్టి కేంద్రీకరించిన మా వంటి వారం తరచుగా ఉపాధ్యక్షుడి పుత్రరత్నం అయిన జార్జ్.డబ్ల్యూ.బుష్ గురించి కూడా మాట్లాడుకునేవాళ్లం. అతను మొదట అర్బస్టో అనే ఒక ఇంధన కంపెనీని నెలకొల్పాడు. అది నష్టాల్లో కూరుకుపోవడంతో 1984లో దాన్ని స్పెక్ట్రమ్ 7 అనే కంపెనీ తనలో విలీనం చేసుకుంది. స్పెక్ట్రమ్ కూడా నడవలేని స్థితికి చేరుకునేసరికి 1986లో దాన్ని హార్కెన్ ఎనర్జీ కార్పొరేషన్ అనే కంపెనీ కొనేసింది. జార్జ్. డబ్ల్యూ. బుష్‌ను లక్షా ఇరవై వేల డాలర్ల సంవత్సర జీతమిచ్చి బోర్డు సభ్యుడిగా, కన్సల్‌టెంట్‌గా నియమించుకుంది హార్కెన్.

ఇక అక్కడి నుండి హార్కెన్ ఎనర్జీ ఎన్నడూ వెనక్కి తిరిగి చూసుకోలేదు. విదేశీ మార్కెట్లలో చమురు అన్వేషణ మొదలుపెట్టింది. అదేం విచిత్రమో కానీ అదృష్టలక్ష్మి ఎప్పుడూ హార్కెన్ వెన్నంటే ఉండేది. 'అనూహ్యమైన' కొత్త పెట్టుబడులూ, ఆర్థిక సాయాలూ, బంగారం వంటి చమురు అన్వేషణ హక్కులు అన్నీ వచ్చి ఆ కంపెనీ ఒడిలో వాలాయి. ఈ ఎన్రాన్‌లు, హార్కెన్లు ఎలా 'వృద్ధి' చెందుతున్నాయో నాకు మాత్రం స్పష్టంగా అర్థం అయింది.

అధ్యాయం 29

మరోసారి అమ్ముడు పోయాను

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఒక కొత్త యుగంలోకి అడుగిడిందని అర్థం అవుతోంది నాకు. రక్షణశాఖ సెక్రటరీ నుండి ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడి హోదాకు మారిన రాబర్ట్ మెక్‌నమారా నేతృత్వంలో జరిగిన ఈ మార్పులు నాలో ఉన్న భయాలను నిజం చేశాయి.

ఇప్పుడు ఎకనామిక్ హిట్‌మెన్ అన్ని రంగాలకూ విస్తరించారు. నాలాగా వారిని నేషనల్ సెక్యూరిటీ ఏజన్సీ ఇప్పుడు రహస్యంగా నియమించట్లేదు. కానీ వారు నేను చేసినటువంటి పనులే చేస్తున్నారు.

ఇప్పుడొస్తున్న మా బహుళజాతి కంపెనీల అధికారులు మేం చేసినట్లు బ్యాంకుల రుణాల వితరణ అంశాల్లో జోక్యం చేసుకోరు. కానీ ఈ కొత్త తరం ఇంకొంచెం ప్రమాదకరమైన పనులు చేస్తోంది. 1980లలో ఒక కొత్తతరం యువతీయువకుల బృందం బహుళజాతి కంపెనీ మేనేజర్లు అయ్యారు. తమ లాభాల లక్ష్యం చేరడానికి ఏ మార్గం పట్టినా తప్పులేదన్నది వారి సిద్ధాంతం. ఇప్పుడు సామ్రాజ్యవాదం లాభాల వర్షం కురిపించే ఒక సాధనం మాత్రమే.

మా ఇంధన రంగంలో శరవేగంగా చోటు చేసుకుంటున్న మార్పులు ప్రపంచం మొత్తాన్ని కుదిపేస్తున్న మార్పుకు సూచికలు. ఇప్పుడు సామాజిక శ్రేయస్సు పర్యావరణం, మెరుగైన జీవనవిధానం వంటివన్నీ దురాశ ముందు కనబడకుండా పోయాయి. ప్రైవేటు వ్యాపారానికి పెద్దపీట వెయ్యబడింది. కమ్యూనిజాన్ని ఎదుర్కొనడానికి పెట్టుబడిదారీ విధానమే తగిన మందు అని మొదట్లో దీనికో సైద్ధాంతిక సమర్థన ఉండేది.

కొన్నాళ్లు గడిచాక ఆ కుంటిసాకు కూడా అవసరం లేకపోయింది. ప్రభుత్వం చేతిలో కన్నా ధనిక వ్యాపారుల చేతిలోనే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉండటం మెరుగనే ఓ కొత్త వాదన బయల్దేరింది. ప్రపంచ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు ఇటువంటి ప్రచారం చేసేవి. అప్పటి వరకూ ప్రభుత్వం చేతిలో ఉన్న

లాగు నీటి వ్యవస్థను, మురుగు పారుదల వ్యవస్థనీ, సమాచార వ్యవస్థనీ, విద్యుత్ వ్యవస్థలనూ ప్రైవేటు పరం చేయాలని ఉద్బోధించేవి.

అందుకే ఇప్పుడు అనేక మంది దళారీలు వచ్చారు. మేం ఇదివరకు రహస్యంగా చేసిన పనులు చేయడానికి, బహుళజాతి కంపెనీల మేనేజర్లు ఇప్పుడు విశ్వమంతా జల్లెడ పడుతున్నారు - చౌకగా దొరికే శ్రమశక్తి కోసం, తేలిగ్గా దొరికే సహజవనరుల కోసం, ఉత్పత్తులు అమ్ముకునేందుకు పెద్ద మార్కెట్ల కోసం.

వీళ్లు కూడా మాలాగే నిర్దాక్షిణ్యంగా ఉంటారు. మాలాగే వారు దేశాలనీ, వాటి ప్రజలనీ రుణాల ఉచ్చులో బిగిస్తారు. ప్రైవేటీకరణ ద్వారా ఎనలేని లాభాలుంటాయనీ, తద్వారా పోగుపడిన సంపదతో ఈ రుణాలు అవలీలగా తీర్చెయ్యొచ్చనీ నమ్మబలుకుతారు. జనాల మెప్పు కొరకు వాళ్లు స్కూళ్లు, రహదారులు నిర్మిస్తారు, ఫోన్లు, టీవీలు, ఆరోగ్య సేవలు అందిస్తారు. చివరకు మరో దేశంలో ఇక్కడికన్నా చౌక పనివారు దొరుకుతారని, ఇక్కడి కన్నా తేలికగా వనరులు లభ్యమవుతాయని తెలిసిందో, తట్టాబుట్టా సర్దుకుని బిచాణా ఎత్తేస్తారు.

తాము ఇంతకాలం ఆశల పల్లకీలో ఊరేగించిన ప్రజల ఆశలు నేలరాలినా, వారి జీవితాలు నాశనమైనా ఈ కంపెనీల ప్రతినిధులు క్షణకాలమైనా వారి గురించి ఆలోచించరు.

నాకు మాత్రం ఐపిఎస్ కంపెనీ లాభాల బాటలో నడవడం, నా కుటుంబ జీవనం ఆనందంగా గడుస్తుండటం వంటి మంచి సంతోషకరమైన పరిణామాలు జరుగుతున్నా అప్పుడప్పుడూ మానసిక ఆందోళన ఆవహించేది. ఎదుగుతున్న నా కూతురిని చూసినప్పుడల్లా తను ఎలాంటి ప్రపంచాన్ని వారసత్వంగా పొందబోతుందోనని భయం వేసేది. అటువంటి భయానకమైన ప్రపంచాన్ని ఆవిష్కరించడంలో నేను పోషించిన పాత్ర నన్ను వెన్నాడేది.

ఒకసారి వెనుదిరిగి చూస్తే ఇప్పుడు జరుగుతున్న మార్పులకు చాలా కంచివేసే చరిత్ర ఉంది. రెండో ప్రపంచ యుద్ధం ముగుస్తున్న దశలో మా స్వరాష్ట్రమైన న్యూహాంప్‌షైర్‌లో గల బ్రెట్టన్‌ఉడ్స్‌లో జరిగిన ఓ సమావేశంలోనే ఆ నిర్ణయం జరిగింది. యుద్ధానంతరం విధ్వంసమైన యూరప్‌ను పునర్నిర్మించే బృహత్తర బాధ్యతను నెరవేర్చడానికే ప్రపంచబ్యాంక్‌ను, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)ని స్థాపించాలని నిర్ణయించారు. ఆ పనిలో అవి బాగానే సఫలం అయ్యాయి. తదనంతర కాలంలో అన్ని అమెరికన్ మిత్ర దేశాలు ఈ రుణ వ్యవస్థను సమర్థించాయి. కమ్యూనిజం కబంధ హస్తాల నుండి ప్రపంచాన్ని రక్షించేందుకు ఇదే మార్గమని వాళ్లు నూరిపోశారు.

1980ల చివరినాటికి సోవియెట్ యూనియన్ పతనం తరువాత కమ్యూనిజాన్ని అడ్డుకోవడం అసలీ సంస్థల లక్ష్యం కాకుండా పోయింది. పెట్టుబడిదారీ విధానాలకు పుట్టిన గ్లోబల్ సామ్రాజ్యవాదానికి ఇక ఎదురులేని పరిస్థితి తయారైంది.

ఇవన్నిటి గురించీ ఆలోచించడం వల్ల నాకు నా జీవిత అనుభవాలు అన్నీ ఒక పుస్తకంగా రాయాలనే సంకల్పం కలిగేది. అయితే నేను రాయబోయే పుస్తకం విషయం ఏ మాత్రం రహస్యంగా ఉంచలేదు. ఏకాంతంగా కూర్చుని రాసుకోవడం నాకు ఏనాడూ చేతగాని పని. నలుగురిలో చర్చించి రాయడం నా పద్ధతి. నా పరిచయస్తులను కలవడం, కొన్ని విషయాలను సరిగా అర్థం చేసుకోవడంలో వారి సహాయం తీసుకోవడం, రాసిన అధ్యాయాలను స్నేహితులకు వినిపించి వారి సూచనలు తీసుకోవడం - ఇదీ నా పద్ధతి. ఇది కొంచెం ప్రమాదకరమైన పద్ధతి కావొచ్చేమో కానీ మరోలా రాయడం నా వల్లగాదు.

అందుకే నేను మెయిన్‌లో గడిపిన రోజుల గురించి ఓ పుస్తకం రాస్తున్నాననే విషయం చాలా మందికే తెలిసింది.

1987లో ఓ మధ్యాహ్నం మెయిన్ కంపెనీ భాగస్వాముల్లో ఒకాయన నాకు ఫోన్ చేశాడు. స్టోన్ అండ్ వెబ్‌స్టర్ ఇంజనీరింగ్ కార్పొరేషన్ అనే ప్రఖ్యాత బహుళజాతి కంపెనీలో కన్సల్టెంట్ ఉద్యోగం ఒకటుందనీ, జీతం చాలా ఎక్కువ ఉంటుందనీ చెప్పాడు.

స్టోన్ అండ్ వెబ్‌స్టర్ ప్రపంచంలోనే అత్యున్నత శ్రేణి ఇంజనీరింగ్, నిర్మాణ సంస్థ. నాకు ఇవ్వజూపిన కన్సల్టెంట్ ఉద్యోగం ఆ సంస్థ కొత్తగా నెలకొల్పిన మరో విద్యుత్ కంపెనీ కొరకు. అయితే ఇదివరకులా ఎకనామిక్ హిట్‌మాన్ పనులేవీ ఇందులో ఉండవని నాకు భరోసా ఇచ్చారు.

ఆ మాటకొస్తే నాకు పెద్దగా పనేమీ ఉండదనీ, ఐపిఎస్ వంటి స్వతంత్ర విద్యుత్ కంపెనీని విజయవంతంగా నడిపినందుకూ, పరిశ్రమలో నాకున్న మంచి పేరును ఉపయోగించుకోవాలనీ, నా పేరును వారి సలహాదారుల లిస్టులో పెట్టుకుని తద్వారా లబ్ధి పొందాలని ఆ కంపెనీ అనుకుంటున్నదనీ నా చెవిన వేశాడు మా మాజీ కంపెనీ భాగస్వామి.

నాక్కూడా ఇదేదో బాగానే ఉందనిపించింది. మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా ఎలాగూ నేను మా ఐపిఎస్ కంపెనీని అమ్మేద్దామనే అనుకుంటున్నాను. స్వంతంగా కంపెనీని నడపడంలో ఉన్న ఒత్తిడిని నేనెందుకో తట్టుకోలేకపోతున్నాను.

నేను స్టోన్ అండ్ వెబ్‌స్టర్‌లో చేరిననాడే ఆ కంపెనీ సీఈఓ నన్ను లంచ్‌కి తీసుకువెళ్ళాడు. మా మాటల సందర్భంగా నా మనస్సు కన్సల్టెన్సీ పనులు

చెయ్యడానికెంత ఉవ్విళ్లూరుతుందో నాకు అర్థమైంది. ఇక్కడ వచ్చే ఫీజుతో ఏదైనా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి సమాజానికి సేవ చేయాలని అప్పటికే నిర్ణయించేసుకున్నాను.

ఐస్‌క్రీమ్ తింటుండగా ఆ సీఈఓ నేను ఇదివరకే రాసిన 'ది ట్రైన్ ఫ్రీ హాబిట్' అనే పుస్తకం ప్రస్తావన తీసుకొచ్చాడు. ఆ పుస్తకం గురించి చాలా విన్నానని చెప్పాడతను. క్షణమాగి నా కళ్లలోకి ఓరకంట చూస్తూ 'ఇంకేమయినా పుస్తకాలు రాయాలనుకుంటున్నారా' అని అడిగాడు.

నాకు పొలమారినట్టయింది. ఈ సంభాషణ ఎటు దారితీస్తుందో అర్థం అయింది నాకు.

'అలాంటిదేమీ లేదు' అన్నాను తొణక్కుండా.

'చాలా సంతోషం. మా కంపెనీలో కొన్ని విషయాలు బహిరంగపరచడం మాకు అంతగా ఇష్టం ఉండదు. అచ్చం మీ పూర్వ కంపెనీ మెయిన్ లాగానే'.

'నాకు ఆ సంగతి తెలుసు' అన్నాను నేను.

అతను కొంచెం కులాసాగా కనిపించాడా మాట విని.

'మీరిదివరకు రాసిన లాంటి పుస్తకాలు రాస్తే మాకేం అభ్యంతరం లేదు. చెప్పాలంటే మన కెరీర్‌కు అలాంటి వాటి వల్ల చాలా లాభం కలుగుతుంది కూడా' నా మొహం కేసి పరీక్షగా చూస్తూ అన్నాడు.

'చాలా సంతోషం' బదులిచ్చాను.

'మీరు రాసే ఏ పుస్తకంలోను మా కంపెనీ పేరు గానీ, మీరు ఇదివరకు చేసిన పనుల గురించి గానీ, ఏ రాజకీయ విషయాల గురించి గానీ, అంతర్జాతీయ బ్యాంకుల వ్యవహారాల గురించి గానీ ప్రస్తావించకూడదు'.

'మీరు మరీ అంతగా చెప్పాలా?' అన్నాను మోముపై బలవంతపు నవ్వు పులుముకుని.

నా హృదయం ఒక్క క్షణం కొట్టుకోవడం ఆగిపోయినట్టనిపించింది. పాత ఆలోచనలు నన్ను కమ్మేశాయి. ఇండోనేషియాలో హోవార్డ్ పార్కర్‌ను కలిసినప్పటివి, పనామా సిటీ వీథులలో ఫిడెల్‌తో కలిసి తిరిగినప్పటివీ, కొలంబియాలో పౌలాతో కలిసి మాట్లాడిన మాటలూ...

నేను మరోసారి అమ్ముడుపోతున్నాను.

ఇది లంచం కాకపోవచ్చు - నాకో కన్సల్టెంట్ ఉద్యోగమివ్వడం, భారీ ఫీజు కూడా ఇవ్వడం ...

ఆ రోజు సాయంత్రం ఫ్లోరిడా తిరిగి వెళ్లడానికి నేను ఎయిర్‌పోర్ట్‌లో కూర్చున్నప్పుడు నాపై నాకే అసహ్యం వేసింది. నేను శరీరాన్నమ్ముకునే వేశ్య కన్నా హీనం.

కానీ నాకు ఇంకో మార్గాంతరం లేదు. ఈ లంచం ఒప్పుకోకపోయుంటే తప్పనిసరిగా బెదిరింపులు వచ్చేవి.

అధ్యాయం 30

పనామా దురాక్రమణ

టోరిజోస్ మృతి తరువాత కూడా పనామాకు నా హృదయంలో ఒక ప్రత్యేక స్థానం ఉండేది. దక్షిణ ఫ్లోరిడాలో నివసించే నేను మధ్య అమెరికా విశేషాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేవాడిని.

పనామా నూతన అధ్యక్షుడయిన మాన్యుయెల్ నోరిగా మొదట్లో టోరిజోస్ బాటలోనే నడిచినట్టు కనబడ్డాడు. నేనెన్నడూ ఆయనను కలవలేదు కానీ నేను విన్నదాని ప్రకారం ఇతను కూడా లాటిన్ అమెరికా పేదల, అణగారిన వర్గాల పట్ల పక్షపాతంతోనే ఉన్నాడు. కొత్త పనామా కాలువ నిర్మాణం కొరకు ఒమర్ టోరిజోస్ మొదలు పెట్టిన ప్రణాళికలు పూర్తి చేయడం కొరకు జపనీయులతో చురుగ్గా చర్చలు మొదలుపెట్టాడు. సహజంగానే వాషింగ్టన్ పెద్దలూ, అమెరికన్ బహుళజాతి కంపెనీలూ కన్నెర్రజేశాయి.

ఈ కోపానికి కారణాలు నోరిగా ఆత్మకథలో ఆయన మాటల్లోనే చదవండి:

> *'అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ జార్జ్ షుల్జ్ బహుళజాతి నిర్మాణ కంపెనీ బెక్టెల్ మాజీ ఉద్యోగి. రక్షణ సెక్రటరీ కాస్పర్ వీన్‌బెర్గర్ బెక్టెల్ మాజీ ఉపాధ్యక్షుడు. ఈ కొత్త కాలువ నిర్మాణం ద్వారా కోట్లు ఆర్జించవచ్చని బెక్టెల్ ఆశ. రీగన్, బుష్ ప్రభుత్వాలకేమో ఈ కాలువ ప్రాజెక్ట్ జపాన్ ఎక్కడ తన్నుకుపోతుందోనని భయం'.*

కానీ నోరిగా ఎప్పటికీ టోరిజోస్ కాలేకపోయాడు. పూర్వాశ్రమంలో నోరిగా పనామా రక్షణ గూఢచార సంస్థ అయిన జి-2 యూనిట్‌లో పనిచేసేవాడు. ఆ రోజుల్లోనే సిఐఏ డైరెక్టర్ విలియం కేసీ తో సంబంధాలు పెంచుకున్నాడు.

నోరిగా అధ్యక్షుడయ్యాక రీగన్ ప్రభుత్వం ఈ అనుబంధాన్ని బాగా ఉపయోగించుకుంది. ఉదాహరణకు 1983లో గ్రెనెడా పై అమెరికా దాడి జరపడానికి ముందు ఈ సమాచారాన్ని పొరుగున ఉన్న క్యూబాకు చేరవేయడానికి నోరిగానే వాడుకుంది అమెరికా.

1984లో పనామాను దర్శించడానికి వచ్చిన సిఐఏ డైరెక్టర్ కేసీ విమానాశ్రయంలో దిగగానే స్థానిక సిఐఏ అధికారులతో,

'మా అబ్బాయి నోరిగా ఎక్కడ?' అని అడిగాడట.

తనకు సిఐఏ అండ ఉండటంతో ఇక ఎదురేలేదని నోరిగా నమ్మేవాడు.

కానీ అవినీతి, మాదక ద్రవ్యాల వ్యాపారాల్లో అతనికి భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో త్వరలోనే అతని ప్రతిష్ఠ మంటగలిసింది. 1986 జూన్ 12న న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఇదే విషయాన్ని పతాక శీర్షికలకెక్కించింది. అతనికి లాటిన్ అమెరికాలోని అనేక చీకటి వ్యాపారాల్లో వాటా ఉన్నదనీ, ఇటు అమెరికాకు, అటు క్యూబాకు డబుల్ ఏజెంట్‌లా పనిచేస్తున్నాడనీ, హ్యూగో స్పాడాఫొరా అనే ప్రతిపక్ష నాయకుడిని చంపించాడనీ, పనామాలో మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని అతను స్వయంగా నడుపుతాడనీ టైమ్స్ రాసిందా కథనంలో.

పనామాలో ఉన్న అమెరికన్ సైనిక శిక్షణ కేంద్రం 'స్కూల్ ఆఫ్ అమెరికాస్' ను మరో పదిహేనేళ్లు ఉండనీయాలన్న అమెరికా విజ్ఞప్తిని నోరిగా తిరస్కరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

1989 డిసెంబర్ 20 నాడు అనేక మందిని విభ్రాంతికి గురిచేస్తూ పనామాపై ఏకపక్ష దాడికి దిగింది అమెరికా. రెండో ప్రపంచ యుద్ధం తరువాత జరిగిన అతి పెద్ద వైమానిక దాడిగా అభివర్ణించబడిందీ దాడి. ఎలాంటి కవ్వింపూ లేకుండా సాధారణ పౌరులపై జరిగిన అమానుష దాడి. పనామా ప్రజలు అమెరికన్ ప్రభుత్వానికి ఎటువంటి హాని తలపెట్టాలని యత్నించలేదు. ఈ యుద్ధం అనైతికమని, ఇది అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించటమేనని అనేక మంది దేశాధ్యక్షులు, మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు.

ఇదే దాడిని సామూహిక జనహననం చేస్తున్న, మానవ హక్కులను హరిస్తున్న పినోషె (చిలీ)పైనో, స్ట్రోస్నర్ (పరాగ్వే)పైనో, సోమోజా (నికరాగువా)పైనో, డి అబుసన్ (ఎల్‌సాల్వడార్)పైనో, సద్దాం (ఇరాక్)పైనో చేసి ఉంటే బహుశా ప్రపంచం అర్థం చేసుకునేదేమో. కానీ పనామా అటువంటి నేరమేమీ చేయలేదు. అది చేసిన నేరమల్లా గుప్పెడు మంది అమెరికన్ ప్రభుత్వ పెద్దలను, బహుళజాతి కంపెనీల ప్రతినిధులను వ్యతిరేకించడమే. తన దేశంలో ఒక కాలువను తనకు నచ్చిన వారితో నిర్మింపజేసుకోవాలనే ఆకాంక్షలను వ్యక్తపరచడమే. తనపై బురద జల్లి పనామాపై దాడి జరపడానికి కేవలం కాలువ నిర్మాణంలో గల ఆర్థిక అంశాలే కారణమని తరువాత నోరిగా ఆత్మకథలో విస్పష్టంగా వెల్లడించాడు.

కేవలం ఒక వ్యక్తి కోసం ఈ దాడి జరిపింది అమెరికా. పనామా సిటీ పట్టణంలో అనేక ప్రాంతాలను అగ్గికి ఆహుతి చేయడం, అమాయక పనామా

రైతులనూ, పసి పిల్లలనూ ఊచకోత కోయడం కేవలం నోరిగా ఒక్కడి కోసం. అతనో ప్రజాకంటకుడనీ, మాదక ద్రవ్యాల స్మగ్లర్ అన్న నెపంతో ఇరవై లక్షల మంది జనాభా గల ఈ దేశంపై విరుచుకుపడింది అగ్రరాజ్యం.

పనామా పై దాడి నన్ను చాలా రోజులపాటు ఆందోళనలో ముంచేసింది. ఈ అరాచకం గురించి ఆలోచించిన కొద్దీ అమెరికా సామ్రాజ్య విస్తరణకు పాత పద్ధతులనే తిరిగి ఉపయోగించడమనే విధానానికి తెరలేపిందని అనిపించేది నాకు. తన పంతం నెగ్గించుకోవడానికి రీగన్ ప్రభుత్వం కన్నా రెండాకులు ఎక్కువే చదివానని బుష్ ప్రభుత్వం నిరూపించుకుంటోందిక్కడ.

పనామాపై దాడి ద్వారా ఇరాక్ వంటి ఇతర దేశాలకు కూడా ఒక సందేశం పంపదల్చుకుంది అమెరికా.

న్యూయార్క్ టైమ్స్ పత్రికలో ఎడిటర్‌గానున్న డేవిడ్ హారిస్ 2001లో తను రాసిన 'షూటింగ్ ద మూన్'లో ఇలా అంటాడు

'అమెరికా ఇంతవరకూ ఎంతో మంది ప్రభువులతో, నాయకులతో, నియంతలతో వ్యవహారం నడిపింది కానీ ఇంత శక్తివంతంగా దాడి జరిపింది ఒక్క జనరల్ మాన్యూయెల్ ఆంటోనియో నోరిగా పైనే. అమెరికా తన 225 ఏళ్ల జాతి చరిత్రలో ఒక విదేశీ గడ్డపై దాడి జరిపి దాని అధ్యక్షుడిని తన దేశానికి తీసుకువచ్చి, విచారించి తన శిక్షాస్మృతి ప్రకారం విచారణ జరిపి శిక్ష విధించడం ఇదే మొదటిసారి'.

పనామాపై బాంబుల వర్షం కురిపించాక అమెరికా అకస్మాత్తుగా ఆత్మ రక్షణలో పడింది. అంతర్జాతీయ సమాజం ముందు టెర్రరిజం చేసే దాదా వలె నగ్నంగా నిలబడింది. బాంబు దాడులు జరిపిన ప్రాంతాల్లోకి రెడ్‌క్రాస్ సిబ్బందినీ, మీడియా వారినీ, స్వతంత్ర పరిశీలకులనూ రాకుండా మూడు రోజుల పాటు అమెరికా సైన్యం అడ్డుకుంది. ఈ సమయంలో సైనికులు అనేక శవాలను మాయం చేశారు.

అగ్రరాజ్యపు నేరపూరిత వైఖరిపై, సరైన సమయంలో వైద్య సహాయం అందక మరణించిన వారి సంఖ్య గురించి మీడియా అడిగిన ఎన్నో ప్రశ్నలకు జవాబులు ఎన్నటికీ లభించనేలేదు.

అమెరికా రక్షణ సెక్రటరీ రిచర్డ్ షెనీ అయిదారు వందల మంది మరణించారని ప్రకటిస్తే, ఈ సంఖ్య మూడు నుండి అయిదు వేల దాకా ఉండొచ్చని, మరో పాతిక వేల మంది నిరాశ్రయులయ్యారనీ స్వతంత్ర సంస్థలు వెల్లడించాయి. నోరిగాను అరెస్ట్ చేసి మియామీకి తరలించి అక్కడ అతనికి నలభై ఏళ్ల కారాగార శిక్ష విధించారు. ఆ సమయానికి అమెరికాలో అధికారికంగా ఉన్న ఏకైక యుద్ధ ఖైదీ అతడే.

ఈ దుశ్చర్యపై అంతర్జాతీయంగా ఖండనలు వెలువడ్డాయి. కానీ ఆశ్చర్యకరంగా అమెరికా పౌరులలో అత్యధికులకు ఈ విషయాలు తెలియవు. ప్రభుత్వం అక్కడి పత్రికలపై, టీవీ ఛానెళ్లపై విపరీతంగా ఒత్తిడి చేసి ఈ వార్తలు ప్రముఖంగా రాకుండా 'అన్ని' జాగ్రత్తలూ తీసుకోవడమే దానికి కారణం.

టోరిజోస్ రాక మునుపు పనామాను ఏలిన అరియాస్ కుటుంబానికే దేశాన్ని ఏలే అవకాశం కల్పించింది అమెరికా. పనామా కాలువపై తిరిగి తన ఆధిపత్యాన్ని ఏర్పరచుకుంది.

నా మదిలో అవే పాత ప్రశ్నలు మళ్లీ మళ్లీ... - చారిత్రక ప్రాధాన్యం కలిగి, కోట్ల మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలు ఎలా తీసుకోబడతాయి? కొంత మంది వ్యక్తుల వ్యక్తిగత స్వార్థం కోసమా లేక న్యాయమైన పని చేయడం కోసమా?

స్టోన్ అండ్ వెబ్‌స్టర్ అధ్యక్షుడికి మాట ఇచ్చినప్పటికీ నేను రహస్యంగా నా పుస్తకం రాయడం మొదలెట్టాను. అందులో టోరిజోస్ కథకు అధిక ప్రాధాన్యతనిచ్చాను. ఈ ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అన్యాయాలను బైటపెట్టడానికి అది మంచి ఉదాహరణ కాగలదని నా విశ్వాసం.

పుస్తకం రాస్తుంటే నాకు మా ఎకనామిక్ హిట్‌మెన్ సాధించినదాని విశ్వరూపం అర్థం కాసాగింది. నేను పని చేసిన దేశాల జాబితా, ఆ తరువాత ఆ దేశాలు నాశనమైన తీరు నన్ను ఆశ్చర్యపరచింది. నేను నా రోజువారీ కార్యకలాపాలలో భాగంగా ఆయా పనులు చేసినప్పుడు నాకు వాటి పర్యవసానాలు అర్థం కాలేదు.

నాకో సైనికుని రూపం గుర్తొచ్చింది. మొదట్లో అమాయకంగానే ఉంటాడతను. మనుషులను చంపడంలోని నైతికతను ప్రశ్నిస్తాడు. అతను తన మనుగడ గురించీ, తన భయాల గురించీ ఆలోచిస్తాడు. మొదటిసారి శత్రువును చంపినప్పుడు తీవ్రమైన భావావేశానికి లోనవుతాడు. చనిపోయిన వ్యక్తి కుటుంబం గురించి మథనపడతాడు, పశ్చాత్తాప పడతాడు. సమయం గడిచే కొద్దీ అతను చాలా యుద్ధాలలో పాల్గొంటాడు. ఇంకా ఎక్కువ మందిని చంపుతాడు. రాటుదేలుతాడు. పరిపూర్ణ సైనికుడవుతాడు.

ఇప్పుడు నేనూ పరిపూర్ణ సైనికుడినయ్యాను!

నేరాలు ఎలా జరుగుతాయో, సామ్రాజ్యాలు ఎలా నిర్మింపబడతాయో ఆ నిజం నాకు అవగతమయ్యేలా చేసింది.

ఎకనామిక్ హిట్‌మాన్‌గా నేను నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ నుంచి గాని, మరే ప్రభుత్వ ఏజెన్సీ నుండి గాని ఒక్క చిల్లి గవ్వ జీతంగా తీసుకోలేదు. నాకు

శతం మెయిన్ ఇచ్చింది. ఒక ప్రైవేట్ కంపెనీ ఉద్యోగిని నేను. ప్రపంచ చిత్రంపై ఓ కొత్త రకం సైనికులు ఆవిష్కృతమయ్యారు. వీరు తమ చర్యల పరిణామాల పట్ల ఏమాత్రం సున్నితత్వం లేని వారు.

నా పుస్తకంలో నేనిలా రాశాను:

'ఇవ్వాళ పని కోసం ఆరాటపడే మనుషులను వెతుకుతూ మన వాళ్లు థాయిలాండ్, ఫిలిప్పీన్స్, బోట్స్‌వానా, బొలీవియా, ఇంకా అనేక దేశాలకు వెళ్తున్నారు. ఇప్పటికే దుర్భర దారిద్ర్యంలో ఉండి, తమ బిడ్డలకు కడుపునిండా నాలుగు మెతుకులు పెట్టలేని వారినింకా దోపిడీ చేయడానికి వీళ్లు వెళ్తున్నారు. మన్‌హట్టన్‌లో, శాన్ ఫ్రాన్సిస్కోలో, షికాగోలో ఉన్న ఖరీదైన ఆఫీసుల్లో ఈ దళారీలు ఉంటారు. విలాసవంతమైన జెట్ విమానాల్లో తిరుగుతూ ఖరీదైన ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేస్తూ వీళ్లు శ్రామికుల కొరకు వెతుకుతారు.

బానిస వ్యాపారులు ఇప్పటికీ ఉన్నారు. కాకపోతే పూర్వంలా వాళ్లు ఆఫ్రికా అడవుల్లోకి వెళ్లి నల్లవారిని కట్టేసి పట్టుకురారు. చార్లెస్‌టన్, కార్టజినా, హవానాల్లో బానిసల వేలంపాట వేదికలు లేవిప్పుడు. ఇప్పుడీ దళారీలు ఫ్యాక్టరీలు కట్టి స్థానికంగా దొరికే శ్రామికులను అందులో పనిచేయించుకుంటారు.

ఆ ఫ్యాక్టరీలో జీన్స్ ప్యాంట్లు, టెన్నిస్ బూట్లు, వాహనాల విడిభాగాలు, కంప్యూటర్ విడిభాగాలు తయారు చేస్తారు. తమ ఇష్టం వచ్చిన దేశంలో వాటిని అమ్ముకుంటారు. ఒక్కోసారి వాళ్లసలు ఫ్యాక్టరీ కూడా పెట్టరు. స్థానికంగా ఉన్న పెద్ద వ్యాపారవేత్తతో ఈ ఫ్యాక్టరీ పెట్టిస్తారు. తమ వస్తువులు తయారు చేయించుకుంటారు.

ఇలా వెళ్లే దళారీ యువతీ యువకులు తమని తాము చాలా ఉన్నతమైన మనుషులమనుకుంటారు. ఆయా దేశాల పురాతన శిథిలాల ఫోటోలను తెచ్చి స్వదేశంలో గర్వంగా ప్రదర్శించుకుంటారు. విదేశాల్లో వ్యాపారం చేయటంలో గల సాధకబాధకాలు సదస్సులలో పిచ్చాపాటిగా మాట్లాడుకుంటారు. వాళ్లకు విదేశంలో ఏ చికాకు కలగకుండా వారి కంపెనీ ఓ పెద్ద లాయర్‌ను నియమిస్తుంది. వాళ్లు చేస్తున్న పని సరైనదేనని వారిని అనుక్షణం నమ్మించడానికి మానసిక నిపుణులతో సహా అవసరమైన అన్ని 'వసతులు' సమకూరుస్తుంది వారి కంపెనీ.

బానిసలు పూర్తిగా పరిణామం చెందని మానవులనీ, వారిని సంస్కరించేందుకే క్రైస్తవ మతంలోకి వారిని చేర్చుకుంటున్నామనీ పూర్వకాలపు బానిస వ్యాపారి అనుకునేవాడు. తమ ఆర్థిక వ్యవస్థ, తమ సమాజం బానిసల శ్రమశక్తి పైనే ఆధారపడిందని అతగాడికి తెలుసు.

అసలేమీ లేకపోవడం కన్నా నేను ఇచ్చే డాలర్ మిన్న అనీ, ఇటువంటి ఉద్యోగాలు చేయడం వల్ల ఈ పేద ప్రజలకు అంతర్జాతీయ సమాజంతో కలిసే ఒక గొప్ప అవకాశం కల్పిస్తున్నామనీ కొత్త బానిస వ్యాపారులు అనుకుంటున్నారు. తాము చేసే ఈ పనుల వల్ల తమ కంపెనీ అయితే లాభపడుతుందేమో కాని తమ పిల్లల భవిష్యత్తేమవుతుందనేది వీరికి ఎప్పటికీ అర్థం కాదు'.

అధ్యాయం 31

ఇరాక్‌లో ఎకనామిక్ హిట్‌మాన్ వైఫల్యం

1980లలో నేను ఐపిఎస్ యజమానిగా ఉన్నప్పుడు, ఆ తరువాత స్టోన్ అండ్ వెబ్‌స్టర్‌కు కన్సల్‌టెంట్‌గా ఉన్నప్పుడు నాకు ఇరాక్ గురించి ఇతరులకు తెలియని చాలా సమాచారం లభ్యమయ్యేది. 80లలో ఇరాక్ గురించి మా అమెరికన్లకు చాలా కొద్ది విషయాలే తెలిసేవి.

ప్రపంచబ్యాంక్, యుఎస్‌ఎఐడి, ఐఎంఎఫ్‌లలో పనిచేస్తున్న నా మిత్రులు, బెక్టెల్, హాలిబర్టన్ వంటి బహుళజాతి కంపెనీలలో పనిచేసే సన్నిహితులు నాకు పశ్చిమాసియాలో ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు చెపుతుండేవారు.

ఇరాక్‌ను మరో సౌదీ అరేబియాగా మార్చాలని రీగన్, బుష్ ప్రభుత్వాలు కృతనిశ్చయంతో ఉండేవి. సద్దాం అట్లాంటి ఒప్పందానికి సై అనడానికి చాలా కారణాలే ఉన్నాయి. సౌదీలతో అమెరికా జెకార్ ఒప్పందం కుదుర్చుకున్నాక ఆ దేశపు స్వరూపమే మారిపోయింది. రియాద్ నగరంలో గొర్రెల స్థానంలో ఇప్పుడు అత్యాధునిక చెత్త ఎత్తే ట్రక్కులు కనపడుతున్నాయి. సముద్రపు నీటి నుంచి ఉప్పును తొలగించే కొత్త తరం ప్లాంట్లు, మురుగుశుద్ధి ప్లాంట్లు, సమాచార వ్యవస్థలు, విద్యుత్ గ్రిడ్లు ఇలాంటి నవీన సాంకేతిక విజ్ఞాన ఫలాలను ఇవ్వాళ సౌదీలు ఆస్వాదిస్తున్నారు.

అంతేకాదు అంతర్జాతీయ వ్యవహారాల్లో కూడా సౌదీలకు అనేక రాయితీలిచ్చింది వాషింగ్టన్. అనేక ఛాందసవాద, అతివాద సంస్థలను సౌదీలు పెంచి పోషిస్తున్నా చూడనట్టే నటించింది. సోవియెట్లను ఎదుర్కోవడానికి ఒసామా బిన్ లాడెన్‌కు ధనం, ఆయుధాలు అందించాల్సిందిగా సౌదీలను స్వయంగా అమెరికానే కోరింది.

1980లలో ఇరాక్‌లో ఎకనామిక్ హిట్‌మెన్ కార్యకలాపాలు జోరుగా సాగేవి. జెకార్ వంటి ఒప్పందం ఒకటి కుదుర్చుకుంటే సద్దాంకు ఒక రకంగా మేలే జరిగేది. బతికినంతకాలం ఇరాక్‌ను ఏలే సౌభాగ్యం అమెరికా అతనికి కలుగజేసేది. ఆ ప్రాంతంలో అతడి ప్రాబల్యం విస్తరించేందుకు సాయపడేది.

అతను పరమ దుర్మార్గుడు కావచ్చు. సామూహిక జనహననానికి ఒడిగట్టిన వాడు కావొచ్చు. అతని చేతలూ, హావభావాలూ చూస్తే అడాల్ఫ్ హిట్లర్ గుర్తుకురావచ్చు.

కాని అమెరికా ఇటువంటి వారినెందరినో చేరదీసింది కదా ఇదివరకు! అతని పెట్రో డాలర్లకు బదులుగా ప్రభుత్వ బాండ్లు జారీ చేసి, ఆ బాండ్లపై వచ్చిన వడ్డీని మా బహుళజాతి కంపెనీలకు చెల్లించి, ఇరాక్‌ను 'ఆధునికీకరించడానికి' మా దేశం సదా సన్నద్ధం. ఓహ్! చెప్పడం మరిచాను. వడ్డీ డబ్బుల్లో కొంత భాగాన్నిస్తే యుద్ధ ట్యాంకులు, ఫైటర్ విమానాలు, రసాయన, అణు విద్యుత్ ప్లాంట్లు కూడా సరఫరా చేస్తారు మా వాళ్లు.

ఇరాక్ అమెరికాకు చాలా కీలక దేశం. అందుకు దాని వద్దనున్న చమురు ఒక్కటే కారణం కాదు. టైగ్రిస్, యూఫ్రటీస్ నదులు రెండూ ఇరాక్‌లో నుండే ప్రవహిస్తాయి. ప్రపంచంలోని ఈ భాగంలో ఇంత విలువైన నీటి వనరులు మరే దేశానికీ లేవు. విద్యుత్, ఇంజనీరింగ్ రంగాలలో ఉన్న మా వంటి వారికి 1980లలో నీరు అటు ఆర్థికంగా ఇటు రాజకీయంగా చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది.

అనేక బహుళజాతి కంపెనీలు ఇప్పుడు ప్రైవేటీకరణ హడావిడిలో ఆఫ్రికా, లాటిన్ అమెరికా, పశ్చిమాసియా దేశాలలో ఉన్న నీటి వనరులపై కన్నేశాయి.

చమురు, నీరు మాత్రమే కాక భౌగోళికంగా కూడా ఇరాక్ చాలా కీలకమైన ప్రాంతంలో ఉంది. ఇరాన్, కువైట్, సౌదీ అరేబియా, జోర్డాన్, సిరియా, టర్కీ దేశాలతో ఇరాక్ సరిహద్దును పంచుకుంటుంది. అటు ఇజ్రాయెల్‌కు, ఇటు పూర్వ సోవియెట్ యూనియన్‌కు ఇది క్షిపణి వేటు దూరంలో ఉంది. ఇరాక్ ఎవరి అధీనంలో ఉంటుందో పశ్చిమాసియా వారి అధీనంలో ఉంటుందని ప్రతీతి.

ఇరాక్‌లో ఉన్న భారీ చమురు నిల్వలపై, దాని ద్వారా పోగువడే కోట్ల డాలర్లపై, నీటి వనరులపై మా ఇంజనీరింగ్, నిర్మాణ కంపెనీలు, కంప్యూటర్ సిస్టమ్స్ సరఫరాదారులు, విమానాలు, క్షిపణులు, ట్యాంకుల తయారీదారులు, ఔషధ, రసాయన కంపెనీలు కన్నేశాయి.

అయితే ఎన్ని తాయిలాలు చూపినా సద్దాం మాత్రం మా ప్రభుత్వానికి లొంగలేదు. బుష్‌కు ఇదో అవమానంలా తోచింది. ప్రతిష్ఠాత్మకమైన ఈ సమస్యను ఎలా తీర్చాలా అని అతని ప్రభుత్వం తలపట్టుకుంది.

కాగల కార్యం గంధర్వులే తీర్చినట్టు ఆగస్టు 1990లో కువైట్‌పై దాడి చేశాడు సద్దాం. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించినందుకు సద్దాంపై బుష్ విమర్శలు గుప్పించాడు.

ఎలాంటి కవ్వింపూ లేకుండా అన్యాయంగా తాను పనామాపై దాడి చేసి అప్పటికింకా ఏడాది కూడా పూర్తి కాలేదు!

అదను కోసం వేచిఉన్న అమెరికన్ అధ్యక్షుడు ఇరాక్‌పై సైనికదాడికి ఆదేశించాడు. అంతర్జాతీయ సంకీర్ణ సేనలో భాగంగా అయిదు లక్షల మంది అమెరికన్ సైనికులు ఆ యుద్ధంలో పాల్గొన్నారు. 1991 తొలి నెలల్లో ఇరాక్‌పై వైమానిక దాడి జరిగింది. ఆ తరువాత భూతలంపై జరిగిన వంద గంటల స్వల్ప వ్యవధి యుద్ధంలో ఇరాక్ ఓడిపోయింది. కువైట్‌కు విముక్తి కలిగింది.

ఒక నియంతను తరిమికొట్టినందుకు అమెరికాలో అధ్యక్షుడు బుష్ ప్రజాదరణ 90 శాతానికి ఎగిసింది.

ఇరాక్‌పై దాడి జరిగినప్పుడు నేను బోస్టన్‌లో స్టోన్ అండ్ వెబ్‌స్టర్ సమావేశంలో పాల్గొంటున్నాను. ఆ దాడి వార్త విని మా ఆఫీసులో ఉద్యోగులు కేరింతలు కొట్టారు. ఓ క్రూర నియంతపై కఠిన వైఖరి అవలంబించినందుకే కాదు వారి ఆనందం. ఇరాక్‌లో అమెరికా విజయం ఇటువంటి కంపెనీలకు అంతులేని లాభాలనూ, తద్వారా ఉద్యోగులకు పదోన్నతులనూ, పెరిగిన జీతాలనూ తెచ్చిపెడుతుంది.

ఈ యుద్ధం సామాన్య అమెరికన్లలో ఎనలేని దేశభక్తి స్ఫూర్తిని రగిలించింది. అమెరికన్ వ్యాపార ప్రయోజనాలు, బహుళజాతి కార్పొరేషన్లకు పని చేసే ఉద్యోగులు కలిసి ప్రపంచాన్ని ఓ కొత్త కోణంలో చూడటం మొదలైంది. గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్ అనే జంట ఆలోచనలు మా మదిలో సింహభాగం ఆక్రమించాయి.

ఇప్పుడు సామ్రాజ్యవాద అమెరికా సరిహద్దులు లేని గ్లోబల్ ప్రపంచంలోకి అడుగిడింది. ఇదివరకు అమెరికన్ కార్పొరేషన్లని పిలవబడే కంపెనీలు ఇప్పుడు అంతర్జాతీయ కంపెనీలుగా రూపాంతరం చెందాయి. అనేక దేశాల్లో ఇవి తమ కార్యకలాపాలు మొదలుపెట్టాయి. ఏ చట్టాలకు, నియమాలకు లోబడి పనిచేయాలో అవే నిర్ణయించుకోవచ్చు. రకరకాల గ్లోబల్ ఒప్పందాలు, సంస్థలు పరిస్థితిని ఈ బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా మారుస్తున్నాయి. ఇప్పుడు 'ప్రజాస్వామ్యం', 'సోషలిజం', 'పెట్టుబడిదారీ విధానం' వంటివన్నీ పాత మాటలు. ఇప్పుడు నడుస్తున్నదంతా కార్పొరేట్‌స్వామ్యం.

కొన్ని అసాధారణ పరిణామాలు నన్ను కూడా ఈ కార్పొరేట్‌స్వామ్యానికి లొంగిపోయేలా చేశాయి. నవంబర్ 1990లో నేను నా ఐపిఎస్ కంపెనీని అమ్మేశాను. ఆష్‌లాండ్ ఆయిల్ కంపెనీ అనే పెద్ద బహుళజాతి కంపెనీ దాన్ని అమ్మమని మాపై విపరీతమైన ఒత్తిడిని తెచ్చింది. ఆ కంపెనీని ఎదిరించే ఆర్థిక శక్తి నాకు లేదు. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల కంపెనీ అయిన ఐపిఎస్ ను ఒక చమురు కంపెనీ కొనుగోలు చేయడం వింతే.

నాకు నేను ఒక నమ్మకద్రోహిలా కనపడసాగాను.

స్టోన్ అండ్ వెబ్‌స్టర్‌లో నాకు పెద్దగా పనేమీ ఉండేది కాదు. ఒకసారి కొందరు 'పెద్దల'తో కలవడానికి రియో డి జెనీరో వెళ్లాను. మరోసారి కంపెనీ వారి ప్రైవేటు జెట్ విమానంలో గ్వాటెమాల వెళ్లాను. చాలాసార్లు మా కంపెనీ ప్రాజెక్టు మేనేజర్లకు ఫోన్ చేసి నేనొకడిని ఉన్నాననీ, ఏదైనా పనిబడితే నా సేవలు వినియోగించుకోవచ్చనీ గుర్తు చేసేవాణ్ని. అంత పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుంటూ ఏమీ చేయకపోవడం నా అంతరాత్మకు ఇబ్బందిగా అనిపించేది.

అటూ ఇటూ గాకుండా ఉన్న నా అస్తిత్వం నన్ను చాలా ఇబ్బంది పెట్టేది. నా జీవితంలోని చెడునంతా మంచిగా మార్చేసే ఏదైనా చర్య చేపట్టాలని గట్టిగా అనిపించేది. నా పుస్తకం 'కాన్షియన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్‌మాన్'పై రహస్యంగా పనిచేయడం మొదలెట్టాను. ఈ పుస్తకం ఎప్పటికయినా ప్రచురితమవుతుందనే నమ్మకం మాత్రం నాకు లేదు.

* * *

1991లో అమెజాన్ అడవుల పర్యటనకు చిన్న బృందాలను తీసుకువెళ్లడం మొదలెట్టాను. అక్కడ నివసించే షూఆర్ తెగల సాంప్రదాయక వైద్యం, పర్యావరణ స్పృహ మా వారికి చూపించాలనే ఈ పర్యటనలు చేయసాగాను. అతి త్వరలోనే వీటికి ఎనలేని జనాదరణ లభించింది. ఆ ఆదరణ 'డ్రీమ్ ఛేంజ్ కోయలిషన్' అనే ఒక స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసేలా నన్ను పురికొల్పింది. పారిశ్రామిక దేశాల్లోని ప్రజలు భూమితో తమకు గల అనుబంధాన్ని పునర్‌నిర్వచించుకునేందుకు డ్రీమ్ ఛేంజ్ కృషి చేస్తుంది. మా సంస్థ వెబ్‌సైట్‌కు టైమ్ పత్రిక నుండి అవార్డ్ కూడా లభించింది.

1990లలో అధికభాగం నేను స్వచ్ఛంద సంస్థలతోనే గడిపాను. ఎక్కువగా దక్షిణ అమెరికా తెగల సంస్కృతుల గురించి మా దేశ ప్రజలకు పరిచయం చేసే కార్యకలాపాలలో నేను పాల్గొనేవాణ్ణి. స్టోన్ అండ్ వెబ్‌స్టర్ కూడా నా పనులకు పెద్దగా అభ్యంతర పెట్టేది కాదు. ఇదే సమయంలో నేను కొన్ని పుస్తకాలు కూడా రాశాను. కానీ అందులో నా ఎకనామిక్ హిట్‌మాన్ విషయాలేవీ లేకుండా జాగ్రత్త తీసుకున్నాను.

ఈ స్వచ్ఛంద సేవ, పుస్తక రచన నా పూర్వాశ్రమ పాపాలకు పరిహారం అని నేను సమర్థించుకోలేకపోయాను. నా హృదయాంతరాల్లో నాకు తెలుస్తూనే ఉంది నా కూతురు జెస్సికా పట్ల నా బాధ్యతను నెరవేర్చటంలేదని. ఎప్పటికీ తీర్చలేని అప్పుల భారాన్ని మోస్తున్న మిలియన్ల కొద్దీ పిల్లలున్న ప్రపంచాన్ని తను వారసత్వంగా పొందుతుంది.

ఈ దుస్థితికి కారణం నేనే.

అప్పట్లో నేను రాసిన 'ద వరల్డ్ ఈజ్ అజ్ యు డ్రీమ్ ఇట్' (మీరు స్వప్నించినట్టే ఈ ప్రపంచం ఉంటుంది) బాగా ప్రాచుర్యం పొందింది. ఫలితంగా నేను అనేక చోట్ల వర్క్‌షాప్‌లు, ఉపన్యాసాలు ఇవ్వవలసి వచ్చేది. బోస్టన్, న్యూయార్క్, మిలాన్ ఇలా ఎన్నో ప్రదేశాలు చుట్టేవాడిని.

నాకు ఒక విషయం వింతగా అనిపించేది. ఒకవేళ ప్రపంచం మనం స్వప్నించినట్టుగా ఉండేటట్టయితే ఇలాంటి ప్రపంచాన్ని ఎందుకు స్వప్నించాను నేను? ఈ పీడకలను నిజం చేయడంలో ఇంత క్రియాశీలకమైన పాత్రనెందుకు పోషించాను నేను?

1997లో ఒక వర్క్‌షాప్‌లో పాల్గొనటానికి సెయింట్ జాన్స్ ద్వీపానికి వెళ్లాను. ఉదయాన్నే లేచి నా హోటల్ బాల్కనీలోంచి చూస్తే లీన్‌స్టర్ బే కనపడింది. పదిహేడేళ్ల కింద నేను మెయిన్‌ను వదిలేయాలన్న నిర్ణయం తీసుకుంది అక్కడే. ఒక్క క్షణం మనస్సంతా ఉద్విగ్నంగా మారింది. అలాగే కుర్చీలో కూలబడిపోయాను.

అక్కడున్న వారం రోజులూ ఎడతెగని ఆలోచనలు. నేను రాజీనామా అయితే చేశాను కానీ ఆ తరువాత మెట్టు ఎక్కలేదు. ఇప్పటికీ మధ్యలోనే ఉన్నాను నేను. అందుకే నా పరిస్థితి భరించశక్యం గాని దశకు చేరుకుంది. నా చుట్టూ ఉన్న ప్రపంచం నేను స్వప్నించేది కాదని అర్థమైంది నాకు. నా వర్క్‌షాప్‌లలో విద్యార్థులకు నేను 'ప్రపంచాన్ని మార్చాలంటే ముందు మీ స్వప్నాలు మార్చుకోవాల'ని ఉద్బోధించేవాడిని. ఇప్పుడు నేనూ అదే పని చేయాలి.

ఆ ద్వీపం నుండి వెనక్కి రాగానే స్టోన్ అండ్ వెబ్‌స్టర్‌కు వెళ్లి రాజీనామా సమర్పించాను.

ఇక ఇప్పుడు నేను ఎప్పటి నుంచో కలలుగంటున్న పుస్తకం రాయొచ్చని అనుకున్నాను. ఇదే విషయాన్ని నా సన్నిహితులకు చెప్పాను. కాని వారు నా నిర్ణయం విని నిర్ఘాంతపోయారు. ఈ నిజాలు వెల్లడిస్తే నా స్వచ్ఛంద సంస్థల పని అయిపోతుందని వారు నాకు నచ్చజెప్పారు. అనేక అమెజాన్ తెగలను చమురు కంపెనీల బారినుండి రక్షించడానికి ఈ స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. ఇప్పుడు నా పుస్తకం గనుక నా గత చరిత్ర బైటపెడితే నా విశ్వసనీయత దెబ్బతింటుందనీ, అది ఎవరికీ మంచిది కాదనీ నా మిత్రులు హెచ్చరించారు.

నేను మరోసారి వెనక్కి తగ్గాను.

ఆధునిక ప్రపంచానికి దూరంగా అమెజాన్ అడవుల్లో ఉన్న ఓ తెగ ప్రజలను పర్యాటకులకు చూపించే పనిలో నిమగ్నమయ్యాను.

2001 సెప్టెంబర్ 11 నాడు నేను అలాంటి పర్యటనలోనే ఉన్నాను.

అధ్యాయం 32

సెప్టెంబర్ 11, వ్యక్తిగత పర్యవసానాలు

సెప్టెంబర్ 10, 2001 నాడు నేను ఈక్వెడార్ అమెజాన్ అడవుల్లో ఒక దిపై ప్రయాణిస్తున్నాను. నేను రాస్తున్న 'స్పిరిట్ అఫ్ షూఆర్' సహరచయిత కాయిమ్ చుంపి కూడా నాతో ఉన్నాడు. అతను, మరో పదహారు మంది అమెరికన్ శన్తులం కలిసి దట్టమైన అడవుల్లో ఉండే షూఆర్ తెగ ప్రజల గురించి లుసుకోవడానికీ, సతతహరిత అడవులను కాపాడుకోవడానికీ ఈ పర్యటన చేపట్టాం.

ఇటీవల ఈక్వెడార్-పెరూ దేశాల మధ్య జరిగిన యుద్ధంలో షకాయిమ్ ాల్గొన్నాడు. చమురు వినియోగించే దేశాల ప్రజలకు అసలిలాంటి యుద్ధమొకటి జరిగిందని కూడా తెలియదు కానీ వారి చమురు అవసరాల కొరకే ఈ యుద్ధం సంభవించింది. రెండు దేశాల మధ్య సరిహద్దు వివాదం అనేక ఏళ్ల నుండి ానసాగుతున్నప్పటికీ ఈ మధ్యే ఈ వివాదం పరిష్కరించాలనే ఆతృత ఎక్కువైంది. చమురు దొరికే క్షేత్రాలు ఏ దేశం అధీనంలో ఉన్నాయో ఆ దేశంతోనే సంప్రదింపులు జరపాలనే బహుళజాతి చమురు కంపెనీల అవసరమే ఈ ఆతృతకు కారణం. సరిహద్దులు సక్రమంగా గీయాల్సిన సమయమొచ్చింది ఇప్పుడు.

ఈక్వెడార్ రక్షణలో షూఆర్‌లు మొదటి శ్రేణిలో ఉండేవారు. ఎంత శక్తివంతమైన, సశస్త్రమైన సైన్యాన్నైనా షూఆర్‌లు అవలీలగా ఎదుర్కొని మట్టికరిపించేవారు. వారికి చమురు రాజకీయాలు అర్థం అయ్యేవి కావు. కానీ తమ పూర్వీకుల వీరత్వం పుణికి పుచ్చుకుని శత్రువుని తమ గడ్డపై కాలుమోపనిచ్చేవారు కాదు.

పైన కిలకిలా రావాలు చేస్తూ ఎగురుతున్న ఓ చిలకల గుంపుకేసి చూస్తూ షకాయిమ్‌ను అడిగాను ఇటీవలే కుదిరిన యుద్ధ విరామం పరిస్థితి ఏమిటని.

'మేం మీ వాళ్లతో తలపడటానికే సిద్ధపడుతున్నాం' అన్నాడు.

మళ్లీ తనే 'మీరు మా నేస్తాలే. కానీ మీ చమురు కంపెనీలు, వాటి తరపున వచ్చే సైన్యాలపై మేం పోరాటం చేయదల్చుకున్నాం'.

'మేం ప్రత్యక్షంగా చూశాం హురాని తెగను ఈ చమురు కంపెనీలు ఎలా నాశనం చేశాయో. వాళ్ల అడవులను ఎలా ధ్వంసం చేశాయో, వాళ్ల నదులను ఎలా కలుషితం చేశాయో, పిల్లా పెద్దా అని చూడకుండా ఎంత మందిని హతమార్చాయో. మేం అలా జరగనివ్వం. చమురు కంపెనీలను ఇటువైపు రానివ్వం. చివరి మనిషి వరకూ నిలబడి పోరాడుతాం' ఆవేశంగా అన్నాడు షకాయిమ్.

ఆ రాత్రి మా బృందం అంతా వెదురు బొంగులతో చేసిన ఓ షూఆర్ కుటీరం మధ్యలో చలికాగుతూ కూర్చున్నాం.

షకాయిమ్‌తో నా సంభాషణ గురించి బృంద సభ్యులకు వివరించాను. ప్రపంచంలోని ఎన్ని దేశాల్లో మా చమురు కంపెనీలను, మా దేశాన్నీ ఇలా ద్వేషిస్తున్నారో, ఎంత మంది తమ జీవితాలను, సంస్కృతులను మేం నాశనం చేస్తామని భీతిల్లుతున్నారోనని మేం చర్చించుకున్నాం.

మరునాడు ఉదయం దగ్గరలో ఉన్న మా చిన్న ఆఫీసుకు వెళ్లాను. తిరుగు ప్రయాణానికి విమానం ఏర్పాటు చేయడానికి నేనక్కడికి వెళ్లాను. వాకీటాకీలో అవతల ఉన్న వ్యక్తితో మాట్లాడుతుంటే అతను అకస్మాత్తుగా 'ఓ మైగాడ్' అని అరిచాడు.

'న్యూయార్క్‌పై దాడి జరుగుతోంది' అదుర్దాగా అన్నాడు.

వెంటనే మా వద్దనున్న రేడియో ఆన్ చేసి ఓ అరగంటపాటు అమెరికాలో జరుగుతున్న సంఘటనలను ప్రత్యక్షంగా విన్నాం.

అందరిలానే నేనూ ఆ క్షణాలను ఎప్పటికీ మరచిపోలేను.

★ ★ ★

ఫ్లోరిడాలోని మా ఇంటికి తిరిగి వచ్చాక ఒకరోజు న్యూయార్క్ బయల్దేరాను. హోటల్‌లో దిగేసరికి మధ్యాహ్నం అయింది. ఒకప్పుడు వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఉండే గ్రౌండ్ జీరో వైపు సెంట్రల్ పార్క్ మీదుగా ఉత్సాహంగా నడక సాగించాను.

దగ్గరకు వెళ్లి ఆ భీతి గొల్పే దృశ్యం చూద్దును కదా, నా ఉత్సాహం చప్పున చల్లారిపోయింది. అదో మహా విషాదం. అక్కడి దృశ్యాలూ, వాసనలూ, భీకర విధ్వంసం, కరిగి మెలికలు తిరిగిపోయిన ఆ భారీ భవంతుల అస్థిపంజరాలూ, ఆ శిథిలాలూ, కాలిపోయిన మృతదేహాల కమురు వాసనా ...

ఆ దృశ్యాలను ఇదివరకు టీవీలో కూడా చూసాను. కానీ కళ్లెదుట కనపడుతున్నది నన్ను విచలితున్ని చేసింది.

ఆ దుర్ఘటన జరిగి రెండు నెలలు గడిచాయి కానీ ఆ చుట్టు పక్కల ఉన్న ప్రజలింకా దాన్నుండీ తేరుకున్నట్టు లేరు. పక్కనే ఉన్న చిన్న చెప్పుల రిపేరు షాపు నడుపుతున్న ఈజిప్షియన్ దేశస్థుడు తన కొట్టు ముందు నిలబడ్డాడు. తల అడ్డంగా ఊపుతూ.

'అసలిదంతా నిజమనిపించలేదు' అని గొణిగాడు.

'నా ఖాతాదారులు, స్నేహితులు చాలా మంది చనిపోయారు. నా అల్లుడు కూడా అపై అంతస్తులో పని చేసేవాడు' ఆకాశంకేసి వేలెత్తి చూపాడు.

'బహుశా దూకేశాడేమో అక్కడి నుండి. చాలా మంది దూకారు ఆ భవనంపై నుండి. ఒకరి చేతులు ఒకరు పట్టుకుని... ఏదో ఎగిరే శక్తి ఉన్నట్టు...'

న్యూయార్క్ నగరవాసులు ఒకరితో ఒకరు సంభాషించుకుంటున్న తీరు నన్ను ఆశ్చర్యపరచింది. చాలాసార్లు వారి మధ్య మాటలే లేని మౌన సంభాషణ - సానుభూతితో నిండిన దృక్కులు, వారి అరవిరిసిన చిరునవ్వులు లక్షల పదాల పెట్టు.

కానీ ఇంకా ఏదో ఉంది. ఈ ప్రదేశంలోనే ఏదో తేడా ఉంది. మొదట్లో నాకూ అర్థం కాలేదు అదేమిటో. కాసేపటికి తెలిసింది ఆ తేడా ఏమిటో...

వెలుతురు!

దిగువ మన్‌హట్టన్ అంతా చీకటి బొయ్యారంగా ఉండేదా రోజుల్లో. నా ఐపిఎస్ కంపెనీ కొరకు పెట్టుబడి సేకరించడానికి నేను ఈ వీథుల్లో తిరిగేటప్పుడు వెలుతురు కావాలంటే వరల్డ్ ట్రేడ్ సెంటర్ పై భాగానికి వెళ్లాల్సివచ్చేది.

ఇప్పుడు అదే వెలుతురు నేలపైకి దిగివచ్చింది.

పైన కనబడుతున్న కొత్త ఆకాశం, కొత్త వెలుతురు నా ప్రజల హృదయాలు తెరుచుకునేలా చేస్తాయా ఇప్పటికైనా? ఆ ఆలోచనలే అపరాధ భావన కలిగించాయి నాలో.

ట్రినిటీ చర్చ్ దగ్గర వీధి మలుపు తిరిగి వాల్‌స్ట్రీట్ వేపు నడిచాను. తిరిగి నీడల్లో ఉన్న పాత న్యూయార్క్ వైపు. ఇక్కడ ఆకాశమూ లేదు, వెలుతురూ లేదు! ఫుట్‌పాత్‌పై ఎవరినీ పట్టించుకోకుండా వడివడిగా అడుగువేస్తున్న నగరవాసులు. ఆగి ఉన్న కారు వైపు చూసి అరుస్తున్నాడో ట్రాఫిక్ కానిస్టేబుల్.

ఎదురుగా కనబడ్డ భవంతి మెట్లపై కూలబడ్డాను. ఎక్కడి నుండో పెద్ద పంఖా శబ్దం వస్తోంది. బహుశా న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నుండి కావచ్చు. రోడ్డుపై నడుస్తున్న వారిని గమనించసాగాను. ఆఫీసుల నుండి ఇళ్లకు త్వరగా చేరుకోవాలని వెళ్తున్నట్టున్నారు. కొద్ది మంది గుంపులుగా ఏదో మాట్లాడుకుంటూ... చాలా మంది ఒంటరిగా, నిశ్శబ్దంగానే అడుగులేస్తున్నారు. నేను ఎవరితోనైనా చూపులు కలుపుదామని ప్రయత్నించాను. ఉహూఁ సాధ్యపడలేదు.

కాసేపయ్యాక నా జేబులో చక్కగా మడతపెట్టి ఉన్న కాగితం ఒకటి బైటికి తీశాను.

అప్పుడు కనపడిందా ఆకారం.

బాగా దుమ్ముకొట్టుకుపోయిన ఓవర్ కోట్ ధరించిన గుబురు గడ్డం వ్యక్తి, అస్తవ్యస్తంగా అడుగులేస్తూ నా వేపు వచ్చాడు.

నేను కూర్చున్న మెట్లెక్కి నా వేపోసారి తలపంకించాడు. రెండు గజాల దూరంలో కూర్చున్నాడు. నేనే మాట్లాడించానతన్ని.

'ఈ మధ్యాహ్నం బావుంది కదూ'

'నిజం. ఇలాంటి సమయంలోనే కాస్త ఎండ కావాలనిపిస్తుంది'

'మీరు అఫ్ఘనిస్తాన్ నుండి వచ్చారా?' అడిగానా వృద్ధున్ని

అతను నాకేసి తేరిపార చూసి 'మరీ అంత కొట్టొచ్చినట్టు కనపడుతున్నానా?' అని అడిగాడు.

'నేను చాలా ఎక్కువ పర్యటిస్తుంటాను. ఈ మధ్యే కాశ్మీర్‌లోని హిమాలయాలకు వెళ్లాను' బదులిచ్చాను.

'కాశ్మీర్‌లో సంఘర్షణ జరుగుతోంది' గడ్డం గోక్కుంటూ అన్నాడతను.

'అవును. ఇండియా - పాకిస్తాన్ మధ్య, హిందువులు - ముస్లిముల మధ్య'

మా ఇద్దరి కళ్లూ కలుసుకున్నాయి. అతనివి ముదురు రంగు కళ్లు. అవి విషాదంతో, విజ్ఞానంతో నిండి ఉన్నట్లు అగుపడ్డాయి నాకు.

అతను వెనక్కి తిరిగి న్యూయార్క్ స్టాక్ ఎక్స్చేంజి భవనం వేపు తర్జని చూపుతూ,

'ఈ యుద్ధం ఆర్థికపరమైంది. మతపరమైంది కాదు' అన్నాడు స్థిరంగా. మళ్లీ తనే 'నువ్వు సైనికుడివా'? అని ప్రశ్నించాడు.

నేను చిరునవ్వు నవ్వి 'కాదు ఆర్థిక కన్సల్‌టెంట్‌ను'.

నా చేతిలోని అంకెలున్న కాగితం అతడికి ఇస్తూ 'ఇవే నా ఆయుధాలు' అన్నాను.

'ప్రపంచ గణాంకాలు'.

అతను వాటిని పట్టి పట్టి చూసి మళ్లీ నాకిచ్చేశాడు.

'నేను చదవలేను' అని నవ్వేశాడు.

'రోజుకు ఇరవై నాలుగువేల మంది ఆకలికి తాళలేక మరణిస్తున్నారు'.

అతను సన్నగా ఈల వేశాడు. ఒక క్షణం నేను చెప్పిన దాని గురించి ఆలోచించి 'నేను కూడా వారిలో ఒకణ్ణి అయిపోయేవాణ్ణి. కాందహార్ దగ్గర నాకో

దానిమ్మ తోట ఉండేది. మొదలు రష్యన్లు వచ్చారు. వారిని ఎదుర్కోవడానికి చెట్ల వెనుక, నీటి గుంతల్లో దాక్కున్న ముజాహిదీన్లు. వాళ్ల నా తోటనంతా నాశనం చేశారు'

'మరి మీరేం చేశారు?'

నా చేతిలో ఉన్న కాగితంకేసి చూసి 'అందులో అడుక్కునే వారి వివరాలు ఉంటాయా?'

అందులో ఆ వివరాలు లేవు కానీ నాకు తెలుసు. 'దాదాపు 8 కోట్ల మంది బిచ్చగాళ్లు ఉన్నారు ప్రపంచం మొత్తంమీద.'

'అందులో నేనూ ఒకడిగా ఉన్నాను'. అతను తల అర్థంగా ఊపాడు. కొద్దిసేపు ఏదో ఆలోచనల్లో మునిగిపోయాడు. మా ఇద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది. 'నాకు అడుక్కోవడం నచ్చలేదు. ఇంతలో మా అబ్బాయి మరణించాడు. కుటుంబాన్ని పోషించడానికి గంజాయి సాగు చేయడం మొదలుపెట్టాను.'

'గంజాయా?'

అతను భుజాలెగరేసి 'ఏం చేస్తాం, చెట్లు లేవు, నీళ్లు లేవు. ముద్ద నోట్లోకి పోవాలంటే ఏదో ఒకటి చేయాలి గదా' అన్నాడు.

నాకు గొంతు పూడుకుపోయింది. బాధతో మిళితమైన అపరాధ భావం.

'గంజాయి సాగుచేయడం నేరం అని అంటాంగానీ మన ధనవంతుల్లో చాలా మంది ఆ వ్యాపారం నుండి పైకి వచ్చిన వారే'.

అతని చూపులు నా కళ్లలోంచి మస్తిష్కంలోకి దూసుకు వచ్చినట్టయింది.

'నువ్వు సైనికుడివే' అని ప్రకటించాడు. మెల్లిగా లేచి అక్కడి నుండి వెళ్లిపోవడానికి ఉద్యుక్తుడయ్యాడు.

నేను ఆగమని అందామనుకున్నాను కానీ నా నోరు పెగల్లేదు. ఎంత యాదృచ్ఛికం ఇవ్వాళ నాకితను కలవడం!

యాదృచ్ఛికం!

ఆ పదం పాత జ్ఞాపకాలను తట్టి లేపింది.

ఇలాంటి యాదృచ్ఛిక ఘటనలకు మనం ఎలా ప్రతిస్పందిస్తాం అన్న దాన్ని బట్టే మన జీవనగమనం ఆధారపడి ఉంటుంది కదూ?

మరి ఇవ్వాళ నేనెలా ప్రతిస్పందించాలి?

లేచి నడుస్తూ ఎదురుగా ఉన్న జనం కేసి దృష్టి సారించాను.

ఆ ముసలివాడి జాడ కనబడలేదు.

పక్కనే ఉన్న భవంతి ఫెడరల్ హాల్. 1789 ఏప్రిల్ 30న మా దేశపు మొదటి అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్ పదవీ ప్రమాణ స్వీకారం చేసింది ఇక్కడే. ఈ చోటనే తన పౌరుల జీవితాలను, స్వేచ్ఛను, ఆనందాన్ని సంరక్షించే బాధ్యత మా ప్రథమ పౌరుడికి అప్పజెప్పబడింది.

ఎంత దగ్గర ఇది గ్రౌండ్ జీరోకు, వాల్‌స్ట్రీట్‌కు! ఇంకొంచెం ముందుకు వెళ్ళి పైన్ స్ట్రీట్‌లోకి మళ్లాను. ఎదురుగా ఉన్నది ఛేస్ బ్యాంకు - డేవిడ్ రాక్‌ఫెల్లర్ స్థాపించింది. చమురు డబ్బుతో నడపబడి, నావంటి వారి ఆలోచనలకు పెట్టుబడి సమకూర్చింది. సామ్రాజ్యవాద విస్తరణకు, కార్పొరేట్‌స్వామ్య స్థాపనకు ఉపయోగపడ్డదీ బ్యాంకు!

నాకెక్కడో చదివినట్టు గుర్తు. 1960లో డేవిడ్ రాక్ ఫెల్లర్ మొదట వరల్డ్ ట్రేడ్ సెంటర్ ప్రాజెక్టును ప్రారంభించాడు. ఈ మధ్యే దీన్నో తెల్ల ఏనుగులా భావించడం మొదలుపెట్టారు. ఆర్థికంగా నష్టదాయకంగా ఉందనీ, నవీన ఫైబర్ ఆప్టిక్, ఇంటర్నెట్ టెక్నాలజీలకు అనువుగా లేదనీ, సరిగ్గా పనిచేయని ఖరీదైన లిఫ్ట్ వ్యవస్థ ఉందనీ... ఇలా అనేక ఆరోపణలున్నాయీ భవనంపై.

ఇప్పుడా ఐరావతం ఏదీ?

మెల్లగా నడవసాగాను. ఈ మధ్యాహ్నపు ఎండలో కూడా నా శరీరం ఎందుకో సన్నగా వణుకుతోంది. ఏదో తెలీని ఉద్విగ్నత. దాని మూలమేమిటో నాకు అవగతం కావట్లేదు. మళ్లీ గ్రౌండ్ జీరో వద్దకు వచ్చాను. పొగలు గక్కుతున్న బిలం, వంకర్లు తిరిగిపోయిన ఇనుప కమ్మీలు... పుడమిపై ఒక లోతైన గాయం. పక్కనున్న గోడనానుకుని ఆ లోతైన గొయ్యిలోకి చూశాను. కూలిపోతున్న ఆ టవర్ల నుండి కిందికి పరిగెత్తుకు వస్తున్న మనుషులు, వారిని రక్షించడానికి పైకి వెళ్తున్న అగ్నిమాపక సిబ్బంది, భవంతుల్లోంచి కిందికి దూకేసి తమని తాము కాపాడుకోవాలనుకుంటున్న జనం... ఇవేవీ కళ్ల ముందు మెదలట్లేదు నాకు.

నాకు ఒసామా బిన్ లాడెన్ కనబడుతున్నాడు. అమెరికన్ ప్రభుత్వం తరపున పనిచేసే ఓ ప్రైవేటు కన్సల్‌టెంట్ అందిస్తున్న కోట్ల కొద్దీ డాలర్ల డబ్బును, ఆయుధాలను అందుకుంటున్నాడు అతను.

తరువాత దృశ్యం, కంప్యూటర్ ముందు కూర్చుని ఉన్న నేను. తెరపై అంతా శూన్యం.

నేను గ్రౌండ్ జీరో నుండి దృష్టి మరల్చి న్యూయార్క్ వీథుల వేపు చూశాను. ఈ రోడ్లపై నడుస్తున్న జనం ఏం ఆలోచిస్తూ ఉంటారు? కూలిపోయిన టవర్ల గురించి కాదు, నాశనమైపోయిన దానిమ్మ తోటల గురించీ, రోజూ ఆకలికి మరణిస్తున్న

ఇరవై నాలుగు వేల మంది గురించీ. అసలిలాంటి సంగతుల గురించి ఎప్పుడయినా ఆలోచిస్తారా వీళ్లు? తమ ఉద్యోగాల గురించీ, ఇంధనం జుర్రే కార్ల గురించీ, తమ వడ్డీ చెల్లింపుల గురించీ కాక తమ పిల్లలు వారసత్వంగా పొందే ప్రపంచానికి మనమేం చేస్తున్నాం అని ఏనాడైనా అనుకుంటారా? అసలు వీళ్లకు అఫ్ఘనిస్తాన్ గురించి ఏమైనా తెలుసా? టీవీలో కనపడే అమెరికన్ సేనల టెంట్లు, ట్యాంకులున్న అఫ్ఘనిస్తాన్ కాదు - ఆ ముసలివాడి అఫ్ఘనిస్తాన్.

నా దేశం ఇప్పుడు అఫ్ఘనిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని అనుకుంటున్నది. కానీ నేను ప్రపంచంలో ఎన్ని దేశాల ప్రజలు మా కంపెనీలనూ, మా సైన్యాన్నీ, మా విధానాలనీ, గ్లోబల్ సామ్రాజ్యం వైపు మా ప్రయాణాన్నీ అసహ్యించుకుంటున్నారోనని ఆలోచిస్తున్నాను.

పనామా, ఈక్వెడార్, ఇండోనేషియా, ఇరాన్, గ్వాటెమాల, ఆఫ్రికాలోని అధికభాగం - వీటి మాటేమిటి?

నేను అక్కడి నుండి వెనక్కి మరలాను.

ఒక పొట్టి వ్యక్తి సాయంత్రం పత్రిక అమ్ముకుంటూ స్పానిష్‌లో అరుస్తున్నాడు. 'విప్లవం ముంగిట్లో వెనిజులా'.

నేను ఆగి ఓ పత్రిక కొన్నాను.

పతాక శీర్షిక హ్యూగో చావెజ్ గురించి. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికై అమెరికా అంటే పడని వెనిజులా దేశాధ్యక్షుడు.

వెనిజులా మాటేమిటి?

అధ్యాయం 33

సద్దాం రక్షించిన వెనిజులా *

వెనిజులాను నేను ఎన్నో ఏళ్ల నుండి గమనిస్తున్నాను. చమురు వల్ల కటిక దారిద్ర్యం నుండి కనక వైభోగానికి ఎదిగిన దేశం ఇది. అంతేకాదు చమురు ధనం ఎటువంటి కలతలు రేపగలదో, పేదలు-ధనికుల మధ్య ఎటువంటి అసమానతలు సృష్టించగలదో, చమురు సంపదను కార్పొరేట్‌స్వామ్యం ఎంత నిస్సిగ్గుగా దోపిడీ చేస్తుందో వెనిజులా చక్కని ఉదాహరణ. నా వంటి పాతతరం ఎకనామిక్ హిట్‌మెన్, అధునిక కార్పొరేట్ దళారులు సహజీవనం ఎలా సాగిస్తారో తెలుసుకోవడానికి కూడా ఈ దేశం ఉపకరిస్తుంది.

1998 ఎన్నికలలో వెనిజులాలోని పేదలూ, అభాగ్యులూ భారీ మెజారిటీతో హ్యూగో చావెజ్‌ను తమ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. వచ్చీ రాగానే అతను అనేక తీవ్రమైన నిర్ణయాలు తీసుకున్నాడు. వెనిజులా కాంగ్రెస్ (పార్లమెంట్)ను రద్దు చేశాడు. కోర్టులు, ఇతర ప్రభుత్వ శాఖలను తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. అమెరికాది 'సిగ్గుమాలిన సామ్రాజ్యవాదమని' తిట్టిపోశాడు. ప్రపంచీకరణను తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈక్వెడార్‌లో జైమె రోల్డోస్ తెచ్చిన హైడ్రో కార్బన్స్ చట్టం లాంటిది - అదే పేరుతో తెచ్చాడు. తమ గడ్డపై చమురు అన్వేషణ సాగిస్తున్న కంపెనీలు ఇకపై రెట్టింపు రాయల్టీ చెల్లించాలని ఈ చట్టం నిర్దేశిస్తుంది. ప్రభుత్వరంగ చమురు సంస్థ పెట్రోలియోస్ డీ వెనిజూయెలాలో ఉన్నత స్థాయి అధికారులను మార్చి తన అనుకూలురను నియమించుకున్నాడు చావెజ్.

ప్రపంచంలో అనేక ఆర్థిక వ్యవస్థలకు వెనిజులా చమురే ప్రాణాధారం. 2002లో వెనిజులా ప్రపంచంలో నాలుగో అతి పెద్ద చమురు ఎగుమతిదారు. అమెరికాకు చమురు ఎగుమతి చేసే దేశాలలో వెనిజులాది మూడో స్థానం. నలభైవేలమంది ఉద్యోగులు, 5000 కోట్ల డాలర్ల అమ్మకాలతో పెట్రోలియోస్ డీ వెనిజూయెలా ఈ దేశపు ఆదాయంలో ఎనభై శాతం సమకూరుస్తుంది. ఈ పరిశ్రమను గుప్పిట్లో పెట్టుకోవడం ద్వారా చావెజ్ ప్రపంచ వాణిజ్యరంగంపై ఓ ప్రధాన పాత్రే పోషిస్తున్నాడు.

వెనిజులా చమురుకి ఎనభై ఏళ్ల చరిత్ర ఉంది. 1922 డిసెంబర్ 14న మారాకైబో సమీపంలో భారీ బ్లో-అవుట్ సంభవించింది. మూడు రోజులపాటు రోజుకు లక్ష బ్యారెళ్ల చమురు ఎగజిమ్మింది. 1930ల నాటికే వెనిజులా ప్రపంచ చమురు ఎగుమతులలో అగ్రస్థానంలో ఉంది. తమ సమస్యలన్నిటినీ చమురు సంపదే తీరుస్తుందని ఈ దేశీయుల ప్రగాఢ నమ్మకం.

ఆ తరువాతి నలభై ఏళ్లలో చమురు నుండి వచ్చిన ఆదాయంతో ప్రపంచంలో పేద దేశాల్లో ఒకటైన వెనిజులా, లాటిన్ అమెరికాలోనే ధనిక దేశంగా మారింది. దీంతో పాటు దేశానికి చెందిన కీలక గణాంకాలైన విద్య, వైద్యం, ఉపాధి, సగటు ఆయుఃప్రమాణం, శిశువుల మనుగడ శాతం వంటివన్నీ ఎదుగుదల చూపాయి. వ్యాపారాలు వృద్ధి చెందాయి.

1973లో ఒపెక్ దేశాలు అమెరికాకు చమురు సరఫరాలు నిలిపివేసినప్పుడు చమురు ధరలు చుక్కలనంటాయి. వెనిజులా పంట పండింది. దేశపు బడ్జెట్ నాలుగు రెట్లయింది. మా ఎకనామిక్ హిట్‌మెన్ రంగంలోకి దిగారు. మౌలిక వసతుల కల్పన, పారిశ్రామిక ప్రాజెక్టుల కోసమంటూ అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు అప్పులు గుమ్మరించాయి. 1980లలో కార్పొరేట్ దళారీ ఎకనామిక్ హిట్‌మెన్ కూడా రంగప్రవేశం చేశారు. తమ కోరలకు పదును పెట్టే సమయం ఆసన్నమైందని వారికి తెలుసు. వెనిజులాలో మధ్యతరగతి జనాభా గణనీయంగా పెరిగింది. తమ ఉత్పత్తులు అమ్ముకోవడానికిదే అదను. మరో వైపు కార్ఖానాలలో తక్కువ జీతాలకు పనిచేయడానికి వెనిజులాలో పేదవారికి కొదవలేదు.

తదనంతర కాలంలో చమురు ధరలు కుప్పకూలటంతో వెనిజులా చేసిన అప్పులు తీర్చలేకపోయింది. 1989లో అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అనేక కఠిన షరతులు విధించి, కార్పొరేటీకరణకు తలుపులు బార్లా తెరవమని ఈ దేశంపై ఒత్తిడి తెచ్చింది. ఈ విధానాలకు ప్రజల్లో వ్యతిరేకత పెల్లుబికింది. తత్ఫలితంగా ప్రజ్వరిల్లిన హింసలో దాదాపు రెండువందల మంది ఆహుతయ్యారు. చమురు అంతులేని ఆదాయ వనరు అనే అభిప్రాయం పటాపంచలయింది. 1978 నుండి 2003 మధ్య వెనిజులా తలసరి ఆదాయం నలభై శాతం కంటే ఎక్కువ క్షీణించింది.

పేదరికం పెరగడంతో సమాజంలో అసహనం హెచ్చింది. మధ్య తరగతికీ, పేదలకు మధ్య అగ్గి రాజుకుంది. చమురుపై ఆధారపడ్డ ఆర్థిక వ్యవస్థల్లో తరచూ జరిగేట్టుగానే ఇక్కడ కూడా ప్రజల జీవన స్థాయిల్లో గణనీయమైన మార్పులు సంభవించాయి. క్షీణిస్తున్న ఆర్థిక వ్యవస్థ ప్రభావం మధ్యతరగతిపై పడింది. దాంతో పేదరికం పెరిగింది.

మారిన పరిస్థితులు చావెజ్‌కు రంగం సిద్ధం చేశాయి. వచ్చీ రాగానే కొత్త దేశాధ్యక్షుడు బుష్ ప్రభుత్వాన్ని సవాల్ చేశాడు.

సెప్టెంబర్ 11 దాడులకు కొద్ది రోజుల ముందు అమెరికా సిఐఎ తోడేళ్లను వెనిజులాలోకి దింపాలని యోచించింది.

కానీ సెప్టెంబర్ 11 ప్రాధాన్యతలను మార్చేసింది. బుష్, అతని సలహాదారులూ అఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై దాడులకు ప్రపంచ నేతల మద్దతు కూడగట్టడంలో మునిగిపోయారు. మాంద్యంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ కూడా అమెరికా దృష్టిని వెనిజులా నుండి తాత్కాలికంగా మరల్చింది. ఇరాక్, పశ్చిమాసియా చమురు నిల్వల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారడంతో వెనిజులాను అమెరికా ఎక్కువ కాలం ఉపేక్షించబోదు. త్వరలోనే బుష్, చావెజ్ ఢీ అంటే ఢీ అనుకోవడం ఖాయం.

గ్రౌండ్ జీరోను దర్శించడం, చావెజ్ వెనిజులా గురించి చదవడం నేను గత మూడు దశాబ్దాలుగా చేస్తున్న పనులను పునఃసమీక్షించుకునే అవకాశం కల్పించాయి. ఎకనామిక్ హిట్‌మాన్‌గా నేను చేసిన పనులు ఇవ్వాళ నా కూతురు తరాన్ని చాలా ప్రతికూలంగా ప్రభావితం చేశాయి. ఇక వాయిదా వేయడానికి ఎంత మాత్రమూ వీలు లేదు. నా గత జీవితం గురించి పశ్చాత్తాపపడే సమయం ఆసన్నమైంది.

నేను మళ్లీ రాయడం మొదలు పెట్టాను. కానీ నాకెందుకో నేను చెప్పే విషయాలు కొంచెం పాతబడ్డట్టు అనిపించింది. ఒకసారి అఫ్ఘనిస్తాన్, ఇరాక్, వెనిజులా దేశాలను దర్శించి అక్కడ జరుగుతున్న ఇటీవలి పరిణామాలపై అవగాహన పెంచుకోవాలనుకున్నాను. ఈ మూడు దేశాలూ వర్తమాన ప్రపంచ వ్యవహారాలలో ఒక విచిత్రమైన పరిస్థితికి నిలువెత్తు నిదర్శనాలు. మూడూ చాలా హింసాత్మక రాజకీయ గందరగోళాన్ని చవిచూసి చివరికి ముగ్గురు అసంపూర్ణ నాయకుల కిందికి చేరాయి (క్రూరమైన తాలిబాన్లు, ఉన్మాది సద్దాం, ఆర్థికంగా దుర్బలుడైన చావెజ్). కానీ ఏ దేశంలోనూ కార్పొరేట్‌స్వామ్యం ఆయా దేశాల అంతర్గత సమస్యలను అర్థం చేసుకోవడానికి గానీ, పరిష్కరించడానికి గానీ ప్రయత్నించలేదు. ప్రతిచోట మా చమురు విధానాలకు అడ్డుతగిలిన నాయకత్వాన్ని తొలగించడానికే మేం ప్రయత్నించాం. అఫ్ఘనిస్తాన్‌పై ఈ పాటికే దాడి జరిగింది. ఇరాక్‌పై ఇవ్వాళో రేపో దాడికి సన్నద్ధమవుతున్నాం. ఇక వెనిజులా పరిస్థితే ఏమీ అర్థం కావడం లేదు. చావెజ్ మంచివాడా కాదా అని నేను వాదించబోవడం లేదు. కానీ కార్పొరేట్‌స్వామ్యం గ్లోబల్ సామ్రాజ్యం వేపు నడుస్తున్న బాటలో అడ్డుగా నిలబడ్డాడతను.

డిసెంబర్ 2002 నాటికి అటు వెనిజులాలో, ఇటు ఇరాక్‌లో పరిస్థితి తారాస్థాయికి చేరుకుంది. ఒక వైపు ఇరాక్‌లో ఎకనామిక్ హిట్‌మెన్, సిఐఎ తోడేళ్లు

విఫలమయ్యాయి. అందుకే సద్దాంను లొంగదీయడానికి ఇక యుద్ధం అనే చివరి అయుధం వాడబోతున్నాం. మరో వైపు వెనిజులాలో బుష్ ప్రభుత్వం, ఇరాన్‌లో కెర్మిట్ రూజ్‌వెల్ట్ అమలు చేసిన పన్నాగం మొదలుపెట్టింది.

లక్షలాది మంది ప్రజలు చావెజ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె చేయడం మొదలుపెట్టారు. వారితో దాదాపు 30 వేల మంది చమురు కార్మికులు కూడా జత కలిశారు.

సరిగ్గా ఇరాన్‌లో మొస్సాదెగ్ ప్రభుత్వాన్ని ఇలాగే కూల్చింది సిఐఏ. రెండింటి మధ్య చాలా సారూప్యత ఉంది. యాభై ఏళ్ల తరువాత చరిత్ర పునరావృతమవుతోంది. అయిదు దశాబ్దాలు గడచినా అక్కడా ఇక్కడా చమురే చోదక శక్తి.

2003 జనవరి 4 నాడు చావెజ్ మద్దతుదారులకు, అతని వ్యతిరేకులకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. కాల్పుల్లో ఇద్దరు మరణించగా అనేక మంది గాయపడ్డారు.

సిఐఏ తోడేళ్లతో కలిసి చాలా కాలం పనిచేసిన పాత మిత్రుడిని అక్కడి పరిస్థితి గురించి వాకబు చేశాను. ఈ మిత్రుడు అనేక దేశాల్లో రహస్య కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. వెనిజులా రాజధాని కారకాస్‌లో సమ్మెలు జరిగేలా చూడమనీ, సైనికాధికారులు అధ్యక్షుడిపై తిరుగుబాటు జరిపేలా ఉసిగొల్పమనీ తనను ఒక ప్రైవేటు కాంట్రాక్టర్ సంప్రదించాడనీ, బదులుగా భారీ మొత్తం ఇవ్వజూపాడనీ అతను నాకు చెప్పాడు.

'నేను దానికి ఒప్పుకోలేదు. అతను ఇంకొకరికి ఇదే బాధ్యతను అప్పగించాడు' అని చెప్పాడతగాడు.

2003 జనవరిలో ముడి చమురు ధరలు చుక్కలనంటాయి. అమెరికన్ చమురు నిల్వలు గత ఇరవై ఆరేళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. పశ్చిమాసియాలో ఇప్పుడున్న పరిస్థితిలో చావెజ్‌ను తొలగించడానికి అమెరికా త్వరలోనే ఏదో చేస్తుందని నాకు బలంగా అనిపించింది.

ఆ రోజు రానే వచ్చింది. సైనిక కుట్ర ద్వారా చావెజ్ ప్రభుత్వం కూలదోయబడింది.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని న్యూయార్క్ టైమ్స్ ఒక చారిత్రక దృక్కోణాన్ని ప్రచురించింది. వెనిజులాలో చక్రం తిప్పిన మొనగాడెవరో కూడా ఆ పత్రిక రాసింది. చదవండి...

"ప్రచ్ఛన్న యుద్ధానంతరం అనేక మధ్య, దక్షిణ అమెరికా దేశాల్లో తన ఆర్థిక, రాజకీయ లక్ష్యాలను నెరవేర్చుకోవడానికి నియంతృత్వ పాలనలకు మద్దతు పలికింది అమెరికా.

చిన్న దేశమైన గ్వాటెమాలలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోయడానికి 1954లో సిఐఏ కుట్ర పన్నింది. ఆ తరువాత నలభై ఏళ్లపాటు అక్కడి వామపక్ష గ్రూపులను అణచడానికి స్థానిక ప్రభుత్వాలకు సాయం చేసింది. ఈ పోరాటంలో దాదాపు రెండు లక్షల మంది సామాన్య పౌరులు మరణించారు.

చిలీలో సిఐఏ సైనిక కుట్రకు మద్దతు ఇచ్చి 1978 నుండి 1990 వరకూ జనరల్ అగస్టో పినోషె అనే నియంతను అందలమెక్కించింది. పెరూలో, ఇంతకు ముందున్న కళంకిత అధ్యక్షుడు అల్బర్ట్ కె ఫూజిమోరి కి, అతని గూఢచార అధికారి వ్లాదిమిర్ ఎల్. మోన్‌టెసినోస్‌లకు సిఐఏ దశాబ్దం పాటు చేసిన సాయాలపై ఇటీవలే ఎన్నికైన ప్రజాస్వామ్య ప్రభుత్వం విచారణ జరుపుతోంది.

అమెరికన్ ఇంటలిజెన్స్ శాఖకు ఇరవై ఏళ్లపాటు ఇన్‌ఫార్మర్‌గా పనిచేసిన నియంత మాన్యూల్ ఎ. నోరిగాను 1989లో సైనిక దాడి జరిపి పదవి నుంచి తొలగించింది అమెరికా.

1980లలో నికరాగువాలో వామపక్షవాదులను ఎదుర్కోవడానికి అన్ని సాయాలు - చివరికి అక్రమంగా ఇరాన్‌కు ఆయుధాలు అమ్మడంతో సహా - చేసినందుకు రీగన్ ప్రభుత్వంలోని పెద్ద తలకాయలు ఇవ్వాళ దోషులుగా నిలిచారు.

ఆ కేసులో విచారణ ఎదుర్కొన్న వారిలో ఒట్టో. జె. రీష్ అనే పెద్ద మనిషి ఒకరు. లాటిన్ అమెరికన్ సంఘర్షణల్లో కీలక పాత్ర పోషించాడు ఇతడు. నేర నిరూపణ అయినా రీష్‌కు ఏ శిక్షా పడలేదు. కొన్నాళ్లకు వెనిజులాకు అమెరికా రాయబారిగా పంపబడ్డాడు. చావెజ్ తొలగింపు రీష్ కిరీటంలో కలికితురాయి."

అయితే రీష్, బుష్‌ల ఆనందం కొద్ది రోజుల్లోనే ఆవిరయింది. దెబ్బై రెండు గంటల్లోపలే చావెజ్ మళ్లీ పదవి చేజిక్కించుకున్నాడు. ఇరాన్‌లో మొస్సాదెగ్‌లా కాకుండా సైన్యాన్ని తన అధీనంలో ఉంచుకున్నాడు చావెజ్. అంతేగాక శక్తివంతమైన పెట్రోలియోస్ డి వెనిజుయెలా కూడా చావెజ్ పక్షాన్నే నిలిచింది.

దుమారం సద్దుమణిగాక చావెజ్ ప్రభుత్వంపై తన పట్టు బిగించే కసరత్తు ప్రారంభించాడు. సైన్యంలో తనకు వ్యతిరేకంగా పనిచేసిన వారందరినీ తొలగించాడు. తన శత్రువులని రూఢీ అయిన వారికి దేశ బహిష్కార శిక్ష విధించాడు. వాషింగ్టన్‌తో జతగూడి తనపై కుట్రకు పాల్పడ్డ ఇద్దరు ప్రతిపక్ష నాయకులకు ఇరవై ఏళ్ల జైలు శిక్ష విధించాలని సిఫారసు చేశాడు.

తదనంతర పరిణామాలపై లాస్ ఏంజలిస్ టైమ్స్ కథనం చదవండి...

'వెనిజులా దేశాధ్యక్షుడు హ్యూగో చావెజ్‌ను తొలగించడానికి కొన్ని నెలలుగా ఆ దేశ సైనిక, పౌర నాయకులతో కలిసి ప్రయత్నిస్తున్నామని బుష్ ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు ఒప్పుకున్నారు. విఫలమైన ఈ కుట్రపై సమగ్ర దర్యాప్తు జరపాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు'.

వెనిజులాలో ఎకనామిక్ హిట్‌మెన్, సిఐఏ తోడేళ్లు ఇద్దరూ విఫలమయ్యారు. 1953 ఇరాన్ పరిస్థితికీ, 2003లో వెనిజులా పరిస్థితికీ చాలా తేడా కనపడుతోంది.

ఇది శుభసూచకమా లేక కేవలం యాదృచ్ఛిక ఘటనా?

వాషింగ్టన్ ఆ తరువాత ఏం చేయబోతోందని నేను ఆలోచించసాగాను.

ప్రస్తుతానికైతే ఓ తీవ్రగండం గట్టెక్కినట్టే. చావెజ్‌ను ఓ విధంగా సద్దాం హుస్సేన్ రక్షించాడు. అఫ్ఘనిస్తాన్, ఇరాక్, వెనిజులా మూడింటిపై ఒకేసారి యుద్ధం చేయడం అమెరికా వల్లగాని పని . అటువంటి దుస్సాహసం చేయడానికి అవసరమైన సైనికశక్తిగానీ, రాజకీయ మద్దతు గానీ దానికిప్పుడు లేవు. అయితే పరిస్థితులు చాలా త్వరగా మారవచ్చు. మళ్లీ చావెజ్‌కు త్వరలోనే తీవ్ర వ్యతిరేకత ఎదురుకావచ్చు.

యాభై ఏళ్లు గడిచినా పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదని వెనిజులా ఉదంతం నిరూపిస్తోంది.

అధ్యాయం 34

మళ్లీ ఒకసారి ఈక్వెడార్

వెనిజులాలో ఈ పరిణామాలకు దూరంగా మరో దేశంలో మరో తరహా సంఘర్షణ జరుగుతోంది. అయితే ఈ సంఘర్షణలో పణంగా ఉన్నది డాలర్లో, మనుషుల ప్రాణాలో కాదు. అవి ఐహికమైన సామ్రాజ్యవాదానికి అతీతమైన విషయాలు.

ఈ సంఘర్షణ జరుగుతోంది ఈక్వెడార్‌లో, నేను మొదట పీస్ కోర్ వారి కొరకు పనిచేసిందిక్కడే.

1968లో నేను అక్కడ మొదటిసారి కాలుపెట్టిన కొన్నేళ్లకే ఈ చిన్ని దేశం కార్పొరేట్‌స్వామ్యం కబంధహస్తాల్లో చిక్కింది. నావంటి వారు, ఆ తరువాత వచ్చిన కార్పొరేట్ దళారీలు కలిసి ఈక్వెడార్‌ను అప్పుల కుప్పగా మార్చేశారు. దేశంలోని ధనిక కుటుంబాలకు మాత్రమే ఉపయోగపడే ప్రాజెక్టులు నిర్మించేందుకు, మా ఇంజనీరింగ్, నిర్మాణ కంపెనీల సేవలు పొందేందుకుగాను మేం ఆ దేశానికి కోట్ల కొద్దీ డాలర్ల ఋణం ఇచ్చాం.

పర్యవసానంగా ఆ దేశపు అధికారిక పేదరికం 50 శాతం నుండి 70 శాతానికి పెరిగింది. నిరుద్యోగం 15 నుండి 70 శాతానికి పెరిగింది, ప్రభుత్వం అప్పు 24 కోట్ల నుండి 1600 కోట్ల డాలర్లకు పెరిగింది. సహజ వనరుల్లో పేదల అభ్యున్నతికి వాడే సొమ్ము 20 నుండి ఆరు శాతానికి తగ్గింది. తన జాతీయ బడ్జెట్‌లో 50 శాతం కేవలం అప్పులు తీర్చడానికే వినియోగించి, అన్నపానీయాలు గతిలేని పేదలకు సాయపడలేని దుస్థితికి ఈక్వెడార్ దిగజారింది.

ఈ పరిస్థితికి అంతర్జాతీయ బ్యాంకులు, బహుళజాతి కంపెనీలు, విదేశీ 'సాయం' చేసే సంస్థలు, అమెరికా ప్రభుత్వాల తరపున ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపిన వందలాది మందిదే బాధ్యత.

మేమంతా కలిసి కనిపెట్టిన ఈ కొత్త వ్యవస్థ ఈక్వెడార్‌లో బ్రహ్మాండంగా పనిచేసింది. సహస్రాబ్ది సమయానికి ఈక్వెడార్ మా చేతిలో బందీగా మారింది. ఇన్నాళ్లూ కాబూలీవాలా వలె ఓపికగా నిరీక్షించాం. ఇక మా వంతు రక్తం పిండుకునే సమయం ఆసన్నమైంది. ఈక్వెడార్ అడవులు తమ గర్భంలో చమురు సంద్రాన్నే దాచుకున్నాయని మాకు తెలుసు.

వెనిజులాలో చావెజ్ పునరుత్థానం, సద్దాంతో యుద్ధానికి సన్నద్ధం అవుతున్న 2003 తొలి రోజులవి. మా దేశం వద్దనున్న చమురు నిల్వలు నానాటికీ దిగజారిపోతున్నాయి. ఇక లాభంలేదు, ఈ చమురు దాహం తీరాలంటే ఈక్వెడార్‌పై పడక తప్పని పరిస్థితి.

పాస్తాజా నదిపై ఉన్న వంతెనపై నా సుబారు కారు వెళుతోంటే నా మదిలో ఏవేవో ఆలోచనలు. ఈక్వెడార్‌లో ఇప్పుడు జరుగుతున్న సంఘర్షణ ధనవంతులు, దరిద్రుల మధ్యనే కాదు, పీడించేవాడు పీడితుల మధ్యనే కాదు - ఇది మన నాగరికత ఏపాటిదో తేల్చే సమరం. ఈ చిన్ని దేశం తన అమెజాన్ అడవులను మన చమురు కంపెనీలకు అర్పించమని మనం వత్తిడి చేస్తున్నాం. దాని పర్యవసానాలు ఊహించనలవిగానంత ఘోరంగా ఉంటాయి.

ఒక్కోసారి ఈ నష్టాలను మనం అంకెల్లోకి అనువదించడం కూడా కుదరదు. అరుదైన సంస్కృతులు, మనుషుల ప్రాణాలు, వేలాది జీవజాతుల మనుగడ-వీటన్నిటి భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకం. ఇప్పుడు అంతరించే జీవజాతుల్లో మనల్ని పట్టి పీడిస్తున్న వ్యాధులెన్నింటికో ఓషధులు ఉండవచ్చు. ఈ అడవులే కదా మన పరిశ్రమలు వదులుతున్న విషపూరితమైన గ్రీన్‌హౌస్ వాయువులు పీల్చుకుని మనం బతకడానికి అవసరమైన ప్రాణవాయువును అందిస్తున్నది! మబ్బులు వర్షం కురిసేటట్టు చేస్తున్నది! తద్వారా మనకు జీవజలం అందిస్తున్నది!

మనం ఇప్పుడు అవలంబిస్తున్న వ్యూహం ఆనాటి రోమన్ సామ్రాజ్యం ఏర్పడడానికి ముందు నుండీ సామ్రాజ్యవాదులు ఉపయోగించిందే. మనం బానిసత్వాన్ని ఒప్పుకోం కానీ మన గ్లోబల్ సామ్రాజ్యం మానవజాతి చరిత్రలో ఎన్నడూ లేనంత మందిని బానిసలుగా మార్చింది. ఈక్వెడార్‌లో ఇటువంటి హ్రస్వదృష్టి ప్రణాళికలు అమలు జరుగుతుంటే మనం ఇంత నింపాదిగా ఎలా ఉండగలుగుతున్నాం?

నా సుబారు కారులోంచి చూస్తే బోడిగా కనపడుతున్న ఆండిస్ పర్వత శ్రేణులు - నా పీస్ కోర్ రోజుల్లో చిక్కని అడవి ఈ కొండలను కప్పి ఉండేది.

నాకో విషయం స్ఫురించింది. ఈక్వెడార్‌తో నాకున్న సన్నిహిత అనుబంధం నన్నిలా ఈ దేశం గురించి ఆలోచింపజేస్తోంది కానీ నేను ఇదివరకు పని చేసిన అన్ని దేశాల్లో, సహజ వనరులపై సామ్రాజ్యవాదుల కళ్లు పడిన ప్రతి గడ్డపై పరిస్థితి ఇంచుమించుగా ఇదే రకంగా ఉంది.

ఈక్వెడార్ సతతహరిత అడవులు చాలా విలువైనవి. ఇక్కడి స్థానిక తెగలూ, వారి సంస్కృతీ విలువైనవే, ఇక్కడ నివసించే సమస్త జీవజాతులు విలువైనవే.

ఆ మాటకొస్తే ఇరాన్‌లో ఎడారులు, జావాలోని పర్వతాలు, ఫిలిప్పీన్స్ సముద్ర తీరం, ఆసియాలోని స్టెప్పీ అడవులు, ఆఫ్రికాలోని సవాన్నా అడవులు,

ఉత్తర అమెరికాలోని అడవులు, ఆర్కిటిక్ హిమనదులూ- వీటిలో విలువైంది కానిదేది?

నాకో గణాంకం గుర్తుకువచ్చింది. ధనిక దేశాల్లోని ఇరవై శాతం ప్రజలకు పేద దేశాల్లోని ఇరవై శాతం ప్రజలకు మధ్య ఆదాయ వ్యత్యాసం 1960లో 30:1 ఉంటే 1995 నాటికి అది 74:1 కి చేరింది. మరోవేపు ప్రపంచ బ్యాంకు, అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సీ, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ఇంకా ఎన్నో బ్యాంకులూ, బహుళజాతి కంపెనీలూ, ప్రభుత్వాలూ ఎంతో 'ఉదారంగా' సాయం చేస్తున్నామని నమ్మబలుకుతున్నాయి. తమ బాధ్యతలు తాము నిర్వర్తిస్తున్నామనీ, 'అభివృద్ధి' జరుగుతోందనీ మాయమాటలు చెబుతున్నాయి.

నేను ముప్ఫై అయిదేళ్ల తరువాత మళ్లీ ఈక్వెడార్‌లో అడుగుపెట్టాను. అప్పుడు పీస్ (శాంతి) పేరు గల ఒక అమెరికన్ సంస్థ తరపున వచ్చాను. ఇప్పుడు శాంతి నెలకొల్పడానికి నా వంతు కృషి చేయడానికి వచ్చాను. మూడు దశాబ్దాల కింద నేను ప్రేరేపించిన అశాంతిని చల్లార్చడానికి వచ్చాను!

అఫ్ఘనిస్తాన్, ఇరాక్, వెనిజులాలలో ఉన్న ఉద్రిక్తతలు కూడా ఈక్వెడార్‌లో అమెరికా వేలుపెట్టకుండా నిరోధించలేకపోయాయి. ఎందుకంటే ఈ సంఘర్షణకు అమెరికన్ సేనలు అవసరం లేదు. ఇక్కడ యుద్ధం చేస్తున్నది బరిసెలు, బల్లేలు, పాత తుపాకులు చేబూనిన అడవి పుత్రులు కదా. వారిని ఎదుర్కోవడానికి ఆధునిక ఈక్వెడార్ సైన్యం సరిపోతుంది. కొద్దిమంది అమెరికన్ స్పెషల్ ఫోర్సెస్‌కు చెందిన 'నిపుణులు' ఉంటే చాలు. ఇలాంటి యుద్ధం ఒకటి జరుగుతున్నట్టు కూడా మా అమెరికన్ ప్రజలకు తెలియదు.

డిసెంబర్ 2002లో ఇక్కడి చమురు కంపెనీ ప్రతినిధులు తమ కంపెనీ ఉద్యోగులను స్థానిక తెగకు చెందిన వారు అపహరించి, బందీలుగా పట్టుకున్నారని ఆరోపించారు. ఈ అపహరణకు పాల్పడిన వారికి కొన్ని టెర్రరిస్టు గ్రూపులతో - ప్రత్యేకించి అల్-ఖయిదా తో సంబంధాలు ఉండి ఉండవచ్చని వారు అనుమానాలు వ్యక్తం చేశారు. అప్పటికి ఈ కంపెనీకి అక్కడ చమురు అన్వేషణ సాగించడానికి ఈక్వెడార్ ప్రభుత్వం అనుమతినివ్వలేదు. అయితే తాము డ్రిల్లింగ్ జరపడం లేదని కేవలం కొన్ని ప్రాథమిక అన్వేషణ పరీక్షలు జరుపుతున్నామని కంపెనీ వారు అంటుండగా, స్థానిక తెగలు మాత్రం కంపెనీ చెప్పేవన్నీ అర్ధసత్యాలని ఆరోపిస్తున్నారు. చమురు కంపెనీ ఉద్యోగులు తమ అధీనంలోని భూముల్లోకి అక్రమంగా చొరబడ్డారనీ, అందుకే వారిని అడ్డుకున్నాం అనీ ఈ తెగలవారు తెలిపారు. ఆ సమయంలో తమ వద్ద ఆయుధాలు కూడా ఏమీ లేవనీ. ఆ ఉద్యోగులను తమ గూడేనికి తీసుకువచ్చి వారికి ఆహారం పెట్టి చిఛా అనే బీరు తాగించి పంపామనీ ఈ తెగల వారు చెప్పారు. తాము ఎవరినీ బందీలుగా ఉంచుకోలేదని వారు స్పష్టం చేశారు.

ఈక్వెడార్‌లోని స్థానిక తెగలతో సమావేశం అయ్యేందుకు ఇప్పుడు నేనిక్కడికి వచ్చాను. షెల్ పట్టణం చేరుకున్నాక నన్ను ఈ సమావేశానికి తీసుకెళ్లారు. ఈ సమావేశానికి కిచ్వా, షూఆర్, అచ్వార్, షివియార్, జపారో తెగలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. కొద్ది మంది రోజుల తరబడి అడవిబాటల్లో నడుచుకుంటూ వస్తే మరికొంత మందిని స్వచ్ఛంద సంస్థలు విమానాలలో తీసుకుని వచ్చాయి. కొందరు వారి సాంప్రదాయక వేషధారణతో వస్తే మరి కొందరు ప్రతినిధులు మాత్రం నగరవాసుల్ని అనుకరిస్తూ టీ షర్టులు, బూట్లు వేసుకుని వచ్చారు.

బందీలుగా పట్టుకున్నారన్న ఆరోపణలు ఉన్న తెగకు చెందిన ప్రతినిధులు మొదట మాట్లాడారు. ఉద్యోగులు తమ వద్ద నుండి వెళ్లిపోయాక తమ గూడేనికి వంద మందికి పైగా ఈక్వెడార్ సైనికులు వచ్చారని చెప్పారు. వారు వచ్చింది ఆదివాసులు ఎంతో పవిత్రంగా భావించే ఛోంటా అనే చెట్టు ఫలాలు కాసే మాసంలో. ఏడాదికి ఒక్కసారి మాత్రమే ఈ చెట్టు ఫలాలు ఇస్తుంది. ఆ అడవుల్లో నివసించే అనేక పక్షిజాతులు సరిగ్గా ఈ మాసంలోనే జతగూడేవి. ఆ సమయంలో పక్షులను వేటాడటం పాపం అని నమ్మిన స్థానిక తెగలు చాలా నిష్ఠగా వేట నిషేధం పాటించేవారు.

'సరిగ్గా ఆ మాసంలోనే సైనికులు మా గూడెంపై పడ్డారు' బాధగా చెప్పిందో గిరిజన యువతి. ఆ తరువాత ఏం జరిగిందో ఆమె చెబుతుంటే నా హృదయం మెలిపెట్టినట్టయింది.

సైనికులు విచక్షణారహితంగా ఆ పక్షులను వేటాడారు. ఆదివాసుల పెరటి తోటలపై బడి అరటి పళ్లు, ఇంకా చేతికి ఏది దొరికితే అది తీసుకున్నారు. దగ్గరలోని నదిలో చేపలు పట్టడానికి జిలెటిన్ స్టిక్‌లు వాడారు. ఆదివాసులు పెంచుకునే పిల్లులు, కుక్కల్ని కూడా చంపి తిన్నారు. స్థానికుల దగ్గర ఉన్న వేట తుపాకులు లాక్కున్నారు. మల విసర్జన కొరకు అస్తవ్యస్తంగా మరుగుదొడ్లు నిర్మించారు. నదులను చమురుతో కలుషితం చేశారు. స్త్రీలను చెరిచారు. ఎక్కడపడితే అక్కడ చెత్త పారేయడంతో ఎక్కడలేని పురుగూ పుట్రా తయారైంది ఆ ప్రాంతమంతా.

'మాకు రెండే మార్గాలు కనపడ్డాయి' అన్నాడో గిరిజన యువకుడు. 'పోరాడటం, లేదా ఈ అవమానాన్ని దిగమింగి జరిగిన నష్టాన్ని ఏదో విధంగా పూడ్చడం. పోరాడడానికి ఇంకా సమయం ఆసన్నం కాలేదని రెండోదే చేశాం'. ఆ తరువాత తామంతా జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా కొన్నాళ్లపాటు ఉపవాసం ఉన్నామని, ఆకలికి తాళలేక పిల్లలు, వృద్ధులు అనారోగ్యం పాలయ్యారనీ అతడు వివరించాడు.

చమురు కంపెనీలు తమలో కొందరిని బెదిరిస్తున్నాయని, మరి కొందరికి లంచాలిచ్చి కొంటున్నాయని వారు నాకు చెప్పారు.

ఒక యువతి తన కొడుకు గురించి చెప్పింది. 'తనకి ఇంగ్లీషు, స్పానిష్ భాషలే కాక స్థానిక గిరిజనుల భాషలు కూడా వచ్చు. తనో పర్యాటక సంస్థలో గైడ్‌గా పని చేసేవాడు. ఈ చమురు కంపెనీ అతడికి పదిరెట్లు జీతం ఇస్తామని చేర్చుకుంది. ఇప్పుడతను ఆ కంపెనీ వాళ్లు మన స్నేహితులు అని ఉత్తరాలు రాస్తాడు' అని అనంగీకారంగా తల ఊపింది.

'అతన్ని మేం వెలివేశాం' అని చెప్పింది.

సాంప్రదాయక దుస్తులలో ఉన్న మరో వృద్ధుడు లేచి 'మా తరఫున చమురు కంపెనీలతో మాట్లాడటానికి ముగ్గురు ప్రతినిధులను ఏర్పాటు చేసుకున్నాం. కానీ మీకు తెలుసా ఏం జరిగిందో? వారు ముగ్గురూ ఇటీవలే విమానం కూలిపోయి మరణించారు. సరే వారు ప్రమాదవశాత్తూ చనిపోయారని అనుకున్నా ఇప్పుడు వారి స్థానంలో వచ్చిన కొత్త ప్రతినిధులు ఆ కంపెనీల పక్షాన్నే మాట్లాడుతున్నారు'.

ఇంకో గిరిజన ప్రతినిధి లేచి ఒక ఒప్పంద పత్రాన్ని బిగ్గరగా చదివాడు. మూడు లక్షల డాలర్ల సొమ్ముకు బదులుగా అడవిలో ఒక భాగాన్ని ఒక కలప కంపెనీకి ఈ తెగ వారు రాసిచ్చినట్టుగా ఉంది. దానిపై ముగ్గురు తెగ నాయకుల సంతకాలు ఉన్నాయి.

'ఇవి నకిలీ సంతకాలు. ఆ ముగ్గురిలో ఒకరు మా తమ్ముడే. ఇదో కొత్త రకం శీలహననం'.

నాకిదంతా చాలా వింతగాను, ఈ ఆదివాసుల ఆందోళన సబబుగాను తోచింది. చమురు కంపెనీలకు డ్రిల్లింగ్ చేయడానికి అనుమతి ఇవ్వడానికి ముందే పరిస్థితి ఇలా ఉందిక్కడ. అనుమతి ఇచ్చిన వేరే ప్రదేశాల్లో స్థానికులు ఎటువంటి అగచాట్లకు లోనయ్యారో తెలుసుకుని ఇక్కడి గిరిజనులు అప్రమత్తమయ్యారు. వీరి వ్యథలు ఏ సిఎన్ఎన్ ఛానెల్‌లోనో మా అమెరికన్ ప్రజానీకం చూస్తే వారు ఎలా స్పందిస్తారో కదా?

ఈ సమావేశాలు నన్ను అబ్బురపరిస్తే అక్కడ తెలుసుకున్న విషయాలు నన్ను కలవరపరిచాయి.

భోజన విరామంలో, సాయంత్రాలలో సమావేశానికి వచ్చిన ప్రతినిధులు నన్ను ఇరాక్‌ను అమెరికా అలా ఎందుకు బెదిరిస్తోందని అడిగేవారు. ఈక్వెడార్ అడవుల్లోని ఈ చిన్న పట్టణంలోని పత్రికలు ముంచుకువస్తున్న ఇరాక్ యుద్ధం గురించి సవివరమైన కథనాలు వెలువరించేవి. అయితే మా దేశపు పత్రికలు రాసే కథనాలకు, ఇక్కడి కథనాలకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉండేది. బుష్ కుటుంబానికి చమురు కంపెనీలతో, యునైటెడ్ ఫ్రూట్‌తో గల సంబంధాల గురించీ, ఉపాధ్యక్షుడు డిక్ చెనీ పూర్వం హాలిబర్టన్ అనే బహుళజాతి కంపెనీకి సీఈఓగా పనిచేసిన సంగతీ ఇక్కడి పత్రికలు రాసేవి.

ఈ వార్తా కథనాలను తెలుసుకోవడానికి ఇక్కడి నిరక్షరాస్యులైన ఆదివాసులు అమితాసక్తి ప్రదర్శించేవారు. మా అమెరికన్లు 'వెనుకబడినవారు', 'ఆటవికులు' అని పిలుచుకునే ఈ ఆదివాసులకు సమకాలీన అంశాలపై గల ఆసక్తి నిజంగా అపూర్వం.

నాకెందుకో ఈ అమెజాన్ ఆదివాసుల నుండి మనం నేర్చుకోవలసింది ఎంతో ఉందని అనిపిస్తుంది. మనం ఎంతో చదువుకున్నాం, ఎన్నో గంటలు వార్తా పత్రికలు తిరగేస్తూ, టీవీ చూస్తూ గడుపుతాం కానీ ఇక్కడి వారికి ఉన్నంత స్పృహ మనకు లేదు.

నాకు తెలిసిన ప్రతి సంస్కృతీ 1990ల చివరి సంవత్సరాల్లో మనం ఒక కీలకమైన దశకు చేరుకున్నామని చెబుతుంది. అది హిమాలయాల్లోని ఆశ్రమాల్లో కావచ్చు, ఇండోనేషియాలోని ధార్మిక సంస్థల్లో కావచ్చు, ఉత్తర అమెరికాలో, అమెజాన్ అడవుల్లో, ఆండియన్ పర్వతాలలో, మధ్య అమెరికాలోని పురాతన మాయా నగరాల్లో - ప్రతీ చోటా ఒకటే మాట. మానవజాతి చరిత్రలో ఇప్పుడున్నది ఒక ప్రత్యేక మహత్తర దశ. మనందరం ఏదో సాధించడానికే జన్మించాం.

ఇప్పుడు స్థానిక విజ్ఞానాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించి, ఉత్తర, దక్షిణ సంస్కృతులను రంగరించి ఒక ఉన్నతమైన జీవన విధానానికి బాటలు వేయాలి మనం. జీవితాన్ని, ప్రపంచాన్ని విభిన్న కోణాల నుండి చూసే పద్ధతుల నుండి నేర్చుకుని ఒక కొత్త స్పృహను పొందవలసిన సమయమిది. మానవజాతి మరింత మెరుగైన జాతిగా పరిణామం చెందవలసిన ఘడియలివి.

అధ్యాయం 35

ముసుగును తొలగించి చూస్తే

2003లో ఈక్వెడార్ నుండి తిరిగివచ్చిన కొన్నాళ్లకే అమెరికా ఇరాక్‌పై దాడి జరిపింది. అక్కడ ఎకనామిక్ హిట్‌మెన్, సిఐఏ తోడేళ్లు విఫలమయ్యారు కనుక ఆ ఎడారి ఇసుకల్లో చంపడానికీ, చావడానికీ అమెరికన్ యువతీ యువకులు పంపబడ్డారు. కేవలం కొద్ది మంది అమెరికన్లు మాత్రమే ఈ దాడి వల్ల ఉత్పన్నమవుతున్న ఒక ప్రత్యేక పరిస్థితి గురించి ఆలోచిస్తారు. అదే సౌదీ అరేబియాతో మా ప్రభుత్వానికి గల ఒప్పందం. ఏ విధంగా చూసినా సౌదీలో కన్నా ఇరాక్‌లోనే చమురు నిల్వలు అధికంగా ఉన్నాయి. ఒకవేళ ఇరాక్ మా గుప్పిట్లో ఉంటే సౌదీ అరేబియాతో ఇప్పుడున్న ఒప్పందం ఇక ఎంత మాత్రమూ అవసరం లేదు.

ఇరాక్ మా అధీనంలోకి వచ్చాక ఒపెక్ పరిస్థితి ఏమిటి? దాన్ని విడగొట్ట గలమా మేము?

కొద్ది మంది అంతర్జాతీయ విశ్లేషకులు ఒక ముఖ్యమైన ప్రశ్న వేస్తున్నారు. తప్పించుకు తిరుగుతున్న ఒసామా బిన్ లాడెన్‌ను పట్టుకోవడానికి సర్వశక్తులూ కేంద్రీకరించవలసిన ఈ సమయంలో ఇరాక్‌పై దాడి చేయాల్సిన తొందర ఏమొచ్చింది?

బుష్ కుటుంబానికి ఉన్న చమురు వ్యాపారాల దృష్ట్యా అంతర్జాతీయ టెర్రరిస్టును పట్టుకోవడం కన్నా చమురు నిల్వలపై నియంత్రణకే అమెరికా ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వదలుచుకుందా?

ఇరాక్ మా అధీనంలోకి వచ్చిన తరువాత కూడా ఒపెక్ దేశాలు చమురు ధరలు పెంచడం, అమ్మకాలు నియంత్రించడం ద్వారా అమెరికాను అడ్డుకోగలవు. అటువంటిదేదయినా జరిగితే ఎంతో 'శ్రమపడి' నిర్మించుకున్న ఈ గ్లోబల్ పేకమేడ కుప్పకూలటం ఖాయం.

అమెరికన్ సామ్రాజ్యవాదం ఇవాళ ఇంత శక్తివంతంగా కనబడడానికి ఒక ప్రధాన కారణం డాలర్‌ను అంతర్జాతీయ మారక కరెన్సీగా గుర్తించడం. యునైటెడ్ స్టేట్స్ మింట్‌కు ఈ డాలర్లను ముద్రించే అధికారం ఉండటం. ఈక్వెడార్ వంటి దేశాలు - ఎన్నటికీ తమ అప్పులు తీర్చలేవని తెలిసీ అప్పులిస్తుంది మా దేశం. అవి

అప్పులు తీర్చకూడదనే మా అభిమతం. ఎందుకంటే అలా జరిగితేనే మా వాటా రక్తం పిండుకోవచ్చు.

మామూలుగానైతే ఇలా తీసుకున్న వాళ్లంతా అప్పులు ఎగ్గొడితే అప్పులిచ్చిన ఆసామి పనైపోతుంది. కానీ అమెరికా అలాంటి ఇలాంటి ఆసామి కాదు. ఏ దేశమైనా కరెన్సీ ముద్రించాలంటే దానికి తగ్గ బంగారం నిల్వలు లేదా ఇంకేదయినా వనరులు ఉండి తీరాలి. అమెరికా అటువంటి నియమాలు ఏమీ పెట్టుకోలేదు. బంగారం వంటి నియంత్రణలేవీ లేకుండా అమెరికా తన ఇష్టం వచ్చినన్ని డాలర్లు ముద్రిస్తుంది. ప్రపంచానికి డాలర్‌పై గల అచంచలమైన విశ్వాసమే దాని విలువను నిలబెడుతోంది.

ఇలాంటి కరెన్సీని ముద్రించగలగటం మా దేశానికి అపరిమిత అధికారాన్ని ఇస్తుంది. ఓ వైపు ఎప్పటికీ తీర్చలేని వారికి రుణాలు ఇచ్చి, మరో వేపు సొంత అవసరాలకు అప్పు చేస్తుంది అమెరికా. 2003 ప్రారంభంలో మా దేశపు అప్పు ఆరు వేల కోట్ల డాలర్లు . సంవత్సరాంతానికి ఏడు వేల కోట్ల డాలర్లు అవుతుందని అంచనా. అంటే తలసరి అప్పు 24 వేల డాలర్లు. ఈ అప్పులో సింహభాగం ఆసియన్ దేశాలైన చైనా, జపాన్‌లకు చెల్లించాల్సినది. ఆ దేశాలు మాకు అమ్మే ఎలక్ట్రానిక్ పరికరాలు, కంప్యూటర్లు, వాహనాలు, గృహోపకరణాలు, దుస్తులకు బదులుగా వారికి మా దేశం ప్రభుత్వ బాండ్లు ఇస్తుంది. వారు ఎప్పుడు మార్చుకోవాలనుకుంటే అప్పుడు ఈ బాండ్లను డబ్బు రూపంలోకి మార్చుకోవచ్చు.

ప్రపంచం అంతటా డాలర్‌ను మారక కరెన్సీగా ఉపయోగించినంత కాలం మాకేమీ ఢోకా లేదు. కానీ ఒక్కసారి ఏదైనా ఇతర దేశపు కరెన్సీ డాలర్ స్థానంలోకి వచ్చినా లేదా చైనా, జపాన్‌లు తమ వద్దనున్న అమెరికా బాండ్లను డాలర్లలోకి మార్చుకోవాలనుకున్నా మా ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలం అవుతుంది.

2002 జనవరి 1 నుండి వినియోగంలోకి వచ్చిన యూరో ఇప్పుడు అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ఆధిపత్యానికి తీవ్ర సవాల్ విసురుతోంది. ఒపెక్ కనుక అమెరికాను ఇబ్బంది పెట్టాలని నిర్ణయించుకుంటే, 'డాలర్‌కు బదులుగా యూరో కరెన్సీలో మా చమురు బిల్లు చెల్లించండి' అంటే చాలు మా సామ్రాజ్యం పునాదులు కదిలిపోతాయి.

* * *

2003 ఏప్రిల్ 18 గుడ్‌ఫ్రైడే. మా ఇంటికి నాలుగు అడుగుల దూరంలో ఉన్న ఆఫీసుకు నడిచి వెళ్లాను. కంప్యూటర్ ఆన్ చేసి న్యూయార్క్ టైమ్స్ వెబ్‌సైట్‌ను తెరిచాను. అక్కడ పతాక శీర్షిక నన్ను చెళ్లున చరిచినట్లనిపించింది. నా పాత రోజులు మళ్లీ జ్ఞప్తికి వచ్చాయి:

'ఇరాక్ పునర్నిర్మాణ కాంట్రాక్టులు బెక్టెల్‌కు అప్పగించిన అమెరికా' అన్న శీర్షిక కింద ఈ వార్త ఉంది:

'ఇరాక్ కొరకు రూపొందించిన ఒక భారీ పునర్నిర్మాణ ప్రణాళికలో భాగంగా శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన బెక్టెల్ గ్రూప్‌కు అమెరికా మొదటి కాంట్రాక్టు ఇచ్చింది.

అమెరికా లోతుగా ప్రభావితం చెయ్యగల ఆర్థిక సంస్థలు ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి, ఈ ప్రణాళికలో ఇరాక్‌కు భాగస్వాములుగా ఉంటాయి.'

ప్రభావం!

అది చాలా చిన్నమాట!

నేను టైమ్స్‌లోని ఇంకో కథనం చదివాను. బెక్టెల్ డైరెక్టర్లలో ఒకరైన జార్జ్. పి. షుల్జ్ రీగన్ ప్రభుత్వంలో సెక్రటరీ ఆఫ్ స్టేట్ గా పనిచేసిన విషయం, ఆ కంపెనీ అధ్యక్షుడిగా పనిచేసిన కాస్పర్. డబ్ల్యూ వీన్‌బర్గర్ ఆ తరువాత అమెరికా రక్షణ సెక్రటరీ అయిన సంగతీ, ఈ ఏడాదే బెక్టెల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రైలె. పి. బెక్టెల్‌ను అధ్యక్షుడు బుష్ తన ఎగుమతి కౌన్సిల్ సభ్యునిగా నియమించాడనీ ఆ పత్రిక రాసింది.

ఇదీ ఆధునిక చరిత్ర. గ్లోబల్ సామ్రాజ్య ప్రస్థానం. ఇరాక్‌పై బాంబులు వేసి దాన్ని సర్వనాశనం చేసి ఇప్పుడు దాన్ని పునర్నిర్మించడానికి - ఆధునిక పాశ్చాత్య పద్ధతిలో పునర్నిర్మించడానికి కాంట్రాక్టులు ఇస్తుంది మా దేశం. సౌదీ అరేబియాలో అక్కడి రాజకుటుంబం, మేం కుదుర్చుకున్న కాంట్రాక్టు వంటి దానికి సద్దాం కూడా ఒప్పుకుని ఉంటే ఇవ్వాళ మేం అతనిపై ఈగ వాలకుండా చూసుకునే వాళ్లం.

ఏ మిస్సైళ్లు, రసాయన ఆయుధాలు ఉన్నాయని మేం ఇవ్వాళ అతనిపై దాడి చేశామో వాటిని మేమే సంతోషంగా సరఫరా చేసే వాళ్లం. బతికినంతకాలం ఇరాక్‌ను అతగాడికే హక్కు భుక్తం చేసేవాళ్లం.

అసలిటువంటి వార్తలను ప్రధాన స్రవంతిలోని వార్తా సంస్థలు రాయకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకునేవారు. ఇప్పుడు ఎందుకో లోగుట్టు మెల్లిగా బైటికి వస్తోంది.

సిఎన్ఎన్ వెబ్‌సైట్ కూడా ఇటువంటి వార్తనే రాసింది.

'ఈ కాంట్రాక్టు కొరకు చాలా కంపెనీలు పోటీపడ్డాయి. అందులో ఉపాధ్యక్షుడు డిక్ చెనీ సీఈఓగా పనిచేసిన కెల్లాగ్ బ్రౌన్ అండ్ రూట్ (కెబిఆర్) అనే సంస్థ (ఇది హాలిబర్టన్ గ్రూప్‌కు చెందింది) కూడా ఉంది.

హాలిబర్టన్‌కు ఇదివరకే 700 కోట్ల డాలర్ల విలువైన రెండేళ్ల కాంట్రాక్టు లభించింది. ఈ కాంట్రాక్టు ప్రకారం ఇరాక్ చమురు వనతులకు అత్యవసర మరమ్మత్తులు చేబడుతుంది హాలిబర్టన్.'

గ్లోబల్ సామ్రాజ్య ప్రస్థానానికి సంబంధించి ఇన్నాళ్లూ గుప్పిట్లో మూసిపెట్టిన రహస్యాలు ఒకటొక్కటిగా బైటికొస్తున్నాయ్. అయితే ఇది గోరంత మాత్రమే. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న అప్పులు, మోసం, బానిసత్వం, దోపిడీ, పీడన - ఇవన్నీ చెప్పలేదీ పత్రికా కథనాలు. దురదృష్టవశాత్తూ గ్లోబల్ సామ్రాజ్యపు దుష్టక్రీడను మన వార్తా పత్రికలు చెప్పవు.

ఇప్పుడు వెల్లడవుతున్న ఈ సమాచారం, నేను వెల్లడించవలసిన సమాచారం కూడా ఎంతో ఉందని నాకు గుర్తు చేస్తోంది. ఎన్నో ఏళ్లుగా వద్దు, కాదు అనుకుంటూనే నేను చేసిన పనులు, వాటి పర్యవసానాలు, చెప్పాలనుకుంటూ వాయిదా వేస్తూ వస్తున్న నేను ఇక కథ మొదలు పెట్టాల్సిన అవసరం వచ్చింది.

మనం ఒక మిథ్యను నమ్ముకున్నాం ఇవ్వాళ. వేల ఏళ్ల మానవజాతి వికాసం నేడు ఒక సరైన ఆర్థిక వ్యవస్థ నమూనాను సృష్టించిందనేది మన తప్పుడు నమ్మకం. ఆ తప్పుడు ఆలోచనను ఇవ్వాళ వేదంలా వల్లెవేసి పాటిస్తున్నాం. ఆర్థిక ప్రగతి మానవజాతికి మంచి చేస్తుందనీ, ఈ రంగంలో ఎంత ఎక్కువ ప్రగతి సాధిస్తే అంత మంచిదనే దురభిప్రాయం మనలో ప్రబలింది. ఈ ఆర్థిక ప్రగతి జ్వాలలను ప్రజ్వలింపజేసే వారికి పొగడ్తలు, నజరానాలు దక్కితే, చివరి వరుసల్లో ఉండిపోయిన అభాగ్యులు మాత్రం పీడనకు గురవుతారు.

ఇవాళ ఇరాన్, పనామా, కొలంబియా, ఇరాక్, ఇంకా ఎన్నో ఇతర దేశాల్లోని ప్రజలను దోచుకునేందుకు, వారి ప్రాణాలు హరించేందుకు 'లైసెన్సులు' ఇవ్వబడుతున్నాయి.

ఆర్థిక ప్రగతి సంభవిస్తుందని నమ్మించగలిగినన్నాళ్లూ మా బోటి ఎకనామిక్ హిట్‌మెన్, సిఐఏ తోడేళ్లు, సైన్యాలు వర్ధిల్లుతాయి.

మీరొక నగరాన్ని బాంబులు వేసి ధ్వంసం చేసి ఆ తరువాత దాన్ని పునర్నిర్మిస్తే మోసపూరితమైన గణాంకాలు, ఆర్థిక అంచనాల పుణ్యమా, అని ఆర్థిక ప్రగతి సూచిక పైపైకి దూసుకెళుతుంది.

మేమొక అబద్ధపు జీవితాన్ని జీవిస్తున్నాం. లోపల క్యాన్సర్ కనపడకుండా అందమైన ముసుగు వేసుకున్నాం. ఆ క్యాన్సర్‌ను కొన్ని గణాంకాల ఎక్స్‌రేలు బయటపెడతాయి.

ఈ భయంకరమైన నిజం మీకు తెలుసా? ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన, సంపన్నమైన అగ్రరాజ్యం అమెరికా - ఆత్మహత్యలు, మాదక ద్రవ్యాల వ్యసనాలు, విడాకులు, అత్యాచారాలు, హత్యలు, పసిపిల్లల లైంగిక వేధింపులు - వీటన్నిటిలోనూ అగ్రభాగాన ఉంది.

***

నా పోస్ట్‌బాక్స్‌లో ఉన్న పామ్ బీచ్ పత్రికను చేతిలోకి తీసుకున్నాను. దానిపై ఉన్న ఏప్రిల్ 18 తారీఖును చూడగానే నా మనస్సుకు చిన్నప్పుడు చదువుకున్న అమెరికన్ విప్లవం రోజులు గుర్తుకు వచ్చాయి.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరు జరుగుతున్న రోజులవి. పాల్ రివర్ అనే కంసాలి మా న్యూ ఇంగ్లాండ్ పట్టణాలలో గుర్రంపై తిరుగుతూ 'బ్రిటిష్ వారు వస్తున్నారహో' అని అందరికీ వినపడేలా అరిచి అప్రమత్తం చేశాడట.

అప్పటికి బ్రిటిష్ సామ్రాజ్యం వేళ్లూనుకొన్న వటవృక్షంలా విస్తరించింది. స్వయంగా వలసవచ్చిన వారైనా అప్పటి అమెరికన్ ప్రజలకు స్వార్థమే పరమావధిగా నడుస్తున్న ఈ బ్రిటిష్ వ్యాపార సామ్రాజ్యంపై ఏవగింపు కలిగింది. టామ్ పెయిన్, థామస్ జెఫర్‌సన్ వంటి నాయకుల మాటలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని రగిల్చాయి.

బ్రిటిష్ సామ్రాజ్యం తమని మోసగించిందనీ, బానిసలుగా మార్చిందనీ అనాటి అమెరికన్లు గ్రహించారు. అనాటి సామ్రాజ్యవాదులు ఇప్పటి సామ్రాజ్యవాదుల వలెనే కొద్ది మందికే లాభం చేకూర్చే ఒక వ్యవస్థను తయారు చేసి, అదే ఉత్తమమైనదని అందర్నీ నమ్మించారు. ఎన్నో దశాబ్దాల పాటు దోపిడీ జరిగాక గుప్పెడు మంది తత్వవేత్తలూ, వ్యాపారవేత్తలూ, రైతులూ, బెస్తవారూ, రచయితలూ, వక్తలూ నిజాలు మాట్లాడటం మొదలెట్టారు.

పదాలు!

ఎంత శక్తివంతమైనవీ పదాలు!

నేను రాయడం మొదలెట్టాను.

ఇక ఈ సారి మాత్రం ఆగేది లేదు. నా జీవితంలో యాదృచ్ఛికంగా జరిగిన కొన్ని ఘటనలూ, నేను అప్పుడు ఎంచుకున్న ప్రత్యామ్నాయాలూ నన్నిక్కడికి తీసుకువచ్చాయి. ఇక ఇక్కడి నుండి నేను ముందుకే వెళతాను.

నాకు ఆ కంసాలి గుర్తొచ్చాడు. న్యూ ఇంగ్లాండ్ వీథులలో... ఆ నిశీధి రాత్రిలో... ఒంటరిగా తన గుర్రంపై... జనాలను హెచ్చరిస్తూ... ఆ కంసాలికి తెలుసు తన కంటే ముందే థామస్ పెయిన్, జెఫర్‌సన్ మాటలు ప్రజలకు చేరాయని.

బ్రిటిష్ సామ్రాజ్యపు కుట్రను పెయిన్ తెలియజెపితే, ఈ దేశం తన ప్రజల జీవితాలు, స్వాతంత్ర్యం, సంతోషాలకు కట్టుబడి ఉందని జెఫర్సన్ చెప్పాడు.

అ రాత్రి గుర్రంపై దౌడు తీస్తున్న రివరీకి తెలుసు ప్రజలు ఆ మాటలు విని సాయుధంగా ఉన్నారని. ఒక మెరుగైన ప్రపంచం కొరకు పోరాటం చేయడానికి వారు సంసిద్ధులుగాఉన్నారని.

వారిని అలా మార్చినవి వారి నాయకుల నోటివెంట వచ్చిన కొన్ని పదాలు!

పదాలు!

నేను ఇక ఆపదలుచుకోలేదు. వాయిదా వేయదలుచుకోలేదు. గత కొన్నేళ్లుగా ఎన్నోసార్లు మొదలుపెట్టి ఆపేసిన ఈ మహాయజ్ఞం ఇప్పుడు పూర్తి చేయాల్సిందే.

ఈ పుస్తకంలో పదాలు రాయాల్సిందే!

ఉపసంహారం

ఈ పుస్తకం ముగింపుకు చేరుకున్నాం మనం - అదే సమయంలో ఒక కొత్త ప్రారంభానికి కూడా... ఇక్కడి నుండి ఏ వైపు వెళ్లాలా అని మీరు ఆలోచిస్తూండ వచ్చు. కార్పొరేట్‌స్వామ్యాన్ని, గ్లోబల్ సామ్రాజ్యం దిశగా సాగుతున్న ఈ వెర్రి ప్రస్థానాన్ని ఎలా ఆపాలా అని మధనపడుతుండవచ్చు. ఈ పుస్తకాన్ని వదిలి ప్రపంచం పైకి లంఘించడానికి సిద్ధపడుతుండవచ్చు.

మీకు ఆలోచనలు కావాలిప్పుడు.

నేను కొన్ని సలహాలు ఇవ్వగలను.

చివరి అధ్యాయంలో బెక్టెల్, హాలిబర్టన్‌లు ఇరాక్‌లో చేస్తున్న పనుల గురించి చదివారు కదా. ఈ పుస్తకంలో మీరు ఆ విషయం చదివేసరికే అది పాతబడిపోయి ఉంటుంది. కానీ అందులోని విషయం ప్రాధాన్యత మాత్రం ఎన్నటికీ తరగనిది. వార్తల పట్ల మీ దృక్పథాన్ని ఆ అధ్యాయం మార్చాలి. రేడియోలో, టీవీలో, వార్తా పత్రికలలో చెప్పే కథల వెనుకనున్న నిజం ఏమిటో చూడగలగాలి మీరు.

కనపడేదంతా నిజం కాదు!

అమెరికాలో ప్రఖ్యాత వార్తా సంస్థ ఎన్‌బిసి, జనరల్ ఎలక్ట్రిక్ అనే బహుళజాతి సంస్థకు చెందినది. అలాగే ఎబిసి వార్తా సంస్థ డిస్నీ వారిది, సిఎన్ఎన్ ఛానెల్- అమెరికా ఆన్‌లైన్ టైమ్ వార్నర్ గ్రూప్‌కు చెందింది. మన వార్తా పత్రికలు, ముద్రణా సంస్థల్లో అధిక శాతం బహుళజాతి కంపెనీల యాజమాన్యం కింద ఉన్నాయి. మన మీడియా కూడా కార్పొరేట్‌స్వామ్యంలో భాగమే. ఈ వ్యవస్థలో లోపలికి చొచ్చుకుపోయి దాన్ని ఇంకా శక్తివంతం చేసి విస్తరించే ధ్యేయంతో ఈ మీడియా సంస్థల డైరెక్టర్లు, ఆఫీసర్లు పని చేస్తుంటారు. ముసుగులు తొలగించి నిజాలు తెలుసుకునే బృహత్తర బాధ్యత మీపైనే ఉందిప్పుడు.

మీ స్నేహితులతో, కుటుంబ సభ్యులతో ఈ విషయాలు చర్చించండి. విస్తృతంగా ప్రచారం చేయండి. ఆచరణీయమైన కొన్ని సలహాలు చెబుతాను మీకు. మీ పెట్రోల్, డీజిల్ వ్యయాన్ని తగ్గించుకోండి. ఈ సారి మీకు షాపింగ్ చేయాలని పించినప్పుడు దానికి బదులుగా ఓ పుస్తకం చదవండి, వ్యాయామం లేదా ధ్యానం చేయండి. మీ ఇంట్లో, ఆఫీసులో వీలైనంత తక్కువ సామాన్లు ఉండేలా చూసుకోండి. స్వేచ్ఛా మార్కెట్లను, శ్రమశక్తిని, పర్యావరణాన్ని దోపిడీ చేసే బహుళజాతి కంపెనీలను వ్యతిరేకించండి.

ఇప్పుడున్న వ్యవస్థపై చాలా ఆశ ఉంది నాకు. ఈ బ్యాంకులు, బహుళజాతి కంపెనీలు, ప్రభుత్వాలు నిజానికిలా ఉండక్కర లేదు. ఇప్పుడు జరుగుతున్న తప్పుకు కారణం కొన్ని సంస్థలు కాదు. ఆర్థిక ప్రగతి గురించి కొద్ది మంది వ్యక్తులకున్న తప్పుడు భావాలే ప్రస్తుత పరిస్థితికి కారణం. సంస్థలు పని చేసే తీరులోనే తప్పంతా ఉంది.

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడున్న సమాచార పంపిణీ వ్యవస్థలను మంచి పనులకు కూడా ఉపయోగించవచ్చు. నైకి, మెక్‌డోనాల్డ్స్, కోకోకోలా వంటి కంపెనీలు భూమిపై ఉన్న పేదలందరికీ కూడు, గుడ్డ, నీడలు ఇచ్చేవయితే ఎంత బావుంటుందో కదా! చంద్రునిపై మనిషిని పంపడం, సోవియెట్ యూనియన్‌ను ముక్కలు చేయడం, ప్రపంచంలో ప్రతీ మూలా తమ సరుకులు చేరవేసేందుకు వసతులు ఏర్పరచడంతో పోలిస్తే ప్రజల ఆకలి తీర్చడం కష్టమేమీ కాదు. అందుకు మనకు, మన పిల్లలకు సరైన జ్ఞానం కావాలి - ఆలోచించడానికి... ప్రశ్నించడానికి ... ధైర్యం చేయడానికి...

మీరు ఆదర్శంగా నిలవచ్చు ఇప్పుడు. కొన్నిసార్లు పాఠాలు చెప్పే గురువుగా, కొన్నిసార్లు ఆసక్తి గలగిన విద్యార్థిగా... మీ చుట్టూ ఉన్న వారిని ఉత్తేజపరిచేలా...

వీలైనన్ని చోట్ల ఈ విషయాల గూర్చి మాట్లాడండి. సభలు, సమావేశాలలో ప్రసంగించండి. ఉత్తరాలు, ఈ మెయిళ్ల రాయండి.

ఏదైనా కొనాల్సి వచ్చినప్పుడు బాగా ఆలోచించి కొనండి.

1990లో నాకు షూఆర్ తెగవారు చెప్పింది మళ్లీ ఒకసారి గుర్తు చేస్తాను. ప్రపంచం మనం స్వప్నించినట్లే ఉంటుంది. కాలుష్యభరితమైన పరిశ్రమలూ, ట్రాఫిక్‌తో జామ్ అయిన రహదారులూ, జనంతో కిక్కిరిసిపోయిన పట్టణాలూ - వీటి స్థానంలో భూమిని గౌరవించే, సాంఘికంగా బాధ్యతాయుతమైన ప్రపంచాన్ని పొందవచ్చు మనం. ఆ శక్తి మనలోనే నిక్షిప్తమై ఉంది.

ఈ పుస్తకం మీరేం చేయాలో బోధించేది కాదు. ఇది నా పశ్చాత్తాప ప్రకటన.

వ్యవస్థ చేతిలో పావుగా, ఎకనామిక్ హిట్‌మాన్‌గా మారిన ఓ వ్యక్తి పశ్చాత్తాపం ఇది. స్వలాభం కోసం ఈ అవినీతి వ్యవస్థలో భాగమైపోయిన వ్యక్తి కథ ఇది. అభాగ్యులను దోచుకోవడాన్ని, భూమిపై వనరుల దోపిడీని ఏవో కుంటి సాకులతో సమర్థించుకున్న ఓ దురాశాపరుడి చరిత్ర ఇది.

నాకు సంబంధించినంత వరకూ ఈ పశ్చాత్తాపం ఓ మేల్కొలుపు వంటిది. పాపపరిహారానికి తొలి అడుగు.

ఇప్పుడిక మీ వంతు. మీరు కూడా పశ్చాత్తాప ప్రకటన చేయాలిప్పుడు. మీ గురించి, మీరు చేసిన మంచి లేదా చెడు గురించి, మీ భవిష్యత్తు ప్రణాళికల

గురించి చెప్పుకుంటే కొంత మనస్సు తేలికపడుతుంది. ఎంతో సంతోషం కలుగుతుంది.

నేను ఎవర్ని, ఎప్పుడు మోసం చేశాను? ఎప్పుడు మాట తప్పాను? ఈ నిలకడలేని వ్యవస్థలో ఎందుకు కూరుకుపోయాను? నా పిల్లల కోసం ఓ మెరుగైన సమాజం ఉండాలంటే నేనేం చేయాలి? ప్రపంచంలో ఆకలితో ఎవరూ అలమటించకుండా, సెప్టెంబర్ 11 వంటి దాడులు జరగకుండా నేనేం చేయగలను? వృథాగా డబ్బును తగలేస్తూ జీవించే వారిని చూసి జాలిపడాలి గానీ వారిని ఎన్నడూ అనుకరించగూడదనీ, పెంట్‌హౌస్‌లు, ఖరీదైన పడవలూ ఆనందాన్నివ్వలేవనీ మన పిల్లలకు ఎలా నేర్పాలి?

ఇవన్నీ సమకాలీన ప్రశ్నలు. మనందరం వీటికి జవాబులు అన్వేషించాలి.

ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసినవారి, బానిసల హక్కుల కోసం పోరు సల్పిన వారి, ఫాసిజంపై యుద్ధం చేసిన వారి స్ఫూర్తిని అందుకోవాలి మనం. ఆ మహత్తర పోరాటాలకు ఆహారం అందించిన వారు, బట్టలు సమకూర్చిన వారు, ఏదో విధంగా తమ వంతు కృషి సల్పినవారి నుండి స్ఫూర్తి పొందాలి మనం.

ఆ పోరాట ఫలాలను అహర్నిశం కాపాడుకునే యువతీ యువకులు, అధ్యాపకులు, కవులు, కళాకారులు, పారిశ్రామికవేత్తలు, వైద్య సిబ్బంది, శ్రామికులు... మీరు, నేను!

ఈ కాలం మనది. యుద్ధ రేఖపై కాలిడి, మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన ఘడియలివి. కార్యరంగంలోకి దూకాల్సిన క్షణాలివి.

మీ జీవితంలో జరిగిన కొన్ని యాదృచ్ఛిక ఘటనలు, అప్పుడు మీరు తీసుకున్న నిర్ణయాల ఫలితంగానే మీరిక్కడ ఉన్నదివ్వాళ...

ఇది మనందరి కథ!

అది 2005 వేసవి.

కొత్తగా స్థాపించబడ్డ సిడిఆర్‌సి ఆఫీసులో పుస్తకాలను రాక్‌లలో సర్దుతున్న నన్ను కేకేశాడు వేణు. అప్పటికి మా ఆఫీసులో మేమిద్దరమే ఉద్యోగులం.

ఏదో చేసెయ్యాలనే తపన... ఎక్కడ మొదలుపెట్టాలో అర్థం కాని సందిగ్ధం...

అన్ని కొత్త ఆఫీసుల్లో ఉండే వాతావరణమే ఇక్కడా ఉంది.

'కొత్త పుస్తకం వచ్చిందట. ఎకనామిక్ హిట్‌మాన్ అని కొంతమందిని వరల్డ్ బ్యాంక్ నియమించుకుందట' కంప్యూటర్‌లోకి చూస్తూ ఉత్సాహంగా చెబుతున్నాడు వేణు.

ఆ రోజు పరిచయమైన 'కన్ఫెషన్స్ ఆఫ్ ఎకనామిక్ హిట్ మాన్' గత ఆర్నెల్లుగా నాలో భాగమైపోయింది. పుస్తకంలోని ప్రతీ అక్షరం నన్ను కదిలించింది. ప్రపంచబ్యాంక్ దాష్టీకానికి తెలుగు నేల ఎలా ధ్వంసమైపోతూవుందో గత ఏడెనిమిదేళ్లుగా అటు వ్యాసాల్లోను, ఇటు కల్పనా సాహిత్యంలోనూ ఆసక్తిగా చదువుతూ ఉన్న నాకు హిట్‌మాన్ ఓ కొత్త అనుభవాన్ని కలుగజేసింది. సస్పెన్స్ థ్రిల్లర్‌లో క్లైమాక్స్ చదివేశాక కలిగే ఫీలింగ్ అది.

ఇన్నాళ్లూ అందరం ఈ అప్పులూ, గ్లోబలైజేషన్, డబ్ల్యూటీవో ఇవన్నీ కుట్రలనేవాళ్లం. కానీ అసలా కుట్ర ఎంత లోతైనదీ, దాన్ని అమలు జరుపుతున్న విధానం ఎంత సంక్లిష్టమైనదీ పెద్దగా బైటికి తెలిసేది కాదు. ఇన్నాళ్లకు జాన్ పెర్కిన్స్ పుణ్యమా అని లోగుట్టు బైటపడింది.

చంద్రబాబునాయుడు వంటి నాయకుల వల్ల మన రాష్ట్రం ప్రపంచబ్యాంక్ విధానాలకు ప్రయోగశాలగా మారిందన్నది ఎంత వాస్తవమో, గ్లోబలైజేషన్ ప్రక్రియపై, బ్యాంక్ విధానాలపై ఇక్కడ వచ్చినంత చైతన్యం, ఇక్కడ జరిగినంత వ్యతిరేక ఉద్యమం మరెక్కడా లేదన్నది అంతే సత్యం. దీనికి కారణం తెలుగు గడ్డపై ఉన్న వామపక్ష మేధావులు, బుద్ధి జీవులు. ప్రపంచబ్యాంక్ విధానాలను ప్రజలు ఎదిరించి నిలబడ్డ అరుదైన ఘటనల్లో ఒకటిగా బషీర్‌బాగ్ కాల్పుల ఉదంతం ప్రపంచ ప్రజలందరి దృష్టినీ ఆకర్షించింది.